
మాదిరెడ్డి సులోచన

A-PDF Merger DEMO : Purchase from www.A-PDF.com t

# వారసులు



## మా మనవి

**తిరిగి** యిన్నేళ్ళకు మాదిరెడ్డి సులోచన నవలలు మీ ముందుకు వచ్చాయి. దాదాపు నలభై యేళ్ళ క్రితం, అచ్చమైన తెలంగాణా వాతావరణం, పొందికైన మానవ సంబంధాలూ కలగలిపి చక్కని యితివృత్తాలు ఆమె సాహిత్యంలో కనిపిస్తాయి. డెబ్బై పైగా నవలలు ఆమె రచించారు. వాసిలోనూ, రాసిలోనూ కూడా సులోచన రచనలు ఎన్నతగినవే. ఆమె ప్రమాదవశాత్తూ అకాలమరణం పాలు కాకుండా వుంటే, మరెన్ని మంచి నవలలు రాసి వుండేవారోననేది ఊహకు మాత్రమే మిగిల్చి వెళ్ళిపోయారు.

ఇప్పుడు అంటే నూతన సహస్రాబ్ది తొలిదశకంలో యీ నవలల్ని చదువుతున్నపుడు కొన్ని కొన్ని సందర్భాలలో పాఠకులకు అసహజంగా వున్న భావన కలిగే అవకాశం వుంది. ఎందుకంటే గడచిన నలభై సంవత్సరాలలో ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఆనాటి రూపాయికి, నేటి రూపాయికి పొంతన లేదు. కొన్ని వూళ్ళపేర్లు, కొన్ని మాటల అర్థాలు సైతం మారిపోయాయి. వేషధారణ మారింది. దూరాలు తగ్గిపోయాయి. భూగోళం గుప్పెట్లో వొదిగిపోయింది. ఆనాడు వంద రూపాయలంటే చాలా పెద్ద మొత్తం. నేడు అది చిల్లరడబ్బు. కనుక ఇలాంటివి మాదిరెడ్డి నవలలలో తారసపడినప్పుడు విజ్ఞులైన మా పాఠకులు కాలంతో అన్వయించుకుని అర్థం చేసుకోగలరని ఆశిస్తున్నాము. ఆచార వ్యవహారాలలో, మాటతీరులో వున్నట్టుండి ఎన్నో మార్పులు వచ్చాయి. గత పదిహేను యిరవై సంవత్సరాలలో యీ మార్పు అత్యంత వేగంగా జరిగింది.

ఎన్ని మార్పులు వచ్చినా మానవనైజాలు, ప్రవృత్తులు ఎన్నటికీ మారవు. ప్రేమ, ద్వేషం, స్వార్థం లాంటి ముడిదినుసుకు యెన్ని తరాలు గడిచినా చలనం వుండదు. అందుకే మాదిరెడ్డి సులోచన కాల్పనిక సాహిత్యంలో మౌలిక అంశాలు నేటికీ నూతనంగానే వుంటాయి. మా సంస్థ 50 సంవత్సరాలలోకి అడుగుపెట్టిన తరుణంలో వుత్తమ విలువలను ప్రోది చేసిన మాదిరెడ్డి నవలలను పునర్ముద్రించడం మాకెంతో ఆనందంగా వుంది. వీటిని తెలుగు పాఠకులు సొంతం చేసుకుని, చదివి ఆనందిస్తారని మా ఆకాంక్ష.

విజయవాడ — నవోదయ పబ్లిషర్స్

1.10.2007

# వారసులు

తీయని కలలు కంటూ నిద్రపోతున్నది బాలామణి. యు ఫోమ్ పరుపు మీద కాదు. చింకి చాపపై పరిచిన చిరిగిన బొంతమీద. ఆమె కలల్లోకి వచ్చేది రాకుమారుడు కాడు, జమీందారు కాడు. కనీసం అందమైన ఆరడుగుల సుందరాకారుడు కాడు. టీచర్ మార్తమ్మ కొడుకు విల్సన్. అంతకు ముందు రోజే పట్నం నుండి అతడు వచ్చినట్టు చెప్పింది టీచర్.

బాలామణి మామూలుగా తలుపుతట్టింది పాలు పోద్దామని.

'పరమ పితా, పరవినుతా!'అనే సన్నని గొంతుతో పాట పాడుతూ మార్తమ్మ కాదు తలుపు తీసింది, చారల పైజమా వేసుకున్న ఒక యువకుడు తలుపు తీశాడు. అతను నలుపేకాని నలుపులో నాణ్యత కనిపించింది బాలామణికి.

"ఎవరూ?"

"పాలు దెచ్చిన-" అన్నది కంగారుగా. అతను సన్నగా నవ్వాడు. ఆమె హృదయం జల్లుమంది.

"మమ్మీ, పాలు వచ్చాయి."

"ఆఁ- వస్తున్నా" అతని తల్లి తళతళ మెరిసే స్టీల్‌గిన్నె తీసుకుని వచ్చింది. అతను లోపలికి వెళ్ళిపోయాడు. అతని నడక ప్రత్యేకంగా కనిపించింది బాలామణి కళ్ళకి.

"బాలా! వాడు మా అబ్బాయే. హైదరాబాదులో డాక్టరీ చదువుతున్నాడని చెప్పలేదూ" మార్తమ్మ అన్నది.

"ఆ..... ఆ యాదికొచ్చింది?" బాలామణి పాలచెంబు పావులోకి వంచింది.

"ఏమే నీళ్ళు కలిసినట్టున్నాయి" మార్తమ్మ పాలలో వేలు ముంచి చూచింది.

"అంత అనుమానమయితే పిండేటప్పుడు రారాదూ పంతులమ్మా" బాల అడిగింది.

"మేము పిండేటప్పుడు వచ్చినా, నాల్గు కళ్ళుపెట్టి చూచినా మీరు చేసే పని మానుతారుటే" ఆమె నవ్వింది.

బాల అక్కడే నిల్చుంది-విల్సన్ వస్తే మరోసారి చూద్దామని, ఆమె కోర్కె నెరవేరనే లేదు. అతన్ని తన ఊహల్లోకి ఆహ్వానిస్తూ మిగతా ఇళ్ళల్లో పాలు పోసింది. దినమంతా అతన్ని జ్ఞాపకం చేసుకుంటూ గడిపింది. ఒకసారి అతని తెల్లని పలువరస కనిపించి మాయం అయింది. మరోసారి అతని నొక్కుల జుట్టు ఆమె హృదయాన్ని మెలికలు తిప్పింది. సాయంత్రం తడిచేత్తో జుట్టు వెనక్కు దువ్వుకుంది. గూట్లో వున్న రెమి పౌడర్ చేతిలోకి పోసుకుని ముఖానికి పులుముకుంది. చాదుబొట్టు పెట్టుకుంది. అద్దంలో ముఖం చూసుకుంటే బూజు, బూజుగా కనిపించింది. పమిటచెంగుతో ముఖం మరోసారి తుడుచుకుని బయటికి వచ్చింది.

"అమ్మా! పాలచెంబేదే!"

"ఎందుకు?" చొప్ప నరుకుతున్న మల్లమ్మ తాపీగా అడిగింది.

"రాతావులు (వాడుక) పొయ్యవద్దా యేం?"

"యాదయ్య పొయ్యిండు" అన్నది.

"ఆణ్ణి నీల్లు చేది పొయ్యమన్నగద."

"నువ్వు చేదరాదూ! అట్లనే యెసరుపెట్టు. సద్దిబువ్వ లేదు" అని మళ్ళీ తన పనిలో లీనమయింది. బాలామణి కోపమంతా చేదమీద చూపింది.

"ఓ బాలమ్మతల్లీ! నీవు నీల్లు చేదకుంటే మానాయె. ఆ బొక్కెన ఇరగ్గొట్టకే" మల్లమ్మ కేకలు వేసింది.

"ఏందే..." తడిక తోసుకుని కొమరయ్య వచ్చాడు. బాలామణి హడిలి పోయింది. తండ్రి రాత్రిపూట మనిషి కాడు. ఎవరు ఏ చిన్న తప్పు చేసినా చావతంతాడు.



"ఏం లేదే అయ్య! హన్మండ గుడికాడ మల్లన్న కత చెప్తుండలే" అన్నది.

"ఎవరూ? జగ్గోల్లేనా! అయిపోవచ్చులేవే"అన్నాడు. స్తంభానికి చేరబడి చుట్ట వెలిగించాడు. బాలామణి గబగబ వంట ప్రయత్నంలో పడింది. ముదిరిపోయిన బెండకాయ ముక్కలుంటే వేసి దప్పలం పెట్టింది. మల్లమ్మ చొప్ప నరుకుడు కానే లేదు. పాలు పొయ్యడానికి వెళ్ళిన యాదయ్య, ఆటలకు పోయిన నర్సిమ్మ, సక్కుబాయి వచ్చారు. ఎవరి కంచం వాళ్ళు పెట్టుకున్నారు. అయ్యకు మాత్రం బాలామణే పెట్టింది.

"ఒరేయ్! పోరలు కాల్లు జేతులు ఏం కడగరా?"

"అప్పుడే కడ్గినమే అక్క" నర్సిమ్మ బొంకాడు.

"ఎప్పుడ్రా? ఫో... ఫో..." తప్పదన్నట్టు యిద్దరూ వెళ్ళి బయటవున్న నీళ్ళకాగులో చేతులు ముంచారు. అది చూచిన యాదయ్య చెరొక్కటి అంటించాడు.

"ఏందిరా! చిన్న పోరల జూస్తె ఓర్వవు-" మల్లమ్మ దీర్ఘం తీసింది.

"నీ యవ్వ నీలన్నీ ఖరాబు జేసిండ్రే"అతను కంచం పెట్టుకున్నాడు. కొమరయ్య లేచాడు.

"బాలా! ఓ బాలమ్మా! కూరేందే..." బాలామణి గబగబ తల్లి దగ్గరకొచ్చింది. ఆమె చేతిలోని కత్తి లాక్కుంది.

"అమ్మ నేను నరుకుత, నువ్వు అయ్యకు బువ్వపెట్టవే" ఆమె లేచి తల, చీర దులుపుకుంది. తల్లి లోపలికి పోగానే తేలికగా నిట్టూర్చింది. కత్తి చేతితో పట్టుకుంది. మళ్ళీ ఆమె కళ్ళముందు విల్సన్ కదలాడాడు. అతని పలువరస, ఒంకీలజుట్టు, తీరయిన నడక గుర్తుకువచ్చి చిన్నగా నవ్వుకుంది.

"అమ్మో?.... నేనేం జేతు దేవుడో..." తల్లి అరుపులు విని ఈ లోకంలోకి వచ్చింది.

"సన్యాసిదానా! నీ యక్క ఇంట్లకూసుండవు కూరెగురు చేసుకోరే..." మరో రెండు దెబ్బలు వినిపించాయి.

"రోజా నీసు కావాల్నంటే యేడదెత్త?"

"మళ్ళీ మాట్లాడితే బొక్కలిరగ దంత - బాలా..."

"పిల్సినావయ్యా?" బాలామణి పరుగుపెట్టింది.

"ఆఁ మార్తమ్మ తాన వొయ్యి గింత కూర యేపిచ్చుకురా..."

"అట్లనే అయ్య" చిన్న గిన్నె తీసుకుంది. విల్సన్‌ను చూడవచ్చు అన్న భావమే ఆమెను ఆనందలోకాలకు తీసుకుపోయింది. రెండడుగులు వేసింది.

"ఉండే పోరీ? ఇంత రాతిరి ఒక్కదానవుబోతావు! యాదిగా-నువ్వు బోరా..." కొమరయ్య మళ్ళీ అన్నాడు. యాదయ్య లేచాడు. బాలామణి ఉత్సాహమంతా నీరుగారిపోయింది.

"కొమురయ్యా, ఓ కొమ్రయ్యా...." అరుచుకుంటూ వచ్చాడు బిచ్చపతి, ఆ ఊరి పంచాయతీ బోర్డు మెంబరు సీతారాంరెడ్డి నౌకరు. కూర సంగతి మరచిపోయారందరూ."

"ఏందిరా బిచ్చాలూ?"

"ఏం లేదే! మా అయ్య పెద్దావు ఈనింది. పాలు బోసుక పొమ్మన్నడు" బిచ్చాలు వచ్చి కూర్చున్నాడు.

"ఎప్పుడు యీనింది?"

"మొన్న మాపటాల్ల. పూటకు మూడు శేర్ల పాలిస్తదే."

"ఆల్లకేంరా మేత పెడ్తరు. జున్ను అయిత లేవు?"

"రేపటికి నాలుగు దినాలు..." వాళ్ళు లోకాభిరామాయణంలో మునిగిపోయారు. బాలామణి వెళ్ళి చాప పరిచి, దానిమీద బొంతేసుకుని పడుకుంది. మిగిలిన పిల్లలు భోజనాలు కానిచ్చి అక్క ప్రక్కన ఒరిగి పోయారు. నిద్రబట్టింది, రాత్రంతా కలలే! విల్సన్‌ను గూర్చిన కలలే.

"బాలా.... ఓ పిల్లా లేవే తెల్లారిపోయింది. పాలు పోసి రావాల్నే." మల్లమ్మ అరుపులు బాలామణి కలను చెదరగొట్టాయి.

"ఏందమ్మా!" బద్ధకంగా వళ్ళు విరుచుకుంది.

"లేవు బిడ్డా, రాతిరి పలుగోలె పంతివి. కడుపు పీక్కుపోయింది సూడు" తల్లి హృదయం తల్లడిల్లిపోయింది.



"పాలు పిండారే?" బాలామణి చెంగున లేచి అడిగింది.

"మీ అయ్య పిండుతున్నడు."

బాలామణి బావి దగ్గరకు వెళ్ళి కచ్చికతో పళ్ళు తోముకుంది. చెక్క దువ్వెనతో తల దువ్వుకుంది. ముఖం గట్టిగా తుడుచుకుని పౌడర్ రాసుకుంది, బొట్టు పెట్టుకుంటుంటే పురోహితుడు కిష్టయ్య భార్య మాటలు గుర్తుకు వచ్చాయి.

'బాలా, నువ్వు బ్రాహ్మల ఇండ్లలో పుట్టవలసిన దానవు' అని. నిజమే అనుకుంది బాల. అనుకోవడానికి అవకాశం లేకపోలేదు. పచ్చగా, సన్నగా, నాజూకుగా వుంటుంది. పొడవుగా లేకపోయినా ఒత్తయిన జుట్టే మరి. బొట్టుపెట్టుకుని, చీరవిప్పి మళ్ళీ కట్టుకుంది. బయటికి వచ్చేసరికి యాదయ్య పాలచెంబుతో వెళ్ళిపోయాడు.

"నన్ను పొమ్మంటివి గదవే అమ్మా."

"నువ్వు పాలు తీసుకురా పో..." అన్నది. కూతురి అంతర్యం తల్లికేం తెలుసు?

"నువ్వు యెంతకూ రాకపోతే ఆడ్ని పొమ్మన్న. అందరికీ చాయ్‌లు అలవాటు, పొద్దున్నే కావాల్నంటారు. 'పాలు దీసుకురా, యాదయ్య పట్నం బోవాలే" అన్నది మల్లమ్మ. బాలామణి ఉత్సాహం నీరుగారిపోయింది. మెల్లగా పాలుతెచ్చే బిందె నెత్తిన పెట్టుకుని బయలుదేరింది. అయిదారిండ్ల వాళ్ళు పాలుపోస్తారు. అవి తెచ్చి తమ దగ్గర మిగిలిన పాలు కలిపి హైదరాబాద్ తీసుకుపోతాడు యాదయ్య.

## 2

సీతారామిరెడ్డిది పెద్ద భవంతి, అతని తండ్రి కాలంలో కట్టింది. అతను ఊరికి పులి అని చెప్పుకుంటారు. నలుగురు కూతుర్ల తరువాత పుట్టినవాడు సీతారామిరెడ్డి. ఆయన తరువాత మరో ఆడపిల్లే పుట్టింది. అందుకే ఆ యింటి దీపంగా చూచారు ఆయన్ని. ఆఖరమ్మాయి పెళ్ళిలోనే ఇరవై నిండని సీతారామిరెడ్డికి వివాహం కూడా చేశారు. అతని భార్య

జయలక్ష్మి సంసారం చెయ్యటంలో చాలా నేర్పరి అని పేరుగాంచింది. తండ్రిపోయాక సీతారామిరెడ్డి పెత్తనమంతా భార్యకే వదిలేశాడు. తల్లి రాజమ్మ అప్పుడప్పుడు వెర్రెత్తినట్టు శాపనార్థాలు పెట్టినా, మళ్ళీ మామూలుగా వుంటుంది.

జయలక్ష్మి పమిటచెంగు నడుముకు దోపుకుని పెరట్లోకి వచ్చింది. జీతగాడు పాలు పిండుతున్నాడు.

"సాయిలూ!.... ఒరేయ్..."

"అయిపోయిందమ్మా"

"నేను చెప్పింది గుర్తుందా?"

"ఏం చెప్పినవు?" నురగలు కక్కుతున్న పాలచెంబు పట్టుకుని వచ్చాడు.

"నీకు నేను చెప్పిందేదీ జ్ఞాపకముండదు, యెందుకు పనికివస్తావురా?"

"అమ్మ.... మల్లజెప్పుండ్రి జర...." తలమీద రుమాలులోకి చేయి బోనిచ్చి బరాబరా గోకాడు.

"పాలు పిండేముందే ఓ పావుశేరు నీళ్ళు చెంబులో పట్టాలని చెప్పలేదట్రా నేను."

"ఇప్పుడేమయింది! అర్ధశేరు నీల్లు పోస్త."

"నీ తెలివి తెల్లారినట్టే వుంది, ఈ నురగంతా పోతే ఆ సన్యాసులు గుర్తుపట్టరూ! అదిగో ఆ పిల్లముండ రానే వస్తోంది." ఆమెకు విపరీతమయిన కోపం వచ్చింది, అన్యాయంగా వ్యాపారం చెడగొట్టిన సాయిల్ను నమిలి మింగేయాలనిపించింది.

"అప్పుడే పిండినాడు పాలు..." తలమీది బిందె దించుకుని అడిగింది బాలామణి.

"నువ్వేమో సోకులు చేసుకుని వయ్యారంగారావే, నీవు వచ్చే అంత వరకు గేదెల్ని కట్టి వుంచుతాము" రుసరుసలాడింది జయలక్ష్మి.

"ఏందమ్మో పొద్దున్నే నా మీద యెగిరిపడుతున్నావు? నాల్గిండ్లు తిరిగి రావాల్నా వద్దా?" మూతి తిప్పింది బాల.

"పట్టు..." లీటర్ చెంబుతో పాలు కొలిచింది, గోరెడు తక్కువే కొలిచింది.



"ఏందమ్మా బంగారం కొలిచినట్టు కొలిస్తే యెట్ల? మేము పోస్తే కొసరు పిసరు అంటరు జనం."

"ఓయమ్మో, నీ నోరు పెద్దదే? నువ్వెట్ల సంసారం జేస్తవో?"

"నువ్వు జేసినట్టే చేస్తానమ్మా."

"నువ్వు చదువుకుంటే ప్రధానమంత్రి అయ్యే దానివే..." లోపలి గుమ్మంలో నిల్చున్న రాజమ్మ ప్రశంసాపూర్వకంగా చూసింది.

"ఈ మాత్రం మాట మంత్రే అనాల్నా? పనిలేక పడి వుండేవాళ్లె వరయినా అనవచ్చు." జయలక్ష్మి మూతిముడుచుకుని మిగిలిన పాలు తీసుకుని లోపలికి వెళ్ళింది.

"బాలా! మీ అమ్మనోసారి రమ్మనే" రాజమ్మ చెప్పింది. మల్లమ్మ పేలు కుక్కడంలో సిద్ధహస్తురాలు. రాజమ్మ అప్పుడప్పుడు పిలిపించి పేలు కుక్కించుకుని తన కష్టసుఖాలు చెప్పుకుని, కూతుళ్ళతో మాట్లాడిన అనుభూతి పొందుతుంది.

"అట్లనే ఓ చెయ్యి యెయ్యత్తా! బిందె బరువయినాది" అన్నది. బిందె యెత్తింది.

పాత కాలమునాటి మేడ, చెక్కమెట్లు దిగి వచ్చాడు సీతారామిరెడ్డి. తల్లిని యేదో అడుగబోయి వెంటనే నాలుక కరుచుకున్నాడు. ఆమెతో మాట్లాడినట్టు తెలిస్తే జయలక్ష్మి నిద్రపోతుందా? ఆ రోజంతా గిన్నెలమీద, చెంబులమీద కోపం చూపుతూనే వుంటుంది. తల్లితో యెప్పుడు మాట్లాడినా భార్య చాటుగానే మాట్లాడుతాడు. అది సుఖపడడానికి కనిపెట్టిన కిటుకు.

"ఊ...... ఒట్టి అర్భకపు సన్యాసి" అనుకుంటుంది రాజమ్మ.

"జయా! చాయ్ పెట్టావా?" భార్యనే పిలిచాడు.

"ఇదిగో పెడుతున్నాను. అన్ని పనులు నేనే చూచుకోవాలాయె. వెనకా ముందు చెయ్యి అందించే దిక్కేది?" అన్నది విసురుగా. ఆయనకు తెలుసు ఆ విసురు తల్లి మీదేనని. అక్కడ వున్న పని మాత్రం యేపాటి? ముగ్గురి వంటకు ఇద్దరు పనివారు. సాయిలు పాలు పితికి, నీళ్ళుతోడి పశువులను తోలుకుపోతాడు. చెన్నమ్మ వాకిళ్ళు వూడిచి, అంట్లు తోమి

అమ్మగారి చేతిక్రింద పది గంటలవరకు వుంటుంది. చాకలి వేరే వుండనే వుంది. ఆ మాటే పైకి అంటే జయలక్ష్మి అలనాటి సత్యభామను గుర్తుకు తెస్తుంది. సత్య ఎడం కాలితో తన్నితే శ్రీకృష్ణ పరమాత్ముని రోమాలు పులకించి నిక్కబొడుచుకుని ఆమెకే బాధను కల్గించాయేమో తెలియదుగాని జయలక్ష్మి మాటలు ఈటెల్లా అతని మనసును గాయపరుస్తాయి. అందుకే అతను నోరు మూసుకుంటాడు.

సామాన్య కుటుంబాలలో నూటికి 50 మంది మగవారు సీతారామి రెడ్డిలాగే బ్రతుకుతున్నారేమో! బయటి ప్రపంచం చూడని స్త్రీలు నాలుగు గోడలమధ్య మడికట్టుకుని స్త్రీ స్వాతంత్ర్యమో అని గోలపెడుతుంటే వీపుగిల్లి జోల పాడుదామనే పురుషులు అట్టడుగునే వున్నారు. స్త్రీలంటూ వాపోతూ తమాషాలు చూస్తున్నారు.

అతని ఆలోచన పూర్తి అవుతుండగా టీ కప్పుతో వచ్చింది జయలక్ష్మి.

"చాయ్‌లు, కాఫీలు అందివ్వడానికో కుర్రాడిని పెడితే బావుండును!"

"ఎవరు దొరుకుతారే?"

"ఎందుకు దొరకరు? అసలు నేను మీ కంటికి దున్నపోతులా కనిపిస్తాను" అన్నది నిష్ఠూరంగా.

"ఏమిటా మాటలు? కాస్త మృదువుగా మాట్లాడలేవా?" అతనికి టీ చేదుగా అనిపించింది.

"మరి యెన్నాళ్ళాయె కుర్రాడు కావాలని చెప్పి?"

"ప్రయత్నం చేస్తూనే వున్నాను. పిల్లకాయలంతా బడులకు బోతున్నారు. యెక్కడో ఒక్కడు వుంటే వాడు తన పనే చేసుకుంటాడు."

"మనసుంటే మార్గం లేకపోదు."

"పోనీ నువ్వే చూడరాదూ?"

"ఆ మాట అంటారని తెలుసు - మీరు గాజులు వేసుకోండి. వ్యవహారాలు నేనే చూస్తాను" అన్నది వెటకారంగా. ఆమె గొంతు గీరగా వుంటుంది. ఆమె అలా మాట్లాడినప్పుడు అతని వెన్ను జలదరిస్తుంది.



"ఊఁ.... మాయదారి కాలం, బ్రహ్మంగారు మహానుభావుడు యేనాడో చెప్పాడు" రాజమ్మ గొణుక్కుంది. చెట్టంత కొడుకును గాజులు వేసుకోమంటుందా?

"ఏమిటది! గుసగుస గుడిసెకు ముప్పు, అనేది గట్టిగా అను" అన్నది జయలక్ష్మి పెద్దగా.

"నేనేమన్నానే తల్లీ? పోతాను..." బయటికి వెళ్ళిపోయింది రాజమ్మ.

"జయా, ఒక్క ఐదు రూపాయలుంటే యిస్తావూ?"

"ఎందుకు?"

"మగవాడిని అలా బయటికి వెడితే యెన్నో అవసరాలుంటాయి" అన్నాడు మెల్లగా.

"పేరూ ఊరూ లేని అవసరాలేమున్నాయి? అలా ఐతే సంసారం గుండమయినట్టే" పూల గదిలోకి వెళ్ళి ఒక్క రూపాయి తెచ్చి యిచ్చింది.

"ఇది కూడా పూజ అయ్యాక హుండీలో వేద్దామనుకున్నాను. నా దగ్గర ఒక్క పైసా లేదు" అంటూ ఖచ్చితంగా చెప్పింది.

"నిన్ననే కదా పంటమ్మిన డబ్బు షావుకారు పంపింది..."

"దాని ఖర్చులు దానికే వున్నాయి."

"ఏమిటో..."

"ఒకసారి చెబితే అర్థం చేసుకోవాలి. నేను నోట్లు భోంచేస్తున్నాను చాలా?" విసురుగా అని విసుగ్గా వెళ్ళిపోయింది. ఆయన బయటికి వచ్చాడు. అటు, యిటు చూచి రాజమ్మ అతడిని అనుసరించింది.

"నాయనా సీతయ్యా."

"ఏమిటమ్మా!" వెనక్కు తిరిగాడు.

"ఏంలేదురా, అక్కలంతా యెవరి సంసారాల్లో వారు కూరుకు పోయారు. నువ్వు పిలిచినా వారు వచ్చే పరిస్థితి లేదు. అందరికంటే చిన్నది సరస్వతి. దాన్ని పిలుచుకురా తండ్రీ..."

"మంచిదమ్మా విజయదశమి దగ్గరకు వస్తుందిగా. అప్పుడు పిలిపిస్తాను."

"తప్పకుండా పిలుస్తావు కదూ?" ఆశగా అడిగింది.

"తప్పక పిలుస్తానమ్మా?" అన్నాడు. అతను తల్లిని పరీక్షగా చూశాడు. ఆమె బాగా చిక్కిపోయింది.

"ఒరేయ్ నాయనా! ఒక్క ఐదు రూపాయలు యివ్వరా. బొత్తిగా చేతిలో పైసా లేదు. గుడికి వెడితే పూజారి పళ్ళెం పడతాడు-"

"ఒక్క రూపాయే వుందే, తీసుకో" రూపాయి ఆమె చేతిలో పెట్టి బయటికి వెళ్ళిపోయాడు.

"ఎక్కడిదాకానోయ్?" కరణంగారి పెద్ద కొడుకు గోవిందరావు వాకిట్లో నిలబడి పిలిచాడు.

"అలా పొలంవైపు వెడదామని-" ఆగాడు.

"పొలం పిల్లి ఎత్తుకుపోదుగాని రెండు పట్లు వేసుకుందాము రా" అని లోపలికి ఆహ్వానించాడు.

"మళ్ళీ వస్తాను-జేబులో డబ్బులు వేసుకురాలేదు."

"డబ్బులుదేముంది నేనిస్తాను" అంటూ అతను బలవంతం చేశాడు. అప్పటికే అక్కడ పదిమందిదాకా చేరారు. గోవిందరావు వెళ్ళి 50 రూపాయలు తెచ్చి సీతారామిరెడ్డికి అప్పుగా యిచ్చాడు. కుర్రాడిని ప్రక్కనే వున్న రేకుల షెడ్డు హోటల్‌కు పంపి అందరికీ టీ తెప్పించి ఇచ్చాడు.

జూదగృహాలు లోకంలో యెందుకు వెలిశాయి? సంసారాల్లో గయ్యాళి భార్యలవల్లా లేక కుటుంబ బాధ్యత తెలియని భర్తలవల్లా?--

## 3

బయట ఎవరో అరుస్తుంటే తన అలంకరణ ముగించి వచ్చింది బాలామణి. యాదయ్య అసహాయంగా చూస్తున్నాడు. అతని చేతిలో పాల చెంబు వుంది - నిల్చున్నావె ఆ ఊరి హెడ్‌మాస్టరుగారి భార్య రుక్కుంబాయి.

"ఏంటి రుక్కుంబాయమ్మా?"

"మీ అమ్మా, నాన్నా లేరా?"



"లేరండీ, పక్కూరిలో పచ్చగడ్డి కోసం బొయ్యిండ్రు."

"ఈ పోరడు చూడే బాలా! పాలల్లో నీల్లు కలిపాడు."

"కలిపినావు అన్నా?"

"లేదే ఆమె ముందే చెంబు బోర్లిస్తే నీల్లెక్కడివి" యాదయ్య తన నిర్దోషిత్వం నిరూపించుకునే ప్రయత్నం చేశాడు.

"ఒరీ నీ తెలివి తెల్లారా! నేనే దద్దమ్మనుట్రా?" ఆవిడ వెళ్ళి గాడిలో వున్న సీసా ఒకటి తెచ్చింది.

"దీనికేం చెబుతావే?"

"అది... అది మా నాయన కల్లుసీసండి."

"అమ్మో-అమ్మో! యెంత జాణతనమే. అందుకే కాలమిలా మండిపోతుంది-ఈ సీసాలో నీళ్ళు చెంబులో పోయటం నేను కళ్ళారా చూశానే?"

"అట్లనా! మా అమ్మ వచ్చినంక ఆడి సంగతి జెప్తలే బాయమ్మా? నీల్లు కలిసినయి అంటున్నవు గద ఒక్కపావు యెక్కువ బోస్త పట్టు" అంటూ ఆమెకు పాలుబోసి పంపింది.

"డబ్బెక్కువ యిచ్చినపుడు మంచిపాలు పొయ్యాలి" అని ఆవిడ వెళ్ళిపోయింది.

"ఏందిరా అన్నా! ఏ పని జేసినా తెల్వకుండ జేసుకుంటరు గాని గిట్లనా?"

"ఆమెవి చాకుల్లాంటి కండ్లే, యలాగ జూసిందో!"

"ఈ డాటరిగారి నౌకరెప్పుడొస్తడో? ఆడిముందు పిండాలె పాలు."

"బాలా, మన దగ్గర అసలు పాలు గావాలంటడు గద, అసలు మందులే యిస్తాడంటావా?"

"ఇంగిలీసు తెలిసినోల్లకు యిస్తడంట" ఆమెకు విల్సన్ గుర్తుకు వచ్చాడు.

"అన్నా! మార్తమ్మ టీచరు పాలు జల్దీ తెమ్మన్నదే పోయొస్త" నిండుగావున్న పాలచెంబు పట్టుకొని బయలుదేరింది.

"బాలా! జల్ది రా, పాలు తెచ్చి పట్నం బోవల్నె!"

"ఈడున్నట్టు వస్త-" ఉత్సాహంగా ముందుకు కదిలింది. మార్తమ్మ ఇంట్లో ఆలస్యమయినా ఫరవాలేదు అనుకుని దారిలో పొయ్యవలసిన వాడికలు త్వరగా పోసింది. మార్తమ్మ ఇంటికివెళ్ళి తలుపు కొట్టింది.

"కమిన్..."

"కమిన్ను యేంటే చీబ్బా!" మళ్ళీ కొట్టింది.

"ఐ సే కమిన్..."

"యెవరయ్యో ఇంట్లో! కమిన్, అసేయ్ అంటే తెలవదనుకుంటున్నావా? ఆ...." ఈసారి కోపంగా తలుపు దబదబ బాదింది.

"మై గాడ్.... వచ్చింది బాలామణిగారా? ఇదిగో గిన్నె లోపలుంది. పాలు పొయ్యి" అన్నాడు విల్సన్. బాలామణి లోపలికి వెళ్ళింది. విల్సన్ అద్దముందు నిల్చుని బ్రష్‌తో గడ్డం రుద్దుకుంటున్నాడు. ఆమె పకాపకా నవ్వింది.

"యెందుకు?"

"యెందుకా? బాగుంది వేషం. నాకు తెలువక అడుగుతున్నా..."

"వేషం కాదు గడ్డం గీసుకుంటున్నా" అన్నాడు. ఈసారి యింకా గమ్మత్తుగా కనిపించాడు. ఒక ప్రక్క గీసినట్టుంది, మరో ప్రక్క తెల్ల నురుగుంది.

"మీకు మంగలోడు లేడా?"

"రోజూ మంగలోడితో చేయించుకుంటే అయినట్టే" నవ్వాడు. ప్రక్కనేవున్న బేసిన్‌లో చిన్న షేవ్ మిషన్ ఓపెన్ చేసి టాప్ విప్పాడు.

"రోజూ యెందుకు చేసుకోవాలె?"

"నువ్వు రోజూ తల దువ్వుకోవా?"

"అదీ యిదీ ఒక్కటేనా?"

"ఆహా రెండూ ఒక్కటే. పాలు పొయ్యి. అమ్మ డికాషన్ పెట్టింది. నీ కోసం చూచి చూచి షేవ్ చేసుకుందామని వచ్చాను."

"నిజంగా నా కోసం సూస్తున్నావా?" ఆమె ముఖం వెలిగిపోయింది.



"ఆధునిక యుగంలో పాలవాళ్ళు దేవదూతలు" అన్నాడు. ఆమె పాలు పోసింది. అతను త్వరగా తీసుకువెళ్ళి హీటర్‌మీద పెట్టి స్విచ్ నొక్కాడు.

"అదేంది?"

"కరెంటు పొయ్యి."

"వారేవ్వా.... ఇట్ల ఏలు పెడితే అట్ల మంట... మేం చూడు రాజేసి ఊది ఊది సావాలె. జల్ది అయితదా వంట?"

"ఆహా..." అతను రెండు మగ్గుల్లో డికాషన్ వంచాడు.

"మార్తమ్మ లేదా?" అంత చిన్నపిల్ల, తల్లిని అలా ఏకవచనముతో సంబోధించడం ఏ మాత్రం నచ్చలేదు. కాని అది వారి అలవాటు. దాన్ని తనేం మార్చలేడు.

"నేను అడిగింది ఇనపడలే?"

"మిషన్ కాంపౌండుకు వెళ్ళింది. అక్కడ దీవెనమ్మ టీచర్ లేదూ, ఆమె కూతురు ప్రసవించింది. తోడు రమ్మని పిలిచింది."

"మొగపిల్లగాడా, ఆడపిల్లనా?"

"ఆడపిల్లే..." అన్నాడు పొంగుతున్న పాలు డికాషన్‌లో పోస్తూ.

"అయ్యో!" తనకేదో ప్రమాదం ముంచుకువచ్చినట్టు తలకు చేతులు పెట్టుకుంది.

"ఆడపిల్లలంటే అంత భయమెందుకు?"

"యహ్! నీకేం దెలువదు. మా నాయనమ్మ అనేది మొగపిల్లలున్న ఇల్లు చెడదట, మోతుకులున్న వనం చెడదట..."

"ఆ కాలం మారిపోయింది. ఇప్పుడంతా సమానం."

"పిచ్చివాడివి..." పకపక నవ్వింది.

"పోనీ నీ కంతా కొడుకులే కావాలా?"

"ఛీ-పో...." ముఖమంతా యెర్రగా చేసుకుని పోబోయింది.

"అరె ఆగమ్మాయి నీ కోసం కాఫీ కలిపాను."

"నా కేమొద్దు."

"పేచీ పెట్టకు. కాఫీ తీసుకో" అతనిచ్చిన కాఫీ తీసుకుంది.

"బాలా! నువ్వు బడికి వెళ్ళావా?"

"ఆఁ.... రెండో క్లాసు వరకు చదివాను."

"మరెందుకు చదువు ఆపావు?"

"అప్పుడే తమ్ముడు పుట్టిండు. మరి ఆడ్ని చూడవద్దా ఏం?" విల్సన్ ఆలోచనలో పడ్డాడు. నిజమే పేద కుటుంబాలలో ఈ సమస్య ఒకటి వుంది. ముందు పుట్టిన అమ్మాయి ఖచ్చితంగా వెనక పుట్టిన సంతానాన్ని చూసుకోవాలి.

"ఏం కాఫీ.... చేదు..." ముఖం చిట్లించింది.

"కాఫీ అలాగే వుంటుంది. మరింత పంచదార వేస్తాను" అతను చంచాతో పంచదార వేసి పాలు పోశాడు. అప్పుడు కూడా ముక్కు మూసుకుని త్రాగినట్టే త్రాగింది.

"నేను త్వరగా కాఫీ తీసుకుని ఆస్పత్రికెళ్ళాలి" విల్సన్ గ్లాసులు బేసిన్‌లో పడేశాడు.

"నేనూ వెళ్ళాలి, మాయన్న యెదురు చూస్తడు."

"థాంక్స్..."

"అదేంది?" మళ్ళీ తిరిగి చూచింది.

"అదా.... నువ్వు నాకు కంపెనీ యిచ్చినందుకు.... ఓ అదే నాతో కాఫీ త్రాగినందుకు?"

"థాంకూ అంటే నాతో కాఫీ తాగినావనా?"

"ఖర్మ? అది కాదు బాలా! యెవరయినా యేదయినా యిస్తే, యేదయినా నీ కోసం చేస్తే ధన్యవాదాలు చెబుతాం చూడు..."

"ఓ... తెలిసింది నువ్వు నాకు కాఫీ యిచ్చినందుకు థాంకు."

"యు నాటీ..." విల్సన్ నవ్వాడు. బాలామణి సిగ్గుల మొగ్గయి ఖాళీ చెంబుతో పరుగులు పెట్టింది. ఇంటికి వచ్చేసరికి పాల డబ్బా సైకిల్‌కు బిగిస్తున్నాడు యాదయ్య. అప్పుడే గడ్డిమోపు యెత్తుకొని వచ్చింది మల్లమ్మ.



"అమ్మా? ఇంట బువ్వలేదు. ఉపాసమే"

"ఎందుకు కొడక! బాలతో చెప్పిపోయినరా రొట్టె జెయ్యమని. చెయ్యలేదా?"

"పాలు బోసి ఆ దొరసాని గిప్పుడు వస్తోంది" యాదయ్య కొర కొర చూచాడు.

"జర ఆగు, రొట్టె అయిదు నిమిషాల్లో జేస్త."

"నాకేమొద్దు... అమ్మా ఒక రూపాయి యియ్యి యేదన్నా హోటల్ల తింట."

"గట్ల చెప్పరాదూ! హోటల్ల తినబుద్ధయి నకరాలు..." బాలామణి వెక్కిరించింది.

"నా దగ్గర యాడివిరా. మీ అయ్యకే యెక్కడ పైసలు సాలవు. రాతావులు పోశేటోలత అడుక్కో బిడ్డ."

"అమ్మా! సీతయ్య దొరింటి పాలు బంద్ జేసుకోవల్నె?"

"ఎందుకురా?" ఆమె ఉస్సురంటూ బావి చప్టామీద కూర్చుని కచ్చిక తీసుకుంది.

"సగానికి సగము నీల్లు బోస్తే యెట్లనే? కొసర్ల పాలు గిట్టుబాటు గావాల్నని మనమిన్ని బోస్తమా! పట్నం రాతావులోల్లు లొల్లి పెడ్తున్నరు. ఇప్పుడే సగంమంది సర్కారోల్లంత తెస్తున్నరు" యాదయ్య పాలల్లో వేలు ముంచి తీశాడు. వేలు తల్లికి చూపాడు.

"మరి యెట్లరా. ఆయన నాల్గు రూపాయలు అప్పంటే యిస్తండు, వద్దంటే యేమనుకుంటడు?"

"ఆయన ధర్మరాజే, ఆ పెండ్లముంది చూడు నా తల్లే..." బాల గుండెల మీద చేయి పెట్టుకుంది.

"మరెట్ల?"

"అమ్మా! నువ్వంతా నాకు వదిలి బేఫికర్‌గా వుండు. జర నేను ఆమె తిక్క కుదురుస్త...." బాలామణి బయలుదేరింది.

"వద్దే పోరీ.... పెద్దవాళ్ళతో మనకేందే..." తల్లి చెబుతున్నా వినలేదు,

బాల వెళ్ళిపోయింది. అప్పుడే గొల్లలకు పెద్ద బాబయ్య వచ్చాడు. అతనెప్పుడు ఎర్రంచు, అరచేయి వెడల్పుతో వుండే ధోవతులు కడతాడు. పైన అంగారఖలాంటి చొక్కా నల్లగొంగళి కప్పుకునివుంటాడు.

"ఏందే మల్లమ్మా? కొమరడు లేడూ?"

"రా అన్న...రాలేదు, గడ్డికి పోయినము. పిల్లలు ఆకలిగొంటరని నేను వచ్చిన, ఆయన ఒస్తడేమో?" లేచి, ఒక ప్రక్కకు ఒదిగి నిల్చుంది మల్లమ్మ.

"అరే యాదయ్యా, ఆలుగడ్డ లంట తే బిడ్డ...." ఒక రూపాయితీసి ఇచ్చారు. యాదయ్య అది జేబులో పెట్టుకుని వెళ్ళిపోయాడు.

"జంగమ్మ వచ్చిందంట గద అన్నా!"

"ఆడ దిక్కులేని ఇల్లు రాక తప్పుతాది?"

"జంగయ్యకు మళ్ళీ పెండ్లి జెయ్యరాదె."

"అదే సొంచాయిస్తున్న" అన్నాడు తలపాగలోని చుట్టతీసి వెలిగించు కుంటూ.

బాబయ్యకు సంవత్సరానికో పిల్ల పుట్టడం, పురుట్లోనే పోవడం జరిగింది. అతను జహంగీరు పీర్లదగ్గర నమాజు చదివించి మొక్కుకున్నాడట. ఆ తరువాత పుట్టిన అబ్బాయి, అమ్మాయి దక్కారు. ఇద్దరికీ జంగయ్య, జంగమ్మ అంటూ జహంగీర్ పేరు కలిసివచ్చేలా పెట్టుకున్నారు. ఇద్దరికీ పెండ్లి చేశాడు. పదిసంవత్సరాలు హాయిగా గడిచిపోయాయి. జంగయ్య భార్య నల్గురి పిల్లలను కని కన్నుమూసింది. బాబయ్య భార్య యెందుకూ పనికిరాని ముసలమ్మ. నాల్గు అయిదు నెలలుగా ఇటు పిల్లలు, అటు పనులతో సతమతమవుతున్నాడు జంగయ్య. బాబయ్య నాల్గయిదు చోట్ల అమ్మాయి కోసం ప్రయత్నం చేశాడు. నల్గురు పిల్లలు అనగానే 'అమ్మో' అన్నారు. ఎక్కడయినా భర్త వదిలివేసిన స్త్రీ, గాని, విత్తంతువు గాని దొరికితే బాగుండునని చూస్తున్నాడు బాబయ్య. అప్పుడప్పుడు కొమురయ్యతో బాతాఖానీ వేసుకుంటాడు. ఇద్దరికీ దూరపు బంధుత్వం కూడా వున్నది.



"ఒక్క పొగాకుకాడ వుంటే యిస్తావే!"

"తెస్తనే..." మల్లమ్మ చిలుకకొయ్యకు తగిలించిన బుట్టలో నుండి కాడతీసి ఇచ్చింది. తన చుట్టలోవున్న నుసి అంతా దులిపాడు. పొగాకుకాడ తుంపి నాపాడు.

"ఓ పిల్లా, సక్కూ! మామకు ఇంగలము(నిప్పు) తేయే."

"ఎందుకులే పుల్లలపెట్టె వుంది."

"అమ్మో! ఓ యమ్మ, ఆ జయమ్మ తిక్క కుదిరిందే" సంతోషంగా వచ్చింది బాలామణి.

"జగడం చేసి వస్తివా యేందే?"

"నీయవ్వ జగడం యెందుకు జేస్తనే? పాలల్ల నీల్లు శాన కలుపుతున్నవు అన్నాను. ఒక్క బొట్టు కలపదంట. ఒట్లు, సత్యాలు అంటూ నల్గురిని పిలిచిందే. నాకు భయమేసింది. సూతమని ఒక్క మాటన్న, ఈ లొల్లి యెందుకు రేపటినుండి నేనే పిండుకుంట అని... అమ్మ మొకం సూడాలె" పక పక నవ్వింది. పలువరుస దానిమ్మగింజల్లా తెల్లగా తళతళ లాడింది.

"ఏమంది?"

"ఏమంటుంది! ఇరుగమ్మను, పొరుగమ్మను పిలిచింది తనే కదా. నోరు మూసుకుని పిండుకొమ్మంది."

"సీతయ్యదొర లేడా?"

"ఆయన వున్నడు. యేమనలేదు." చీర పైకి దోపి నీళ్ళు తోడ సాగింది బాల.

"మల్లమ్మా, బాలమ్మ పెండ్లి జేయరే?"

"ఎందుకుజేయమన్నా! యెవరన్న అడగందే జేతుమా? మేనోల్లకు వరదచ్చన కావాల్నంట, మాకడ యాడివి పైసలు?"

అతని పెదవులమీద చిరునవ్వు కదిలింది. "కిష్టమ్మకు అంత సిరి వచ్చినాదే?"

"రాదా అన్న! పెద్దకొడుకు గుత్తలు పడ్తడంట. రెండో కొడుకు

మిఠాయి దుకానము పెట్టిండంట. ఈ పిల్లవాడేమో సదువు తుండంట. లస్కరోల్లు (సికిందరాబాద్) రెండేలు యిస్తమంటూ ఒస్తున్న రంట. మనము ఏడ దేవాలె అంత పైసా? ఆయనతో మాట్లాడుతూనే గేదెలకొట్టం శుభ్రం చేసింది మల్లమ్మ.

"మేనపోరినట్టు పరాయిపిల్ల ఉంటాదె?"

"అది కిష్టమ్మొదినకు తెలుపాలె మనము జెప్తమా. నా బిడ్డ పుట్టిందిగని. దానికి మొగడే పుట్టలేదా!"

"ఓ మల్లక్క-గింతతొక్కయ్యే" జొన్నరొట్టె పట్టుకొని వచ్చాడు సాయిలు.

"సీతయ్య దొర జీతగాడికి తొక్కు (పచ్చడి) కరువా?" బాబయ్య చుట్టతీసి అడిగాడు.

"అది కాదె ఈ పిల్ల బాలామణి మాయమ్మతో లడాయి జేసింది. ఆమె అందరిమీద యెగిరిపడుతోంది. అవునే మల్లక్కా, దీని ధైర్యం పాడుగాను అమ్మను యెన్ని మాటలన్నదే..." ఒక చేత్తో రొట్టె పట్టుకుని, రెండో చేత్తో చెంప పట్టుకొన్నాడు సాయిలు.

"ఓయ్ సాయిలూ... ఆ చేయి తీసేయి..."

"సూడే మల్లక్కా!"

"అందరు చూస్తున్నరుగాని. జరా మొగోని తీరుగా మాట్లాడే సాయిలు మామా" అన్నది బాలామణి.

"నోరులేని ఒన్ని యేమన్న ఏం లాభమే" మల్లమ్మ ఉల్లిపాయల పచ్చడి తెచ్చిపెట్టింది. సాయిలు వెళ్ళిపోయినా బాబయ్య బాలామణి పనితనాన్ని చూస్తున్నాడు. అలాంటి స్త్రీలను చూచే కాబోలు మహాలక్ష్మి అంటారు. అతని మనసులో యేవేవో ఊహలు తలయెత్తాయి. మరోసారి వస్తే బావుంటుంది, అదీ మంచిరోజు చూచి అనుకున్నాడు.

"పోతనే మల్లమ్మా."

"నీ ఇష్టమన్నా" అన్నది. మల్లమ్మకు అతడు కూర్చోవటము పనికి ఆటంకంగానే వుంది. అతను వెళ్ళగానే నిట్టూర్చింది.



"పొద్దుటి ముచ్చట పని చేటు, రాత్రి ముచ్చట నిద్రచేటు అన్నారు. ఓ పిల్లా సక్కూ... పొయ్యి మండుతుందేమో చూడవే" అన్నది పేడ తొక్కుతూ.

"అమ్మా!" బాలామణి వచ్చి నిలబడింది.

"ఏందే..."

"ఏంలేదు" మళ్ళీ వెనకకు తిరిగింది. తల్లి పేడ తొక్కుతుందంటే విధిగా ఆ అమ్మాయి వెళ్ళి ఒడ్లాడించే మిల్లుదగ్గర ఒరిపొట్టు యెత్తుకు రావాలి. అందుకే గంప తీసుకుంది.

"బాలా! ఏందో అడగరాదే పెద్దమనుషోలే సోంచాయిస్తవు."

"అది కాదే అమ్మా, మనము పాలల నీల్లెందుకు కలుపాలే?" అనుకోని ఈ ప్రశ్నకు తెల్లపోయింది మల్లమ్మ.

"ఎందుకంటే... అదేదో అందరూ కలుపుతున్నారని..."

"అందరెవరే?"

"మన గొల్లోలంత కలుపుతరే బిడ్డ."

"పోమ్మా అందరూ జేస్తరని మనమూ జేస్తమా?"

"చెయ్యకపోతే యెట్లనే. మేము నికారసయిన పాలు పోస్తం అంటే ధర పెడ్తరేమో సూడు."

"ఎందుకు పెట్టరు" బాలామణికి ఆ నమ్మకం వుంది.

"ఆ..... పో.... పో... పొట్టు దే."

"అమ్మో! అక్కను ఒంటజెయ్యమనే. నాకు బడికి టేమయింది" సక్కుబాయి అరిచింది.

"ఏం బిడ్డా! సదువుకోని ఊరు ఏలుతావే."

"అక్షరము తెలిసివస్తే మంచిదేగదనే రానియ్యి. నువ్వు బడికి పోయే సెల్లి" అన్నది బాలామణి.

"మా యక్క బంగారం..." సక్కుబాయి పరుగున వచ్చి అక్కను కౌగిలించుకున్నంత పనిచేసింది.

"గట్లనొద్దె పిల్ల"

"మరేమనాలే"

"అదేందో... అదేదో వుందమ్మా... ఆఁ థాఁకు-థాంక్యు అనాల్నె"

"అవునే మా టీచరమ్మ గూడా ఎడ్‌మాస్టరు తలీలు (సెలవు) యిస్తే గట్లనే అంటది."

"ఇగవో..." సక్కుబాయి తల వెనక్కు దువ్వుకుని బడికి పరుగు తీసింది. బాలామణి పొట్టు కోసం బయలుదేరింది.

## 4

సరస్వతి తల్లిలా, అన్నలా అమాయకురాలు కాదు. చాలా తెలివయింది. పుట్టింటికి రాగానే వదిన ఆటలు కట్టడానికి రకరకాలుగా ఆలోచనలు చేసింది.

"వదినా! అన్నయ్యా, నువ్వూ వెళ్ళి ఆస్పత్రిలో చూపించుకోండి. ఇంత ఆస్తి వుండి పిల్లలు లేకపోతే ఏం లాభం?" అంది. 'నీకు పిల్లలు లేరు', అని ప్రత్యక్షంగా అనలేక.

"ఆస్పత్రి వాళ్ళేం దేవుళ్ళా! ఇదిగో సరమ్మా. పుట్టింట్లో నాలుగురోజులుందామని వచ్చావు. అట్లనే వుండిపో. లేని తాకట పెట్టకు" విసురుగా జవాబు యిచ్చింది జయలక్ష్మి.

"మా అన్నకు పిల్లలు పుట్టాలని, నా పుట్టిల్లు నిలబడాలని ఉండదా?"

"పుట్టకపోతే ఏం జేస్తావు?"

"ఏదో మార్గం ఆలోచించరా? లోపమెవరిదో తెలుసుకోవాలాయె. నాకు చూడు అటు పెండ్లి అయింది. ఇటు నెల తప్పింది. పదేండ్లలో అయిదుగురు."

"ఉద్ధరించావు..." అనబోయి మాట లోపల మింగుకుంది.

"పరీక్షలు చేయించితే తెలుస్తుంది."

"నాదే లోపం అని తెలిసిందే అనుకో ఏం చేస్తావు?"

"ఏం చేస్తాం? మా అన్నయ్యకు మళ్ళీ పెళ్ళిచేస్తాం. నీకింత ఆస్తి



రాస్తాంలే" అన్నది. ఆమె మాట జయలక్ష్మికి వాతలా తగిలింది. ఒట్టి వాత కాదు ఇనుప సలాకు ఎర్రగా కాల్చి పెట్టినట్టు గిలగిలలాడింది.

"మీ అన్నయ్యకే కారనుకో అప్పుడు" కసింకా పెరిగింది.

"మా ఖర్మ అనుకుంటాము."

"నాకు కాకపోతే ఆ మాట అనుకుంటే తప్పా ఏం?"

"తప్పనిగాదు. అవకాశముంది కదా అని. మా అన్నయ్యలో లోపముంటే, నీకు పిల్లలు కావాలని వుంటే మరొకర్ని పెళ్ళిచేసుకో" సరస్వతి నిక్కచ్చిగా చెప్పింది.

"నువ్వు భార్యాభర్తలకు తగాదా పెడదామనే వచ్చావా? అందుకే మిమ్మల్ని పిలవను" జయ గంటు పెట్టుకుంది. ఆమెకు దిగులుగా వుంది. ఒకవేళ పరీక్షలు చేస్తే నిజంగా తన లోపమే వుంటే కొంపదీసి భర్తకు వివాహం చెయ్యరు కదా! అన్నగారు అందరినీ ఒక యెత్తు అభిమానిస్తే సరస్వతిని మరో యెత్తు అదనంగా అభిమానించడం యెరగనిది కాదు. ఏదో యెత్తు వుంది. అందుకనే పిలుచుకుని వచ్చాడు. భర్తను సాధించాలని అలకపాన్పు వేసింది. ఆమెకు మండిపోతోంది. కల్లంలోని గింజలు అటువి అటే అమ్మి పేకాటకు తగిలేయడం తనకు తెలియని విషయం కాదు. వెళ్ళి ముసుగుతన్ని పడుకుంది మేడమీద. భర్త భోజనానికి వచ్చి అలనాటి సత్యభామను అలక తీర్చినట్టు తీరుస్తాడని ఆమె భావన. పన్నెండు దాటింది. ఆత్మారాముడు ఘోష పెడుతున్నాడు. భర్త పైకి రాలేదు. ఏం చేస్తుంటారబ్బా? లేచి పొగకోసం కట్టిన గూడులో నుండి క్రిందికి చూచింది. బూడిద వారింది. అదంతా దులుపుకుని మళ్ళీ చూచింది. సీతారామిరెడ్డి, సరస్వతి కూర్చున్నారు. రాజమ్మ ఆప్యాయంగా వడ్డిస్తున్నది.

"అమ్మా, యెంత నెయ్యో! రేపు హెడ్‌మాస్టర్‌గారి భార్యకు పోస్తానన్న నెయ్యి పొయ్యలేనిక. ఈ ముసిల్ది కొడుక్కూ, కూతురుకే అంతా ఒంచేస్తోంది" గుండెలు బాదుకుంది జయ.

"అన్నయ్యా! బొత్తిగా చిక్కిపోయావు. పిల్లా పాపలు లేరు. హాయిగా తినకూడదూ! పాలమ్మి, పెరుగమ్మి యెవర్ని ఉద్ధరించాలని..."

"వాడిదేం సాగుతుందే తల్లీ!" రాజమ్మ జాలి చూపింది.

"నువ్వూరుకోవే అమ్మా! మగవాడు మెత్తగా వుంటే యెవరయినా ఆటలు ఆడిస్తారు."

ముఖం పగలగొట్టాలనిపిస్తున్నది జయకి.

"నువ్వు మా బావగార్ని ఏడ్పించవా సరస్వతీ!"

"అమ్మో ఆయన నీలా మెతక కాదన్నయ్యా! సంసారమన్నాక ఒకరిమాట ఒకరు వినాలి. అది కాదనను. కాని ఒకరికి ఒకరు బానిసలుగా బ్రతకరాదన్నయ్యా! ఓ రెండు రోజులు నువ్వు బెట్టుగా వుండు. ఆవిడే దారికి వస్తుంది." ఆ చిమ్మి కూలగొడితే బెడ్డ సరస్వతి తలమీదపడి చనిపోతుంది అనుకుంది జయలక్ష్మి కోపంగా. ఇక ఆమె ఉపదేశాలు వినలేక వచ్చి పడుకుంది. అరగంట తరువాత భర్తపైకి రావడం చూచి బిగదీసుకుంది.

"జయా!"

"....."

"నువ్వు అలిగితే అలిగావు గాని కరెంటు బిల్లు కట్టాలి డబ్బులియ్యి."

"లేవు"

"ఎందుకు లేవు?, కంచె గడ్డి అమ్మిన డబ్బు నీ దగ్గర లేదూ?"

"ఉన్నా యివ్వను. ఇందాక యెవరి సలహాలు విన్నారో, వారినే అడగరాదూ?" దుప్పటి కాస్త తొలగించింది.

"ఇయ్యవా?"

"ఎన్నిసార్లు చెప్పాలి?"

అతను మాట్లాడక క్రిందికి వెళ్ళాడు. నిజంగా చెల్లెలు యిస్తుందేమో చూద్దామని మెట్లు దగ్గరికి వచ్చి నిల్చుంది.

"అన్నయ్యా! ఆవిడను నెత్తినెక్కించుకొని బాధపడడం దేనికి? మీ ఒడ్లు కొనేది యెవరు?"

"పంజరి లక్షయ్య"



"ఆయన దగ్గరకే వెళ్ళి అడ్వాన్సు తీసుకో"

"సీతయ్యా! ఓ వంద ఎక్కువ తీసుకో, చెల్లెలికి చీరకొందాం" రాజమ్మ చెప్పింది.

"మంచిదమ్మా..." అతను వెళ్ళిపోయాడు. అపర కాళికాదేవిలా మేడ దిగింది జయ. ఆడబడుచును మింగివేసేలా చూసింది.

"ఏమ్మా! నా కాపురంలో నిప్పులు పోసి గాని కదలవా?"

"నీళ్ళుబోసి చల్లార్చుదామంటే నిప్పులంటావేం వదినా!" వెటకారంగా అంది సరస్వతి.

"ఊ..." ఇంకా యెన్నో అనాలనుకుంది జయలక్ష్మి. తన అన్న రావడంతో తగ్గిపోయింది.

"ఏమన్నయ్యా యెప్పుడొచ్చావు?" ప్రసన్నవదనంతో ఎదురు వెళ్ళింది. అతను చేతిలోని సంచి చెల్లెలికిచ్చాడు. కుర్చీ లాక్కుని కూర్చున్నాడు!

"అమ్మా వాళ్ళు బావున్నారా?"

"అమ్మ, వదిన నిన్ను చూడాలని ఒకటే యిదయిపోతున్నారు. నిన్ను తీసుకుపోదామని వచ్చాను."

"ఎప్పుడూ రావాలనే వుంటుంది అన్నయ్యా. రాక్షసమూక మమ్మల్ని ప్రశాంతంగా బతకనిస్తుందా? మీ బావ అసలే మెత్తనివాడు" అన్నది.

"ఇద్దరూ రండి" అతను ఆహ్వానించాడు.

"వస్తాములే. ఒరేయ్ సాయిలూ! నీడెందుకుంటాడు?" తనే వెళ్ళి నీళ్ళు తెచ్చింది. అతను తల్లి, కూతుళ్ళను పలుకరించాడు.

"చూచావే అమ్మా తన వారొస్తే యెంత మర్యాద చేస్తుందో" మోచేత్తో పొడిచింది రాజమ్మ.

"ఊం చూస్తున్నానే" సరస్వతి బొమ్మలు ముడిచింది. అన్నాచెల్లెళ్ళు భోజనాలు పూర్తిచేసి మేడ యెక్కారు. జయలక్ష్మి అన్న అనంతరెడ్డి సాత్వికుడు. చెల్లెలు వాల్చిన మంచంలో నడుం వాల్చాడు.

"అన్నయ్యా! ఆ క్రిందవున్న మూకను చూశావా?"

"ఎవరున్నారు? నాకు సరస్వతే కనిపించింది."

"ఆ సరస్వతే నా పాలిట శని అన్నయ్యా! ఇప్పుడేం పని చెప్పు? మా ఇంట్లో పెండ్లా పేరంటమా? ఎందుకొచ్చినట్టు?"

"బావుంది జయా! అన్నను చూడటానికి చెల్లెలు యెప్పుడయినా రావచ్చు."

"నీకేం తెలియదు."

"పిచ్చితల్లి, నాకు తెలియంది నీకేం తెలుసమ్మా? నీమీద అభిమానంతో నేను రాలేదా! అలాగే ఆ అమ్మాయి వచ్చింది."

"రావద్దని నేను అనటం లేదన్నయ్యా! మా మధ్యలో తగవులు పెట్టాలని చూస్తోంది" బుంగమూతి పెట్టింది.

"మీరిద్దరూ సమరసంగా వుంటే పెట్టే తగవులు మాత్రం ఏమున్నాయి? ఆ...." ఆవులిస్తూ చిటికె వేశాడు.

"సర్లే... పడుకో." జయకి అన్నమీద పీకలదాకా కోపం వచ్చింది. ఎప్పుడూ ఇంతే. తను మాట్లాడింది సమర్థించడు. మళ్ళీ ప్రేమలేదందామా అంటే రెండు నెలలు తను కనిపించకపోతే పరుగెత్తుకు వస్తాడు. జయలక్ష్మి తన పద్ధతి కొంత మార్చుకోవాలనుకుంది. అందుకే క్రిందకి వస్తూనే మినప్పప్పు నానబోసింది.

"సరస్వతొదినా... ఓ వదినా" పిలిచింది. గదిలో పడుకున్న సరస్వతి చెవులు మలుపుకున్నది. తననేనా, అందులో జయలక్ష్మి పిలవటమా ఆశ్చర్యంగా వుందే అనుకుంటుండగా మరోసారి పిలుపు వచ్చింది.

"నన్నే పిలుస్తుందమ్మా" అన్నది తల్లి వంక చూచి.

"అన్న ఏం గడ్డిపెట్టాడో? అదీ కాక మాటకు మాట అంటావని దానికి నిన్ను చూస్తే భయంలే" రాజమ్మ దీర్ఘం తీసింది. సరస్వతి వంటింట్లోకి వెళ్ళింది.

"ఏమమ్మో వదినా యిందాకే అన్నావు, నీ కాపురంలో నిప్పులు పోస్తానని...."



"అదంతా యెందుకులే నీకు గారెలు ఇష్టం కదా! మసాలా గారెలు చెయ్యనా అని అడుగుతున్నాను..."

"మీ అన్నగారిని అడుగు" అన్నది. జయ ముఖం మాడ్చుకుంది. ఆ తరువాత ఇద్దరూ మౌనంగా వుండిపోయారు.

సాయంత్రం భర్త తనను యెలా బ్రతిమాలడో చూద్దాం అనుకున్న జయలక్ష్మికి నిరాశే యెదురయింది. ఆయన అనంతరెడ్డిని పలుకరించి చెల్లెలి దగ్గర కూర్చున్నాడు.

"జయను తీసుకుపోదాం అనుకుంటున్నాను."

"తీసుకుపో బావా. సరస్వతి వచ్చిన దగ్గరనుండి ఇంట్లో ఒకటే రుసరుసలు. ఏదో అమ్మ వండిపెడుతుంది" అన్నాడు. భర్త తన బలహీనత గురించి అలా చెప్పడం జయకు తలకొట్టేసినట్టు అయింది.

"చాల్లెండి. డబ్బంతా పేకాటలో తగలేస్తూ నన్నాడిపోసుకుంటున్నారేం?" ఎదురుదెబ్బ తీశానని సంతోషించింది.

"మీ చెల్లెలితో చావు వచ్చింది బావా. రాబడే కాని ఖర్చు వద్దంటుంది. వచ్చిన డబ్బు దాచుకుంటుంది. కరంటు బిల్ కట్టాలంటే అడ్వాన్స్ తీసుకోవాల్సి వచ్చింది."

ఇద్దరూ మాటకు మాట అనుకున్నారు. జయ యెన్ని అన్నా పడి వుండే భర్త ఈనాడు యెదురు తిరుగుతున్నాడంటే కేవలం చెల్లెలి అండ చూసుకునేనన్న నమ్మకం కలిగింది. ఆమె మళ్ళీ అలకపాన్పు వేసింది. భోజనాలు అవుతున్నా క్రిందికి రాలేదు. అనంతరెడ్డే వెళ్ళాడు పైకి.

"ఇలా మొండితనం చేస్తే అతను విసిగి డబ్బంతా దాచుకుంటే ఏం చేస్తావమ్మా? నీ దురుసుతనం తగ్గించుకో." అన్న బెదిరిస్తే బావురుమంది.

"నువ్వా నన్నే అంటావా?"

"అనక ఏం చేయమంటావు? నీ మొండితనం వల్లే కదా అతను వెళ్ళి పంజరి వాడి దగ్గర డబ్బు తీసుకుంది. ఆ అలవాటు ప్రతిసారి అమల్లోకి వస్తే నీ చేతికి వచ్చేది యేముంటుంది?"

అన్నగారు చెప్పింది ఆలోచించతగిందిగానే తోచింది. ఈ మధ్య యెప్పుడూ గోవిందరావు దగ్గరే వుంటాడు భర్త. అలాగే పడుకుంది. నిద్ర పట్టింది కూడా తెలియదు.

తలుపు దబదబ బాదిన చప్పుడుకు మేలుకుంది. కోళ్ళు కూస్తున్నాయి. సాయిలు యింత త్వరగా లేచాడా అని మేడ దిగింది. అప్పటికే సీతయ్య లేచి పాల చెంబులు యిస్తున్నాడు బాలామణికి.

"అప్పుడే తెల్లవారిందటే?"

"ఇయ్యాల్ల జర పనివుంది లెంద్రి."

"ఏం పనో!"

"ఏదో మా పని..." ఆ మాట అంటుంటే బాలామణి ముఖం దించుకోవటం గమనించింది.

"ఏమిటే? పెళ్ళి చూపులా ఏం? కొంపదీసి..."

"కొంపదీసి అంటారేమమ్మా మాకు పెండ్లి కావద్దా!"

"ఓయమ్మో! నువ్వు లీడరు అయ్యావే తల్లీ" ఇంకా ఏదో అనబోయి రాత్రి తను ఎవర్నీ అనవసరంగా అనగూడదు అని తీసుకున్న నిర్ణయం గుర్తుకు వచ్చింది. కచ్చిక తీసుకుని ఒక చేద నీళ్ళు తోడుకుని బావి దగ్గర కూర్చుంది. భర్త బాలామణితో మాట్లాడడం బొత్తిగా గిట్టలేదు. బలవంతంగా కోపం దిగమింగింది. వయసులో వున్న పిల్లకు మగాడితో ఏం మాటలుంటాయి? అని తిట్టుకుంది. సాయిలు వచ్చి దాలి వేశానని చెప్పగానే అటు వెళ్ళింది.

## 5

జడ అల్లుకుని తలలో బంతిపూలు పెట్టుకుంటున్న బాలామణి కళ్ళ ముందు విల్సన్ కనిపించాడు. అతడు తనంటే ఇష్టపడుతున్నాడు. బాలామణికి ఫార్మాలిటీస్‌కి, అనురాగానికి భేదం తెలియలేదు. అమాయకురాలు కాదు కాని కొన్ని విషయాలలో తన కోణంలోనే ఆలోచించే అతి సామాన్యురాలు. వచ్చే పెళ్ళికొడుకు యెలా వున్నాడో!



"ఏందే యింకా నీ సింగారం కాలేదా?" తల్లి పిలిచింది. బొట్టు సరి జేసుకుని బయటికి వచ్చింది.

"జంగమ్మొదినను అడిగి రెండు కప్పులు పట్కరా. గిలాసల్ల తాగరంట. అట్లనే బాబయ్య మాముంటే రమ్మను" అన్నది మల్లమ్మ. బాలామణి కప్పులు అడుక్కుని అతనితో రమ్మని చెప్పి వచ్చింది. ఉద్వేగంగా వుంది. విల్సన్‌ను మాత్రమే అంగీకరించిన ఆ కన్య హృదయం మరొకరిని మరొక దృష్టితో చూడలేకపోతోంది. ఇప్పుడెలా?

"రంద్రి... రంద్రి...." ఇద్దరు పురుషులను, ఒక స్త్రీని వెంటబెట్టుకుని వచ్చాడు కొమురయ్య. మల్లమ్మ హడావుడిగా చాప పరిచింది. కాళ్ళకు నీళ్ళు యిచ్చింది. వాళ్ళొచ్చి కూర్చున్నారు. బాలామణి తలుపు చాటు చేసుకుని చూచింది. గీతల ప్యాంటు, తెల్ల చొక్కాతో అందంగానే కనిపించాడు. తడికెల గేటు తీసుకుని బాబయ్య రావడం చూచి వెనక్కు తగ్గింది. బజార్లో కొనుక్కు వచ్చిన మిక్చరు సాసర్లలో పెట్టి వచ్చిన వారికి పంపింది సక్కుబాయితో. అందరికీ టీ కూడా పంపింది మల్లమ్మ.

"సక్కు! అక్కను పిలుపు బేటా!" కొమురయ్య చెప్పాడు.

"అక్కా! రమ్మంటున్నరే..." సక్కు అరిచింది. అప్పుడే పాల సైకిల్ తెచ్చిన యాదయ్య అందరికీ నమస్కరించాడు. నర్సిమ్మ మొదటే సాసర్ అందుకొని మిక్చరు తీసుకున్నాడు. బాలామణి వచ్చిదూరంగా కూర్చుంది. ఆ వచ్చిన స్త్రీ శల్యపరీక్ష మొదలుపెట్టింది. మాటి మాటికి మెడ సవరించుకో సాగింది. తల యెత్తి చూసింది బాల. ఆమె మెడలో మూడు పేటల గొలుసు పట్టెడ, నాను వున్నాయి. నల్లపూసలు, నకిలీ ముత్యాల గొలుసు వున్నాయి.

"ఏం పేరు?" చెప్పింది బాలామణి. అందరూ అమ్మాయినే చూస్తున్నట్టు మౌనంగా వుండిపోయారు. పది నిముషాలు గడిచాయి. కొమురయ్యే ముందు పలుకరించాడు.

"బాలమ్మను పొమ్మందునా?"

"అఁ..... పొమ్మను" అన్నాడు అబ్బాయి తండ్రి.

"ఆ చా కప్పులు తీసుకుని పో బిడ్డా" కొమురయ్య మాటలకు త్వరగా లేచి కప్పులు తీసుకుని వెళ్ళింది బాలామణి.

"పిల్ల మీకు పసందు అయిందా?" బాబయ్య చుట్ట వెలిగించుకుని అడిగాడు.

"పిల్లకేం ముక్కులేదా? మొకం లేదా" అన్నదామె.

"ఇగ మరి పెట్టిపోతలు మాట్లాడుకుందమా? మీరేం బెడ్తరు?"

"బాబయ్యా! మీరేం బెడ్తరనే కాలం బొయ్యిందయ్యో. మీరు పెట్టేది చెప్పండ్రి." అబ్బాయి తండ్రి అడిగాడు. అందరూ కొమురయ్య వంక చూశారు.

"మీ అందరికీ ఎరికే కద, నేనేం షావుకార్ని కాను. వరదచ్చిన కది ఇదంటే కాదు, కాని మాటలు అని దండుగ."

"వరదచ్చిన యెవరడిగిండ్రు మాపిల్లగాని కింత గడియారం, సైకిలు, ఉలన్ బట్టలు పెట్టి, మీ పిల్లకు రెండు మడుముల ఇత్తడి, శేరు ఎండి, అయిత్తులాల బంగారం పెడ్తే చాలు. మీరు పెట్టింది మాకుంటదా!" ఆమె ఏకధాటిగా చెప్పింది.

"ఇత్తడి బొత్తడి ఏడ్వున్న కోశీసు చేసి పెడ్తాడుగాని యెండి, బంగారు కష్టం" బాబయ్య పైకి చూస్తూ గుప్పుగుప్పుమంటూ పొగ వదిలాడు.

"యేమంత అడిగినమని?"

"ఎంత అడిగినా మాకు యెల్లాలి కద?" బంగారం, వెండి దగ్గరే మాటలు ఆగిపోయాయి.

"ఇగో నేనొక్క మాట చెప్త. మీరు అన్నందుకు తులం బంగారం, ఇరవై అయిదు తులాల యెండి పెడ్తము. ఇక గంతే" కొమురయ్య చెప్పాడు. వాళ్ళు ముఖాలు చూచుకున్నారు.

"మల్లజెప్తాం" అన్నారు. బస్సుందంటూ వెళ్ళిపోయారు.

"ఏం బావ చెప్తారంటావా?"

"ఏందోయ్ గుడ్డిపిల్లకు, కుంటిపిల్లకు ఫికరు చేసినట్టు చేస్తవేంది? ఆడు కాకపోతే ఆడి తాత మరొకడు ఒస్తడు." బాబయ్య నింపాదిగా



జవాబు చెప్పాడు. అతను వెళ్ళిపోయాక భార్యాభర్తలు కొట్లాడుకున్నారు.

"అయిదు అన్న తాన మూడు తులాలు అంటరుగాని తులమంటే యెవడు వస్తున్నడు?"

"ఏందే మా లావు మాట్లాడుతున్నవు? నీ యబ్బ సొమ్ము యేమయినా దాచ పెట్టినావు? వుంటే పెడ్తరు?"

"ఉండక యాడికి పోతది, తాగిన నోటికి ఇరామం లేకపోయే" అన్నది.

"ఏమే.... ఈపు గులగుల పెడ్తుందా?"

"మనిషోలే మాట్లాడటము ఒచ్చునా ఊఁ అంటే అందరినీ కొట్టి గెలిసినవు!"

మాట మాట పెరిగింది. కొమురయ్య భార్యను జుట్టుపట్టి లొంగదీసి గుద్దాడు. ఆమె నోరు ఆడుతుంది. అతని చెయ్యి ఆడుతుంది.

"నాయినా... ఇడువే....." పిల్లలు యెంత గోలపెట్టినా అతను విన లేదు. బాలామణి మొండికేసింది.

"నాకు పెండ్లి పెటాకులు ఏం వద్దు. మీరు యిట్ల కొట్లాడితే బాయిలపడి సస్త అఁ...." అన్నాక ఇద్దరూ శాంతించారు.

"నీ యవ్వ! ఒక్కనాడు నిమ్మలంగ వుండనియ్యరు..." తుపుక్కున ఉమ్మేసి, బయటికి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళే చోటు తెలుసు. మొదట కల్లుపాక, తరువాత సారాయి కొట్టుకు వెడతాడు. యాదయ్య తల్లిని లేపాడు. గాజులు చిట్లి రక్తం వచ్చింది! అదంతా కడిగి పసుపు అద్దాడు. ఆనాడు వారి భోజనాలయ్యేసరికి మూడు గంటలు అయింది.

"బాలా? సీతయ్య దొర చేన్ల పచ్చగడ్డి కోసుకురాయె. నేను అడిగిన" అన్నాడు యాదయ్య.

"మంచిదన్న" అన్నది. ఒక గంట ఇంట్లో పనిచూసుకుని కొడవలి, తాడు తీసుకుని వెళ్ళింది.

"ఏందే పిల్లా... పెండ్లి అంట" జీతగాళ్ళు పరిహాసము ఆడారు.

"అవును" అన్నది యేమీ అనలేక.

"పప్పన్నము వుందన్నమాట" ఒకడు నవ్వాడు.

"మీ ఇంట పప్పన్నము తినరా ఏం?" సాయిలు అడిగాడు. అతని పండ్లనిండా పచ్చని పదార్థం కనిపించి వెగటు కల్గుతోంది.

"అబ్బ-సాయిలూ నువ్వు నోరు విప్పకు" విసుక్కుంది బాల.

"బాలమ్మా, నీ మగడు సాయిలున్నట్టు వున్నడా?" పక, పక నవ్వుతూ పెద్ద జీతగాడు అడిగాడు.

"ఛీ.... పో... వుండి వుండి యిలాంటి అడివట్లోన్ని చేసుకుంటనా ఏం?" అన్నది.

"ఏందిరా! అందరూ పని ఆపి బాతాఖాని కొడుతున్నారు?" సీతా రామిరెడ్డి అరిచేసరికి యెవరి పనుల్లోకి వారు వెళ్ళిపోయారు.

"ఏమిటే బాలామణి పెళ్ళిచూపులట."

"ఊఁ...." అన్నది సిగ్గుపడుతూ ఆమెలో ఆడదనము బయట పడినట్టు అనిపించింది. ఒక్కసారి అయినా జయలక్ష్మి యిలా తీరుగా వుండదు యెందుకో! ఒంటి కాలిమీద లేస్తుంది.

"ఎప్పుడు అనుకుంటున్నారు పెళ్ళి?"

"ఇంకా ఏం చెప్పలేదు. చెప్పి పంపుతామన్నారు."

"వాళ్ళ నీల్గుడు కాకపోతే ఆలోచించటానికేం వుందే బంగారం లాంటి పిల్లవు" అన్నాడు.

'పాపం సీతయ్య దొరకు దొరకవలసిన పెండ్లముకాదు జయమ్మ' అనుకుంది. సందిల నిండిన గడ్డిమోపు కట్టి యెత్తుకుంది. దూరంగా వెడుతున్న సీతయ్య ధోవతి రెపరెపలాడుతూ కనిపించింది.

ఊరు దగ్గరకు వచ్చింది. ఆమె వెనకాల బూట్ల శబ్దం వినిపించింది.

"ఓ..... బాలామణి కదూ-"

ఎంత మందిలో వున్నా ఆగొంతు గుర్తించగలదు. విల్సన్ గొంతు అది.

"యాడ్కి బోయినవు?"

"వాకింగ్‌కు..."



"అదే ఊరు!"

"మై గాడ్! బాలామణీ, నామాట విని మమ్మీ దగ్గర చదువుకో" అన్నాడు.

"ఏందుకు?"

"మరి వాకింగ్ అంటే తెలియదూ, షికారుకు."

"షికారా అంటే ఏం గొట్నవు? లేడినా? కోడినా?"

"నీతో చిక్కే వచ్చి పడింది. నడవటానికి?"

"అదేం నీకు నడువరాదా?" కిలకిలా నవ్వుతూ మోపు నేలమీద యెత్తేసింది.

"ఓ బ్యూటిఫుల్!" అన్నాడు. చెదిరిన ఆమె జుట్టును, కుంకంను ముగ్ధుడయినట్లు చూశాడు.

"ఏమిటి? నేను యేమన్నాను అంటే నీకు నడువరాదా?"

"నీతో భలే చిక్కే వచ్చింది. అప్పుడప్పుడు తోచక అలా వెడుతుంటాము. దాన్ని షికారు అంటారు. షికారు అంటే తుపాకి పుచ్చుకొని జంతువుల్ని చంపరు."

"తోచక నడుస్తారా!" ఆశ్చర్యంగా చూచింది.

"ఊఁ.... అన్నట్లు మరిచిపోయాను. నీ పెళ్ళిట కదా?"

"అప్పుడే నీకెట్ల తెలిసింది?"

"అందరికీ తెలిసిన తరువాత నాకు తెలియదా?" అన్నాడు. అతని వంక పరీక్షగా చూచింది. ఆమె వరుడి రూపం విల్సన్‌తో పోల్చి చూచింది.

"ఏమిటలా చూస్తావు?"

"ఏం లేదు" అన్నది సిగ్గుపడుతూ.

"తెలిసిందిలే ఆ వచ్చిన అబ్బాయి బావున్నాడా! నేను బాగున్నానా? అని చూస్తున్నావా" అన్నాడు.

"అరే నీకెట్లా తెలుసు?"

"దానికో మంత్రం వుందిలే." ఇద్దరూ మరోసారి నవ్వుకున్నారు.

"అమ్మో! చీకటిపడుతోంది నేను పోవాలే" బాలామణి మోపు యెత్తుకుంది.

"మే ఐ హెల్ప్.....నేను యెత్తనా!" తనూ చెయ్యి వేశాడు. బాలామణి నాలుగు అడుగులు వేసింది. తన ఊహలు అతనికి తెలిసినందుకు చాలా సిగ్గుగా వుంది.

"బాలమ్మా! ఎవరే ఆ పిల్లగాడు?"

"ఎవరదీ?" గడ్డిమోపు వంగింది. ఎదుటి వ్యక్తి కనిపించలేదామెకు.

"అవునే.... నేను కనిపిస్తానా! మగవాళ్ళయితే కనిపిస్తరుగాని..."

"ఓ జంగమ్మ వదినా! ఏమిటి వదినా యిట్లు వచ్చినవు?"

"ఏం రావద్దా?"

"అట్లన్ననా నేను?"

"వెనుక వచ్చే మగాయన యెవరే!"

"మార్తమ్మ టీచర్ కొడుకు వదినా."

"అతనితో నీకేం పనే?"

"బాగుంది నాకేం పని? తోవన వస్తుంటే పలకరించిండు."

"పొద్దున చూసుకునేటందుకెవరో వచ్చిండ్రంట..."

"ఊఁ.... యెంతమంది అడుగుతరు..." విసుగ్గా, విసురుగా వెళ్ళిపోయింది బాలామణి. గడ్డిమోపు వాకిట్లోవేసి బట్టలు దులుపుకున్నది.

ఒక సీసాలో సారా పట్టుకొని బాబయ్య వచ్చాడు. అతను నింపాదిగా అరుగుమీద కూర్చున్నాడు.

"మీ అయ్య యేడే?"

"ఏమో నేను యిప్పుడే వస్తున్న"

"జరూర్ పని వుందే పోరీ. కల్లు దుకానంల చూసిరా పో." బాలామణి వెళ్ళి తండ్రిని పిలుచుకు వచ్చింది.

"ఏం బావా పని అన్న వంట."

"అవును....దా" ఇద్దరూ కాస్త యెడంగా జరిగి కూర్చున్నారు. కొమురయ్య ముఖం ఎర్రగా వుంది అప్పటికే.

"ఈ ఆడసన్నాసులకు అక్కరలేదు బావా. అయిత్తులాల బంగార మంట యాడదెత్తు చెప్పు?"



"దొంగతనం చేస్తావా యేంది? ఇప్పుడే చెప్పంపిండ్రు. అల్లుడు అడిగినంత యిస్తేనే మంచిదని. బంగారి కత్తి అని మెడకోసుకుంటామా! మన కున్నంత పెడ్తం."

"అదేమాట నేనంటే మీ సెల్లెలు యింటేనా, నాల్గు ఉతికినంక నోరు మూసుకుంది."

"నీకెందుకు అంతా నేను చూసుకుంట. పిల్లలను అన్నం గల్ల ఇంట్ల పడేత్తాము. ఏమంటవు?"

"నీవు దునియ చూసినోడవు బావా...."

"పద ఇప్పువువ్వు సారా దెచ్చిన...." ఇద్దరూ సారా త్రాగుతూ అపశబ్దాలు మాట్లాడుతున్నారు. ఆడజాతిని తిడుతున్నారు, మెచ్చుకుంటున్నారు. వారి కళ్ళముందు అంతా అందమైన ప్రపంచమే కనిపిస్తోంది.

"బాలా... ఇట్లరా బిడ్డా...." తత్తరపడుతూ పిలిచాడు తండ్రి.

"ఏందే..." అన్నది విసుక్కుంటూ.

"అంగిజేబులో రూపాయి వుంది తీస్కపో-గుడ్లు దెచ్చి కూర ఒండు...." అన్నాడు. అతను తాగినప్పుడు యెదురు చెబితే ఏం జరుగుతుందో తెలుసు. అందుకే తల్లితో చెప్పి పరుగులు పెట్టింది బాలామణి.

## 6

జయలక్ష్మికి అన్న అనంతరెడ్డి కంటే వదిన కమలమ్మంటే ఎంతో ఇష్టం. ఎందుకంటే ఆమె ప్రపంచం తెలిసింది. అన్నలా నిజాలు మాట్లాడదు. అవసరాలను బట్టి మాట మారుస్తుంది. ఆడపడుచును చూచి ఆనందంతో యెదురు వచ్చింది.

"ఏం జయమ్మా యెంత చిక్కిపోయావు?"

"నీకలా కనిపిస్తున్నానేమో వదినా?"

"నెల రోజులుండువులే, పిల్లలు లేరన్నట్టేగాని చాకిరికేం తక్కువ." ఆప్యాయంగా తీసుకువెళ్ళి కాళ్ళకు నీళ్ళిచ్చింది.

"అమ్మా, నాన్నా కన్పించరేం వదినా?"

"రాముల వారి గుడిలో అభిషేకం చేస్తున్నాం. ఒక్కగానొక్క పిల్లవు వస్తుంటే యెలా అని నేనుండిపోయాను." ఒంగి ఆడపడుచు కాళ్ళు తుండు గుడ్డతో తుడిచింది.

"ఎందుకు వదినా?" కాళ్ళు లాక్కుంది.

"భలేదానివి. తుడిస్తే తప్పేం" అన్నది.

"ఊం... వదినా మరదళ్ళు మాటల్లో పడి కష్టపడి పిలుచుకు వచ్చిన నన్ను మరచిపోయేలా వున్నారు" అనంతరెడ్డి పడక కుర్చీలో కూర్చున్నాడు.

"మీకు కావలసింది కాఫీయే కదా. కలుపుతాను లెండి" అన్నది.

"జయమ్మా, యిలా కూర్చో, నిముషంలో కాఫీ కలుపుకు వస్తాను." కమలమ్మ వంటింట్లోకి వెళ్ళింది. వదినగారి ఈ అపారమైన ప్రేమ చూచి జయ సంతోషించింది. కారణాలు వెతకలేకపోయింది. తను ఒకర్తే కావటం మూలాన తల్లిదండ్రులు ప్రేమగానే చూశారు. ఎవరికోసం చూస్తుంది. నా అన్నను చేసుకున్నది కాబట్టి చూస్తుంది అనుకున్నా కాస్త కృత్రిమంగా కనిపించకపోలేదు. అయినా అన్నకంటే నయం అనుకున్నది.

పెద్ద పెద్ద గ్లాసులతో ఇద్దరికీ కాఫీ తెచ్చింది కమల.

"ఇంత త్రాగలేను వదినా."

"ఎంత వుందని, మరేం ఫరవాలేదు, త్రాగు. నాకు లేదనుకుంటు న్నావేమో యిదిగో...." వంటింట్లోకి వెళ్ళి తన గ్లాసును తెచ్చుకుంది. ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూ కాఫీ త్రాగారు.

రాంరెడ్డి, వరమ్మ దంపతులకు నల్గురు బిడ్డలు పుట్టిపోయాక, అనంతరెడ్డి, జయలక్ష్మి బ్రతికారు. అందుకే ఇద్దరినీ గారాబంగా పెంచారు. అనంతరెడ్డి సున్నితంగానూ, జయలక్ష్మి పెంకెగాను తయారయ్యారు. అనంతరెడ్డికి నలుగురు పిల్లలు. పెద్ద ఆస్తిపరులు కారు. దానికి తోడు కమలమ్మకు ఆడంబరాలు యెక్కువ, ఖర్చులు యెక్కువ. నలుగురు పిల్లలతో గడవటం కష్టంగానే వుంది. అటు వరమ్మకు అభిషేకాలు,



ఉత్సవాలు అంటే ప్రాణం. ఎప్పుడూ అత్తాకోడళ్ళు మిగిలిన కుటుంబాల లోలా దెబ్బ లాడుకోరు.

"స్నానం చేస్తావా జయా! గుడికి వెళదాము."

"అలాగే వదినా?"

"ఏమండీ మీరు లేవండి" భర్తను తొందర చేసింది.

ముగ్గురూ ఆలయం చేరేసరికి పిల్లలు అత్త అత్త.... అంటూ వచ్చి చుట్టుకుపోయారు. ముగ్గురు మగపిల్లలు, ఒక్క అమ్మాయి.

"ఏం చంద్రం, రఘు, మధూ బావున్నారా?" అన్నది.

"ఓ బావున్నామత్తయ్యా! ఈసారి అన్నలు ఇద్దరూ లాస్ట్. నాక్లాసులో నేను ఫస్ట్" మధు చెప్పాడు.

"పెద్ద. మొదటి క్లాసులో ఫస్టు రావడం గొప్పేనేమిటి?"

"మరి యెన్నో క్లాసులో వస్తే గొప్ప!" ఉక్రోషంగా అడిగాడు మధు.

"ఏమిట్రా మీ కొట్లాటలు తాతగారు చూస్తున్నారు పద!" అన్నది.

"ఇదిగో జయమ్మా! అత్త పలుకరించలేదని కోడలు ముఖం మాడ్చుకొంది" కమల పిలిచింది. దూరంగా నిలబడిన ఆరేళ్ళ ఇందిరను దగ్గరగా తీసుకుంది.

"ఏమిటే అలిగావా?" నవ్వింది. అందరూ ఆలయములోకి వెళ్ళారు. వరమ్మ వచ్చి కూతురి యోగక్షేమాలు అడిగింది.

"బావున్నావా తల్లీ," రాంరెడ్డి కూతుర్ని దగ్గరగా తీసుకున్నాడు. పూజ ముగిసింది. పూజారి యిచ్చిన ప్రసాదం, పులిహోర తీసుకుని ఇంటికి వచ్చారు. భోజనాలు అయ్యాయి. అందరూ విశ్రాంతి తీసుకుంటుండగా వరమ్మ కూతురి దగ్గర చేరింది.

"సీతయ్య రాలేదేమిటమ్మా."

"ఇద్దరం వస్తే ఆ ముసలమ్మ ఇల్లు గుండముచేసి కూతుళ్ళకు పెట్టుకుంటుందమ్మా" అన్నది.

"పిచ్చిదానివే, యిప్పుడు మాత్రం కొడుకు కాపలా వుంటాడా ఏం."

"అవున్లే?" అన్నది. జయకు ఆ క్షణంలో హెలికాప్టర్ లాంటిది దొరికితే ఇంటికి వెళ్ళిపోదాం అని వుంది.

"రాజమ్మొదిన బావుందా!"

"ఆహా నిక్షేపంగా వుంది" అన్నది. వరమ్మకు కూతురు నైజం తెలుసు కాబట్టి అంతటితో వారి విషయాలు వదిలివేసింది. "జయా! ఇంత దూరం వచ్చావు. అన్నయ్య పిల్లలకు యేదయినా పట్టుకు రాకూడదటే! పిచ్చి పిల్లలు అత్తయ్య వస్తే నాకు పళ్ళు తెస్తుందని ఒకడు, పెన్సిళ్ళు అని, రిబ్బన్లు అని ఆశతో చూస్తున్నారు" అన్నది. జయలక్ష్మి ముఖం చిట్లించింది.

"అన్నయ్య కొని యివ్వటం లేదా."

"ఎవరికయినా యేదయినా యివ్వటము వారు కొనుక్కోలేరని కాదు. పిల్లలు ఎదురు చూస్తారే..."

"నాకు తోచలేదు" అన్నది, ఆ విషయం వినడం ఇష్టంలేనట్లు ఆవులిస్తూ కళ్ళు మూసుకుంది. వరమ్మ లేచింది. మెల్లగా బయటికి వచ్చింది. ప్రక్క ఇంటి కుర్రాడిని కేకవేసి, ఓ రెండు డజన్ల అరటిపండ్లు, ఒక నాల్గు బాల్ పాయింట్ పెన్నులు తెమ్మని పంపింది. కోడలు గయ్యాళి కాకపోయినా తన కూతురు గురించి చెడ్డగా మాట్లాడటం సహించలేదు.

"తెచ్చి మీ ఇంట్లో పెట్టు నాయనా నేనొచ్చి తీసుకువెడతాను" అని రొంటిన దోపిన డబ్బు యిచ్చింది. ఆ కుర్రాడు వెళ్ళిపోయాక వచ్చి నడుం వాల్చింది.

పప్పు నానబోసి వచ్చి అత్తగారి పక్కనే పడుకుంది కమల. అయిదు గంటలకు పిల్లలు లేచారు.

"ఎంతసేపు నిద్ర" తండ్రి కసిరాడు.

"నాలుగు గంటలకే లేచారు కదరా" వరమ్మ సమర్థించింది.

"ముఖాలు కడుక్కు రండి, అత్తయ్య మీ కోసం తెచ్చిన పండ్లూ పెన్నులూ యిస్తుంది."

"నిజమా నాయనమ్మా?" మధు అడిగాడు ఆశగా.

"నిజంరా..." అన్నది. వాళ్ళు దొడ్లోకి వెళ్ళారు.

"అమ్మా! ఎందుకు ఆ పసివారికి అబద్ధం చెప్పావు? నేను పండ్లు తీసుకురాలేదు" అన్నది.



"ఉష్... మాట్లాడకు" ప్లాస్టిక్ బుట్ట తీసి యిచ్చింది.

"నువ్వు తెప్పించావా?" ఇంకా ఏదో అడగాలనుకుని కమల రావటం చూచి ఆగిపోయింది. పిల్లలు అత్తయ్య తెచ్చిన వస్తువులు తీసుకుని సంతోషంతో గంతులువేశారు.

"ఇవన్నీ యెప్పుడు తెప్పించావమ్మా?" అనంతరెడ్డి అడిగాడు.

"నీకు చెప్పి తెప్పిస్తుందా? లేవండి కాఫీ తాగుదురుగాని" అన్నది వరమ్మ. అందరూ కలసి కాఫీ త్రాగారు. జయలక్ష్మి తండ్రితో లోకాభి రామాయణం చెబుతూ కూర్చున్నది.

"మా ఇంట్లో ఎప్పుడూ యిలా కూర్చోవటానికి వీలు వుండదు నాన్నా. ఆయన కొంపలు మునుచుకుపోయినట్టు ముఖం మాడ్చుకుంటారు. "మా అత్త వుందా యెప్పుడూ కూతుళ్ళకు దోచిపెడుతుంది"

"ఇక మరి ఆడపిల్లలున్నాక తప్పుతుందా?" అన్నాడు. ఊఁ! నాన్న కూడా అంతే అనుకుంది. కమల తనకు అవకాశము వచ్చినందుకు సంతోషించింది.

"దీనికంతటికి కారణం ఒకటే అత్తయ్యా. జయకు తోచటం లేదు. అన్నగారు బయటికి వెడితే తనకు ఏం తోస్తుంది? త్వరగా డాక్టరుకు చూపించండి" అన్నది.

"అన్నీ అయ్యాయి వదినా. మొన్నో తలకు మాసిన డాక్టర్ చెప్పాడట. ఆయనకేం లోపంలేదని. నాకే యేదో వుందని. అప్పటినుండి మా ఆడబడుచు అన్నగారికి వివాహము చేస్తానంటుంది" అన్నది ఏడ్పు గొంతుకతో.

"ఆవిడిష్టమేమిటి?"

"నీకు తెలియదు వదినా, అది యెంత చెబితే అంత ఆయనకు. ఒక్కొక్కసారి తల బద్దలుకొట్టుకోవాలనిపిస్తుంది."

"నీదంతా విపరీతమే అమ్మాయ్, యేదో పుట్టింటి దీపం నిలవాలని వుంటుందేమోలే" అన్నది వరమ్మ.

"అమ్మకేమీ తెలియదు. వాళ్ళతో పదిరోజులు వుండి చూడు."

"ఒక పని చేయి జయా! నీ అల్లుళ్ళలో ఒకడిని తీసుకు వెళ్ళ
నీకు తోస్తుంది, ఒంటరిగా వుండాలన్న దిగులుండదు."

"ఏం పిల్లలు వదినా! నాల్గు దినాల కాలక్షేపం గాని యెప్పటిక
యిస్తారా ఏం?"

"ఎంత మాటన్నావు జయమ్మా. ఈ ఇంటి ఆడపిల్లవు. కంటతడి
పెడితే క్షేమమా మాకు? ఎన్నాళ్ళు వుంచుకుంటావో వుంచుకో" అన్నది
అతిలౌకికంగా. జయ ప్రాణం గిలగిలలాడిపోతోంది. ఒక అబ్బాయి
అయినా నెలకు యెంత ఖర్చు పెరుగుతుంది?

"చూద్దాంలే వదినా" అన్నది. మళ్ళీ తను ఒంటరి దాన్ని అన్న
ప్రసక్తి రానివ్వలేదు. ఎంత జాగ్రత్తగా తను కాపురం చేసుకుంటోంది
వదినలా గ్లాసెడు చిక్కని కాఫీ, అంతంత నెయ్యి యెక్కడ వెయ్యగలదు

"ఒరేయ్ అత్తయ్యతో ప్రయాణం అవ్వు" అని వదిన నాలుగయిదు
సార్లు అన్నా ఆమాట విననట్లు నటించింది జయ. కమలకు కసిగా
వున్నా పైకి ఏం అనలేదు.

"మీరు ఒక్కమాట అనకూడదూ?" భర్తను అడిగింది.

"ఏమిటే నీ సొద. తానంతట తను అడగాలిగాని" కసిరాడు
అనంతరెడ్డి. దాంతో తన ప్రయత్నం విరమించుకుంది. ఆడబిడ్డ
వెళ్ళేటప్పుడు ఓ గుంటూరు జరీచీర, గద్వాల జాకెట్టు తెప్పించింది. అవికా
వరమ్మ యాభై రూపాయలు పెట్టింది. అవి తీసుకుంది. జయకు భర్త
చాటయినా తనకు స్వతంత్రం వుంది. తనకు తోచినది పండైనా నా
తల్లితండ్రులకి యివ్వాలని ఆలోచన రాలేదు. ఇవ్వడం తన నిఘంటువులో
లేదనుకుంది.

## 7

బాబయ్య సారా సీసాతో రావటం మల్లమ్మకు బొత్తిగా గిట్టలేదు
అసలే తన భర్త తాగుబోతు. రోజూ యితనిలా రావటం ఏమిటి? అతను
రావటం చూచి విసుగు కనిపించనీయక యెదురు వెళ్ళింది.



"కొమురయ్య రాలేదూ?"

"పచ్చగడ్డికి పొయ్యిండు."

"బాలమ్మ యేది."

"అదేందో కుట్టు నేర్చుకుంటానని మార్తమ్మ టీచరు దగ్గరికి పోయింది" అన్నది. అతను అరుగుమీద కూర్చున్నాడు. తొట్టిలో వున్న కుడితిలో ఉప్పువేసి కలిపింది.

"ఇదిగో మల్లమ్మా! ఆ ఇంట్ల వయసుపోరడు వున్నాడు. మన పోరి నేందే పంపేది."

"ఎవరూ మార్తమ్మ కొడుకా. బంగారము అసుంటోడు. నెలాఖర్ల పోతాడంట" అన్నది.

"ఏందో పోరడు బంగారమయితే వయసు బంగారమయితాదే"

"జంగమ్మ పొయ్యిందంట గద!" మాట మార్చాలని అడిగింది.

"అవునమ్మ, చెయ్యి కాల్చుకోటం (వంట చేయటం) మహా కష్టంగ వున్నదనుకో" అన్నాడు.

"ఓ..... ఏం బావో యెప్పుడొచ్చినవు" కొమురయ్య గడ్డిమోపు నేలమీద వేశాడు. ఆమె గాడిలో వున్న గేదెలను విప్పింది. అవి కుడితి త్రాగుతుంటే విసుగ్గా సారాయి త్రాగే భర్తను చూచింది.

"కాళ్లేతులు కడుక్కోరాదూ?"

"ఇప్పుడేమయింది?"

"డుమ్మూ, ధూళితో యెందుకు తాగాలి."

"నీ యబ్బ పోయించినట్టు అంటావేందే! ఏదో మా బావ పోయించిండు తాగుత" అన్నాడు.

"సచ్చేనాడు యెవరము కట్టుకుపోయేది యేముందే మల్లమ్మా" బాబయ్య వేదాంతం చెప్పబోయాడు.

"వద్దంట యెవరన్నారు అన్న, సాప్ సఫాయి వుండాలే" ఆమె మూతి ముడుచుకుని వెళ్ళింది.

"చూడు కొమురయ్యా! పిల్లదాన్ని ఇంట యింకెన్ని దినాలుంచు కుంటవు?"

"యెవరూ రాంది ఏం జేయ బావ?"

"ఈ లంట యెవరొస్తర్రా! ఆడపిల్లల పుటక యెక్కువయింది యేమో."

"ఏందో..." మరో గ్లాసు పట్టించాడు. అతనికి బుర్ర మెల్ల స్వాధీనము తప్పుతున్నది.

"కొమిరిగా! నా మాటిను. నీ ఇంటికి వచ్చి అడిగిన ఓడు ఎసుం ఓడయినా యియ్యి."

"ఏంది బావ-అట్లనే యిస్త. నీ మాట నాకు యేదమే...కాద బమ్మవాక్కు..... ఏది కుసింత పొయ్యి" గ్లాసు ముందుకు చాపాడు. గ్లా నిండుగా నాటుసారా నింపాడు.

"మన జంగయ్యకేమయిందిరా?"

"బంగారం వుత్త బంగారం కాదు. పుటమేసిన బంగారము."

"పిల్లల నిస్తమంట ఊరూరునుంచి ఒస్తున్నరనుకో. మనింటి తగినట్టు వుండాలా?"

"ఉండాలే... నీ ఇంటికి లచ్చిందేవి అసుంటి కోడలు కావాల బావ...."

"మన బాలమ్మను మించిన లచ్చిందేవి యెవరున్నార్రా! మ జంగయ్యకు యిస్తివా పెట్టిపోతలు అవసరం లేదు. నేనే నాల్గు తులా బంగారం పెడ్త ఒడ్డాలం, పట్టకొలుసులు, కమ్మలు పెడ్త. నీఇష్టమొచ్చి పెద్దచీర యేరుకో" అన్నాడు.

"బావా.... ఏందే పరాయోల్లకు జెప్పినట్టు చెప్తవు. ఊరికనే చేసు పో-బాల నీ బిడ్డ కాదా?"

"మరిప్పుడన్న మాట కాదు, అదే మాట మీదుండాలి."

"ఏందే నాకు నిస యెక్కిందనుకుంటున్నావా? ఎప్పుడయిన ఒక్కటే మాట. ఆ...." సీసాలో మిగిలిన అడుగు, బొడుగు కూడా నోట్ల పోసుకున్నాడు.

"ఏంది?" మల్లమ్మ ఆడపులిలా అక్కడికి వచ్చింది.



"యహా! ఆడముండలతో యేందే, పో లోపలికి" కొమురయ్య కసిరాడు.

"అది కాదే అన్నా, నీకయినా నోరు యెట్ల ఒచ్చిందే అడగటానికి. జంగయ్యకు తొలిసూరు పిల్ల బతికితే బాలామని తోటిదే కద" అన్నది కినుకుగా.

"ఆడపిల్లకు ఈడు యేందే, మూడేండ్ల పిల్లకు ముప్పయి ఏండ్ల మొగుడు అన్నారు. జంగయ్యకు జల్ది చేసినము పెండ్లి. జల్ది పిల్ల పుట్టింది" నచ్చచెప్పే ధోరణిలో అన్నాడు.

"జల్ది యెందుకయిందే. అప్పుడు పిల్లకోసము దేవుల్లాడి దేవుల్లాడి తెచ్చిండ్రు" అన్నది 'దేవుల్లాడి' అనే మాట ఒత్తి పలుకుతూ. బాబయ్యకు మండిపోతోంది. కాస్త జంగయ్య మొరటుగా వుండి పిల్లకోసము తిరిగిన మాట వాస్తవమే. అయితే మాత్రం తన కొడుకు ముసలాడయ్యాడా ఏం?

"ఏమే! నువ్వు లోపలికి పో..." కొమురయ్య అరిచాడు. అప్పుడు గట్టిగా మాట్లాడితే తన్నులు పడతాయని తెలుసు. త్రాగితే అసలు మనిషి కాడు. అర్ధరాత్రివరకు మంతనాలు ఆడుతూనే వున్నారు. బాలామణి వచ్చి అన్నము తిని పడుకుంది.

"అమ్మ, అయ్య బువ్వ తిన్నడే?"

"సారా పడుతోందిగా. ఇంక బువ్వ యెందుకు?" తింటాడని అన్నీ ఒకచోట పెట్టి అలసిన శరీరాన్ని పడకమీద పెట్టుకుంది.

•తెల్లవారింది. కొమురయ్య లేచి పండ్లు తోముకుంటుండగా, మల్లమ్మ కోపంగా తవుడు గంపలు తెచ్చి గేదెలముందు పెట్టింది.

"బాలామని పాలకు పోయినాదే?"

అతన్ని ఒక్కసారి పరీక్షగా చూచి, మళ్ళీ తనపనిలో లీనమయింది మల్లమ్మ.

"యాదయ్య లేవలేదూ?"

ఈసారీ జవాబు యివ్వలేదు.

"ఏందే పిలిస్తే పలుకవు."

"ఏం పలుకాలే?"

"నేను అడిగింది యిన్నావా?"

"నేను చెవిటిదాన్ని కాను, తాగి లేను" అన్నది చురుకుగా.

"తాగితే తాగుతాను. నీ యబ్బ సొమ్ము తాగడం లేదు."

"ఎవడబ్బా సొమ్మో తాగు, బిడ్డను అమ్ముకుందుకు నీకు సిగ్గు శెరం వున్నాయా? పసి పోరిని పట్టుకుపోయి ఆ నడీడు ఓనికి యిస్తావా?" గబ గబ అనేసి మళ్ళీ పాలు పితుకుతుందామె. ఆమె కోపమంతా గేదె మీద చూపింది. అది కాస్త కాలు కదిపితే కోపంగా ఒక్కటిచ్చింది.

కొమురయ్యకు రాత్రి సంగతులు ఒక్కొక్కటే గుర్తుకు రాసాగేయి. తను సారా బాగా తాగి బాబయ్యతో ఏమన్నాడో గుర్తుకు వచ్చింది. అతనికి సిగ్గువేసింది. బంగారములాంటి పిల్లను యెలా యిస్తానన్నాడు తను? పదే పదే ఆ విషయం జ్ఞాపకం వచ్చి మనసులో ముల్లు గుచ్చినట్టు అయింది. కొమురయ్యకు మనసులోకి ఒక విషయం దూరదు. దూరిందంటే అవతలి వారి ప్రాణాలు తీసినంత పనిచేస్తాడు. నోరు పుక్కిలించి పుమ్మేసి నేరుగా బాబయ్య ఇంటికి వెళ్ళాడు. అతను ఆనందంగా యెదురుగా వచ్చాడు.

"రారా కొమిరి... ఛా తాగుదాం."

"దండం కొమురయ్య మామ" గేదెలకు గడ్డివేస్తున్న జంగయ్య వచ్చి నమస్కరించాడు. అతను రాత్రికి రాత్రి వెళ్ళి అక్కను తీసుకు వచ్చాడు.

"బాగున్నావే మామ" జంగమ్మ ఆప్యాయంగా పలుకరించింది. అతడిని ఊపిరి పీల్చుకోనివ్వడము లేదు.

"రాతిరి నువ్వా మాటన్నంక కంటినిండ నిదుర పోయిన్నోయ్. బాలమ్మొస్తే లచ్చిమి ఒచ్చినటే...."

"బాబయ్య బావా-నా మాటింటావా?" వెళ్ళి అతని ప్రక్కన కూర్చున్నాడు.

"ఏందో ఒక్కటికాదు వెయ్యి చెప్పర-"



కొమురయ్య ఊపు మీదయితే వచ్చాడు గాని వారి మర్యాదలు చూచి తెల్లబోయాడు. ఎలా చెప్పాలో అర్థం కాలేదు, మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

"చూడు బావ! మనము అనుకున్నవి అనుకున్నట్టు జరగవే. పిల్లలు పెద్దగయితున్నారు. బాలమ్మకు ఈ పెండ్లి ఇష్టం లేదు."

"బాలమ్మకా, దాని అమ్మకా?"

"దాని అమ్మను యెవడు లెక్క జేసిండే! పిల్లకి ఇష్టం లేదు."

"బాలమ్మకా?"

"అవునే, రెండో సంబంధము వద్దు అంటుంది. ఇస్తే బాయిలపడ్త దట. ఏం జేతు బావ?" నోటికి వచ్చినట్టు అబద్ధం ఆడాడు. దాని ఫలితము గురించి ఆలోచించలేదు.

"నువ్వు మాటిచ్చినంక పోరిదేందిరా?"

గేదెలను కడుగుతున్న జంగయ్య పని ఆపి కుతూహలంగా వింటున్నాడు. జంగయ్య పెద్ద కొడుకు చొప్ప నరుకుతున్నాడు. అతడిని చూడగానే కొమురయ్యకు తనమీద తనకే కోపం వచ్చింది. అంత పెద్ద కుర్రవాడున్న వరుడినా తను బాలమ్మకోసము చూచింది. అతనికి అక్కడ వుండాలని కూడా అనిపించలేదు. లేచాడు.

"పోరే కద బావ సంసారం జేసేది. అదికాక పెద్ద పోరలున్నరు. మొగుడు ఇడిసినదాన్నో, చచ్చినదాన్నో యిక కట్టించుకొమ్మను" అని అక్కడ నిలబడలేనట్టు బయలుదేరాడు.

"కొమురయ్యా.... ఒక మాటినాలే."

"పొద్దున్నే యేడ పని ఆడ వుంది బావ. ఇంకేమయిన మాట్లాడు, పెండ్లి సంగతిల మాతరం మాట్లాడకు" వెనక్కు తిరిగి జవాబిచ్చి ముందుకు సాగాడు.

అతనింటికి వచ్చేసరికి బాలామణి పాలబిందెలు తెల్లగా తోమి బోర్లించింది. ఇత్తడి బిందెలు బంగారములా మెరిసిపోతున్నాయి. అల్యూమినియమ్‌వి వెండిలా తళతళలాడిపోతున్నాయి.

"బాలా?" అతను ఆమె దగ్గర నిలబడి ఆర్ద్రంగా పిలిచాడు.

"ఏందే అయ్యా?" బాల తల పైకి యెత్తింది. ఆమెకు కృత్రిమ మయిన అలంకారాలు లేవు. బ్యూటీ క్లినిక్‌లకు వెళ్ళలేదు. అయినా చక్కని చర్మము, ఒత్తయిన జుట్టూ, బొమ్మలు ఏ నూనెలు లేకనే పెరిగాయి. "తాగి నీకు అన్యాయము చేయాలనుకున్నాను క్షమించు" అనాలని వుంది. కాని మాట బయటికి రాలేదు.

"ఏందే గట్ల చూస్తవు-"

"ఏం లేదు బిడ్డ! బయట తిరగకు. అందరి కండ్లు ఒక్క తీరు గుండవు" అన్నాడు చివరకు.

"నేనెక్కడ తిరుగుతనే! సీతయ్యా దొర ఇంటికాడ పాలుదెస్త, మార్తమ్మ ఇంటికాడ సదువుకుంట."

"ఆ సదువులు మనకెందుకు బిడ్డ."

"ఓయమ్మో బాలమనీ! నీ పెండ్లి అంట కద. మాకు పప్పన్నం దొరుకుతుందన్నమాట" గారపళ్ళు బయటపడేలా నవ్వుతూ అడిగాడు సాయిలు.

"ఇక్కడ నిలబడి రోజూ గప్పాలు కొడుతున్నావని చెప్పానా నీ పనే గోవిందా! మసాలా పప్పన్నం పెడ్తది జయమ్మ."

"అవును... ఒచ్చిన సంగతే మరిచిపోయిన వారీ...."

"ఏం సంగతీ!"

"మా జయమ్మ చెయి తంగు వుందంట, బకాయ రూపాయలు తెమ్మన్నది."

"బకాయా?" కుడితి కలుపుతున్న మల్లమ్మ నిటారుగా నిలబడి అడిగింది.

"అవునంట, కొమురయ్యా మామ అరవయి రూపాయలు బకాయ పెట్టిండట. అత్తకు చెప్పలేదే."

"ఆం... నేనొచ్చి మాట్లాడుతను నువ్వు పో" కొమురయ్య తరిమినట్లు సాయిల్ను పంపేశాడు.



"ఇగో ఆడ్ని ఎల్లగొడితే అంత మాసిపోద్దనుకుంటవా యేంది? పైసలు పూర్తిగా యివ్వలేదా?"

"లేదు. సారా దుకానపోడు అడిగితే యిచ్చిన్నే.... ఏదో కష్టపడి నా పైసలు నేనిచ్చుకుంటలెయ్యే" అన్నాడు తప్పించుకునే మార్గము లేదని తెలిసి.

"యెట్ల యిస్తవు, పాలల్ల నీళ్ళు కలుపుతవు. ఆ అడ్డమయిన సారా తాగకపోతే కడుపు కొట్నాని?"

భార్య ముందు నోరెత్తలేకపోతున్నాడు రాతిరి చర్యవల్ల. భార్యను మంచి చేసుకోవాలని, ఆమె మాట మరో దిక్కు తిప్పాడు.

"ఏమే! జర జల్ది బువ్వవెట్టు. నువ్వన్నట్టు పిల్ల సుఖపడాలంటే కరుసు అవుతది. నేను జర పోయొస్త... అదేనే మొన్నటి పిల్లగాని దగ్గరకు పోత, ఓ బర్రె నమ్ముత, గొర్రె నమ్ముత. మన బాలకంటే యెక్కువనా?" అన్నాడు. నిజంగా అతని ఊహ నిజమయింది. మల్లమ్మ బకాయి సంగతి మరిచిపోయింది.

"మీ బాబయ్యా బావ నేంజేస్తవు."

"సూడే మల్ల వల్ల, ఆ మాట అడుగకు. పోయి చెప్పి వచ్చిన" బాలామణికి అర్థం అయింది విషయమేమిటో. ఆమె జంగయ్యను తలుచు కుంటేనే కంపరము పుడుతోంది. అతన్ని పెళ్ళి చేసుకోవటమన్నది ఊహించలేకపోయింది. కొమురయ్యా తయారయి పట్నం వెళ్ళిపోయాడు.

## 8

పట్నం సంబంధం కుదిరిందని చాలా వుత్సాహంగా వుంది బాలామణికి. తను కలలుకన్న నాయకుడు తన జీవితంలోకి వస్తున్నాడు. అతనితో గడుపబోయే జీవితం గురించి ఊహించి సిగ్గుతో ముఖం రెండు చేతుల్లో దాచుకుంది. ఆమెకు తన సంతోషం ఎవరికయినా పంచాలని వుంది. ఎవరూలేరు ఇంట్లో. తల్లి పిడకలు చేస్తున్నది. చిన్నపిల్లలు బడికి వెళ్ళారు. తండ్రి గేదెలను మేపడానికి వెళ్లాడు. ఎదురింట్లో, పక్కింట్లో

యెవరూ కనిపించలేదు. మనసు ఒక్కసారి బలహీనంగా యెందుకు మారిపోతుందో. తలుపులు లాగి గొళ్ళెం వేసింది బాల. మెల్లగా మార్తమ్మ ఇంటివైపు బయలుదేరింది. ఆమె బడిలో వుంటుంది. విల్సన్‌తో మాత్రం చెప్పవచ్చు. అతను యేవో చిలిపి మాటలంటాడు. అలాంటప్పుడు తను పొందే ఆనందము యింతా అంతా కాదు.

వెళ్ళి వరండాలో నిల్చుంది. విల్సన్ పెట్టే బేడ సర్దుకుంటున్నాడు. "ఎవరూ! హాయ్ స్వీటీ, యేమిటి ముఖం సంతోషంతో వెలిగిపోతోంది?" అతను చేస్తున్నపని ప్రక్కనపెట్టి వచ్చాడు.

"యహ్! ఏం లేదు."

"ఏదో వుంది. బాబయ్య కొడుకు గొలుసు చేయిస్తానన్నాడా యేమిటి?"

"ఛీ.... పో, నీకు చెప్పడం నాదే తప్పయింది."

"మరేటి చెప్పు?"

"మరేమో... ఆ రోజున అనలే పట్నపోల పిల్లగాడిని కాయం చేసుకు వచ్చిండు అయ్య-" తల చేతుల్లో దాచుకుంది.

"కంగ్రాచ్యులేషన్స్?" చేయి చాపి మళ్ళీ వెనక్కు లాక్కున్నాడు.

"బాలా! మరి నేనేమో సాయంత్రం వెళ్ళిపోతున్నాను. స్వీట్ యెప్పుడు పెడతావు."

"రాత్రికుండు యేదయినా చేస్త" అన్నది చేతులు తీసి.

"నువ్వు చేసేదెప్పుడు, నేను తినేదెప్పుడు. నేనే పెడతాను వుండు." అతను లోపలికి వెళ్ళి ఒక డబ్బా తెచ్చాడు. దానిలో కేకులున్నాయి. ఒక ముక్కతీసి ఆమెకు అందించాడు.

"ఏమనాలి?"

"థాంక్స్"

"థ్యాంక్స్" అన్నది అతన్ని అనుకరిస్తూ.

"గుడ్ గర్ల్! నీవు చదువుకుంటే యెంతో పైకి వచ్చేదానివి సుమా."

"పెళ్ళి వద్దని చదువుకుందునా. ఏం?"



"వద్దులే. ఆ కుర్రాడు గుర్తుకొచ్చినప్పుడల్లా నన్ను తిట్టుకుంటావు" తనూ ఓ ముక్క తీసుకుని డబ్బా పక్కన పెట్టాడు.

"మళ్ళీ యెప్పుడొస్తావు?"

"ఎప్పుడు రమ్మంటే అప్పుడే?"

"తమాషా చాలుగాని నిజం చెప్పు."

"ఈసారి తొమ్మిది నెలల తరువాతే రావడం జరుగుతుంది. అప్పుడు నేను డాక్టరునయిపోతాను."

"ఓయమ్మో! మమ్మల్నందరిని రోగిష్టిలు కమ్మనా ఏం?"

ఇద్దరూ నవ్వారు. కొందరి సమక్షంలో మాటలు మూటల్లా దొర్లి పోతాయి. మరి కొందరి సమక్షంలో అసలు నోరు విప్పడానికి మనసు రాదు. విల్సన్, బాలామణిల మధ్య కబుర్లు ఊరుతూనే వుంటాయి.

"రండ్రే.... జర చూడండ్రి..." గావు కేకలాంటిది వినిపించి ఇద్దరూ తిరిగి చూచారు. జంగమ్మ ముందున్నది, వెనకాల గొల్ల స్త్రీలంతా వున్నారు.

"నేను చెబితే మీకు యకీన్ కాలె. ఇప్పుడేమంటరే."

"పెండ్లి పెట్టుకున్నరంట. పోరికిదేం బుద్ధి?"

"పోరిని యేందె అనేది ఆ తల్లి తండ్రికి సిగ్గుండాలె."

"జోగుదానిలాగ వూరంతా ఇదే..." రకరకాల వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. విల్సన్ మొదట తేరుకుని బయటికి వచ్చాడు.

"ఏమిటండీ యిదంతా?"

"వారెవ్వా! ఆమాటే నిన్నడుగుతున్నాము. మా అసుంటి గరీబుగాల్ల పిల్లలతో నీకేంది! నువ్వు సూటూ బూటూ యెయ్యంగానే సరా!" జంగమ్మ గయ్యిమంది.

"చూడండి నేను సూటూ బూటూ వేసి మిమ్మల్నేం మోసం చేశాను!"

"ఇంకేం జేస్తవయ్యో! మా కులం పిల్లను పాడుజేస్తున్నవు సాలదా!"

"నేనా? నేనెవర్ని పాడుచెయ్యటం లేదు. అమ్మాయి యేదో తనకు వివాహం నిశ్చయమయిందని చెబితే వింటున్నాను."

"ఆహా... ఎంత బాగుందయ్యా నీ మాట. పసిపోరలకు చెప్పు?" విల్సన్ యెంత నచ్చచెప్పినా వారెవరూ వినిపించుకోలేదు. వాళ్ళ ధోరణే వాళ్ళది. వేటకాడివాడి బాణం గుచ్చుకున్న పక్షిలా గిలగిలలాడింది బాలామణి మనస్సు. మెల్లగా వారనేవి ఏం వినిపించటంలేదన్నట్టు బయటికి నడిచింది. ఆ క్షణంలో బాలను హృదయానికి హత్తుకొని "వారన్న మాట నిజం చేద్దాం పద" అనాలనిపించింది అతనికి. అతను తేరుకునే లోపలే ఆమె వెళ్ళిపోయింది.

"చూడండి మీకంతా బాల లాంటి బిడ్డలున్నారు. అలా నిందలు వెయ్యటం న్యాయం కాదు" అన్నాడు.

"మా పిల్లలు నీ ఇంటి జాడల్ల ఒస్తే వాతపెట్టమా, ఏం మాట్లాడ తావయ్యో" ఒక స్త్రీ విల్సన్ మీదికి చెయి చూపుతూ వచ్చింది.

"అడిదేం తప్పే, మొగోడు కనిపించిన దాని యెంట పడ్తడు. తప్పంతా దానిది. దాని తల్లిని పంచాదుల కీడ్చి బుద్ధి చెప్పాలె. పదండి పోదాం" అన్నది జంగమ్మ.

విల్సన్ పిచ్చిగా చూడటం తప్ప ఏం చేయలేకపోయాడు. అతను తల్లి వచ్చింది కూడా గమనించలేదు. అతని కళ్ళముందు చిన్నబోయి ముడుచుకుపోయిన బాలామణి ముఖమే కనిపించసాగింది.

"విల్సన్! వెళ్ళటానికి సమయము అవుతుందిరా... అదేం అలా వున్నావు?" ఆశ్చర్యంగా అడిగింది మార్తమ్మ.

జరిగిన విషయము చెప్పాడు. ఆమె చాలా బాధపడింది. "నేను మొదటే హెచ్చరించానురా. మన పద్ధతి వేరు, వారి పద్ధతి వేరు. వారి ఆలోచనా పరిధిలో స్త్రీ పురుషుల స్నేహము అంటే లైంగిక సంబంధమనే అనుకుంటారు."

"పాపం బాలనేం చేస్తారో."

"ఆ! ఏం చేస్తారు! కుల పెద్దలంతా మందలించి వదిలివేస్తారు."



"నిశ్చయమైన వివాహం తప్పిపోతుందో యేమో."

"ఫర్‌గెట్ ఇట్. దానికి నువ్వే విధంగా బాధ్యుడవు కావు" ఆమె లోపలికి వెళ్ళి ఆమ్లెట్ వెయ్యడానికి ప్రయత్నం మొదలుపెట్టింది.

"మమ్మీ! ఒకసారి అలా వెళ్ళి చూచిరానా? పాపం బాలను వాళ్ళంతా యేమంటారో యేమో" అన్నాడు.

"నిన్ను చూచి మరీ రెచ్చిపోతారు. ఇలాంటివి యిక్కడ ఊళ్ళలో ప్రతినిత్యం జరుగుతూనే వుంటాయి." ఆవిడ నిదానంగా గుడ్డు ఫోర్కుతో కొడుతూ అన్నది. అతను వెళ్ళి టై కట్టుకుంటుంటే అద్దంలో అందమైన బాల మొఖమే కనిపించింది. ఒక నిట్టూర్పు విడిచాడు. తను యేవిధంగా సహాయం చేయలేని తన అసహాయతకు తిట్టుకున్నాడు.

## 9

"ఆడబుద్ధో, అపరబుద్ధో ఎద్దులా పెరిగిన పిల్ల ఏదో చేసింది. వదలి వేయమని పడుచులకు చెబుతున్నాను'' బాబయ్య యెంతో నాగరికంగా మాట్లాడినట్టు పోజు పెట్టాడు.

"ఆ కులమంటే కుక్కలు చింపిన ఇస్తరాకా ఏం? దానికి సజావైన పద్దతులు వున్నాయి. ఈ తప్పుడు పని ఇయ్యాల ఈ పిల్లజేసింది. రేపు మా పిల్ల జేస్తుంది. ఒకసారి మాఫీ చేస్తే అందరికీ అలుసు కాదు. దీనికి యేమయినా జర్మాన పడాలె'' ఒక పెద్ద మనిషి అన్నాడు. ఏడ్చీ ఏడ్చీ అలసి పోయినట్టు బాబయ్య ఇంటిముందున్న చెట్టుకు చేరబడింది మల్లమ్మ. చెట్టు నానుకుని నిల్చుంది బాలామణి. బాబయ్య అరుగుమీద కూర్చున్నాడు. ఆయన చుట్టూ కులపెద్దలు కూర్చున్నారు. కొమురయ్య అతనికి కాస్త దూరంలో నేలమీద కూర్చున్నాడు. జంగమ్మ తన ఇంటి వాకిట్లో నిలబడింది.

"ఏందే తప్పు, తప్పు అంటరు. నా పిల్లేం తప్పు చేసింది?" కొము రయ్య రోషంగా అడిగాడు.

"మేము తప్పుచేసిందని అన్నామురా. పట్టుకున్న ఆడోళ్లు అంటున్నారు" బాబయ్య కూతురి వంక చూచాడు.

"ఇంకేం తప్పు చేయాలె! తల్లి ఇంటలేనప్పుడు ఒయిసు పోరడు పిలిస్తే యిది యెట్ల పోతది! అప్ప పగలే..."

"జంగమ్మొదినా? జర నాలుక సవరిచ్చుకో. నా పెండ్లి సంగతి జెవుదమంట బోయిన" ఆడపులిలా లేచింది బాలామణి.

"ఒంటిగున్నప్పుడే పోవాల్నా?"

"ఆయన ఊర్కిపోతున్నాడని పోయిన మల్ల నన్నేం అన్నా ఊర్కోను."

"ఆనెంట ఈనెంట పొయ్యేదానికి యెంత రోషమో."

"జంగమ్మ! నీకు దానసుంటి పిల్లల్లేరా! దాని రాయి కొట్టుకుంట వేంది. నీ తమ్మిని కియ్యలేదన్న కడుపుమంటతో కాదు ఈ నింద్య వెట్నవు. ఆ ఉసురు ఊరికే పోదు" మల్లమ్మ అన్నది. తన కూతురు యెలాంటిదో తనకు తెలుసన్న ధీమా ఆమె కళ్ళలో కనిపించింది.

"జంగమ్మ, నువ్వాకో బిడ్డ. ఊరి ఆడవారంతా అబద్ధం చెప్తరా" బాబయ్య అడిగాడు.

"అంతా నీ మాటనే మాట్లాడరు బావా! పైస గలోడివి" కొమురయ్య చుట్ట కొస కొరికి ఉమ్మేశాడు.

"పైసుండని లేకపోని-తప్పందరిది ఒక్కటే కొమురయ్యా! నీ పిల్ల చేసింది తప్పు. కులపెద్దలకందరికీ ఓ కుండ కల్లు జెప్పు. అయిదు నూర్లు జరుమాన గట్టు" తీర్పు యిచ్చేశాడు బాబయ్య. కొందరికి అన్యాయము అనిపించింది. నూట పదహారు మాత్రమే తీసుకుంటారు. పైకి అంటే తంటా. అందరికి అప్పులు పెట్టేవాడు, కులపెద్దాయె.

"ఇవ్వకపోతే?"

"కులములకు రానియ్యము" అన్నాడు.

"పూర్తిగిను, పోరిని అందరి కాలమీదెయ్యి."



"కులములకు ఒచ్చి నేను చేసేది యేముంది. అట్లనే చెయ్యి" విసురుగా లేచాడు కొమురయ్య.

"ఏందియ్య..." అతడిని ఆపాలని చూసింది భార్య.

"ఏందే బయము. ఈల్లంతా పత్తిత్తులట. పద పద. పనికిరాని కులముంటే యెంత పోతే యెంత. పదవే" భార్యను ఈడ్చుకుపోయాడు. బాలామణి అక్కడ వున్న పెద్దలందరివంక ఒకసారి చూచింది. ఆమె చూపులు కవులు వర్ణించే ద్రౌపది చూపుల్లా వున్నాయి. ద్రౌపది పైకే ప్రశ్నించింది. ఇంతమంది పెద్దలముందు అవమానిస్తే చూస్తూ వూరుకుంటావా అని. కాని బాలామణి ఆ ప్రశ్న కళ్ళతోనే వేసింది. అందరూ తలదాచు కున్నారు. మెల్లగా తల్లి, తండ్రిని అనుసరించింది.

"అడి నీల్గుడు చూడు యెట్ల ఓతున్నడో!"

"ఆడికి బిడ్డ బాగ తెచ్చిపెడుతుంటే నీల్గుడు కాక యేంది?"

"బాబయ్య యేదో చెప్పాడు మనల్ని న్యాయమంటూ అడిగినాడు?"

తలా ఒక మాటా అన్నారు. అందరూ అవమానము జరిగినట్టు బాధపడడం విన్న బాల ఒకసారి తిరిగి చూచి ముందుకు వెళ్ళింది. తండ్రి అడ్డమయిన బూతులు తల్లిని తిట్టడం సహించలేక పోయింది. ఏందే నాయనా అన్నట్టు కళ్ళతోనే మందలించింది. ఇంటికి వెళ్ళగానే మల్లమ్మ కూతుర్ని దగ్గరకు తీసుకుని బావురుమంది.

"మల్ల ఏడుస్తదేమిరా యెవరో సచ్చినట్టు, యిప్పుడేమైందని యేడు స్తున్నావు. బాలమ్మ పెండ్లికి కులమోలు రారనేనా నీ యేడ్పు? అట్లయితే పట్నంలో జేతం పద."

"ఆలు చేసుకుంటారా?" జర్రున చీదేసింది.

"ఊరంతా బాబయ్య మాట యింటరు అప్పు, సప్పు ఇస్తడని. పట్నపోలు యింటరా? రేపెబోయి దబ్బున యేర్పాట్లు చేస్త. నువ్వు శోకాలు తియ్యకు."

"పైసలెట్ల?"

"సీతయ్య దొరతో మాట్లాడి వుంచిన. ఇస్తడు, ఈ కారం కొట్టుకున్న కండ్లకు మంటగాని మనపిల్లంటే అందరికీ మంటనా?"

"ఏమయిందే అయ్య!" పాలసైకిలు పక్కకుపెట్టి అడిగాడు యాదయ్య అంతా విన్నాడు.

"ఈల్ల యవ్వారం జర చేయి దాటి పోయిందే. కాల్జేతులు కట్టి కొట్టిల్ల పారేసి వయసు పోరలను పెట్టాలి. తప్పు నీదయ్యా! ఆడు ఊకనే సారా, కల్లు యెందుకు పోస్తడు చెప్పు" కొడుకు నిలదీస్తే అదిరిపోయాడు తండ్రి.

"అవురా నేను అప్పుడు బేకూపును అయిన" అంగీకరించాడు. ఇద్దరూ కలసి ఓ ప్రణాళిక వేసుకున్నారు. వారి ప్రణాళిక విజయవంతమయిందనే చెప్పాలి. సీతయ్యకాదు జయమ్మ ఏ కళనుందోగాని అంగీకరించింది డబ్బు యివ్వటానికి. యాదయ్య పాలుపోసే మార్వాడి రెండువేలు యిస్తానని మాట యిచ్చాడు, కొంత డబ్బు యిచ్చాడు కూడా.

"యాదీ! ఆ డబ్బు తీసుకెల్లి ఆ పెండ్లి పిల్లగాని తల్లిని పిలుచుక పోయి బాసండ్లు (పాత్రలు) యేం గావాల్నో యిప్పియ్యి బిడ్డ" అన్నది మల్లమ్మ.

"అట్లనే" యాదయ్య వెళ్ళిపోయాడు.

పంచాయతీ జరిగిన నాటినుండి బాలామణి యేదో కోల్పోయినట్టు ఒక మూల కూర్చుని వుంటుంది. పరధ్యాస యెక్కువయింది.

"ఏంది బిడ్డ నువ్వేం తప్పుచేసినవని అట్ల బాధపడతవు? లే, ఆల్ల నోరు కట్టాలంటే యెప్పట్లాగ తిరుగు." కూతురి తలను హృదయానికి హత్తుకుంది తల్లి.

"అది కాదే అమ్మ, బాబయ్య మామ..... మా...... అదే..... ఆల్లకు చెబితే నమ్మరూ?"

"ఏం జెప్తడే? అంత దిగజారిపోలేదులే. యేదో కొడుక్కు యియ్యలేదన్న కచ్చ తప్పితే ఏం లేదు" ఓదార్చింది కాని సాయంత్రం యాదయ్య తెచ్చిన వార్త విని యెక్కడి వారక్కడే కూర్చుండిపోయారు.



"కులంలో తీసేసిన మీ పిల్ల మాకొద్దు" అన్నారట.

"నేను అప్పుడే చెప్పలేదయ్యా! అనుకున్నంత అయింది. ఇప్పుడేం జేతం" తలబాదుకుంది మల్లమ్మ.

"ఆడుకాకపోతే ఆనబ్బ మరొకడు. నువ్వు నోరుముయ్యే ముందు" కొమురయ్య అనవసరంగా జుట్టుపట్టి భార్యను కొట్టాడు. ఆమె బావురుమంది.

"ఏందే అయ్య అల్లు ఒద్దంటే అమ్మేం జేస్తది?"

"ఏడుస్తది యెందుకురా?"

"ఆమెకు చాతనయింది ఆమె జేస్తది" అన్నాడు విసుగ్గా.

"ఆ బాబిగాన్ని, రండ కొడుకును ఏ కండకు ఆ కండ నరుకుతరా" లేచాడు కొమురయ్య.

"అయింది చాలుగాని నువ్వు ఇంట్లకు పద" తండ్రిని లోపలికి నెట్టాడు. తల్లిని కసురుకున్నాడు.

"అమ్మా ఓయమ్మా కిష్టయ్య మామింట్ల ఇరవయి ఒక్క దినమంట. మనుమరాలిది దావత్ అయితుందే. సంటిపిల్ల గాన్ని జాతమంట పోతే 'మీరు కులంల లేరు' రా వద్దందే అత్తమ్మ" సక్కు రోషంగా వచ్చింది.

"ఊఁ" అన్నది మల్లమ్మ. చేబదులకు కూడా మీరు కులంల లేరు అంటున్నారు.

## 10

జయలక్ష్మికి కొత్తబెడద పట్టుకుంది. ఆడబడుచు రాకపోకలు యెక్కువయ్యాయి. ఆమె ఆఖరి కూతురు ఉమంటే సీతయ్యకు ప్రాణం. ఆ సంగతి తెలిసినప్పుడల్లా ఆ పిల్లను వెంటబెట్టుకు వస్తుంది సరస్వతి. మునుపటిలా కట్టడి చేసినా లాభం లేకపోయింది. పంటరానిదే దానిమీద అప్పు చేస్తున్నాడు. కంచెలమీద అప్పుతెస్తున్నాడు. పాలవారి దగ్గర అడ్వాన్స్ తీసుకొంటున్నాడు, తనేమన్నా లెక్కచేయడం లేదు. నోరువిప్పి జవాబు చెప్పడు. ఏం చేయాలో అర్థం కాలేదు.

"అమ్మా! నువ్వు తీర్థయాత్రలకు వెడతానన్నావుకదా?" ఒకనాడు వస్తూనే ఉమ కోరికమీద కట్టించిన వుయ్యాల బల్లమీద కూర్చుని తల్లిని ప్రశ్నించాడు.

"అన్నాను కాని యెలా వెడతాను నాయనా! అందరికీ అన్ని కోర్కెలు తీరుతాయా. నా కాలము యిలా వెళ్ళిపోనియ్యి. ఒక్క కొడుకు కడుపున నాల్గు కాయలు కాస్తే చూచి ఆనందించాలనుకున్నాను. యేదీ? ఆ కోర్కె తీరిందా? భగవంతుడు నిర్దయుడు. యాత్రలు అనుకున్నాను..."

"అబ్బబ్బ యేమిటే గోల? మన శెట్టిగారి తల్లి, గోవిందరావు మేనత్త వెడుతున్నారు నువ్వు వెడతావేమోనని అడిగాను...."

"నువ్వు డబ్బిస్తే వెడతాను" అన్నది.

"నేను యివ్వకపోతే నిన్ను సంపాదించుకుని వెళ్ళమన్నానా ఏం? సోమవారం బయలుదేరుతున్నారట, బట్టలు అవి సిద్ధంగా పెట్టుకో." జవాబుగా వంటింట్లో చెంబు ధన్‌మని బయటపడింది.

"అదిగో అప్పుడే యెత్తేసుడు, పగలేసుడు ప్రారంభము అయింది. వద్దులే నాయనా" అన్నది కినుకగా.

"అమ్మా అవన్నీ మరిచిపో. చేసేవాళ్ళు అలాంటి చేష్టలు చేస్తూనే వుంటారు. మనము చేసే పనులు మనము చెయ్యాలి" అన్నాడు. ఆమె మాట్లాడక బయటికి వెళ్ళింది, ఈ వార్త చెప్పడానికి. ఆమె ఉత్సాహము యింతా అంతా కాదు. జయలక్ష్మి సాయిల్ను అడ్డమైన తిట్లు తిట్టింది.

"ఎందుకలా నోరు పారేసుకుంటావ్?" సీతయ్య అడిగాడు.

"మీ ప్రయోజకత్వం చూడలేక."

"నోరుముయ్యి" అన్నాడు. సరస్వతి అన్న మాటలు గుర్తుకు తెచ్చుకుంటూ.

"శాశ్వతంగా మూసుకుంటాను... " జయలక్ష్మి పెరటివైపుకు వెళ్ళింది.

"ఎవర్ని బెదిరిస్తావే! ఏం చేసుకుంటావో పో" అన్నాడు. జయలక్ష్మికి పిచ్చి కోపం వచ్చింది.

"ఒరేయ్ సాయిలూ! మా వాళ్ళకు నా చావు వార్త అయినా చెప్పడేమో ఈ కర్కోటకుడు. నేను ఈ సంసారం చెయ్యలేక, వీరి బాధలు



పడలేక చచ్చానని చెప్పరా... ఒరేయ్ పాలమల్లమ్మ దగ్గర రెండు వందలు రావాలి. తెచ్చి మీ అయ్యకు తగలబెట్టు, పేకాడుకుంటాడు" ఎగచీదుతుందామె.

"దొరా అమ్మ యేమో అంటుంది...." సాయిలు గాభరాగా అన్నాడు.

"చావాలని వుందట. చావనియ్యరా. ఆపటం యెందుకు?"

"అదేం మాటయ్యా!"

"వెధవా, పొలం వెళ్ళు. అక్కడ పని అక్కడే పెట్టి యేందిరా నీ గోల." సీతారామిరెడ్డి కదలకపోయేసరికి సాయిలుకు అమ్మగారిపై జాలి కల్గింది. అమ్మగారికేమో శివమెత్తిపోయింది.

"ఇదంతా ఆ సంగనాచి చేసింది. నా సంసారంలో నిప్పులు పోసింది. ఆ సరస్వతి సర్వనాశనము అయిపోను..." శాపనార్థాలు పెడుతూ గట్టు మీద కూర్చుంది.

"ఒక్క నిముషం కళ్ళు మూసుకుంటే ప్రాణం పోతుంది. ఈ ముఖం ఎట్లు బ్రతుకుతాడు! అంతా అక్కాచెల్లెళ్ళు దోచుకుపోతారు. అప్పులు వసూలుచేసే తెలివి వుందా?"

ఆమె ధోరణికి సీతయ్య నవ్వుకున్నాడు. చావడానికి కూడా తెగింపు కావాలి అనుకుని మెల్లగా బయటకు వెళ్ళాడు. గోవిందరావు యెదురు వచ్చాడు.

"రా సీతయ్యా! నువ్వులేక ఆట రక్తికట్టడంలేదు."

"అమ్మ యాత్రలకు వెడతానంటుంది. ఓ అయిదు వందలు సర్దుతావా?" అన్నాడు. గోవిందరావు పకపక నవ్వాడు. సీతయ్య చికాకుగా చూశాడు.

"నీ దగ్గర డబ్బుకు కొదువటయ్యా భలేవాడివి గనుక."

"ఇప్పుడు కాస్త చెయ్యి ఆడటం లేదయ్యా."

"అయితే ఓ పని చెయ్యి. మీ టమోటాలు ఊరివారందరూ తేరగా తింటున్నారు. లాభంరాని, నష్టంరాని పదిహేనువందలకు మా తమ్ముడికి యిచ్చెయ్యి."

సీతయ్యకు భార్యమాటలు గుర్తుకు వచ్చాయి.

"ఈసారి టమోటో చెట్లు బాగున్నాయి. తప్పకుండా రెండు మూడు వేలు వస్తాయి. వాటికి కొంత కలిపి సిటీలో ఇల్లు కొనుక్కుందాము. వడ్డీ గిట్టుబాటు అవుతుంది. వెధవ బ్యాంకిలు రూపాయికి పావలా యిచ్చే రోజుల్లో నూరు రూపాయలకు పన్నెండు అణాలు యిస్తారు. ఏమూలకు సరిపోతాయి?"

"వొద్దులెండి మరోచోట యెక్కడయినా ప్రయత్నం చేస్తాను" సీతయ్య వెనుతిరిగాడు.

"మరో రెండు వందలు వేసుకోవయ్యా! ఇదిగో ఆస్తి వుండగానే సరిగాదు. రూపాయికి పైసా చేర్చి మూట కట్టడం కాదయ్యా! నల్గురూ బ్రతకాలని వుండాలి. అందుకే విప్లవకారులు బయలుదేరారు" గోవిందరావు తన కరణము చిట్కా వేశాడు.

"సరే కానివ్వు. డబ్బు మాత్రం అంతా వొకేసారి యివ్వాలి" అన్నాడు.

"ఆ మాట అడిగావు బావుంది" అతను తమ్ముడిని పిలిచి డబ్బు విషయం చెప్పాడు. అతను నాల్గు రోజులు గడువు కోరాడు. సీతయ్య ఆనందంగా అరువు ఆటలు అయిదారు ఆడి, గోవిందరావుకు వంద రూపాయలు బాకీపడి ఇంటికి వచ్చాడు. తల్లి అన్నం పెట్టింది.

"జయ లేదూ?"

"ఎందుకు లేదు? మేడ యెక్కింది" అన్నది. అతను భోజనము కాగానే మేడ బదులు ఉయ్యాలబల్ల యెక్కి పడుకున్నాడు.

"డబ్బు యెక్కడయినా దొరికిందా?"

"దొరికింది. నువ్వు నిశ్చింతగా వుండు" ఆవులించాడు.

"నాకేం చింతగాని, మరొక్క కోరిక మిగిలిపోయిందిరా. ఆడపిల్లలు నిన్ను భాగం అడుగుతారా? ఆస్తులు పంచుకుపోతారా? ఇంత పసుపు కుంకం యిస్తే తీసుకుపోతారు. నేను వయసు మళ్ళినదాన్ని, యాత్రలకు వెడితే తిరిగివస్తానో రానో" ఆవిడ కళ్ళనుంచి నీళ్ళు టపటపరాలాయి.



"ఇప్పుడేమయిందనే, ఈ ఆడవారికి అడగకుండానే వస్తాయి కన్నీళ్ళు" విసుగ్గా చూశాడు.

"ఆ భగవంతుడి దయవల్ల యేమీ కాలేదు. ముసలి ప్రాణము. ఎటు పోయి యెటు వస్తుందో, అందరికీ నా చేతుల్తో బట్టలు పెట్టుకోవాలని వుందిరా."

"అలాగే పెట్టుకుందువు గానిలే" అన్నాడు అటు తిరిగి కళ్ళు మూసుకుంటూ. రాజమ్మకు కొడుకు మాటలు నిశ్చింత కలిగించినా కొడలి స్వభావము నిరాశ కలిగించసాగింది.

ఇంట్లోకి వచ్చిన ఆడపడుచులను చూచి మూతి తిప్పుకున్నా, వాళ్ళ బలగం యెక్కువ కనిపించి మాట్లాడ్డం తప్పలేదు.

"ఏమ్మా మరదలు పిల్లా! మేమున్నామని గుర్తుందా?"

"అయ్యో రామ. మరిచిపోదాం అనుకున్నా మీరు మరువనిస్తా రటమ్మా. మీ అమ్మ మీ నామమే జపం చేస్తుంది."

"చేసినా నీకు గుర్తురాకపోయామా?" వొక ఆడబడుచు దీర్ఘం తీసింది.

"గుర్తుకు వచ్చినా ఏ వంకన పిలవాలి? మీ ఆశీస్సుల ఫలితమా అన్నట్టు మీ తమ్ముడికి పిల్లాపీచు కలుగలేదాయె" జయలక్ష్మి ముఖానికి నవ్వు పులుముకుంది.

"ఏడ్చినట్టే వుందే నీ మాట. పండుగ, పబ్బం లేదా ఏం?"

వారి మధ్య సంభాషణ యిలాగే నడిచింది వున్న నాలుగు రోజులు. భార్యకంటే నాలుగు ఆకులు యెక్కువ చదివిన అక్క, చెల్లెండ్ల మాటలతో హడలిపోయాడు. పని పేరు చెప్పుకుని గోవిందరావు ఇంట్లోనే మకాం పెట్టాడు.

"ఏమిటి రెడ్డీ ఆలోచిస్తున్నావు?" కోమటి రాఘవులు అడిగాడు.

"స్త్రీల మనస్తత్వాన్ని గురించి."

"ఇప్పుడా ఆలోచన యెందుకొచ్చిందయ్యా?"

"అది కాదయ్యా! మన భార్యలు, మన అప్పచెల్లెండ్లు, అమ్మలు

యింత యథేచ్ఛగా మొగవాడి నో చచ్చుపీనుగును చేసి రాజ్యం ఏలినంత పని చేస్తున్నారు కదా, మన పేపర్ వాళ్ళు స్త్రీకి స్వాతంత్ర్యం లేదు అట్టడుగున వున్నారని గోలబెడతారేమిటి?" అన్నాడు పేక కలుపుతూ.

"అందరు వొకేలా వున్నారా?"

"మన ఊరి స్త్రీలంతా నాకు వొకేలా కనిపిస్తారు" అన్నాడు ముక్కలు పంచుతూ.

"ఏమిటి సీతయ్యా! ఏమిటి కథ?" గోవిందరావు అడిగాడు.

"ఏంలేదు" అన్నాడు. ఉన్నా భార్య, అక్కచెల్లెండ్లను గూర్చి బయట యెలా చెబుతాడు! వారం రోజుల తరువాత అందరూ ప్రయాణం అయ్యారు.

"నీ పని నీదే గాని మా గురించి పట్టించుకోకపోతే యెలాగన్నయ్యా ఈరోజు అక్కయ్యలు వెళ్ళిపోతాం అంటున్నారు." సరస్వతి వచ్చి చెప్పింది.

"అందరికీ బట్టలు తెమ్మని పైకం నీకిచ్చాను కదమ్మా!"

"బట్టలు తెచ్చాను. నేనే వాళ్ళకు పెడితే నీ పరువు వుంటుందా ఆమె యెలాగూ పెట్టదని తెలుసు. ఆమె ముందు మమ్మల్ని యెందుకు చులకన చేస్తావు?"

"అలాగే వుంటానులే."

"ఉండటమే కాదు. వెళ్ళి వదినను పిలువు, రేపు నిష్ఠూరాలు నిందలు నాకెందుకు? బట్టలు నువ్వే తెచ్చినట్టు చెప్పు" అన్నది.

"అలాగేలే" అన్నాడు. అతనికి గుండెదడగా వుంది. వారం పది రోజులుగా ఉయ్యాల బల్లమీదే పడక. జయ చేసే రాద్ధాంతానికి అంతే వుండదు. కొందరు కలహానంతరము కలయిక, కమ్మదనము కావ్యాలు వ్రాశారుగాని అతనికి మాత్రం గొడవలు, పేచీలు పడ్డాక మళ్ళీ లైంగిక జీవితంకోసం రాజీపడడం సుతరాము ఇష్టం లేదు. భార్యను దగ్గరకు తీసుకున్నప్పుడు యెలాంటి చలనము కలుగదు. ఉద్రేకంతో ఊగిపోదు ఒక విధమైన ఏహ్యాభావము కలుగుతుంది. అతను భోజనము తరువాత



పడమటి వసారాలోని సరంజామా చూచి పైకి యెక్కక తప్పలేదు. సరస్వతి చాపవేసి, బట్టలు పొట్లాలు ట్రేలో పెట్టి పసుపుకుంకాలు పెట్టింది.

"జయా?"

"జయ చచ్చిపోయింది." మంచం మీద దొర్లుతున్న జయ జవాబు అది.

"చచ్చి మళ్ళీ బ్రతికిందా?" నవ్వుతూ మంచం చివర్న కూర్చున్నాడు.

"చచ్చే బ్రతికాను మిమ్మల్ని సాధించాలని. తెలిసిందా?"

"బ్రతికి సాధిస్తున్నావు చాలదా?"

"అయ్యో నా రాత! ఎంత అమాయకుడమ్మా నా మొగుడు. అప్ప చెల్లెండ్లను రప్పించి కొంప గుండం చేయడమేకాక, ఒక్కసారంటే ఒక్కసారి పైకి వచ్చారా? ఈ కాపురం నా కొద్దు."

"నీకు అంటే కోపంగాని నీవు నీ పుట్టింటికి వెళ్ళటం లేదా?"

"వెడతాను. అన్నా, వదినలు సంపాదన తినటానికి కాదు, మా నాన్న వున్నాడు కాబట్టి వెడతాను" అన్నది అతిశయోక్తిగా.

"ఏమిటే ఆ ధోరణి? లే వాళ్ళు వెడతామంటున్నారు. సాగనంపి వద్దువురా."

"ఇంత ఈసడించి కొట్టగానే యిలా వున్నారు మొండిఘటాలు, వచ్చి సత్కారం చేసి సాగనంపితే నా నెత్తిన యెక్కరూ?"

"వస్తావా రావా?" లేచాడు.

"రాను. రాను గాక రాను" అన్నది దృఢంగా. అతను ఒక్క నిమిషము చూచి వెళ్ళిపోయాడు. జయ కూర్చున్నది. ఆమె మనసు క్రిందే వుంది. అత్త ఆమె దృష్టిలో రాతికి చెమటతీసే మనిషి. కూతుళ్ళకోసం కొడుకును పీడించి జాకెట్టు బట్టలయినా కొని వుంటుంది. డబ్బంతా తన దగ్గరుంటే భర్త యెలాకొంటాడు. అమ్మడానికి గడ్డి గాదం లేవు. తెస్తే బదులుతేవాలి చూద్దాం అని పై మెట్టువరకు వచ్చింది. హాల్లో అందరినీ చూడగానే ఆమె హృదయం భగ్గుమంది.

"దానికి తలనొప్పిగా వుందట. మనలో మనకు భేదాలు యేమిటి? సరస్వతీ నువ్విచ్చెయి" అన్నాడు.

"అలాగే అన్నయ్యా" అందరికీ బొట్టుపెట్టి బట్టలు పెట్టింది. జయ గతుక్కుమంది. జాకెట్టు బట్టలయితే అంతలావుగా వుండవు. ఇప్పుడు తను దెబ్బలాడినా లాభంలేదు. తన భర్త తనకిచ్చే విలువ యింతేనా? ఆమెకు దుఃఖం ఆగలేదు. వెళ్ళి మంచం మీదపడి వెక్కి వెక్కి ఏడ్చింది. క్రింద కలకలం, నవ్వులు వింటుంటే వేడిచేయని ఇనుమును నిర్దాక్షిణ్యంగా సమ్మెటతో కొట్టినట్టు అనిపించింది. బండి కదిలిన శబ్దం అయింది. "పీడా విరగడయింది" అనుకుంది. అరగంట తరువాత క్రిందికి వచ్చింది.

"చూడమ్మా ఉమ, నేను లేకపోతే మామయ్య కాఫీ అడగడు వెర్రి నాయన. నువ్వే అడిగి యిస్తుండాలి" రాజమ్మ సరస్వతి కూతురిని కూర్చుండ బెట్టుకుని చెబుతుంది.

"ఉమా" అరచినట్టు పిలిచింది!

"ఏమత్తయ్యా?"

"నువ్వు వెళ్ళలేదూ?" అమ్మమ్మవైపు చూచింది. "నేనే వుండమన్నాను. నేను యాత్రలకు వెడితే వాడికిన్ని నీళ్ళు యిచ్చేవారు వుండవద్దూ!"

"అన్నం వండి పెట్టేదాన్ని నీళ్ళు యివ్వనా." ఈసారి కొడుకు తనమాట విని డబ్బు తేవటంతో రాజమ్మకూ కాస్త ధైర్యం వచ్చింది.

"మహా యిచ్చావులే, మేడ యెక్కితే దిగే పనే లేదాయే. కొడుకు నిన్ను ఆపలేక పరుల పంచలు పట్టుకుని తిరుగుతాడు" నీళ్ళు రానిదే కళ్ళు ఒత్తుకుంది.

"ఓహో! వ్యవహారము చాలావరకు వచ్చిందే."

"ఏం? నేను నీలాగే ఒకప్పుడు ఈ ఇంటి యజమానురాలినే. నీలా కాపీనము చేస్తూ బ్రతుకలేదు. పిల్లా జెల్లాతో కళ కళలాడిపోయేది నా ఇల్లు."

"ధర్మ సత్రంలా ఇల్లు మారితే తప్ప మీకు తృప్తిలేదా?"

"ఎందుకులేదూ? నువ్వు నా వాళ్ళందరిని గౌరవించకపోతే మానెయ్యి



నీచంగా చూస్తే ఊరుకోను. ఉమకి మేనమామల ఇంట్లో వుండే అధికారముంది." ఇద్దరూ గొంతు నొప్పిపుట్టే వరకు అరుచుకున్నారు.

"నీ యవ్వ కూటికి లేకనా గుడ్డకు లేకనా!" అనుకున్నాడు గేదెలను కట్టేస్తూ సాయిలు. వాడికేం తెలుసు కొన్ని సమస్యలు పుడతాయి, కొన్ని కావాలని కొందరు ఆహ్వానిస్తారని.

జయలక్ష్మి భర్త ఉమను పిలిచినప్పుడల్లా ఉరివేసుకుని చద్దామని పించేది. రాజమ్మ యాత్రలకు వెళ్ళాక మరీ ఆ పసిదానితోనే లోకం అన్నట్టు ప్రవర్తించసాగేడు. చస్తానని బెదిరించినా చలించని మనిషితో ఏం వాదిస్తుంది! భర్తను లొంగదీసే మార్గాలు ఆలోచించసాగింది.

## 11

పద్దెనిమిది దాటినా బాలామణి వివాహం కాలేదు. అంతకంటే కానియ్యలేదంటే బావుండేది. ఆమెకో ముద్ర పడిపోయింది. కిరస్తానీ అబ్బాయితో వ్యవహారము నడిపిందంటూ. అది కాక సక్కు ధోరణి కూడా విపరీతంగా కనిపించింది. పూర్తిగా ఫాషన్ల పుట్టలా మారిపోయింది. ఎవరేం చెప్పినా వినదు. సక్కుకయినా పెండ్లి చేయాలంటే కుల పెద్దలు రావాలి. ఆనాడు పౌరుషంగా మాట్లాడిన కొమురయ్య గేదెనమ్మి జుల్మానా, కల్లు తెచ్చాడు. కాళ్ళు పట్టుకొని క్షమార్పణ అడగాలని కొందరు అడిగినా మరికొందరు పోనిమ్మన్నారు.

"నేను ఆయాలనే చెప్పలే బలవంతులతో మనకేంది అంటే విన్నావా?" మల్లమ్మ అడిగింది.

"లోకంల యింత అన్యాలం వుంటదని అనుకోలేదు. మా బతుకులు కాలబడ...." తుపుక్కున ఉమ్మేశాడు.

"పెద్దదాని పెండ్లి అయితే సక్కును రామీరం లచ్చుమయ్య కొడుక్కు చేసుకుంటడంట."

"మరి యెక్కడ జాతము?"

"ఇప్పుడిచ్చినా చేసుకుంటడంట తన కొడుక్కు....."

"ఎవరు?" రోషంగా అడిగింది మల్లమ్మ.

"అతనే కుల పెద్ద...."

"అయ్యా! ఒక మాటంట వింటావా! నన్నో బాయిల యెయ్యి. అదిష్టం లేకపోతే యెవనికన్న ముసలోనికియ్యి. జంగయ్యను చేసుకోను. అతను గెలిచానని...... అదే కుల పెద్ద నీల్గుతడు."

"బాలమ్మా......"

"అవునయ్యా నీ ఇష్టమొచ్చినోనికి ఇయ్యి" అన్నది ఏడుస్తూ.

"ఊకో బిడ్డ ఊకో....."

"నేను ఏడ్వ అయ్యా.....ఒట్టు....." అన్నది కళ్ళు తుడుచుకుని. పల్లెలో మాట రహస్యంగా వుండదు. ఆనోట ఆనోట ప్రాకి బాబయ్యా వరకు వెళ్ళింది. అతను మీసం మెలివేశాడు. అతను అరుగుమీద కూర్చుని పళ్ళు కొరుకుతుండగానే సీతారామిరెడ్డి గేదెలు మలుపుకుని సాయిలు వెడుతున్నాడు.

"దండమే పెద్దయ్యా....దండం..." సాయిలు వంగి తలవంచాడు.

"దండంరా....." మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

"ఒరేయ్ సాయిలు పెండ్లి జేసుకోవురా!"

"ఊహు.....నాకెవలిత్తరే పిల్లను?" సిగ్గుపడిపోయాడు.

"కులపెద్ద నుండి యెందుకురా? రేపు బొయ్యి మీ మ్యానత్త వున్నది పిల్చుకురా...." అన్నాడు. సాయిలు ఆ విషయము కంచెకు చేరుకునే లోపల మరచిపోయాడు. బాబయ్యా మరచిపోలేదు. సైకిల్ వచ్చిన కుఱ్ఱాడిని పంపి సాయిలు అత్త లస్మక్కను పిలిపించాడు. లస్మక్క విషయము విని పకపక నవ్వింది.

"ఏందే బాబయ్యన్న నీకు పిచ్చేమన్న లేసిందా! ఆన్కి పెండ్లి యెందుకు?"

"బావుందే లస్మక్క! రేపు కాల్జేయి పడిపోతే గతేది? వయసు యెప్పటికుంటాదే! ఇన్ని నీల్లు యిచ్చే దిక్కు వుండకూడదా?"

"అవునే నిజమే అనుకో. ఈనికి పిల్లనిచ్చే వాడెడవంట?"



"అదంతా నాకు వదిలేయి. నేను చెప్పినట్లు విను. జంగమ్మా.... బిడ్డ లస్మక్కకు రొండు సీసల మంచి కల్లు తెప్పిచ్చి, మిఠాయి గారిలోని దుకునముల బుబుడాలు (బజ్జీలు) కొనకరా."

కల్లుమాట విని లస్మక్క పెదవులు తడుముకుంది. ఆమెకు అప్రయత్నంగా కళ్ళమ్మెట నీళ్ళు వచ్చాయి.

"ఏందొనె అన్నా! ఆడదానికి పుట్టినిల్లుండాలె. తోడబుట్టినోల్లుంటే ఆవతి సంపతి ఎరికయితది. గుతికింత కల్లో నీల్లో తెస్తరు. అన్ని పోయిన ఈ అర్దేకులోడు మిగిలిండు" జర్రుగ చీదేసింది.

"ఏందే లస్మక్క మేమంత లేమా? నిన్ను అంత దూరంనించి యెందుకు పిలిపిచ్చిన చెప్పు?"

"అవునన్న..." వారి మాటల్లోనే జంగమ్మ కల్లు తెచ్చింది. కల్లు కడుపులో పడ్డాక ముల్లోకాల ముచ్చట్లు వస్తున్నాయి లస్మక్కకు. ఆ తరువాత బాబయ్యా చెప్పినదంతా చిలుకలా పలుకడం నేర్చుకుంది. మొదట కామందు ఇంటికి బయలుదేరింది. సీతారామిరెడ్డి ఉయ్యాల బల్లమీద పడుకుని వార్తాపత్రిక చదువుతున్నాడు.

"సీతయ్య దొరా..." లస్మక్క అతని కాళ్ళు పట్టుకుని బావురుమంది. అతను అదిరిపడ్డట్టు లేచాడు.

"ఎవరు?"

"నన్ను గుర్తుపట్టలేదా దొరా... రాజమ్మక్క లేదా?"

"యాత్రలకు వెళ్ళింది."

"నేను సాయిలుగాని అత్తను. దొరలతన్ని కొజ్జా ఓల్లల్ల యిడుస్తారు? ఇంత పెండ్లిజేసి నాల్గిత్తులు నెత్తిమీద ఏతమంటనుకోరా?" అన్నది నిలదీసినట్టు. ఆమె పచ్చని శరీరము నిషావల్ల బుగ్గలు టమేటో రంగుకు మారాయి. తాంబూలం నములుతూనే వుంది. చేతులకు లావాంటి వెండి కడియాలు, మెడలో గుండ్ల పేరున్నేయి.

"ఏమిటి?" వంటింట్లో ఉన్న జయలక్ష్మి వచ్చింది.

"అదే సాయిలు లగ్గం..." మరోసారి అతనికి వివాహము యెంత అవసరమో చెప్పింది.

"వాడికి పెండ్లా ? అయినా ఏ తలకు మాసినవాడు పిల్లనిస్తాడు.." సీతయ్య జవాబు చెప్పాడు.

"అవునే అయ్య. ఆని పెండ్లయితే మీరిచ్చే జీతానికి రాత్రింబగల్లు వుండనిస్తాది పెండ్లము."

"ఇప్పుడు మమ్మల్నేం జెయ్యమంటావు!" జయ అసహనంగా అడిగింది.

"పిల్లను మేం చూస్తాం. ఓ నాల్గువందల రూపాయలు అప్పు కావాలె. ఏం బెట్టుకున్నా పుస్తె మట్టెలకే నూరు రూపాయలు కావలె!"

"అట్లాగే యిస్తాను, మొదట అమ్మాయిని చూచుకోండి. అమ్మాయి సాయిల్ను చేసుకోవడానికి అంగీకరిస్తే నేను డబ్బిస్తాను" సీతయ్య చెప్పాడు.

"ఏమిటండీ? ఇప్పుడు నాల్గువందలు యిస్తారా?" కంగారుగా అడిగింది జయ.

"మంచిదయ్యా, నీ ఇల్లు బంగారంగాను అవు... పిల్లలు లేరు కదా! బెజ్జీబాహ్ విక్టోరియా హాస్పత్రిలో చూపిచ్చుకో. మా సుట్టాల పిల్లకు నెల తిరగక ముందే నెల తప్పింది" మరోసారి ఆకు నలిపి దవడకు బిగించింది.

"సరే, సరే వెళ్ళు నీ సలహా కావలసినప్పుడు పిలుస్తాము" జయలక్ష్మి తరిమికొట్టినంత పని చేసింది. లస్మక్క వెళ్ళిపోగానే భర్తవైపు తిరిగింది.

"ఆ వెర్రి వెధవ మీద నాల్గువందలు తగలేస్తారన్న మాట."

"ఆ వెర్రి వెధవకు పిల్లనిచ్చినప్పటి మాట కదా. ఆమెతో మాట్లాడి నెగ్గుకు రాగలమా?" అన్నాడు. భర్త మాట మొదటిసారిగా ఖండించకుండా అంగీకరించింది జయలక్ష్మి. వాడు కనక వెళ్లిపోతానంటే అదే జీతంతో అంత సిన్సియర్‌గా పనిచేసేవారు దొరకరు, దొరికినా జయలక్ష్మి ఆరడి భరించలేదు. అందుకే సాయిలు అంటే అభిమానము. అన్నం పెట్టి కూర లేదు అంటే యెవరింట్లోనయినా అడుక్కు తింటాడు గాని యెదురు చెప్పడు. పని యెక్కువగా వుందని గొణుక్కోడు.



సాయంత్రము భార్యాభర్తల అంచనాలు తారుమారు చేస్తూ లస్మక్క బాబయ్యతో అప్పుకోసము వచ్చింది.

"అమ్మాయిని చూచారా," సీతయ్య అడిగాడు.

"చూడటమే కాదు. లగ్గం పెట్టుకున్నాము."

"ఏ ఊరు?"

"ఈ ఊరే కొమురయ్య పెద్దపోరి."

తన చెవులు తనను మోసం చేస్తున్నాయేమోనన్న భ్రమ కల్గింది. "ఏమిటీ?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవునయ్యా రేపు సుక్కురారం నాడు పూలు పండ్లు పెడ్తరు. చిన్న పోరికి రామారం కెళ్ళి ఇస్తున్నారు."

"బాలామణి సాయిల్ను చేసుకుంటానన్నదా?"

"ఏం! అంతకంటే మంచోడు ఒస్తాడా!" బాబయ్య అన్నాడు. దాని వెనకాల యేదో గూడుపుఠాణి వుందని తెలుసు. అందుకే మాట్లాడక వారం రోజుల్లో డబ్బు యిస్తానన్నాడు. పూలు, పండ్లనాడు ఓ యాభై రూపాయలు ఖివ్వాలని చెప్పి వెళ్ళిపోయారు. సీతారామిరెడ్డి దిమ్ముగా వున్న తలను విదిలించాడు.

"నిజంగా ఆ పిల్ల వీడితో సంసారం చేస్తుందా?" జయ అడిగింది.

"చేస్తుందేమో, వీడి కా నోరు లేదు. అంతా ఆమె ఇష్టమే కదా"

"అయినా వీడికి.. అసలు... పోనివ్వండి" అడగదలచుకున్న ప్రశ్న అడగనే లేదు. చీకటి పడుతుండగా బాలామణి వచ్చింది పాల కోసం. జయ ఆమె ముఖం చూచింది పరీక్షగా. ఏ భావం లేదు. ఎప్పటిలాగే వుంది.

"ఏమిటే నీకు పెళ్ళిట?" చెంబులు అందించింది.

"అవునమ్మ" అన్నది తవుడు తట్టలు గేదెల ముందుకు జరుపుతూ.

"అది కాదే సాయిల్ను యెలా చేసుకుంటున్నావే?"

"మీరు సీతయ్య దొరను చేసుకున్నట్టే" అన్నది కిలకిల నవ్వుతూ.

"ఏడ్చావ్ అసలు సంగతి చెప్పు."

"ఏముందమ్మా? తన కొడుక్కు యియ్యనన్నాడని, కోపం పెట్టుకుని కులం తప్పని నానా తిప్పలు పెట్టిండు. ఇంకోడు రాకుండ చేసిండు. నాకూ రోషమున్నది. నీ కొడుకు తప్ప యెవర్నయిన చేసుకుంటనన్న అందుకే లస్మక్కను పిలిపించి, సాయిలుకు అడిగింద్రు. మా అయ్యకు ఆల్లను బెదిరించే దమ్ముల్లేవు. ఇప్పుడయినా యింకెప్పు డయినా మా గతిగింతే కద. అందుకే చేసుకుంటనన్న" అన్నది నిర్వికారంగా.

"చేసుకుని వాడితో ఏం సుఖపడతావే!"

"ఏం జెయ్యాలె! నా పెండ్లిగాంది నా చెల్లె పెండ్లి కాదు. ఒకరం కష్టపడ్డా, ఇంటిల్లపాదులు సుఖపడితే సాలు" అన్నది. అంతవరకూ ధైర్యంగా వున్న ఆమె ధైర్యం యెక్కడికి పోయిందో, కళ్ళమ్మట నీళ్ళు టప, టప రాలి పడ్డాయి.

"ఊర్కోవే..." జయలక్ష్మి కోపమంతా మరచి జాలి చూపింది. నిజానికి బాలామణికి, సాయిలుకు పోలిక దేనిలోను కుదరదు. ఆమె ఆలోచిస్తుండగానే పాల చెంబు తెచ్చింది బాల. పాలు కొలిచి పోసుకుంది.

'ఒస్తు... నాకు ఫికరు లేదు. నేనేమయినా ఆ బాబయ్య మామ ఆట కట్టింది" అన్నది నవ్వుతూ.

"నీ ముఖం..." జయ అంటుండగానే పాల బిందె భుజం మీద పెట్టుకొని వెళ్ళిపోయింది. పచ్చి సొప్ప మోపు యెత్తుకుని వచ్చాడు సాయిలు. మోపు మొద్దు దగ్గర పడేశాడు.

"అమ్మో! జర గొడ్డలి యియ్యి!"

"నీకు పెండ్లి నిశ్చయమయిందట కదరా".

"అవు.." అన్నాడు నవ్వడానికి ప్రయత్నం చేస్తూ. గారపండ్లు బయటపడ్డాయి. అసహ్యంగా చూచింది వాటివంక.

"అదృష్టమంటే నీదేరా" అన్నది.

"అవు...."

"ఛీ... ఈ ముదనష్టపు వెధవతో ఏం కాపరం చేస్తుందా పిల్లది."



"ఏందమ్మా?"

"నీ తలకాయ" గొడ్డలి తెచ్చి యిచ్చింది.

"ఇగో... అమ్మో! బాయికాడ గుడిశె కావాల్నంట. మాయత్త అడుగుమన్నది" పండ్లు బయటపడేలా నవ్వాడు సాయిలు.

"నువ్వు అలా నవ్వకురా. నాకు మంట" అన్నది విసుగ్గా.

"బాగుందమ్మా. పెండ్లి అయితుంటే ఏడుస్తారు."

"నువ్వెందుకు ఏడుస్తావురా! పచ్చి కొబ్బరి లాంటి అమ్మాయి దొరికితే? నిన్ను కట్టుకున్నందుకు జీవితాంతం అది ఏడుస్తుంది." విసుక్కుందామె.

## 12

సక్కుబాయిని అత్తగారింటికి సాగనంపుతూ భోరున ఏడ్చింది మల్లమ్మ. మెట్లమీద కూర్చున్న బాలకు ప్రపంచపు తీరే అర్థం కాలేదు. పెళ్ళి కాలేదని దుఃఖిస్తారు, పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళే ఆడకూతురిని చూచి దుఃఖిస్తారు. యెందుకో అర్థం కాలేదు.

"ఇగ మేం బోతమే మల్లమ్మ" లస్మక్క అడిగింది.

"ఇయ్యాల నేనా?"

"బాగుందే నీ మాట. ముందు పెండ్లయింది. ముందు పోవాలె. ఇయ్యాల్లటికి ఆరం దినాలు ఇల్లేమయిందో. గుడిశె తయారయిందిట, పోరికి కట్నాలు చేసి పోతాను." అన్నది. ఒక ప్రాంతం వారు 'కార్యం' అంటే మరో ప్రాంతపువారు 'శోభనం' అంటారు. కొన్ని ప్రాంతాలవారు 'కట్నాలు చేస్తాం' అంటారు. బహుశ ఒకప్పుడు ఆ రోజు అత్తగారు భారీగా కట్నకానుకలు యివ్వడం వల్ల ఆ పేరు వచ్చిందేమో.

మల్లమ్మ కూతురికి సారె యిచ్చింది. ఒక వెదురు బుట్ట నిండుగా కజ్జికాయలు, మరొక బుట్ట నిండుగా బియ్యం పిండితో చేసిన సకినేలు (చక్కిలాలు), పసుపు కుంకుం, సున్నిపిండి బొట్టుపెట్టి యిచ్చింది. అవికాక కొన్ని పాత్ర సామానులు, ఓ గొంగళి, దుప్పటి, దిండు యిచ్చింది.

"పోతావు బిడ్డ!" కూతుర్ని కౌగిలించుకుని బావురుమంది.

"ఏందే ఏడుస్తున్నవు పెండ్లి అయింది, పోతున్న" నవ్వింది బాల. ఆమె మనసులో యెలాంటి భావమూ లేదు. లస్మక్క, యాదయ్య వెంట రాగా, సీతయ్య దొర బావి దగ్గర పొలంలో వేసిన గుడిశెలో గృహప్రవేశం చేసింది. సాయిలు పచ్చగడ్డి వరాల దగ్గిర కోసి యజమాని ఇంటికి బయలుదేరాడు.

"ఓరి పిల్లగా! జర జల్ది రారా" లస్మక్క చెప్పింది. ఆమెకు చాల ఉత్సాహంగా వుంది. తన కొడుకుల వివాహము నాడు కూడా కొత్త చీర ఎరగదు. అలాంటిది రెండు చీరలు వచ్చాయి. ఒకటి మల్లమ్మ యిచ్చింది రెండోది మేనత్త హోదాలో సాయిలు పేరు మీదుగా అతని డబ్బులోనుంచి తను కొనుక్కుంది. ఇంత మర్యాద తనకు జరిగాక, యేదో హడావుడి చెయ్యాలి కదా! అందుకే కార్యం చేసే భారం తన మీద వేసుకుంది

బాల ఒక గుంజకు ఆనుకుని కూర్చుంది.

"బాలమ్మ! గుడిసెల పొయ్యి బెడితే పొగ బిడ్డా. వచ్చేది ఎండాకాలమే బయట పెడుదునా?" అన్నది యాదయ్య వెళ్ళిపోయాక.

"నీ ఇష్టం.."

"నా ఇష్టమేందే ఒండుకునేదానవు నువ్వు" నవ్వి, చకచక పుట్టమన్ను త్రవ్వింది. అడి డొక్కి గాలకి చాటు వుంటుందని అడ్డగోడ, పొయ్యి వేసింది పొయ్యి ఆరాలని నిప్పు వేసింది.

"మీయమ్మ సద్ది కట్టిందే. లాంచనానికి యింత ఒండుత" అన్నది పిడికెడు బియ్యం గిన్నెలో పోసి.

"ఊ...." అన్నది బాల.

"ఏందే పిల్ల అందరు పిరంగివంట జెస్తరు. నువ్వు నోరిప్పవు" ఒకసారి తలయెత్తి చూచి, మళ్ళీ దాచుకుంది. పొయ్యి ఆరిన తరువాత బియ్యము పొయ్యి మీద పెట్టి బెల్లంపొడి చేస్తూ కూర్చుంది.

బాలామణికి మనసుంది. మనుష్యులంతా ఒక్కటే, మనసులు ఒక్కటే గాని భాష వేరుగా వుంటుంది. విపరీతంగా తలంచినప్పుడు



మెదడు మొద్దుబారిపోతుంది. బెల్లంతో ఆవిడ పరమాన్నం వండడం గాని, దీపం వెలిగించడం గాని, గుడిశెలో అడ్డగోడకు అవతల కొత్త చాప గొంగళి, యివతల తన కోసం పాత చాప వేసుకోవడం కూడా గమనించలేదు.

"ఎంతసేపు అట్ల కూసుంటావు. బట్టయికె ఇడిసి కొత్తది కట్కో" అన్నది. పెండ్లికి ముందుకొన్న చవకబారు ప్రింటు చీర తీసిస్తూ.

"ఉండనీ..?" అన్నది లేచి ఒళ్ళు విరుచుకుంటూ.

"ఎప్పుడు వస్తడమ్మా ఈ పిల్లగాడు" ఆవులించసాగింది. పల్లె జనం దినమంతా పనిచేసి కాస్త సమయము దొరకగానే నిద్రబోతారు. రెండవ వసతి, చమురు ఖర్చు కలిసి వస్తుంది. బాలామణి కూడా అలసి నిదురపోయింది.

"అత్తా... ఓ లస్మక్కత్తా..." సాయిలు పిలుపుకు ఇద్దరూ లేచారు. అతను గుడిశె అవతల నిల్చున్నాడు.

"ఏందిర గిప్పుడా రావడం?" ఆవులించింది లస్మక్క.

"అవునే. అమ్మ, అయ్య ఒకటే జగడం. అన్నం బెట్టేదాక వుండాలె. అల్ల జగడం ఒడిశేటట్టు లేదని వచ్చాను."

"జగడమెందుకురా?"

"తిన్నది అరగక; మస్తుగ డబ్బుంది. గింజలున్నాయి, సీతయ్యదొర శెల్లెలి పిల్లుందని ఈయమ్మ జగడం పెట్టుకుంది."

"అందరికి యేదో ఓ కష్టమే" లేచి అతనికి అన్నము, బెల్లంతో కాచిన పాయసం పెట్టింది. అక్కడ పరచిన పక్క చూచి ఒకటే సిగ్గుపడి పోయిండు సాయిలు. అతను తిని లేచాక, ఆడవారు ఇద్దరూ లేచారు భోజనాలకు.

"నువ్వుండు బాల, ఊర్లకు పోయి నల్గురు ముత్తయిదులను పిలుచుకొని వస్త" అన్నది.

"ఎందుకు?"

"ఎంత ఎర్రిపిల్లవే.." లస్మక్క నవ్వింది.

"ఎందుకు పెద్దమ్మ, నిద్రపోయి వుంటారే."

"లేపు కొస్త."

"ఎందుకు లొల్లి" అన్నగ్ అయిష్టంగా. లస్మక్కకు వెళ్లాలని కూ
లేదు. కూతుర్ని సాగనంపే కంటే ముందే మల్లమ్మ యిప్పించిన రెండ
సీసాల కల్లు నిషా యింకా వుంది. నిద్రపోదాం అని వుంది.

"సాయిలూ! గోడ సాటుకు పండుకో బిడ్డ" అన్నది. సాయిల
భయంగా చూచి వెళ్ళి అటు తిరిగి పండుకున్నాడు.

"నువ్వు పోయే బాలమ్మ" బాలామణి చేయిపట్టి లాగింది.

"నేను పోతలే పెద్దమ్మ" అన్నది. వెళ్ళి పడక చివర్న కూర్చుం

"మాయదారి కాలం. మానాడు యేడిసి లొల్లపెడ్తుంటి
గొనుక్కుని చాప దొరికిందే చాలు అన్నట్టు నిద్రబోయింది. బాలామ
అలాగే కూర్చుని, అతనిటు తిరుగుతాడేమోనని చాలాసేపు చూ
కూరుకుపోగా అలాగే పడుకుంది. ఆమె నిద్రలో ఊహాలోకాల
విహరించింది. ఆమె కళ్ళ ముందు అందంగా నవ్వుతున్న విల్సన్ రూప
తిరిగింది. ప్రతి పురుషుడు ప్రతి స్త్రీని ఆకర్షించలేడేమో! కొ
ప్రత్యేకమయిన గుణాలు కలిగినప్పుడే, అవి అవతల వారికి నచ్చినప్పు
ఆకర్షితులవుతారేమో! అలాగే బాలామణి విల్సన్‌ను ఆరాధించింది.
తప్పని కాదు కాని, ఆమె జీవిస్తున్న పరిసరాలలో అనుభవమే తెలు
ఆరాధన లాంటి పదాలు తెలియవు.

తెల్లవారుతుండగా మేలుకుంది. అప్పటికే సాయిలు లేచి, పాలు
వెళ్ళిపోయాడు. లస్మక్క తల జాడించుకుంది.

"ఇక నేను పోతానే బాలమ్మ".

"మంచిది" అన్నది.

"మల్ల యెప్పుడన్న వస్త గాని, యెర్రిబాగులోడు యెట్ల యేగుతా
అన్నది. బాల బయటికి వచ్చి చూచింది. తల్లి తనకిచ్చిన వస్తువుల
సగం మూటలు కట్టుకుంది.

"ఏం చూస్తున్నవే. పాలే పంచుకోవాలి.ఈ అడివిల ఏం పంచుల
మా ఊర్ల పోయి మీ పేరు మీద పంచుత" అన్నది.



"అట్లనే" బాలామణి కచ్చిక వెతుక్కుని పళ్ళు తోముకుంది. లస్మక్క రాత్రి మిగిలిపోయిన ఆహార పదార్థాలు తినేసి వెళ్ళిపోయింది. లస్మక్క వెళ్ళాక కాస్త ఊపిరి పీల్చుకుంది. మెల్లమెల్లగా తన సామానులు సర్దుకుంది. అగ్గిపెట్టె దొరకలేదు. సరుకులతో పాటు అదీ పట్టుకు పోయిందేమో లస్మక్క అనుకుంది. సాయిలున్నాడేమోనని బయటికి వచ్చింది. దూరంగా కందిపొరక పడేస్తున్నాడు సాయిలు. మరో జీతగాడు పెంటయ్య మోపులు కట్టి దొడ్డి దగ్గర పెడుతున్నాడు.

"పెంటయ్యన్నా! పుల్లల పెట్టె వున్నదే?"

"ఇంక పుల్లల పెట్టెకాడనే వున్నావమ్మా? మీ సాయిలు పేగులు గుర్రు గుర్రుమంటున్నాయి.

"నీకు వినిపించాయి కదూ!"

ఇద్దరూ ప్రక్కకు చూచారు. సీతారామిరెడ్డి వచ్చి నిలుచున్నాడు.

"ఏదో పరాష్కమాడిన" పెంటడు వెళ్ళిపోయాడు.

"పుల్లల పెట్టె అడిగిన యినపడలేదా?"

"నేనిస్తాను పట్టు..." సీతయ్య అగ్గిపెట్టె యిచ్చాడు. అది తీసుకొని కొద్ది దూరం వెళ్ళింది బాల. మళ్ళీ వెనక్కు వచ్చింది.

"మీరింత చాయన్న తాగింద్రా?"

"అరే.... నేను చాయ త్రాగలేదని నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు అతను.

"మీరు రాత్రి కొట్లాడింద్రని సాయిలు చెప్పిండు."

"ఆరి నీ అప్పుడే యిలాంటి కబుర్లు మోస్తున్నాడా మొగుడు."

"ఏదో చెప్పాడులే.." ఆ పరిహాసము భరించలేనట్టుగా వెళ్ళిపోయాడు.

వారం రోజులు గడిచాయి. బాలామణి మామూలుగా ఊళ్ళోకి వెళ్ళి తల్లికి సహాయం చేస్తున్నది. ఇంట్లో పని చూచుకుంటున్నది. సాయిల్ని చూస్తే చిన్న కుర్రాడు గుర్తుకు వస్తాడు. ఇష్టం లేని పురుషుడితో గడపడము కన్నా నరకం యేముంది! సాయిలు బలహీనత బాలామణి పాలిట వరమే అయింది. ఆ రోజు ఎప్పటిలాగే వచ్చి అన్నం ముందు కూర్చున్నాడు సాయిలు.

"బియ్యం రెండు రోజులకే వున్నయి" అన్నది మంచినీళ్ళు ముం
అతని ముందు పెడుతూ.

"మరెట్ల! నిన్ననే జయమ్మ చెప్పింది మూడేండ్ల జీతం ముట్టిందంట"
అన్నాడు అన్నము చేత్తో ముద్ద చేస్తూ.

"నీలాంటి వాడిని చూస్తే పదేళ్ళ జీతం ముట్టింది అంటరు"
విసుక్కుంది. తనిక రంగంలోకి దిగకపోతే లాభంలేదని గ్రహించింది
అతను పొలంలోకి వెళ్ళిపోయాక మెల్లగా సీతయ్య ఇంటికి బయలుదేరింది
ఆయన ఉయ్యాల బల్లమీద పడుకుని కునుకు తీస్తున్నాడు.

"సీతయ్య దొరా" పిలిచింది బాల.

"ఏందే - నువ్వా? ఏమిటిల్లా వచ్చావ్?"

"ఇంట్ల గ్రాసము నిండుకుంది."

"అలాగా?"

"అవును దొర, పెండ్లికి తెచ్చినయి యింక నాల్గు దినాలు వచ్చేవే
లస్మక్క మూటకట్టుకుపోయింది."

"మరి మమ్మల్నేం చెయ్యమంటావే!" లోపలి నుండి జయలక్ష్
వచ్చింది. ఆమెకు బాలను చూస్తే మంటగా వుంది.

"అట్లంటే యెట్లమ్మా?"

"మరింకెట్లా అనేనే, నీ మొగుడు నాల్గువందల రూపాయలు అప్
తీసుకుని మూడేళ్ళు రాసిచ్చాడు."

"నాల్గు వందలకు మూడేండ్లా! నెలకు పదకొండు రూపాయ
జీతమా! ఈ రూపాయల్ల బియ్యం ఏం కొంటడు? ఉప్పు తొక్కు ఏ
కొంటడు"?

"ఏందేయ్! పెద్ద లాయర్లా, ముది నాపసానిలా అడుగుతున్నావ్
మేమిచ్చేది గంతె. నాల్గువందలకు వడ్డీ కట్టవే. వందకు అయిదు అయి
ఇరవై రూపాయలు వడ్డీ అవుతుంది" జయ జవాబిచ్చింది.

"పెండ్లికి ముందు పన్జేసిండు ఏం మిగల్లేదా!"

"రెండు పూటలా తిండి పెట్టాము. బట్టలిచ్చాము. అదికా



సాయిలు తండ్రి చచ్చిపోతే వంద రూపాయలు ఖర్చు అయింది. ఆ
అప్పు తీర్చుకున్నాడు.

"ఇది అన్యాయము జయమ్మా! నువ్వే జెప్పు పదకొండు రూపాయల్ల
ఏమొస్తయి."

"దానికి నన్నేం చేయమంటావే? నువ్వూ కూలి నాలి చేసుకో"
అన్నది.

"ఏం దొర మాట్లాడవు?"

"ఏం మాట్లాడాలి? ఎవరము చెప్పినా అంతే"

"అయితే నా మాట కూడా వినండ్రి. నెల దినాలకు సాయిలు
పని మాన్తడు. ఇంకేడనన్న చూసుకుంటము. మీ రూపాయలు మీకిస్తము.

"ఏమిటే యిది? వివాహానికి పూర్వమే అన్నాను నువ్వు కాపరం
చేయవని. ఎవడో నీకు నాలుగు వందలిచ్చేది చూస్తాను."

"చూడమ్మా, డబ్బు సలామత్తుంటే నీకు మనిషి వస్తడు. రెక్కలు
సలామత్ వుంటే మాకు కష్టం దొరుకుతుంది" బాలామణి లేచింది.

"ఈ ఇంట్లో మొగదిక్కు లేదన్నట్టుంది నా పని. మాట్లాడరేం?"

"ఏం మాట్లాడాలి నువ్వు జవాబులు చెబుతున్నావుగా."

"దాని పొగరు చూడండి..."

"పొగరేముంది! తనకు జీతం సరిపోదు మరో చోట చూసుకుంటా
నంటుంది."

"అంటుంది అంటుంది. దానికి తెలుసు. ఈ ఇంట్లో నా మాటకు
చిన్న మెత్తు విలువలేదని."

"నీ మాటే సాగుతుందని తెలుసు."

"ఇదిగో జయమ్మ ఆయనేం చేస్తరు. మాకు కడుపు నిండనిది
ఏడ పనిజెయ్యము."

"ఎంత కావాల్నె?"

"నెలకు ముప్పై రూపాయల జీతమియ్యి. సగం అప్పు కింద
కట్టుకో. సగం మాకు గాసానికియ్యి. పంటకు తూమెడు గింజలియ్యి."

"ఓయమ్మో! నీ ఆశ కూలా. ఈ ఊళ్ళో నువ్వు అడిగింది యెవరిస్తారో చూస్తాను. పోవే పో"

"మంచిది" బాలమణి సరాసరి అక్కడ నుండి పుట్టింటికి వెళ్ళింది. మల్లమ్మ తవుడు, పత్తి గింజలు కలిపి సంచులకెత్తుతోంది. కూతుర్ని చూడగానే ఆమె ముఖం వికసించింది.

"రా బిడ్డ....రా బువ్వ తిన్నావే? నా యమ్మ మొగము పీక్కు పోయింది" అన్నది నొచ్చుకుంటూ.

"తిన్నలేవే సంచులు పట్టు నేను పోస్త."

తల్లి సంచులు పట్టింది. కూతురు చేటతో తవుడంత నింపింది. అరగంట నుండి సతమతమవుతున్న పని నిముషాల్లో అయింది.

"బుక్కెడు బువ్వ తిందువు రా బిడ్డ".

"నీ యవ్వ తిన్నానే అంటుంటే"

"తింటే తింటివి బిడ్డ. గడ్డినుగుల కారముంది." తల్లి చే అన్నం కాదు దొరికేది అమృతము.

"బియ్యము, ఉప్పు తొక్కు వున్నాయి బాల?"

"ఆ, ఇంకో రెండు దినాల కొస్తయి. ఇందాక అడిగి వచ్చిన. దోసుకుంటరే! నెలకు పదకొండు రూపాయలు యిస్తదంట. అది అప్పు పట్కుంటదట."

"మరి అప్పిస్తే గంతే కద బిడ్డ."

"నీ యవ్వ ఏం గంతే! పగటి దోపిడి కాదే! గాలి దిని ప జేస్తమా?"

"సీతయ్య దొరవద్ద మానితే యెవరూ పెట్కోరు బిడ్డ."

"పెట్కోకపోతే దినాము కూలి జేస్తమే."

"అప్పెట్ల కడ్తవు బిడ్డ?"

"మెల్లగా తీరుస్తాములే, అన్న యేడీ?"

"ఆనక మంచి సోపతి లేదు బిడ్డ యేమయిన రాములోరి గుడికా సికులు ఆడ్తరంట" అన్నది.



"అట్లనా! ఈ పెద్దమనిషికి ఆటలే తక్కువయినాయి?"

"ఆ చిన్న పోరడు మాటినడు. నా చెయ్యి యిరిగినట్టుంది".

అయితే! సాయిలు సీతయ్య వద్ద మానేస్తాడా?

"సాయిలంత మెతకోడు అల్లకేడ దొరుకుతడు?'' అన్నది నవ్వుతూ.

"నా ముంగల అంటే అన్నవు, సాయిలుతో అనకు బిడ్డ."

"అంటేందే." నవ్వుతూ భోజనము ముగించింది. ఆమె ఊహలు యెక్కడికో పోతున్నాయి.

## 13

"ఇట్ ఈజ్ టూ మచ్ మమ్మీ"

"మనము ఏం చేస్తాముర! వారి ఆచార వ్యవహారాలు అటు వంటివి" అన్నది మార్తమ్మ, బంగాళాదుంపలు తరుగుతూ.

"ఏమి ఆచారాలమ్మా! పాపం చాలా మంచిపిల్ల, తెలివయింది కూడాను. ఆ మట్టి వెధవకిచ్చి చేస్తారా! నో....నో" పచార్లు మొదలు పెట్టాడు విల్సన్.

"ఆ అమ్మాయే ఇష్టపడిందటరా."

"ఆమె పైకి ఏం ఒత్తిడి తెచ్చారో" అన్నాడు జాలిగా.

"పోనీలే మనకెందుకు? ఆ అమ్మాయి చెల్లెలు మిషన్ కాంపౌండులో చదివింది. అక్కడ కూడా అల్లరి పడిందట."

"ఛ.... ఛ.... ఈ చిన్న కులాలన్నీ యిలాంటి వ్యవహారాలలో నలిగిపోతున్నాయి.

"మనకెందుకులే... వెళ్ళి సుగుణమణిని కలువు. పిచ్చి పిల్ల నీ కోసం నాల్గుసార్లు వచ్చి వెళ్ళింది" అన్నది. ఆమెకు మనసులో భయము లేకపోలేదు. పుటుక్కున తన కొడుకు బాలామణిని ప్రేమించానని అంటే ప్రమాదమే. మార్తమ్మకు బాలామణి అంటే పగ, కోపం లేవు. కాని కొడుకు జాలి ప్రేమలోకి మారుతుందేమోనని భయము. అది తను భరించలేదు.

సుగుణమణి మిషన్ కాంపౌండులో పనిచేసే హెడ్‌మాష్టరు ఏసురత్నం కూతురు. అణకువ గల పిల్ల. ఒక్కగానొక్క కొడుకు వున్నందుకు ఆ అమ్మాయి కోడలుగా వస్తే తన జీవితం ఒడుదుడుకులు లేకుండా వెళ్ళిపోతుందని ఆశపడుతుంది. అన్య కులస్తులను, మతస్తులను ఆహ్వానించలేదు.

"ఏమిటి మమ్మీ ఆలోచిస్తున్నావు?"

"ఏం లేదు. నీ తరువాత కార్యక్రమం యేమిటి?"

"ఏముంది. ప్రభుత్వ ఉద్యోగము యిప్పట్లో రాదు, ప్రయివేటుగా ప్రాక్టీసు పెట్టాలనుకుంటున్నాను."

"ఫాదర్‌ను కలువు. అతను మిషన్ తరఫున సహాయము చేస్తాడు."

"సాయమా! మమ్మీ స్వార్థంతో ఒక మతాన్నిగాని, ఒక సంస్థను గాని వుపయోగించుకోవడం జరుగకూడదమ్మా. మిషన్ కాంపౌండుకు రోజు ఒక గంట పని చేయమను, చేస్తాను."

"అలాగే బాబూ! నువ్వీనాడు యింతవాడివి అయ్యావంటే అంతా ఆ తండ్రి కృపే. ప్రాక్టీసు యెక్కడ పెడతావు?"

"ప్రస్తుతము మన వరండాలోనే."

"మంచిది నాయనా, ఓ అయిదారు వేలు పడుతుందా డబ్బు?"

"ప్రస్తుతం అయిదువేలు చాలమ్మా" అన్నాడు.

"అంత డబ్బు నా దగ్గర లేదురా. ఒక్క జయలక్ష్మి గారి దగ్గర దొరుకుతుంది గాని వడ్డీ చాలా తీసుకుంటుంది."

"వడ్డీలు కడుతూ రక్తం చెమటగా మార్చటం నా వల్ల కాదు. రూరల్ డెవలప్‌మెంట్ స్కీమ్ క్రింద యేవో లోన్స్ యిస్తున్నారు డాక్టర్లకు అది ప్రయత్నం చేస్తాను."

"చెయ్యి. చివరకు యెటూ దొరక్కపోతే బంగారం అమ్మేద్దాం."

"మమ్మీ! ఒకసారి బాలామణిని చూడాలి."

ఆమె గుండెల్లో రాయి పడింది. ఏది మరిపించాలని చూస్తుందో అదే కొడుకు గుర్తు చేస్తాడేం.



"వద్దు విల్లీ... ఆమె జీవితము సాఫీగా సాగాలంటే నువ్వు ఆమెను పూర్తిగా మరచిపోవాలి. మళ్ళీ ఓ రగడ, ఈసారి మళ్ళీ సరిదిద్దుకోలేని తప్పయిపోతుంది" అన్నది.

"అలా అయితే ఆ విషయమే మరిచిపోతాను మమ్మీ" అన్నాడు. అతని కళ్ళ ముందు పదే, పదే ఆడంగిలా వున్న సాయిలు రూపమే కనిపిస్తుంది. అసహ్యంతో ఒళ్ళు జలదరించింది. "పాపం బాల యెలా భరిస్తుందో" అనుకున్నాడు.

"వారం రోజులలో ముందు గది తయారుచేసుకున్నాడు. కొయ్య కుర్చీలకు శుభ్రంగా తెల్ల పెయింట్ వేశాడు. తమ ఇంట్లో వంటింటికి, డైనింగ్ హాలుకు మధ్యనున్న పార్టీషన్ తెచ్చి అది హాల్లో పెట్టాడు. వెయ్యి రూపాయలు పెట్టి మందులు తెచ్చుకున్నాడు. అది బాగా నడిస్తే యింకా అభివృద్ధి చేయాలని ఆశ.

ఆ రోజు పట్నం నుంచి చిల్లర సామానులు, ఇంజక్షన్ సూదులు కొనుక్కుని వచ్చాడు. బస్ దిగి ఊళ్ళోకి వస్తుంటే పిడకల గంప యెత్తుకుని వస్తున్న బాలామణి కనిపించింది.

"విల్సన్..." ఆనందంగా పిలిచింది బాల. ఆమె హృదయము స్నేహ పిపాసతో పిడచకట్టుకుపోయింది. చంద్రుణ్ణి చూచిన చకోరంలా వచ్చింది.

"బాలా.." తల్లి చేసిన హెచ్చరిక గుర్తుకు వచ్చింది. అందుకే వెనక్కు తగ్గాడు.

"ఎవరూ ?.... ఓ బాలామణి కదూ ?" అతని ప్రశ్నకు బాలామణి తెల్లబోయింది. అప్పుడే గుర్తించడం లేదు. ఏమిటో గర్వం అనుకుంది.

"అవును బాలామణిని... గొల్లమల్లమ్మ బిడ్డను. మీ అమ్మకు పాలు పోస్తుండే దానిని." అని చకచకా ముందుకు వెళ్ళిపోయింది. ఆమెను చూస్తుంటే కోపంతో బుసలు కొడుతుందేమో నాగుపాము అన్న భ్రమ కలుగుతుంది. నిట్టూర్చి ఇంటికి వచ్చాడు. అతను వచ్చేసరికి ఏసురత్నం, సుగుణమణి కూర్చుని కాఫీ త్రాగుతున్నారు.

"ఏమిటి? అల్లుడు అంతలా చిక్కిపోయాడేం?"

"వాడి వంట వాడే చేసుకున్నాడు అన్నయ్యా?"

"రక్షకా! అలాంటి ఆటలేం సాగవు. నువ్వు చెయ్యలేకపోతే వం
వాడిని పెట్టు, పాపం, ఎంత చిక్కిపోయాడో. మణీ వెళ్ళి యింకో కప్పు
కాఫీ పట్రా."

"ఎందుకులే అన్నయ్యా, ముందు ఎన్నో చేయాలి. నేను తెస్తాను
ఆమె లేచి వెళ్లింది. విల్సన్ గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకున్నాడు
బాత్‌రూములో కాళ్ళు చేతులు, ముఖం కడుక్కునే సరికి తుండు పెట్టుకు
నిల్చుంది సుగుణ. అది అందుకున్నాడు.

"థాంక్స్"

"నో మెన్షన్" అన్నది. వెళ్ళిపోతుందేమోనని చూచాడు. ఆమె
అక్కడే నిల్చుంది. ఏం మాట్లాడాలో తెలియలేదు.

"ఏం చదువుతున్నావు?"

"చదువు ఆపేశాను" అన్నది. అదే నోటితో యెంతవరకు చది
ఆపిందో చెబితే పోలా? తనకు మెట్రిక్ పాసయిందన్న సంగతి తెలుసు
ఒకసారి సెలవులకు వచ్చినప్పుడు మిఠాయి తెచ్చాడు ఏసురత్నం.

"రాత్రికి మా ఇంటికి భోజనానికి రండి" అన్నది మెల్లగా.

"ఏమిటి విశేషం!"

"నా పుట్టినరోజు" అన్నది తల వంచుకుని.

"మెనీ మెనీ హాపీ రిటరన్స్ ఆఫ్ ద డే"

"థాంక్యూ" అన్నది కనుగొసలకుండా అతన్ని చూడాలని ప్రయత్న
చేస్తూ. ఏ భాగము కాభాగము చూస్తే సుగుణ చాలా అందమయిం
పెద్ద పెద్ద సోగకళ్ళు. కొనదేలిన ముక్కు, మంచి రంగు. పొట్టి పొడు
కాని ఎత్తు, లావుగాకాక సమంగా వున్న శరీరము, నిడుపాటి వెంట్రు
లున్నాయి. కాని చూడగానే ఆకర్షణీయమయిన ముఖం అనిపించద
ఎందుచేతనో ఆ ముఖంలో జీవకళ కనిపించదు.

"విల్లీ.... కాఫీ నాయనా" కాఫీ కప్పుతో మార్తమ్మ వచ్చింది.

"మమ్మీ సుగుణ బర్త్‌డే అట కదూ?"



"అవున్రా! నిన్ను పిలవాలని స్వయంగా వచ్చింది."

"ఓ... ఐ సీ..." అతను మెల్లగా కాఫీ సిప్ చేయడం మొదలుపెట్టాడు. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. కాఫీ పూర్తి చేసి కప్పు బల్లమీద పెట్టాడు. ఒక గంట విశ్రాంతి కావాలనిపించింది. వెంటనే పడుకున్నాడు.

రాత్రి తల్లి తన చేతికిచ్చిన గిఫ్ట్ చూచి తెల్లబోయాడు. దాని మీద ముత్యాల వంటి అక్షరాలతో అభినందనలు కూడా రాసి వుంది. "టు మణి విత్ లవ్.. విల్లీ."

"ఇదేమిటి మమ్మీ ?"

"ఫార్మాలిటీలే పద...." అన్నది. ఇద్దరూ మిషన్ కాంపౌండులో అడుగుపెట్టి ఆశ్చర్యపోయారు. ఏసురత్నం నీటుగా ముస్తాబయి అందరికీ స్వాగతం చెబుతున్నాడు. ఆ ఆడంబరమంతా చూస్తే వివాహ మహోత్సవము అన్నట్టుంది. తల్లి కోరిక ప్రకారం తను తీసుకుపోయిన బహుమతి యిచ్చి ఆవిడకు అభినందనలు తెలిపి వెనక్కు వచ్చాడు.

"మైడియర్ బాయ్ విల్సన్... ఇటు రా బాబూ" ఏసురత్నం అతన్ని లాక్కుపోయాడు. అక్కడ హెడ్ ఆఫ్ ది ఇన్‌స్టిట్యూషన్‌గా వున్న సిస్టర్‌ను పరిచయం చేశాడు.

"నా కాబోయే అల్లుడు..."

"ఓ.... చాలా ఆనందము..." ఆమె తెలుగులో మాట్లాడి చేయి కలిపింది. ఆమెను చూచి మిషనరీ స్పిరిట్ అంటే యిదే కాబోలు అనిపించింది. ఆయా ప్రదేశము పరిసరాలను పరిశీలించి, వాటికి అనుగుణంగా నడుచుకుంటారు. అందుకే వారు మిషనరీలు విజయవంతంగా నడుపుతున్నారు.

"విల్సన్.. మైడియర్ సన్, సిస్టర్ యేమో అడుగుతోంది."

"ఆఁ? యేమిటి సిస్టర్."

"ఉద్యోగము చేయుదువా లేక స్వంతముగా పని చేయుదువా?"

"ఇప్పుడిప్పుడే ఉద్యోగము దొరికే అవకాశము లేదు సిస్టర్! స్వంత ప్రాక్టీసు పెట్టుకుందామనే వుంది."

"ఆ దేవుడు నిన్ను కరుణిస్తాడు. బీదల పట్ల సానుభూతి చూపు. ఆర్తులను ఆదుకో" అన్నదామె. అలా అందరికీ పరిచయం చేశాడు ఏసురత్నం. ఎందుకో విల్సన్ మనసు ఎగిరి గంతులేయడం లేదు. స్తబ్దంగా, నిశ్శబ్దంగా వుంది.

"అల్లుడిని చూపడానికే యింత ఘనమయిన విందు చేస్తే పెళ్ళి యెంత బాగా చేస్తాడో?" ఎవరో అన్నారు.

"అప్పిచ్చేవాడుంటే చెయ్యక ఏం చేస్తాడులే. అరువిస్తే చార్మినార్ కొంటాడు మహానుభావుడు" మరొకరు అంటున్నారు.

"అలానా! బాగా డబ్బుందని చెబుతాడు కదా!"

"మాటలకు ఖర్చు వుండదుగా." చికాకుగా తల్లి దగ్గరకు వెళ్ళాడు విల్సన్.

"అమ్మా! ఏసురత్నం మామయ్యకు బాగా డబ్బుందా?"

"ఈ యేర్పాట్లు చూస్తే తెలియడము లేదా?"

"ఏం వస్తుంది? అప్పు చేసి అయినా చెయ్యవచ్చుగా."

"విల్లీ! సిల్లీగా మాట్లాడకు, అతను తెలివయినవాడు. మనసున్న మనిషి."

"తెలివయిన వారికే అప్పు పుడుతుంది. మనసున్న వారే స్వపర భేదం లేకుండా యెవరిదయినా ఖర్చు పెడతారు. నువ్వు తొందరపడి మాటిచ్చావ్."

"అనుకున్నదేగా..." ఆమె వెళ్ళిపోయింది. కొడుకు వాటం చూస్తే ఆ క్షణంలో వద్దన్నా వద్దనగలడు అనిపించింది. ఏసురత్నం వచ్చాడు అక్కడికి. అతని ముఖం చూస్తే అప్పుడే పౌడరు ముఖానికి రుద్దుకున్నట్టు అనిపించింది.

"రా బాబూ..."

"ఎక్కడికి అంకుల్"

"కాస్త రిఫ్రెష్ అవ్వాలి మరి. ముఖం చమట పట్టినట్టుంది."

"ఇప్పుడు ముఖం కడిగి, ముస్తాబయ్యే ఓపిక లేదు అంకుల్, లీవ్ మి" అన్నాడు చికాకుగా.



"ముఖం కడుగవలసిన అవసరం లేదు బాబూ. మెడ చుట్టూ టవల్ వేసుకుని, పౌడర్ వేసుకో."

"బాఘంది. అలంకరణ మోజు మగవారికుండటము చిత్రంగా వుంది." అతను లేచి వెళ్లాడు గాని పౌడర్ అద్దుకోలేదు. అందరికీ దూరంగా నిల్చుని తననే చూస్తున్న సుగుణమణిని చూచి ఆమె దగ్గరగా వెళ్లాడు.

"సుగుణా! నా తల భారంగా వుంది. ఒక కప్పు కాఫీ యిస్తావా?"

"రా..." ఆమెకు అతడిని ఏకాంతంగా తనివితీరా చూడాలని వుంది. అతనికి ఆమెతో మాట్లాడాలని వుంది. ఆమె కూడా తండ్రి కోవకు చెందినదే అయితే తను భరించలేడు.

"కూర్చో నిముషంలో తెస్తాను." ఆమె లోపలికి వెళ్ళింది.

"సుగుణా! వంట మనిషిని పెట్టుకోకూడదూ!"

"నాన్న సంపాదన మాకే బొటాబొటిగా సరిపోదు. వంటవారికి, పనివారికి యేమిస్తాం" అన్నది అతని మనసులోని ఆలోచన గ్రహించినట్టే.

"ఇదేమిటి సుగుణా! ఇంత గ్రాండ్‌గా పార్టీ చేస్తూ..."

"విల్సన్! రేపు తలుచుకుంటే భయంగా వుంటుంది నాకు. డాడీకి ఏం తెలియదు, యెవరు డబ్బిచ్చినా తిరిగి యివ్వాలని ఆలోచించరు." చెబుతూనే కాఫీ తెచ్చింది.

"నువ్వు చెప్పలేదా ఈ ఆడంబరం వద్దని"

"ఈ పార్టీకి అత్తను, నిన్నే పిలవమని చెప్పాను. ఆయన వినరు. సిస్టర్ చాలా మంచిది. ఆమె డాడీని పూర్తిగా నమ్మింది. లెక్కలు చూచుకుంటే యెంత రాద్ధాంతం అవుతుందో" దిగులుగా చూచింది.

"ఆ సంగతి తెలుసుండి కూడా నాకు చెబుతున్నావేం?"

"అవును విల్సన్ నీకు చెప్పాలనే చాలా రోజులుగా అనుకుంటు న్నాను. డాడీ అబద్ధం చెబితే ఫరవాలేదు. జీవితాంతం ఆయన మీతో వుండరు కదా. మిమ్మల్ని అబద్ధాలతో ఆకట్టుకునే మోసగత్తెను కాదు."

ఆ అమాయక హృదయంలోని సంస్కారానికి ముగ్ధుడయ్యాడు.

"నిజం చెప్పాలంటే నాన్నకు కోపం వస్తుంది. నన్నే అమాయకురాలు అనుకుంటాడు" అన్నది, ఆమె ముఖంలో ప్రసన్నత కనిపించింది. బరువేదో దింపుకున్నట్టు తేలికగా నిట్టూర్చటం గమనించాడు.

"సుగుణా! మీ ఆర్థిక పరిస్థితి తెలిసిననాడు మమ్మీ ఈ వివాహానికి అంగీకరించకపోవచ్చు..."

"ఫరవాలేదు. ముందే తెలిస్తే వారి నిర్ణయాలు వారు చేసుకుంటారు. తరువాత మాట పడవలసిన బాధ్యత వుండదు."

"వివాహము జరుగకపోయినా ఫరవాలేదా!"

"అంతే అనుకోవాలి. మోసం చేసి జీవితాంతం బాధపడేకన్న ఒక నిజం చెప్పి నిశ్చింతగా వుండాలనుకుంటాను. నాన్న పైకి చూస్తే టిప్‌టాప్‌గా వుంటారు, గాని యెన్నో రాత్రులు నిద్ర లేకుండా గడపటం నాకు తెలుసు. ఒక అబద్ధాన్ని కప్పి పుచ్చటానికి యెన్నో అబద్ధాలు ఆడతారు. ఆ ఆడంబరం వద్దు" అన్నది దృఢంగా.

"అయితే నేను పొరబడ్డానన్న మాట, నేనంటే నీకు ఇష్టం లేదు" ఈసారి అతని మాటల్లో మార్పు కనిపించింది.

"ఇష్టం. అది డబ్బుతో ముడిపెట్టకు విల్సన్." ఇంకా ఏమో చెప్పాలని వున్నా, ఆమె చెప్పలేకపోతోంది. తనను తాను అదుపులో పెట్టుకుంది.

"సుగుణా! ఐ లైక్ యువర్ సిన్సియారిటీ." నవ్వుతూ ఆమె చేతిని పెదవులకు తాకించుకున్నాడు.

"థాంక్యూ" చేయి లాక్కుంది. అతను మొదటిసారి ఆమెను మనస్ఫూర్తిగా కావాలని కోరుకున్నాడు.

"సుగుణా! నీవు సార్థక నామధేయురాలివి...మీ నాన్న ఆడంబరాలు యెదిరించడం నీకిష్టమే కదూ!"

"ఇష్టమే" అన్నది మెల్లగా.

"ఏమిట్రా అందరూ మీ కోసం చూస్తుంటే మీరు యిక్కడ చేరి గుసగుసలు ప్రారంభించారా! భలేవారే" సుగుణ స్నేహితురాండ్రు వచ్చారు.



కళ్ళతోనే వీడ్కోలు తీసుకుని బయటికి వచ్చాడు విల్సన్. అతని మనసు తేలికగా హాయిగా వుంది.

# 14

మగవాళ్ళంతా స్వార్థపరులే. తనను చూచి కూడా పలుకరించలేదు విల్సన్. ఆ రోజు ఏదో పొరపాటు అనుకుని ఈ రోజు కడుపులో నొప్పిగా వుంటే మందుకని వెళ్ళింది. యెంత ధీమా, యెంత ఠీవి. రోగానికి సంబంధించిన ప్రశ్నలు తప్ప అసలు మాట్లాడలేదు. అతనితో చనువుగా వుంటేనే కదా తనను నానా మాటలన్నది. తనేం కోరింది? అతని పొందు కావాలందా, అతని ప్రేమ కావాలందా? చల్లని మాట, స్నేహపూర్వకమైన పలకరింపు కోరింది.

"బాలా! చా అయినాదే" సాయిలు వచ్చాడు.

"ఏం? మీ దొర పెండ్లానికి చెప్పలేదా? రోజూ చా అంటవు." విసుక్కుంది. సీతారామిరెడ్డికి, భార్యకు యింకా సంధి కుదరలేదు. ఆయన అడిగేదాకా టీ యివ్వను, ఆ బెట్టు యేమిటో చూస్తానని ఆమె. ఆమె యిచ్చే వరకు అడగను, ఆ పంతమేమిటో చూస్తానని అతను బిగదీసుకు పోయారు. జయకు మంచి అవకాశము తన ప్రాముఖ్యత భర్తకు చాటుకోవటానికి. అత్తగారొస్తే వీలు కాదు. అతను కొంత డబ్బిచ్చి సాయిలు ఇంటిలో టీ కాయించుకుంటున్నాడు.

"మనము పుణ్యానికి కాస్తున్నాము."

"పాపానికేలే..." నీళ్ళ కాగు దించి, టీ గిన్నె పెట్టింది. ఇంటి దగ్గర గల్లంతే తప్ప, పొలం దగ్గర జరిగేది జయలక్ష్మి అసలు చూడదు. రోజుకు రెండు రూపాయల పచ్చగడ్డి అమ్ముతుంది. బాలామణి పిడకలు అడపా దడపా అమ్ముతుంది. పొలం పనులుంటాయి. అక్కడ కూలి దొరుకుతుంది. జరుగుబాటు బాగానే అవుతుంది. జయలక్ష్మి పాతిక రూపాయల జీతంలో నెలకు పన్నెండున్నర యిస్తుంది. ఈ నాలుగయిదు నెలల్లో కొంత డబ్బు కూడా వెనక వేసుకుంది. టీ ఒంపి సాయిలు చేతికిచ్చింది. బయట సీతయ్య గొంతు వినిపించింది.

"బాలమణి టీ బాగా కాస్తుందిరా."

"అబ్బో... గడ్డినువ్వుల తొక్కు బాగ నూర్తది దొర" సాయిలు మురిసిపోయాడు.

"అయితే భోజనము కూడా యిక్కడే చేస్తాను".

"బాలమణేక్క! అమ్మ రమ్మంటుందే" నర్సింహ పరుగెత్తు వచ్చాడు.

"ఎందుకు రమ్మన్నదిరా?"

"సక్కు, మొగుడు వచ్చింద్రు" వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు వంట చేసి సాయిలుకు పెట్టింది. అతను వెళ్ళిపోగానే గుడిసెకు తా పెట్టి బయలుదేరింది. చెల్లెల్లిని చూచి గుర్తుపట్టలేకపోయింది. మి కాంపౌండులోనే నాజూకుగా తయారయిన సక్కు సిటీ వాతావరణము మరింత నాజూకుగా తయారయింది. ఒక వేష భాషలోనే కాదు. భోజన దగ్గర, మర్యాదల దగ్గర తల్లి అదిరిపోయి, పెద్ద కూతురికి కబురు చేసింది బాలామణి రాక గమనించనే లేదు సక్కు.

"ఏమిటమ్మా ఈ గుమ్ములు, ఈ తవుడు సంచులు? వె ఇంట్లో వేసుకోరాదూ" విసుక్కుంది.

"ఏందోనే. ఈడయితే దగ్గర వుంటుందని."

"పొయ్యి కూడా వాకిట్లో పెట్టు పీడా పోతుంది. హాయిగా పొ తీస్తూ, వంట చేసుకోవచ్చు."

"ఏదో పోనీవే మాది ఎడ్డికాలము. అల్లుని ముంగల మాటలనకు తల్లి బ్రతిమాలుతుంది.

"ఏమిటే సక్కూ" మందలించినట్టు పిలిచింది బాల.

"అక్కా..." సక్కూ అక్కను కౌగలించుకున్నంత పనిచేసింది.

"ఏమిటే మా మరిది ఈ ఇంట్ల వుండనంటున్నాడా?"

"నేనేం అనలేదు వదినా, మీ చెల్లెలే అంటుంది" అంతవర కుర్చీలో మౌనంగా కూర్చున్న సక్కు భర్త కేశవులు అన్నాడు. పెద్దకూతు చూచి తేలికగా నిట్టూర్చి, పనిలో జొరబడింది తల్లి.



"ఏందే సక్కు..." అయిదు నిమిషాలలో ముగ్గురూ ఒకటిగా కలిసి పోయి కబుర్లు చెప్పుకున్నారు. సక్కు భర్త చేసే అల్లరి ముద్దు ముద్దుగా విసుక్కుంటూ చెబుతుంటే బాల గుండెలు బరువు యెక్కాయి. అతని గురించి చెప్పినప్పుడు అతను ఉడుక్కున్నట్టు నటిస్తూ, సక్కును ఓ దెబ్బ వేయటము, సక్కు పుట్టింట్లో వుండిపోతానని బెదిరించడం చూస్తుంటే, ఓ సినిమా రీలుగా మధురంగా, ముచ్చటగా అనిపించింది.

"రెండు రోజులు వుంటావా?"

"లేదే... నేను యెక్కడ వుండిపోతానో అని తోక పట్టుకుని వచ్చాడు చూడు" భర్తను వేలితో పొడిచింది. బాల హృదయము తీయని బాధతో మూల్గింది. అభిమానముతో తను ఆశలను ఆహుతి చేసుకుంది. సాయిలు.... ఆమె మనసంతా అల్లకల్లోలమయింది. చెల్లెలిని నాలుగు గంటలకు బస్సు యెక్కించి పొలము వైపు బయలుదేరింది. సక్కు తన బ్యాగులో నుండి తీసి అక్కకు సెంటు పూసింది. ఆ సెంటు తాలూకు సువాసనలు బాలను ఉక్కిరిబిక్కిరి చేయసాగాయి. బలమైన కౌగిలిలో బంధింపబడాలని.. ఇంకా యేవేవో ఊహలతో వచ్చింది. సాయిలు గడ్డిమోపు, పాడిగేదెలని తోలుకుని ఊళ్లోకి వెడుతున్నాడు. అతను వున్నా, చెట్టూ, గుట్ట యెంతో అతను అంతే. బాలకు ఆపుకోలేని దుఃఖము వచ్చింది. గుడిసె ముందు వేసిన చిన్న పీట మీద పడుకుని భోరుమని ఏడ్చింది. ఆమెను ఓదారుస్తున్నట్టు గుడిశె ప్రక్కన నాటిన సన్నజాజులు విచ్చుకుంటూ పరిమళాన్ని అందించాయి. ఆమె దుఃఖం మరింత ఉధృతంగా మారింది. కోపంగా జాజికొమ్మలు విరిచి దూరంగా కొట్టింది.

"ఇది అన్యాయమే బాలా..."

అదిరిపడి చూచింది. ఎద మీద పడిన జాజికొమ్మలను అపురూపంగా పట్టుకుని, చిరునవ్వుతో నిల్చున్నాడు సీతయ్య.

"నువ్వా .... అయ్యా.. నేను చూడలేదు" అన్నది భయంగా.

అనుభవజ్ఞుడయిన సీతయ్య బాల పరిస్థితి అర్థం చేసుకున్నాడు.

"ఇప్పుడేమయింది?" చనువుగా వచ్చి పీట మీద కూర్చున్నాడు.

కట్ బనియన్‌లో నుండి స్పష్టంగా కనిపిస్తున్న అతని శరీరం వంక మత్తుగా చూచింది బాల. అతను యజమాని అన్న సంగతి మరిచిపోయింది. అతను యేన్నో చెప్పాలని వున్నా ఆమె ఒంటి నుండి వచ్చే సువాసన మత్తులో అన్ని మరిచిపోయి చేతులు చాపాడు సీతయ్య..... సీతారామిరెడ్డి ఆ క్షణములో యేమీ గుర్తు లేదు. బాలకు మధురమైన ఊహలు, పురుష స్పర్శ అనుభవించాలన్న తహతహ తప్ప యేమీ గుర్తు లేదు. అతని చేతులలో ఒరిగిపోయింది. అతని హృదయానికి హత్తుకుపోయాక యెంతో హాయిగా అనిపించింది. అతని చేతులు ఆమె శరీరాన్ని వీణను చేసి మీటుతున్నాయి.

"బాలా..." ఆమె అధరాలు అందుకున్నాడు.

"ఊఁ..." అన్నది కళ్ళు మూసుకుని.

"మాట్లాడవూ?"

"ఇట్లనే చచ్చిపోవాలని వుంది..." అస్పష్టంగా గొణిగింది.

"లేదు బాలా! నా కోసం బ్రతకాలి. మన ఇంట్లో కరువయిన సుఖాలు ఏకమయి పంచుకోవాలి" అన్నాడు ఆమెను మరింత దగ్గరకు హత్తుకుంటూ. బాలామణికి కాంక్ష కంటే అతని కౌగిట్లో నిశ్చింత కల్గింది. తన యవ్వనము అడవి కాచిన వెన్నెల అనుకుంది. కాని దానికో అర్థం చెబుతున్నాడు దొర. ప్రకృతి వారికి చీకటి దుప్పటి కప్పింది. మిలమిలలా బాల కండ్లు సుతారంగా ముందుకు వంగి ముద్దుపెట్టుకున్నాడు.

"వెళ్ళనా?"

"ఉహూ..." తన చేతిని అతని చుట్టూ వేసింది.

"జయలక్ష్మి గోలపెడుతుంది" అన్నాడు ఆమె ముంగురులు సవరిస్తూ.

"అబ్బో! చాలా భయము" కిల కిల నవ్వింది.

"భయమని కాదు. అమ్మలేదు కదా దొంగల భయము."

"ఏందో... నిన్ను ఒదలాలని లేదు" అన్నది మెల్లగా లేచి అతని హృదయము మీద తలపెట్టి.



"బాలా..."

"ఊఁ..."

"నువ్వు నా కోసమే వుండాలి."

"అంటే..." తలలేపి చూచింది.

"ఆ విల్సన్... గిల్సన్..."

"అందరి మాటలు నువ్వు యింటావా?" మధ్యలోనే త్రుంచింది.

"ఏమో..."

"థూ. మొగోల్లంతా యింతే" రోషంగా లేచింది.

"బాలా..." ఆమెను లేవకుండా ఆపాడు. "పరిహాసము చేశానే"... అని బ్రతిమాలుకున్నాడు.

"మల్ల యెప్పుడొస్తావ్!"

"తెల్లవారు జామున కొట్టం దగ్గరకు రా."

"ఉహూ....నువ్వే గుడిశెకు రా" అన్నది. దూరంగా పాట వినిపించింది.

"మందదారి సూరుడేమో మల్లన్నారో..."

"మీ సాయిలు వస్తున్నాడు"

"కాదు మీ సాయిలే" అన్నది అతని హృది మీద వేలితో పొడుస్తూ.

"పోనీ, ఈ తగవెందుకు! మన సాయిలు సరేనా!" అతను లేచి త్వరత్వరగా అడ్డదారి గుండా వెళ్ళిపోయాడు. బాల చిన్నగా నవ్వుకుంది.

"తిన్నావే-" సాయిలు వచ్చాడు.

"నా తిండి మీదికి పోయింది ఏం కత!"

"మా జయమ్మ గిన్నెడు ఆలుగడ్డ కూర యిచ్చిందే"

"ఏందేంది? మీ అమ్మ ఆలుగడ్డ కూరిచ్చిందా?'

"అవునే. దీపం ముట్టియ్యి చూద్దువు"

"ఆండ్ల యేమయిన పడిందేమో అందుకనిచ్చింది" లేచి దీపం వెలిగించిందామె.

"ఒట్టి అనుమానం మనిషివి."

"నువ్వు ఒట్టి తెలివిలేనివాడివి." ఆ కూర తీసుకు వెళ్ళి చెత్తబుట్టలో దిమ్మరించింది.

"ఏందే... నీ శామ పాడు గాను."

"రోగమొచ్చి సచ్చినా దిక్కు లేదు. జయమ్మ అంత నూనె బోసిన కూర మనకేస్తదా!"

"అవునే....యాదికి ఒచ్చింది యిప్పుడే వండింది, మల్ల గుడ్లు ఒండుతుంది."

"మరి...." అన్నది అతనికి అన్నం పెడుతూ.

"నువ్వు తినవేందే"

"ఆకలి లేదు."

"ఏం తిన్నావో?" ఏమని చెబుతుంది! మౌనంగావుంది.అతను భోజనము పూర్తి చేశాడు. రోజులా గోడ యివతల పడక పరచుకున్నాడు.

"వెళ్ళి కొట్టంలో పడుకోరాదు" అన్నది.

"నీకు ఒక్కదానికి భయము కాదే!"

"మాలావ్ మొగాడు... నాకు కాపలా కాస్తాడట" అన్నది గేళిగా. అతను ప్రక్క చుట్టుకుని వెళ్ళిపోయాడు. ఆమెకు ఆ క్షణంలో తాను ఒంటరిగా వుందని చుట్టు ప్రక్కలలో యెవరూ లేరని తెలియదు. ఒకటే ఊహ, తీయని ఊహ. అనుభవము కోసము తహతహ... ఆమె ఊహలకు ఊపిరి పోసే వయసు, వయసును జయించాలని ప్రయత్నించే మనసు. ఆమె ఉక్కిరి బిక్కిరి అవుతోంది. చాప పరిచింది. గరుకుగా వుందని గొంగళి వేసింది. గొంగళి కూడా చీకటిలా నల్లగా కనిపించింది. తన ట్రంకు పెట్టె తీసి సగం పాత తెల్ల చీర తీసి రెండుగా చింపింది. మధ్యగా ప్రోగు పెట్టింది. అది గొంగళి మీద పరిచింది. దిండు సర్దింది. మళ్ళీ బయటికి వచ్చి చుక్కలు చూచింది. ఇంకా రాత్రి ముదరలేదని తెలిసింది. మళ్ళీ వచ్చి ప్రక్క మీద కూర్చుంది. ఆమెకు ఆ క్షణములో పాపము, పుణ్యము, పెద్దలు చెప్పే నీతులు, సాంఘిక కట్టుబాట్లు గుర్తు లేవు. ఒక్కటే గుర్తుంది. అందమైన అనుభూతి, అమరమయిన సుఖం-అంతే. తలతిప్పి మరోసారి జడ అల్లుకుంది. పౌడరు రాసుకుంది. కందిపోయిన బుగ్గలు మసక మసకగా కనిపించాయి అద్దంలో. సిగ్గుతో



రెండు చేతుల్లో ముఖం దాచుకుంది. అద్దం ప్రక్కన పెట్టి మరోసారి బయటికి వచ్చి చూచింది. చుక్కల వంక చూచి నిట్టూర్చి లోపలికి వచ్చింది. వెళ్ళి పిలుచుకు వస్తే! అమ్మో! జయలక్ష్మి చూస్తే. రోజా చూచే సీతయ్య దొరే ఆమె కంటికి క్రొత్తగా మరో మనిషిగా కనిపించాడు ఆనాడు.

"అమ్మో, యెంత యెర్రిడోలున్నట్టు వుంటాడు" అనుకుంది. దూరాన పొలాల దగ్గర ఇంజను శబ్దం వచ్చింది. బాల ప్రాణం లేచి వచ్చింది. తడిక తీసుకుని బయటికి వచ్చింది. దూరాన మనిషి వచ్చే జాడలు కనిపించలేదు. "ఛీ... అతని పెండ్లము రానిస్తుందో లేదో?" రకరకాల ఆలోచనలతో సతమతమవ్వసాగింది. వాకిట్లో అలాగే నిల్చుంది. ఆమె నడుము చుట్టూ చేయి పడగానే "అమ్మో" అన్నది.

"భయపడ్డావా?" సీతయ్య ఊపిరి వెచ్చగా తగిలింది.

"నువ్వా?" అతన్ని అల్లుకుపోయింది.

"ఒంటరిగా యిలా నిలబడ్డావేం?"

"నీ కోసం...." అన్నది గుసగుసగా.

"పిచ్చి పిల్ల..." అతను ఒక చేత్తో ఆమెను లోపలికి నడిపించి, రెండో చేత్తో గడియ వేశాడు.

## 15

ఉయ్యాల బల్ల మీద సీతారామిరెడ్డి భార్య చెప్పింది శ్రద్ధగా విన్నాడు.

"మాట్లాడరేం?"

"నువ్వు చెప్పింది వింటున్నాను."

"వింటే లాభం యేమిటి?"

"మరి ఏం చేయాలో చెప్పు?"

"ఆ బాలామణిని పిలిపించి అడుగు" అన్నది తీవ్రంగా.

"సాయిలుకు చెప్పావుగా. వస్తుందేమో అడుగుతాను" అతను లేచి కూర్చున్నాడు.

"పేకాటకేనా?"

"పొలం వెళ్ళి పనులు చూచుకోవద్దంటావు, జీతగాళ్ళు తిన్నా రంటావు. ఎలాగే నీతో చచ్చేది?" ఆయన విసుక్కున్నాడు.

"మీరు నిక్కచ్చిగా మాట్లాడరు. అది రానియ్యి, నా ముందే అడగండి" అన్నది.

"అది రానీ..." అతని మాట పూర్తి కాకముందే బాలామణి వచ్చింది. బాలామణిని చూసి క్షణం నోటమాట రానట్టు నిల్చుండి పోయిందామె. మామిడి పిందెలంచు గుంటూరు చీర కట్టుకుంది. తీరుగా దువ్వుకు జడ అల్లుకుంది. తలలో చేమంతులమాల పెట్టుకుంది. కాళ్ళకు వెండి పట్టా గొలుసులు, చెవులకు హంసాకారపు దిద్దులున్నాయి. ఒక బంగారు గుండు, ఒక నల్లపూస కలిసి కట్టిన హారముంది మెడలో. గొప్పింటి అమ్మాయిలా వుంది.

"అదుష్టమంటే సాయిలు గాడిదే జయమ్మా! యెవడిని మరిగి పెండ్లము కమ్మగా ఒండిపెడితే తింటున్నాడు" అని పెంటడు చెబి తన పొలాలు పాడుచేసి కూరలు దోచి తింటున్నారనుకుంది. కాని నిజం బాలామణి వాలకం చూస్తే పెంటడు అన్నది నిజమనిపిస్తుంది.

"ఏందమ్మ పిలిచిన వంట?"

"ఏం నంగనాచివే. మా పొలం దగ్గర పడివుంటారని గుడి యేసుకోనిస్తే మాకే యెసరు పెడతారే. పిడకలమ్మావు, కట్టెలమ్మావు, గ గాదం యేదమ్మినా పోనీ అని ఊరుకున్నాను. ఇప్పుడు కూరగాయ అమ్ముకుంటావా?" అంతవరకు 'తను నోరు మెదపరాదు, భర్తే అడగాలి' భర్తను పోరిన విషయము, తీసుకున్న నిర్ణయము మరచిపోయింది. నోటి వచ్చిన తిట్లన్నీ తిట్టింది.

"మాటలు సరిగ్గా రానియ్యమ్మో ఎవరి కష్టమో దోచినట్టంటావే

"చూచారా చూచారా దాని పొగరు?" ఇద్దరి గొంతులూ తారాస్థా నందుకున్నాయి. అప్పుడు రాజమ్మ బయటికి వచ్చింది. ఆమెకు కోడలి యెవరయినా పోట్లాడితే సంతోషంగా వుంటుంది.

"మా కష్టం మేం తింటున్నాము. పొగరుండదా ఏం?" నిర్లక్ష్యం



వుంది ధోరణి. తనను బాల లక్ష్య పెడుతుందని భావించకపోయినా యింత నిర్లక్ష్యంగా వుంటుందని మాత్రం ఊహించలేదు. సీతయ్య "ఏమిటే బాలా! అమ్మగారంటే భయభక్తులు అసలు లేవు. ఇట్లాగే మాట్లాడితే వేరే చోట పని చూచుకో" అరుస్తూనే కన్ను గీటాడు.

"మీరట్లంటే యెట్ల దొరా! ఇక మీదట కూరగాయలు అమ్ముకోను. మరీ పదిహేను రూపాయలు పెడ్తె యేమొస్తాయి."

"జీతం యెక్కువ చేస్తాను వెళ్ళు, వెళ్ళి పెసరకాయ ఏరుతుండు. నేను అరగంటలో వస్తాను."

"మంచిది" ఓ చిరునవ్వు జయ చూడకుండా విసిరి వెళ్ళిపోయింది.

"పిలిచి కేకలేస్తారంటే జీతం పెంచుతాననంటారేం?"

"ఇదిగో జయా! ఈ కాలంలో పదిహేను రూపాయలు యెందుకు పనికి వస్తాయి చెప్పు? మనమే వాళ్ళను దొంగలుగా చేస్తున్నాము" అన్నాడు.

"మొగాడి భయము యెంతగా వుంటుందో చూచారా! నా మీదికి ఒంటి కాలి మీద లేచిన మనిషి మిమ్మల్ని చూడగానే నోరు మూసుకుంది."

"అందుకే ఈ విషయాలు నాకు వదిలేయి" అన్నాడు గర్వంగా. ఎప్పుడెప్పుడు బాలామణి దగ్గర వాలుదామా అని వుంది అతనికీ.

"కూరగాయల పట్టీ చూచారా చాలా తక్కువ వచ్చింది".

"వర్షాలకు చెట్లు పాడయిపోయాయి, కాసిని కాఫీ నీళ్లు పోస్తే."...

"పోస్తే బయటికి వెడతారు... పాలు లేవు. అయినా ఇంట్లో పెడితే అందరూ కావాలంటారు."

"అందరెవరే! వున్నది ఒక్కదాన్నే కదా" రాజమ్మ రంగంలోకి వచ్చింది.

"ఒక్కరికయినా, ఇద్దరికయినా ఖర్చుండదేమిటి?"

"నేనేం తేరగా మీ ఇంట్లో పడి తినటం లేదమ్మో. ఆ మాటకు వస్తే 'అంతా మా దొర సంపాదించిన భూములే"

"ఏమిటే అమ్మా యెవరు కాదన్నారు! ఇదిగో జయా! మూడు

గేదెలు పాలిచ్చినప్పుడు పాలు లేవనటం అన్యాయము. రేపటి నుం పాలుండి తీరాలి. ఒక గేదెను మన కోసమే ప్రత్యేకించు" అత ఆజ్ఞాపిస్తున్నట్టు అన్నాడు.

జయ ఉలిక్కిపడి అతని వంక చూచింది. మునుపటిలా ఏ అన్న ప్రతి మాటగా ఆమోదించడం లేదు. కారణం, ఆమె యే అడుగుదాం అనుకునే లోపలే అతను బయటికి వెళ్ళిపోయాడు. పిలుస్తు గుమ్మము వరకు వచ్చింది.

అతనికి ఆమె పిలుపు కంటే అజ్ఞాతంగా పిలిచిన బాల పిలు వినిపించింది. త్వరగా కరణం గారింటికి వచ్చాడు.

"గోవిందరావు లేడా?"

"లేడు నాయనా! నువ్వు వస్తే ఈ సంచి యివ్వమన్నాడు" చేతి సంచి తీసి అతనికిచ్చింది.

"ఈ మధ్య రావటం లేదు నాయనా?"

"వ్యవసాయం చేసుకునే వారికి అంత తీరిక యెక్కడిది. వస్తా చెప్పమ్మా." అతను సంచి తీసుకుని పొలం దిక్కు వెళ్ళాడు. సాయి పడమటి పొలంలో పెసరకాయలు ఏరుతున్నాడు.

"కూలీలు దొరకలేదుట్రా"

"లేదయ్యా రేపు వస్తరు."

"మీ దొరసాని యేది?"

"అది నెత్తి నెప్పి అని గుడిసెలో పడుకుందయ్య."

"నీ గారాబం మరీ యెక్కువయిందిరా" ముసి ముసిగా నవ్వాడు

"ఈ పెసర ఏరగానే సాంబొడ్లు నాటేస్తము. ఓ బేడ యెక్కు యివ్వనిదే యెవరూ రారయ్యా."

"అట్లనే ఇద్దాములేరా." అతను అక్కడినుంచి గుడిసెకు వచ్చాడు బజ్జీలు వేసి కాఫీ పెట్టి ఎదురు చూస్తున్నది.

"ఇంతాలస్యమా!" బుంగమూతి పెట్టింది.

"నేను వస్తూనే వున్నాను. ఏదీ కళ్ళు మూసుకో."



"ఎందుకబ్బా?" కళ్ళు మూసుకుంది. ఆమె చేతిలో బరువయిన పదార్థంతో పాటు బుగ్గ మీద వెచ్చని ముద్ర పడింది.

"ఏమిటిది వేళా పాళా లేదా ఏం?" చిరుకోపంగా చూసింది. చేతిలోని సంచిలో వున్న వస్తువులను బయటికి లాగింది.

"అబ్బ .... సిల్కు చీర... ఎంత మెత్తగుంది. గాజులు.... రిబ్బన్లు.... పౌడరు... స్నో... పిన్నులు... అన్నీ నాకేనా?"

"ఊహు... జయకు..." అన్నాడు నవ్వుతూ.

"పొండి." అన్నది మురిపెంగా.

"బజ్జీలు తిని పోతాను సరా?" అన్నాడు పీట మీద కూర్చుంటూ. ఆ చిన్న ఇల్లు పీటలాంటి మంచం ఇంట్లో వేశాక ఇల్లు యిరుకుగా అనిపించసాగింది. అతనికి ఫలహారం తెచ్చి పెట్టింది.

"ఈ ఇల్లు చిన్నదయిందే బాలా. ఇల్లు కట్టుకుందాం."

"నన్నిట్లా బ్రతకనియ్యి. ఈడికే ఊరందరి కండ్లు నామీదున్నాయి" అన్నది.

"ఎవరి కండ్లే కాస్త చెప్పు పీకేస్తాను."

"అట్లయితే మొదలు మీ జయమ్మవే" కిలకిల నవ్వింది.

"ఇంక నయము. నేను యెవరో మొగవారి వనుకున్నాను" ఆమె నవ్వుతో జత కలిపి, అతనికి పాలమారింది. అతని తలమీద రాసింది బాల.

"బాలా! ఒకమాట చెప్పేదా!"

"చెప్పు" అన్నది అతను ఖాళీ చేసిన ఫలహారము ప్లేటు, గ్లాసు ప్రక్కన పెడుతూ.

"నీతో పంచుకున్న ఈ మధురక్షణాలే నా జీవితంలో మరపు రానివి" అన్నాడు ఆమె వడిలో తల పెట్టుకుంటూ.

"ఇంత గొప్ప మాట చెప్పటానికేనా నన్ను ముందడిగారు?" అన్నది.

"అబ్బ నీ తెలివితేటలు అమోఘం బాలా. మేము మాట్లాడినట్టు మాట్లాడుతున్నావు" సంతోషంగా ఆమెను ముద్దులతో ముంచివేశాడు. అతని జుట్టు నిమురుతూ కూర్చుంది.

"బాలా, సంతోషమంటే యేమిటో చవి చూపావు. ఆనందానికి అంతు చూపావు. నాకే గనక శక్తి వుంటే ఈ ప్రపంచాన్నే జయించి తెచ్చి నీ ముందు వుంచాలని వుంది."

"అమ్మమ్మ.... అంతపాటి ఆశ నాకు లేదు. నన్ను యిట్లనే చూస్తే చాలు" అన్నది తన్మయత్వంగా అతని తల హృదయానికి హత్తుకొని. ఇద్దరూ ఈ లోకాన్నే మరచిపోయారు. అతను వెడతానని లేచాడు. ఆమె కళ్ళతోనే అర్థించింది.

"రోజా రాత్రిళ్ళు బయటికి వస్తే అనుమానిస్తుంది బాలా."

"నాకేమో నీ దగ్గరే వుండాలని వుంటది. పోనీ ఆమె అంటే నీకిష్టం లేదు. సాయిలు సంగతి తెలిసిందే కదా. మనిద్దరం పెండ్లి చేసుకుందం."

"ఇది పెండ్లి అయినట్టు కాదా?" నవ్వుతూ ఆమె బుగ్గ మీద మీటాడు.

"పెండ్లి అయినట్టే...." వెక్కిరించింది. "సీతయ్య దొరా! నీ అంత చదువుకోకపోయినా పెండ్లానికి, వుంచుకున్న దానికి తేడా తెలియని వెర్రిదాని కాను."

"నేను యిందాకే తెలివయిన దానవు అన్నాను గుర్తుందా ? ఇంకా మన సాంప్రదాయాలు మనము వివాహము చేసుకుంటే హర్షించే స్థితికి రాలేదు బాలా"

"అవునూ.... అందరట్లంటే యెట్ల. యెవరో ఒకల్లు ముందుకు వచ్చి చెయ్యాలె. అందరు చేస్తరు" అన్నది.

"నీకేం తక్కువ చెప్పు. నీకేం కావాలన్నా యిస్తాను."

"నాకేం వద్దుగాని నీళ్ళ కాఫీ యివ్వలేక చస్తున్నాను. ఒక బర్రెను కొను" అన్నది.

"డబ్బు నేనిస్తా మీ అయ్యను తెమ్మను."

"అట్లనే" అన్నది. అతన్ని సాగనంపుతూ బయటికి వచ్చింది. మల్లమ్మ వచ్చింది. సీతయ్య త్వరత్వరగా వెళ్ళిపోయాడు.

"సీతయ్య దొరకు ఈడేం పనే?" మల్లమ్మ కూతుర్ని, వెడుతున్న అతన్ని మార్చి మార్చి చూచింది.



"చెప్పాను కదమ్మా ఆయన పెండ్లము కాఫీ టిఫిన్లు పెట్టదు. ఈడ తాగుతాడని చెప్పిన గద."

"బాగుంది. మంచిగ చెప్పి చేపిచ్చుకోవాలె."

"అవన్నీ మనము చెప్పితే వింటారా? నౌకర్లము, చెప్పిన పని చెయ్యాలమ్మా" అన్నది కాస్త విసుగ్గా.

"సక్కు నీల్లు పోసుకుందట. పువ్వెన (సూడిదలు) తీసుకపోదాం. రేపు పొద్దున తయారుండు. నీకు తీరితే రాత్రికి రా ఒంటలు చేద్దాము" అన్నది.

"అట్లనే వస్త" తల్లిని ఇంట్లోకి రమ్మనలేకపోయింది. అనుభవజ్ఞురాలైన స్త్రీ పడకను చూచి ఏం జరిగిందో ఊహించుకోగలదు.

"చెప్పు పీట తీసుకురా" అన్నది.

అట్లనే అన్నది. తల్లి త్వరగా వెళ్ళిపోతే బావుండునని వున్నదామెకు. మల్లమ్మ కూతురు అభిప్రాయం గ్రహించిందో లేదో గాని ఇంటికి వెళ్ళగానే ఎదురయ్యే పనిని తలుచుకుని త్వరగా వెళ్ళిపోయింది. "హమ్మయ్య" అనుకుంది. అతను తెచ్చిన వస్తువులన్నీ ఇంటినిండా పరిచే వున్నాయి. మొదటిసారిగా ఆమెకు తన భయానికి ఏవగింపు కల్గింది. ఎన్నాళ్ళని ఈ రహస్యం దాచగలదు? సక్కుకు వున్న అదృష్టం తనకు లేదు. పోనీ జంగయ్యను చేసుకుంటే ఈ పీడా వుండేది కాదేమోనని కూడా అనిపించింది.

"నీతో పంచుకున్న ఈ మధురక్షణాలే జీవితంలో మరుపురానివి" అన్న మాటలు ఆమె చెవుల్లో సంగీతం పాడాయి. తనను ఆరాధించే పురుషుడున్నాడు. చాలు, రోజా తన్నులు తింటూ దెబ్బలాడుతూ వుండే సంసారాలు తను ఎరుగును. అలాంటి సంసారం లేకుంటేనేం?

"ఓ బాలామణీ, ఈ పెసరకాయ ఏర్సుదువు రావే. ఓ గంట ఏరినా కూలి యిస్తడు దొర" సాయిలు పిలిచాడు. బయటికి వచ్చి చూచింది. అతను ఏరిన పెసరకాయ తెచ్చి గుడిసె ముందు పోశాడు.

"నాకు మా వాళ్ళింట్లో పని వుంది."

"అయితే తొందరగా పో."

"సాయిలూ..." పెళ్ళి తరువాత పేరు పెట్టి పిలవడం తగ్గించింది.

"ఏందే!" ఇప్పుడతని అమాయకతను అసహ్యించుకోవటం లేదు.

"నామీద కోపం వస్తుందా?"

"ఎందుకే?"

"నువ్వు చెప్పిన పని ఇనను కద."

"నువ్వు నా కంటే సిన్నదానవు" అన్నాడు. ఆమె కళ్ళు చెమర్చాయి. తనకు మామూలు మనిషి కోర్కెలున్నాయి. ఆ కోర్కెలు తీర్చే శక్తి సాయిలుకు లేదు. లేదని తనకు తెలుసు. తెలిసి కూడా బలవంతంగా అతని జీవితంలో ప్రవేశించింది. అతన్ని మోసం చేస్తున్నానేమో అని బాధపడింది.

"మరి పోయిరా పో..."

"సాయిలూ!"

"ఏందే!"

"నేను యేదయినా తప్పు చేస్తే మన్నిస్తావా?"

"నువ్వు తెలివయినదానవు, తప్పులు చేయవే."

తెలివయిన వారే అహంకారంతో తప్పులు చేస్తారు. అమాయకులే నిశ్చింతగా వుంటారు. ఆ సంగతి సాయిలుకు అనుభవపూర్వకంగా తెలిసినా ఆలోచించలేడు. అప్రయత్నంగా ఒంగి అతని పాదాలు ముట్టుకుంది. సాయిలు సంబరపడి పోయాడు.

"పో... పో. మీ అమ్మ యెదురు చూస్తది" అని పెసర చేన్లో జొరబడ్డాడు. పెసరకాయలు వడిలో నింపుకుని వెళ్ళింది బాల.

## 16

విల్సన్ మంచి డాక్టర్‌గా పేరు తెచ్చుకున్నాడు. సంపాదన పెద్దగా లేకపోయినా అతని అవసరాలు గడుస్తున్నాయి. అతను వివాహం కోసం కొంత గడువు కోరాడు. ఆ గడువు తీరింది. కాని తల్లి ఆ ప్రసక్తి



ఎత్తడం లేదు. తనకు తానుగా అడగలేకపోతున్నాడు. ఆ రోజు హిందువులకు పండుగ విజయదశమి. ఎవరయినా వస్తారేమోనని ఓ రెండు గంటలు డిస్పెన్సరిలో కూర్చుని విసిగి ఇంట్లోకి వచ్చాడు. మార్తమ్మకు సెలవు. చక్కిలాలు వండుతున్నది. వచ్చి చేతులు కడుక్కొని చక్కిలం తీసుకున్నాడు.

"విల్లీ! సాయంత్రం హైదరాబాద్ నుంచి శామ్యూల్ అంకుల్ వస్తున్నాడురా" అన్నది.

"ఎందుకమ్మా?"

"వాళ్ళ రోజ్‌మేరీకి ఉద్యోగం దొరికిందట.... మరి నిన్ను వివాహం చేసుకొమ్మని అడుగుతాడనుకుంటాను" అన్నది.

"ఆ అమ్మాయి యేదో లవ్ ఎఫైర్‌లో..."

"ఆ తెలియక యేదో తిరిగిందిలే"

"నువ్వు రాయలేకపోయావా మమ్మీ! నాకు సంబంధం కుదిరిందని..."

"ఏ సంబంధం! సుగుణ గురించేనా?"

"అవును ఏం?"

"నువ్వప్పుడు పెద్దగా ఇష్టపడలేదు. అదికాక ఏసురత్నం అంకుల్ అంత మంచివాడు కాడేమోరా!"

"నీకెలా తెలుసు?"

"అంతా ఆడంబరము, డబ్బు లేదు, ఏం లేదు" అన్నది పెదవి విరుస్తూ.

"డబ్బుకు, వివాహానికేం ముడి?"

"నేనంటే ఆడదాన్ని సంపాదించలేదు. మొగవాడు నాలుగు డబ్బులు కూడబెట్టాడు అనుకున్నాను. నీకు ఆస్పత్రి పెట్టుకోవడానికి పనికి వస్తాయన్న ఆశ. అతనూ మనలాంటి వాడేనట..."

"అది కాదు మమ్మీ!"

"విల్లీ! వయసులో, అనుభవంలో నీ కంటే పెద్ద నేను. నీ మంచి చెడులు నాకు తెలుసు. నువ్వేం మాట్లాడకు. శామ్యూల్ అంకుల్‌కు తెల్ల

దొరలు తెలుసు" అన్నది. తల్లితో వాదించి లాభం లేదు. తను డాక్టరుగా రకరకాల ప్రయోగాలు చేస్తున్నాడు. మనుషుల మనసులను బట్టి ట్రీట్‌మెంటు యిస్తాడు. మాట్లాడక చక్కిలం తిన్నాడు. ఆమె శామ్యూల్ గొప్పతనము పదే పదే చెబుతున్నది. అతను మౌనంగా విన్నాడు.

ప్రతి ఆదివారము చర్చికి వెడుతుంది మార్తమ్మ. ఆ రోజు శామ్యూల్ కోసం చూస్తున్నది. రోజ్‌మేరీతో వస్తానని చెప్పాడు. రోజ్‌మేరీలో ఆకర్షణ ఎక్కువ. తప్పక కొడుక్కు నచ్చుతుందని భావించింది. అందుకే చర్చికి రానన్నది.

"మమ్మీ! నీకో ఆశ్చర్యకరమైన విషయం చర్చిలో ఎదురవుతుందనుకుంటే నువ్వు రావడం లేదు" అన్నాడు కొత్తగా కుట్టించుకున్న సూటు వేసుకుంటూ.

"తరువాత చెబుదువులే ఒకవేళ మొదటి బస్సుకే వస్తే వచ్చేస్తాం" అన్నది వడల్లోకి కొబ్బరి పచ్చడి రుబ్బుతూ.

"మీ యిష్టం..." అన్నాడు. టై సవరించుకుని వంటింట్లోకి వచ్చాడు. తల్లి ముందర తలవంచాడు.

'మమ్మీ బ్లెస్ మి...' అప్పుడప్పుడు అలా అడగడం అలవాటే. అందుకే అతని నుదురు ముద్దు పెట్టుకుని తలను తాకింది.

"ఆ రక్షకుడే నీకు దారి చూపుతాడు..." అన్నది. అతను చిన్నగా నవ్వుకొని వెళ్ళిపోయాడు.

ఆమె ఆనందంగా పనులు చేసుకుంది. సుగుణ నెమ్మదితనము ఏసురత్నం మాటకారితనము తనను ఆకర్షించిన మాట వాస్తవమే కాని ఈ ప్రపంచంలో ప్రతి పని డబ్బుతో ముడిపడి వుంది. డబ్బులేనివాడు తను యెందుకూ కొరకాడు. అందుకే అభిప్రాయం మార్చుకున్నది. శామ్యూల్ పెద్ద హోదాలో వున్నవాడు, పలుకుబడి కలవాడు. అన్నింటికన్నా అతనెప్పుడూ ఫారిన్ టూర్స్ తిరుగుతుంటాడు. బాగా డబ్బుందనే చెప్పుకుంటారు. రోజ్‌మేరి తరుణ వయస్కురాలు కాబట్టి, పెద్దగా ఆలోచన లేక యేదో లవ్ ఎఫైర్ పెట్టుకుంది. ఫారిన్‌లో యిలాంటివి కోకొల్లలు.



అతనింటి అల్లుడయితే విల్సన్ గురించి తనేం ఆలోచించవలసిన పని లేదు.

"అబ్బ డర్టీ విలేజ్ డాడీ..." మధుర కంఠం విని బయటకు వచ్చింది. రోజ్‌మేరి, శ్యామ్యూల్ నిల్చున్నారు. అతను విల్సన్ తండ్రికి మేనత్త కొడుకు.

"హాయ్... ఆంటీ..." తెల్ల బెల్‌బాటమ్, నేవీ బ్లూ చొక్కా వేసుకున్న అమ్మాయి మార్తమ్మను కౌగలించుకుంది.

"ఓ డియర్...." ఆ అమ్మాయి నుదురు ముద్దు పెట్టుకుంది.

"రా అన్నయ్యా!" అతడిని ఆహ్వానించింది.

"అబ్బాయి లేడూ!" అతను కూర్చుని టై వదులు చేసుకుంటూ అడిగాడు.

"చర్చికి వెళ్ళాడు అన్నయ్యా."

"గుడ్, దైవభక్తి వుండటం మంచి లక్షణం."

"కాఫీ తీసుకు వస్తాను అన్నయ్యా!"

"ఇప్పుడేం వద్దు. మీ వదిన వచ్చేటప్పుడు భుక్తాయాసము అన్నా వినకుండా వడ్డించేసింది" అన్నాడు. అప్పుడు బయటికి తొంగి చూసింది. విమానం లాంటి కారు రెక్కలు చాచుకుని వుంది బయట. ఆమె సంబరంగా చూచింది. ఏదయినా పని వుంటే మిషనరీస్ తప్ప అంతంత కార్లలో యెవరొచ్చారని తన ఇంటికి. తన అదృష్టం బావుండి ఈ సంబంధం కుదిరితే కావల్సిందేం వుంది?

"డాడీ... ఇంత చిన్న ఇంట్లో ఎలా వుంటారు?"

"ఆంటీ ఒక్కరే కదమ్మా" అంటున్నాడాయన.

"గెస్ట్‌రూమ్ లేదా ఆంటీ!"

"లేదమ్మా! ఇదయినా మీ అంకుల్ కట్టింది. ఆ తరువాత నా సంపాదనంతా విల్లీ చదువుకే అయింది" అన్నది. ఆమెది నాలుగు గదుల ఇల్లు. పెంకుటిల్లు కూడా, చుట్టూ మొక్కలు పెంచింది.

"మన సర్వెంటు క్వార్టరు కూడా యింతకంటే బావుంటుంది" అన్నది అతిశయంగా. మార్తమ్మ మనసు చివుక్కుమంది. అతను తిరిగి

వచ్చిన దేశాల గురించి చెబుతుంటే వింటూ కూర్చుంది. వాకిట్లో మరో కారు ఆగిన చప్పుడయితే బయటికి వచ్చి స్థాణువులా నిలబడిపోయిందామె. విల్సన్, సుగుణ చేయి పట్టుకొని మిషనరీ కారు దిగారు. ఆమె తెల్లని చీర కట్టుకుంది. ఇద్దరి మెడలో దండలున్నాయి. ఆ వెనకాలే ఏసురత్నం, మరికొందరు దిగారు. విల్సన్ భార్యతో తల్లికి నమస్కరించాడు.

"ఏమిట్రా..." ఆమె నోటి తడి ఆరిపోయింది.

"ముందు లోపలికి నడువమ్మా!" అన్నాడు. అందరూ లోపలికి వచ్చారు. పరిచయాలు చాలా గంభీరంగా జరిగాయి. మర్యాద కోసం అందరూ బలవంతపు నవ్వు నవ్వారు.

"ఇక నేను వస్తాను. గ్లాడ్ టు విజిట్" శామ్యూల్ లేచాడు.

"ఫలహారం చేసి వెళ్ళండి అన్నయ్యా!"

"సారీ - నాకు పని వుంది. రోజ్‌కి పార్టీ కూడా వుంది." అతని ధోరణి చూస్తే యేదో చూద్దామని వచ్చాను అన్నట్టుంది.

"థాంక్యూ అంకుల్...." వెడితే వెళ్ళండి అన్నట్టు కరచాలనం చేశాడు విల్సన్. అమ్మాయి యెప్పుడో వెళ్ళి కార్లో కూర్చుంది. అతను వెళ్ళి కార్లో కూర్చున్నాక కారు కదిలింది.

"ఏమిట్రా విల్లీ యిది?"

"అమ్మా.... మార్తమ్మా, యిప్పుడేం అనకు. అబ్బాయి అంతా చెప్పాడు. తండ్రి ఆడంబరాలకు కూతుర్ని శిక్షించడం న్యాయం కాదు. అబ్బాయి, అమ్మాయి బొమ్మలు కారు. మీరు యేదో ఆశించి వారికి ఆశలు కల్పించడానికి. వద్దనగానే యెలా మానేస్తారు" చాలా శాంతంగా నచ్చచెప్పాడు చర్చి ఫాదర్.

"లేదు ఫాదర్? నన్ను మన్నించండి" అన్నది మార్తమ్మ చెమర్చిన కళ్ళతో.

"పశ్చాత్తాపమే ప్రాయశ్చిత్తం అన్నారు. ఆ ప్రభువే నిన్ను క్షమిస్తాడు నీ బిడ్డలను ఆశీర్వదించు." అన్నాడు.



"నన్ను క్షమించు మార్తమ్మా" ఏసురత్నం ఆమె చేతులు పట్టుకున్నాడు.

"అందర్నీ క్షమించేవాడు ఆ ప్రభువే అని ఫాదర్ అన్నారు. ఆ ప్రభువును ఒక్కసారి తలుచుకుందామా?" అన్నది మార్తమ్మ. అందరూ భక్తిగా కూర్చున్నారు.

పరమ పితా వర వినుతా!
మనుజరూపా, సమున్నతా ॥

ఓ పది నిముషాలు ప్రార్థనలు, భక్తి గీతాలు ఆలపించారు.

"విందు భోజనం చాలా సాధారణంగా వుంది" గొణుక్కుంది మార్తమ్మ. భోజనాలు ముగిశాయి. నవ దంపతులను వదిలి, వచ్చిన వారంతా వెళ్ళిపోయారు.

ఏసురత్నం వెనక వెళ్ళాడు విల్సన్. "అంకుల్! మీరు ఒంటరిగా అక్కడ వుండటం దేనికి? వచ్చేయండి" అన్నాడు.

"విల్సన్..." అతని కళ్ళు చమర్చాయి.

"ఏమిటండీ?"

"ఏం లేదు బాబూ....ఏం లేదు. మా సుగుణ తల్లి అదృష్టవంతురాలు. నాకు కాలు, చెయ్యి ఆడని రోజు తప్పక వస్తాను" వెళ్ళిపోయాడు. విల్సన్ తన గదిలోకి వచ్చి బట్టలు మార్చుకున్నాడు. అతనికి ఇల్లు సరిపోదేమో నన్న ఊహ వచ్చింది. తల్లి దగ్గరకు వచ్చాడు. మార్తమ్మ దగ్గర కూర్చుని కబుర్లు చెబుతున్నది సుగుణ.

"నాకు అసలు తెలియదాంటీ! మా నాన్నగారి ఆడంబరాలు నిరసించటానికి సింపుల్‌గా చేసుకుంటున్నాడేమో అనుకున్నాను...."

"అదేనే తల్లీ. చిన్నవాళ్ళెంతయినా యాక్టివ్ కదా" ఆమె కళ్ళ ముందు రోజ్ కదలాడింది. అమ్మో! ఎంత గండం గడిచింది అనుకుంది.

"మమ్మీ! నన్ను క్షమించు..." అన్నాడు రెండవ ప్రక్కన కూర్చుని. సుగుణ లేవడానికి కదిలింది.

"కూర్చో సుగుణా! మీరిద్దరూ నా రెండు కండ్ల వంటివారమ్మా!

ఇక నుంచి ఈ ఇంటి బాధ్యత నీకు అప్పగించి హాయిగా వుంటాను అన్నది ఆమె భుజం మీద చెయ్యి వేసి.

"అవును నేను కుడి కన్నునా, ఎడమ కన్నునా!"

"చాల్లేరా... ఊ లేవండి విశ్రాంతి తీసుకుంటాను. కాళ్ళు లాక్కు పోతున్నాయి."

"ఇద్దరూ లేచారు. సుగుణకు యెటు వెళ్ళాలో తెలియలేదు. అక్కడ కూర్చుందామంటే యేమీ కనిపించలేదు.

"సుగుణా నువ్వెళ్ళి గదిలో విశ్రాంతి తీసుకో. విల్లీ, నీ కన్సల్టిం రూమ్‌లో వుండు వస్తాను" అన్నది ముసి ముసిగా నవ్వి. ఇద్దరూ ముం హాల్లోకి వచ్చారు.

"మమ్మీ చెప్పింది విన్నావుగా..." అన్నాడు కొంటెగా.

"నేను మీ కన్సల్టింగ్ రూమ్‌లోనే కూర్చుంటాను" అన్నది మెల్లగా

"అమాయకురాలివనుకున్నానే..." ఆమె చెయ్యి పట్టి గదిలో లాక్కుపోయి తమకంగా దగ్గరకు తీసుకున్నాడు. ఆమె ముఖమంతా ఎ అయింది. మార్తమ్మ కాఫీకి పిలిచేవరకు స్వీట్ నథింగ్స్ చెప్పుకుంటూ కూర్చున్నారు.

"నువ్వు మొదటిసారి నన్నెప్పుడు చూశావ్?"

"మరి నన్నెప్పుడు చూచావు? ఇలా మనము ఒకటిగా వుంటామ ఊహించి వుండవు." ఇలాంటి కబుర్లతోనే సాయంత్రం అయింది. ఇద్ద ఆమె ఇచ్చిన కాఫీ త్రాగారు.

"ఆంటీ! నాకేదయినా పని చూపించండి."

"పని చేసే రోజులు ముందున్నాయిలే, వెళ్ళి స్నానం చెయ్యి విల్లీ"

"ఏమిటమ్మా!"

"సుగుణకు కాట్ లేదు యెలా?"

"ఫరవాలేదు. నెమ్మదిగా తెచ్చుకుందాం లేమ్మా" అన్నాడు. ఆ నేల మీద పడక యేర్పాట్లు చేయడంలో నిమగ్నమయింది. అతను కొ హెవీగా ఫీలయ్యాడు. అందుకే తిరిగి వస్తానని బయటకు వచ్చాడు.



# 17

"చెప్పండి..." చిరునవ్వుతో తలయెత్తి అలాగే ఆగిపోయాడు విల్సన్. ఎదురుగా నిల్చుంది బాలామణి.

"బాలా...." అతని కళ్ళు మెరిశాయి.

"నా పేరు బాలామణి లెండి" అన్నది. ఆమె కోపం దిగమింగు తోందని తెలిసింది.

"చెప్పండి" అన్నాడు తమాషాగా.

"నాకు యేది తిన్నా అరగటం లేదు" ముక్తసరిగా అంది. ఆమె మాటల్లో, వేషంలో మార్పు స్పష్టంగా గమనించాడు.

"ఇలా వచ్చి పడుకోండి" అన్నాడు. అతను చూపిన బల్ల మీద బిడియంగా పడుకొంది. అతను కొన్ని ప్రశ్నలడుగుతూనే పరీక్షలు పూర్తి చేశాడు.

"కంగ్రాచ్యులేషన్స్!"

"ఏమిటి?"

"ఓ... మై గాడ్. అదే అభినందనలు. నువ్వు తల్లివి కాబోతున్నావు."

"ఏమిటీ?" భయంగా చూచింది.

"నీకు నెల తప్పింది సరా..."

"నెల తప్పిందా? వద్దు .... మందియ్యకండి. కడుపు రాకుండా చూడండి...' బావురుమంది.

"బాలా యేమిటిది?" ఆమె చెయ్యి పట్టుకుని అడిగాడు.


"చెప్పాను కదా! నాకు కడుపు వద్దు" అన్నది కళ్ళు తుడుచు కుంటూ. అతను ఆమె చేయి వదిలాడు.

"భయము అర్థం అయింది. అందము చెదిరిపోతుందన్న భయము కదూ?" ఈసారి అతని కంఠం కరకుగా వుంది.

"ఏమిటీ?" ఆమె కళ్ళు పత్తికాయల్లా బయటికి వచ్చినట్టు అనిపిస్తున్నాయి.

# మాదిరెడ్డి సులోచన

# వారసులు



"అంతే... పిల్లలు పుడితే అందం తరిగిపోతుందని..."

"డాక్టర్... నోరుముయ్యి..." మరుక్షణమే రెండు చేతులతో ముఖ కప్పుకుంది. "నా బాధ యెవరికీ అర్థం కాదు."

"బాలా!" ఈసారి మృదువుగా వుంది అతని కంఠం. ఆమె బా యేమిటో తెలుసుకోవాలంటే కొంత సమయం పడుతుంది. అవత రోగులు చూస్తూంటారు.

"బాలా! నువ్వు ఆవేశములో వున్నావు. ఇంట్లోకి పద." ఆమె లాక్కెళ్ళినట్టే వెళ్ళాడు.

"సుగుణా! మన ఇంటికి అతిథి వచ్చింది. కాస్త ఏం కావా చూడు" అన్నాడు. లోపలి నుంచి వచ్చే యువతిని ఆశ్చర్యంగా చూచి బాలామణి. అప్పుడప్పుడు ఆమెను మిషన్ కాంపౌండులో చూచింది. సుగు కూడా యెక్కడో చూచాను అనుకుంది.

"నా భార్య సుగుణ బాలా" అన్నాడు.

"నీకు పెండ్లయిందా!"

"అయింది. కొన్ని పరిస్థితుల వల్ల యెవరికీ చెప్పకుం చేసుకున్నాను" అన్నాడు. అతను భార్య వంక చూచి బయటికి వె పోయాడు.

"కాఫీ తీసుకుంటారా?"

"ఆ పేరు వింటేనే డోకు."

"పోనీ జూస్ తీసుకో" ఆరెంజ్ క్రష్ కలిపి యిచ్చింది. పుల్ల రుచిగా వుందనుకుంది. మెల్లగా త్రాగేసింది.

"మిమ్మల్ని యెక్కడో చూచాను."

"కొన్నాళ్ళు మిషన్ కాంపౌండులో పాలు పోశాను."

"ఓ కొమురయ్య అమ్మాయివా."

"ఊ.... అన్నది. సుగుణతో కబుర్లు చెబుతుంటే సమయ గడిచిందే తెలియలేదు.



"ఊ....ఇప్పుడు చెప్పు విషయమేమిటో" చేతులు తుడుచుకుంటూ వచ్చాడు విల్సన్. సుగుణ టేబుల్ మీద భోజనాలు అమర్చటానికి వెళ్ళింది.

"ఏం చెప్పాలి..." అన్నది.

"ఎందుకు పిల్లలు వద్దనుకుంటున్నావు?"

"అదికాదు..." మెల్లగా తన వివాహం జరిగిన పరిస్థితులు, సాయిలు గుణము, అతని ప్రవర్తన వివరంగా చెప్పింది.

"నేనూ మనిషినే డాక్టర్? నాకూ కోరికలున్నాయి. నువ్వేమనుకున్నా సరే... ఆ కోర్కెలు తీర్చుకున్నాను. ఇప్పుడు లోకానికి ముఖమెలా చూపను..." మళ్ళీ చేతులలో ముఖం దాచుకుంది.

"ముఖం నలుపు చేసుకునే తప్పు నువ్వేం చేయలేదు. వ్యామోహంలో నలుగురి వెంబడి విశృంఖలత్వంగా తిరిగితే తప్పు. బాలా! నువ్వు హృదయపూర్వకంగా గర్భం పోవాలని కోరుకుంటున్నావా?"

"నీకు తెలియదు డాక్టరు బాబూ! ప్రతి ఆడదానికి తల్లి కావాలని వుంటుంది. వాళ్ళు ఈ ప్రపంచంలోకి వచ్చిన నాటి నుండి యెదురయ్యేది అవమానాలే కదా!"

"అలా అనుకోవద్దు. నాలుగు మాటలు అనేవారు మన కష్టాల్లో భాగం పంచుకుంటారా? పరుగెత్తినంత సేపు తరుముతారు. యెవరయినా నిల్చుని యెదురు తిరిగితే యేమీ చేయలేరు."

"పాపం సాయిలుకు ముఖం యెలా చూపేది?"

"అతడిని నా దగ్గరకు పంపించు, నేను చెబుతాను. అలాగే అతడిని పరీక్ష కూడా చేయాలి. శారీరక లోపమా? లేక అందరూ అనడం వల్ల ఒక విధంగా జంకుతున్నాడా తెలుస్తుంది" అన్నాడు.

"ఊ...." అన్నది. ముగ్గురూ భోజనం చేశారు.

"ఒక మాట అడిగేదా డాక్టర్?"

"అడుగు బాలా" అన్నాడు ఈజీ ఛైర్లో పడుకుని.

"నేను రెండు మూడుసార్లు కనిపించినా, ముందుకు వచ్చినా నన్ను కొత్తదాన్ని చూచినట్టు చూచినవు" అన్నది.

"అది నీ మేలు కోసమే బాలా. మమ్మీ చెప్పింది. నిన్ను నిలదీసి బలి చేసినంత పని చేశారని. నీ పరువు మర్యాదలకు భంగము కలుగరాదని దూరంగా తప్పుకున్నాను" అన్నాడు.

"పరువు... మర్యాద...." వేదాంతిలా నవ్వింది.

"ఏది నా చేతిలో చేయి వేయి యెలాంటి అఘాయిత్యం చేయనని..." చేయి చాపాడు.

"ఊ..." అతని చేతిలో చేయి వేసింది. వచ్చేటప్పుడు యేదో బరువు దింపుకోవాలన్న ఆరాటంతో వచ్చింది. వెడుతుంటే అందరి ముందుగా తను దోషినవుతానేమోనన్న భయము పట్టుకుంది. మెల్లగా తల్లి దగ్గరకు వెళ్ళింది. పిల్లలు చేసే తప్పులు క్షమించే శక్తి తల్లికే వుంది. అయిదారు రోజులుగా తల్లిని చూడటమే కుదరలేదు. సక్కు పురుడుపోసుకుంది. ఆడపిల్లను ప్రసవించింది. నాల్గయిదు రోజులు చెల్లెలి దగ్గర వుండగా తన విషయము అర్థం అయింది. అప్పటి నుంచి ఒకటే ఆరాటం. సమయానికి సీతయ్య ఊళ్లో లేడు. చెల్లెలు సరస్వతికి ఒంట్లో బాగా లేదని వెళ్ళాడు. అతనున్నా తనింత బేల కాకపోవునేమో.

"ఏమిటే మొకమట్లున్నది?" కారప్పొడి దంపుతున్న మల్లమ్మ అడిగింది.

"ఎట్లుందమ్మా?"

"నా మతిమండా అయిదార్రోజులాయె నువ్వు రాక. బాలెంతను చూస్తూ మర్చిపోయిన."

"అమ్మా, చెల్లెలు ఏం చేస్తుందే!"

"పండుకున్నది బిడ్డ" అన్నది.

"అమ్మ.... నేను.... నాకు..."

"ఏమిటే?"

"ఏం లేదు అది కాదు... అమ్మ... అమ్మ నాకు నెల తప్పిందే..." తల్లి భుజం మీద తల వాల్చి బావురుమంది.

"బాలా!!"



"అవునమ్మా.." అన్నది వెక్కుతూ. మౌనంగా పది నిముషాలు దొర్లాయి. ఇంకా బాల యేడుస్తూనే వుంది.

"నెల తప్పితే యేడుస్తారే పిచ్చిపిల్లా! ఊకో... ఊకో బిడ్డ..." ఓదార్చింది.

"అది కాదే..."

"నాకంతా తెలుసు బిడ్డ! పాపిష్టి సన్నాసోడు ఆ బాబయ్య చేసి నీ బతుకుల నిప్పులు ఓసిండు... నీ కంట నీకో పిల్లుండాలే బిడ్డ" అన్నది, తేలికపడ్డ హృదయముతో కళ్ళు ఒత్తుకుంది. తల్లి పాదాలు అంటి తన కృతజ్ఞతలు తెలుపుకోవాలనుకుంది. ఏదీ చెయ్యలేకపోయింది.

"నీవు భయపడకు బిడ్డ" అన్నది కూతురు వెన్ను నిమురుతూ.

"ఏందే... పెద్ద బిడ్డ శిన్నపిల్లయింది" కొమురయ్య దూడలను తెచ్చి కట్టేస్తూ అడిగాడు.

"ఢిల్లీకి రాజయినా తల్లికి పిల్లనే కదా" అన్నది, మరికొంచెం సేపు తల్లితో కబుర్లు చెప్పి తన గుడిసెకు చేరింది బాల. ఆమెకు కొత్త ఉత్సాహము వచ్చింది. ఇల్లంతా శుభ్రం చేసింది. తను స్నానము చేసింది. సాయిలు తనకున్న గేదె పాలు పిండుకుని సీతయ్య గేదెలను తోలుకుని ఊళ్లోకి వెళ్తున్నాడు.

"సాయిలూ..."

"ఏందే?"

"వచ్చేటప్పుడు డాక్టరు దగ్గరకు వెళ్ళిరా."

"నాకేమయిందే!"

"రోగము..." అన్నది విసుగ్గా.

"తిక్కదానవు" అనుకుంటూ వెళ్ళిపోయాడు. అత్తగారింట్లో పాలు యిస్తూ వెడతాడు రోజూ.

చీకటి పడుతుండగా సీతయ్య వచ్చాడు. అతని చేతిలో సంచి పురిది. బాలామణి రోజులా యెదురు చూడలేదు. కొంగు వేలుకు చుట్టుకుని లోపల నిలబడింది.

"అలకా!" అతను నవ్వుతూ సంచి పీట మీద పడవేసి ఆమె రెండు భుజాల మీద చేతులు వేశాడు. ఆమె ముందుకు జరిగి అతని హృదయము మీద తల ఆన్చింది.

"బాలా.... ఏమిటి మాట్లాడవేం!"

"ఏం మాట్లాడాలి?"

"ఏదయినా చెప్పు. నాకెంత అలసటగా వుందో తెలుసా! నిన్ను చూడనిదే వుండలేను అనుకున్నాను, వచ్చేశాను."

"మీ చెల్లెలికి యెలా వుంది?"

"తగ్గిపోయింది. విశ్రాంతి కావాలంటే తీసుకువచ్చాను. ఏం చేస్తుంది మా దొరసాని." కిలకిల నవ్వింది బాల. ఆమెకు అతను దొరసాని అనగానే నవ్వు వస్తుంది యెందుకో.

"అబ్బ! దేవి ప్రసన్నం అయిందన్న మాట. నీ కాలులో బంగారం వుంది."

"అరే... ఏది?" చుట్టూ చూచింది.

"అది నా జేబులోకి వచ్చింది." అతను కూర్చుని ఆమెను ఒడిలోకి లాక్కున్నాడు.

"నిజం బాలా. ఈసారి కూరగాయల బిల్లు యెప్పటికన్నా మూడింతలు వచ్చింది. నిన్నడిగితే యేదీ వద్దంటావు. ఈ నాను, దిద్దులు తెచ్చాను." జేబులోనుండి కాగితం పొట్లం తీసి ఆమె ముందు పెట్టాడు.

"నాకేనా?" నమ్మలేనట్టు చూచింది.

"ఊ..." చనువుగా నాను, చిన్న ఎర్రరాళ్ళ లాకెట్టు ఆమె మెడలో వేశాడు.

"మరి యేదయినా ఊరికే తీసుకుంటారా, నాకేం యిస్తావు?"

"ఏం కావాలి... కొడుకా, కూతురా!" తలవంచుకుని అడిగింది.

"ఏమిటి బాలా?" ఆమెను కుదిపాడు.

"కొడుకా, కూతురా..." అన్నది మరోసారి.



"నిజం... నిజంగా యిస్తావా !" ఆశగా చూచాడు. అతని మగతనాన్ని సవాలు చేసింది భార్య.

"ఊ.... మరో ఆరు నెలలు ఆగాలి..."

"బాలా..." ఆమెను దగ్గరకు లాక్కుని నలిపివేశాడు.

"అబ్బ... వదులు... ఎముకలు విరిగిపోతాయి..." గింజుకుంది.

"ఎంత మంచి వార్త చెప్పావే..." ఆమె ముఖం, మెడ చుంబించాడు.

"నిజంగా నీకు సంతోషంగా వుందా?"

"ఏమిటీ పిచ్చి ప్రశ్న!... నా జీవితం పండింది బాలా. ఈటెల్లాంటి మాటలతో జయ నా మగతనాన్ని సవాలు చేస్తుంటే జీవితం మీద విసిగిపోయాను. ఈ రోజుల్లో గనక నీవు తటస్థ పడకపోతే నేను పిచ్చివాడిని అయ్యేవాడిని..." ఆనాటి పరిస్థితులు గుర్తుకు రాగానే అతని హృదయం కంపించింది. ఆ పరిస్థితులలో బాల చల్లని స్నేహం తాలూకు మధుర స్మృతులు గుర్తుకు వచ్చాయి. ఆమెను అపురూపంగా మరింత దగ్గరకు తీసుకున్నాడు. ఆమె ముడుచుకుపోయింది.

"నాకెంత భయమేసిందో తెలుసా? అందుకే డాక్టరు దగ్గరకు పోయాను కడుపు తీసెయ్యమని."

"బాలా"

"అవును. అతను తిట్టి నచ్చచెప్పి పంపాడు. అతనికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి." సీతయ్య యేమంటాడోనని యెంతో సంకోచించింది. అతనింత సంతోషిస్తాడంటే తను యిలాంటి సాహసము చేసేదా?

"ఇంక లాభంలేదు. బాలా నువ్వంటే ఈ గుడిశెలో వున్నావు. నా బాబు అలా వుండటానికి వీలు లేదు."

"అబ్బ.... బాబట యెంతాశ...." నవ్వింది. నవ్వులతో అర్ధరాత్రి గడిచిందే తెలియదు.

"వెళ్ళండి... ఆవిడ ఉసురు నాకెందుకు?"

"ఉహూ... ఈనాటి నుంచి నిన్ను విడిచి యెక్కడికీ వెళ్ళను" అన్నాడు.

"ఎలా వెళ్ళరో నేనూ చూస్తాను. మీరు యేమైనా చేయండి. ఆమె నాలాంటి స్త్రీయే. ఆవిడ జీవితంలోకి వెళ్ళటమే నాది పొరపాటు" అన్నది అరిందాలా.

"చదవేస్తే వున్న మతిపోయిందని నీలాంటిదాన్ని చూచే అన్నా కాబోలు. ఏదో సరదా పడుతుందని చదువు చెబితే నాకే బుద్ధి చెబుతుంది" అన్నాడు సగం సంబరంగా, సగం విసుగ్గా.

"అబ్బో... అప్పుడే తండ్రి అయినట్టు చేస్తున్నారు...." నవ్వి అత్తి సాగనంపింది. ఆమె కాళ్ళు అప్రయత్నంగా సాయిలు పడుకునే కొట్ట వైపు వెళ్ళాయి. అతను మంట వేసుకుని కూర్చున్నాడు.

"సాయిలూ"

"ఏందే?"

"డాక్టర్ దగ్గరకు వెళ్ళావా?"

"ఆ.... పోయిన.... అంతా చెప్పిండు. ఓ గంట నుంచి సొం యిస్తున్ననే గిప్పుడే జర.... జర సమజ్‌కు వస్తున్నది. నీదేం తప్పున్నది నువ్వెళ్ళి పండుకో."

ఇంకా యేమో అడగాలని అనుకుంది కాని నోరు రాలేదు. మెల్లగ తిరిగి వచ్చి గుడిసెలో పడుకుంది.

## 18

పెంటయ్యకు చాలా ఆనందంగా, హాయిగా వుంది. లేకపోతే పొలం దగ్గిర కాపురము పెట్టి తన పొట్టను కొడుతుందా బాలామణి అనుకున్నాడు. సాయిలు వెర్రి బాగులోడు. పెత్తనమంతా తనదే. సగము కూరగాయల వేరుగా అమ్ముకునేవాడు. కల్లంలో గింజలు కల్లములోనే మాయం అయ్యేవి. సగం గడ్డి అమ్ముకునేవాడు. బాలామణి అక్కడుంది. కూరలు ఏరుతుంది. అక్కడ వుండటమే కాదు. పొలమంతా తిరుగుతుంది. రెండు మూడు సార్లు అక్కడక్కడ దాచిన వస్తువులు పట్టుకుంది. పెంటడి కడుపు మండిపోయింది. ఓ రోజు గొడవ చేశాడు. ఏదో కొంత తింటే చూ



చూడనట్టు వుంటుందట. అసలుకే ఎసరు పెడతావా! అని బెదిరించింది. ఆఖరు అస్త్రము వుపయోగించాడు.

"నిజంగానా పెంటా?"

"ఒట్టు అమ్మ!"

"నువ్వు వెళ్ళు."

"ఈ మాట నేను చెప్పినట్టు చెప్పకు బాలకు."

"సరేలే." అన్నది. తన మాటకు ఎదురు చెప్పని భర్త.... ఊహించలేక పోతున్నది.

"ఏదమ్మా మా రెడ్డి?" నవ్వుతూ గోవిందరావు వచ్చాడు.

"మీ ఇంట్లో లేరా?"

"మా ఇంట్లోనా? రానే లేదమ్మా, మొన్న వచ్చాడు. ఈ మధ్య మేము ఎల్లోరా, అజంతా మొదలుకుని బొంబాయి అటు పడమట చూచి వచ్చాము. బొంబాయి నుంచి తెచ్చిన చీర నీకని తీసుకు వచ్చాడు. నచ్చిందా లేదా?"

"చీరా...", ఆమె తెల్లబోయింది.

"ఏ చీర అన్నయ్యా?" అని అడగలేకపోయింది.

"నచ్చకపోతే మరోటి మార్చుకో. మా ఖర్చులు వెళ్ళమారాలని చవకగా దొరికిన వస్తువులు తెచ్చాములే, సరస్వతికెలా వుంది!" అతను లోనికి తొంగి చూచాడు.

"రండి... రండి, పూర్తిగా నయమయింది" వాళ్ళు మాటల్లో పడిపోయారు. జయలక్ష్మి మనసులో సుళ్ళు తిరుగుతున్నాయి. ఆ చీర బహుశ చెల్లెలికి యివ్వవచ్చునేమో అన్న ఆశ కూడా వుంది. లోపలికి వచ్చేసరికి ఆమెకు చీర యివ్వలేదని తేటతెల్లం అయింది.

"మాతో అనలేదు అన్నయ్య! వాడి చాదస్తంగాని భార్యకు కొంటే వద్దంటానా! నేను సారెల్లు చీరెల కోసం రాలేదు. ఏదో విశ్రాంతి తీసుకుందామని వచ్చాను. ఆ బొంబాయి చీర యెలా వుంటుందో నువ్వయినా చూపించకపోతివి జయా".

"నాకు తెలిస్తే కదా చూపించడానికి" జయ కస్సుమంది. ఇదే గృహకలహంలా వుందని గోవిందరావు చక్కా వెళ్ళాడు అవతలకి. తరువాత వదినా మరదళ్ళు నువ్వెంతంటే నువ్వెంత అనుకున్నారు.

"మీరంతా కలసి నా సంసారంలో కారుచిచ్చు రగిలిస్తే గాని నిదు పోయేలా లేరు".

"మాటలు తిన్నగా రానియ్యవమ్మ. నీ పుట్టింటికి వెళ్ళి న వుండి రావటం లేదా. అలాంటిదాన్నే నేను."

"కాదని ఎవరన్నారు. మళ్ళీ పెళ్ళో, మట్టి దిబ్బలో అంటూ ఆయ మనసు విరిచేశారు. ఆయన అడ్డమయిన వారితో తిరుగుతున్నారు మీరు సంతోషించండి" అన్నది. గోడకు చేరబడి కుమిలి కుమి ఏడ్వసాగింది జయ.

"ఛీ...ఛీ... నా కొడుకు బంగారమే! వాడిని అన్నవారికి కళ్ళు పోతాయి" రాజమ్మ కొడుకును వెనకేసుకు వచ్చింది.

"ఆట్లా పొలం వెళ్లి చూడు బంగారమో, ఇత్తడో తెలుస్తుంది. బాలని తలకెక్కించుకుని తైతక్కలాడుతున్నాడట."

"ఊరివారి మాటలు వేదం నీకు..."

"ఊరి వారి మాటలు నిజమో, కాదో ఒకసారి చూచి రారాదు! చీర కూడా దాని యెదాన కొట్టి వుంటారు. రానీ అడగవలసిన నాలుగు అడిగి నుయ్యో గొయ్యో చూచుకుంటాను."

"ఏమిటోనే తల్లీ! కూలి చేసుకునేవారు సుఖంగా వుంటారు. మ ఇంట్లో ఒక్కనాడయినా నిమ్మళంగా నిదురబోయామా?"

"మళ్ళీ యేమొచ్చిందమ్మా?" సీతయ్య వచ్చి ఉయ్యాలబల్ల మీ కూర్చున్నాడు.

"అది సరే యెక్కడ నుండి రావటం?"

"గోవిందరావు ఇంటి నుంచి." తల్లి యెన్నడూ లేనిది ఆలా ప్రశ్నించిందేమా అని ఆశ్చర్యపోయాడు.

"చూచారా అత్తయ్యా!... ఎలా సత్యం పలుకుతున్నారో!"



జయ అత్తయ్యా అంటూ తన అవసరాలకు తప్ప పిలువనే పిలువదు.

"అవున్రా సీతయ్యా! ఇందాకే గోవిందరావు వచ్చి వెళ్లాడు. ఏదో చీర కూడా తెచ్చావట..." గతుక్కుమన్నాడు. తను లేనప్పుడు గోవిందరావు వచ్చాడని గ్రహించాడు. తను ఏం చెప్పినా అబద్ధంలాగే కనిపిస్తుంది.

"ఐతే మీరెందుకు అరుచుకుంటున్నారు?"

"ఎందుకా! నీలాంటి వాడికిచ్చి నా గొంతు కోసిన మా వాళ్ళ మీద అరవాలి. కాని మధ్యలో వచ్చి నా కొడుకు అపర శ్రీరామచంద్రుడంటుంది. కాబట్టి మీ నిజ స్వరూపము చూడమని, మీ అమ్మతో చెబుతున్నాను..." గొంతుచించుకు అరిచింది జయ.

"చాల్లే యెవరయినా వింటే నవ్విపోతారు."

"ఇప్పుడు గుడిసెల్లో పడుకొని వస్తే నవ్వటం లేదా? అది అసలు మన పొలం దగ్గర కాపరం యెందుకు పెట్టాలి?"

"కాపలా వుంటారని అప్పుడు నువ్వు పెట్టమన్న సంగతి మరిచి పోయావా?"

"అవును. నేనో పిచ్చి ముండను. నా కొంపకే ఎసరు పెడుతుందని ఊహించలేకపోయాను" ఏడుస్తున్నది.

"సరే.....ఈ రాద్ధాంతం యెందుకు? వాళ్ళను వేరే యెక్కడయినా వుండమంటాను సరా!" చికాకుగా అన్నాడు.

"నిజంగా అంటున్నారా మీరామాట?"

"అబద్ధం కూడానా?" విసుక్కున్నాడు. పెద్ద తుఫాను రాబోతోంది, తను అలిగి పుట్టింటికి పోతుందని ఊహించిన జయ అనుకోకుండా భర్త వాళ్ళను పంపేస్తానంటే తెల్లబోయింది. సంతోషపడింది. ఆ రాత్రి అతను ఇంట్లోనే పడుకున్నాడు. భార్యకు కూరగాయల మీదొచ్చిన డబ్బు లెక్క చెప్పాడు. అనవసరంగా అపోహపడ్డాను అనుకుందామె. ఆడదాని బలహీనత యెక్కడో చూచి దెబ్బ కొట్టటం మగవాడు చేస్తున్న తెలివైన పని. తన ఆలోచనా పరిధిని, తన స్వశక్తిని పెంచుకోక యెవరో మోసం చేస్తారనుకోవటం పొరపాటేమో.

వారం రోజులకు తాము వేరే ఇంటికి మారుతున్నాం, సెలవు కావాలని అడిగాడు సాయిలు.

"మళ్ళీ యెక్కడ గుడిసె వేసుకున్నావురా?"

"గుడిసెనా! కాదమ్మా ఇల్లు కొనుక్కున్నాము."

"ఎక్కడ కొన్నారు?"

"అదేందో... పంతులమ్మ... పక్కనుంది చూడు."

"మార్తమ్మ ఇంటి ప్రక్కనున్న ఇల్లా".

"అవు..." అన్నాడు గర్వంగా.

"అది రెండు మూడు వేలు చేస్తుంది కదరా!"

"మూడేలకు మాటయింది. ఎయి రూపాయలిచ్చినం. మల్ల సాలుక యింకిన్ని యిస్తం."

"మీకు డబ్బెక్కడిది?"

"మా బాలామణి వ్యాపారం చేస్తుంది గద" ఆపైన అతడు చెప్పిన మాటలు వినిపించలేదు. ఆమె ఊహలు పరి పరి విధాలుగా పయనించాయి. ఇప్పుడు తనేం చేస్తుంది? రాత్రివరకు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. ఆమెకు కాస్త నిశ్చింతగా వుంది. రాత్రి భోజనాలు చేస్తుండగా భర్తను కదిపింది.

"ఏమండీ! నేను రెండు రోజులు మా పుట్టింటికి వెడతాను."

"వెళ్ళిరా, సరస్వతి వెడతానంటుంది. ఆ తరువాత వెళ్ళకూడదూ?"

"అలాగే అనుకున్నాను. రాత్రంతా పీడకలలు. అమ్మ కలలో వచ్చింది."

"మరి అలాంటప్పుడు వెళ్ళిరా" అన్నాడు ముక్తసరిగా. ఆమె మరునాడు ఉదయమే ప్రయాణం అయి వెళ్ళిపోయింది.

"ఇదేమిట్రా! ఒక వంక సరసు ప్రయాణం అవుతుంటే..."

"ఇలాంటి చర్యలు మనకేం కొత్తా? ఏం కావాలో చెప్పు" అన్నాడు నిశ్చింతగా.

"నేను చెప్పకపోయినా నీ చెల్లెలికి నీవు పెట్టుకుంటావు గాని, ఒక్క మాట అంటాను, కోపం రాదు కదా."



"ఏమిటే అమ్మా ఈ నస! సూటిగా చెప్పరాదూ!"

"ఉమ ఆడపిల్ల. మనింట్లో వుంచుకుంటే మనము పిలిచినప్పుడు యిన్ని మంచినీళ్ళిస్తుంది. నీ కడుపున ఓ కాయకాస్తే చూద్దామనుకుంటే అది నెరవేరే యోగం లేదు. మన దగ్గర భాగం అడుగుతుందా? భాగ్యం పంచమంటుందా? మనము దయుండి తల మీద నాల్గు అక్షింతలు వేస్తే సంతోషమే. కాదంటే తల్లి, దండ్రి వుండనే వున్నారు."

"నువ్వు అనేదేమిటి? ఉమను మన దగ్గర అట్టే పెట్టుకుందామని అవునా?"

"అవును నాయనా!"

"సరే వుండనియ్యి."

"మరి జయకు..."

"నేను చెబుతాలే" అతను హడావుడిగా బయటకు వెళ్ళాడు. పది గజాలు వెళ్ళి మళ్ళీ వచ్చాడు.

"అమ్మా! రాత్రికి ఒక చోటికి వెళ్ళాలి. నా కోసం చూడకండి." అతను వెళ్ళిపోయాడు.

"ఏమన్నాడమ్మా?" సరస్వతి అడిగింది.

"ఏముంది అనడానికి. అంగీకరించాడు."

"అది నోరు చెయ్యగానే అదిరిపోతావ్. నువ్వు కాస్త గట్టిగా వుండు. మొగపిల్లలను దత్తత తెచ్చుకుంటారే అనుకో, వాడి పెళ్ళాం మీకు బంధువా! పరాయి పిల్లే అవుతుంది. మన పిల్లను మీరు ఇంట్లో పెట్టుకొని దాని కోసం ఓ బీద కుర్రవాడిని చూచి ముడి పెట్టేస్తే ఇద్దరూ మీ కళ్ళ ముందు పడి వుంటారన్నయ్యా! నువ్వు యెంత చెబితే అంత... అని నేను నచ్చచెబుతాను" సరస్వతి తల్లితో చెప్పింది.

"అలాగే చెయ్యవే అమ్మా! నా రక్తం రావాలని నాకుండదూ?"

"ఈసారి జయ గొడవచేస్తే కాస్త గట్టిగా వుండు. రోష పడి ఉమను బస్సు యెక్కించేవు."

"అవును గాని ఆ చీర యేమయిందంటావే అమ్మాయ్?"

"అమ్మో! మాయలాడి దాచేసి వుంటుందే." తల్లీ కూతుళ్ళు మంతనాలు జరుపుకున్నారు. తన పుట్టింటి ఆస్తి మరెవరికి పోరాదన్న పట్టుదల బాగా వుంది సరస్వతికి.

## 19

బాలామణి ప్రసవించి పండులాంటి కొడుకును కన్నది. తల్లి అపురూపంగా చూచినా, తండ్రి యెంతో పొగిడినా, ఒక మూల భయంగా వుంది. ఊరంతా యెరుగుదురు సాయిలు గురించి. అందుకే ప కట్టుకుని యెవరూ అడక్కపోయినా మల్లమ్మ కూతురి విషయ చెబుతుంది.

"మా సక్కుకు పిల్లలయి, మా బాలకు కాకపోతే నాకు ఒక ఫికరమ్మా. డాక్టరుబాబు కడుపు సల్లకుండ. మా అల్లుడిని బాగు జేసిండు."

"ఏమయిందేం?" విన్నవారు కుతూహలంగా అడిగేవారు.

"మా సాయిలుకు బాగా లేదంట. ఆయన మందియ్యంగానే నె తప్పింది." అని డాక్టర్ని పొగిడి వచ్చేసేది. ఆ చుట్టుపక్కల జంగమ్మ వుంటే మూతి విరిచేది. 'ఎవరికి తెలియని బాగోతమే! ఆ సీతయ్య ద పుణ్యం కట్టుకున్నడు?' అనేది.

"ఏమయితే మనకేందంట. ఆయన సల్లగుంటే నాలుగు పయిస అప్పు పుడ్తది." అమ్మలక్కలు జంగమ్మకు దూరంగా తప్పుకునేవారు. విలువలు డబ్బును బట్టి మారుతుంటాయి అన్నది సత్యదూరం కాదేమో. ఈసారి బాలామణి విషయంలో శ్రద్ధ చూపలేదు యెక్కువగా.

అటు తల్లికి, తండ్రికి అన్ని విధాల అండ లభ్యమవుతోంది. నర్సింహ చదువు చురుకుగా సాగుతోంది. యాదయ్యకు వివాహం చెయ్యాలని ప్రయత్నిస్తున్నారు. రెండు మూడు సంబంధాలు వచ్చినట్లే వచ్చి వెనక్కు వెళ్ళాయి. దానికి బాబయ్యే కారణమని తరువాత తెలిసింది. మళ్ళీ పక్క ఊళ్లో ఓ అమ్మాయిని చూచి వచ్చారు. ఎదిగిన పిల్ల సక్కు బాలామణి లేని లోటు తీరుస్తుందని ఆశించారు. వారు ఆ రో



వస్తున్నారు. నిశ్చయము చేసుకుని వెళ్ళడానికి. మల్లమ్మ భయము మల్లమ్మకుండనే వుంది. ఎలా చెప్పి వారిని మెప్పించాలని ఆలోచిస్తోంది. బాలామణి కొడుకును చూచుకుని మురిసిపోయింది. అచ్చం సీతారామిరెడ్డి లాగే వున్నాడు అనుకుంది. వాడికి నీళ్ళు పోసి, కొత్త చొక్కా తొడిగింది. చేతులకు బంగారు మురుగులు పెట్టింది. నడుముకు వెండి మొలతాడు కట్టింది. తనూ పండక్కు కొన్న పట్టుచీర కట్టుకుని మెడలో జిగినీ గొలుసు వేసుకుంది. ఛాయ తేలిన ముఖాన ఎర్రని కుంకుమతో చూడగానే గొప్పింటి అమ్మాయిలా కనిపిస్తుంది. కళ్ళకు కాటుక దిద్దుకుంది. ఎర్రబొట్టు క్రింద కాటుక బొట్టు చుక్కలాపెట్టుకుంది. "బాలా బుడ్డోడికి ధ్రిష్టి తగిలేను, చెంపకు యింత మసిబొట్టు పెట్టమ్మా" మల్లమ్మ అరిచింది వసారాలో చాప పరుస్తూ.

"అలాగే లేవే. నీ మనుమడు బంగారు బొమ్మ అయినట్టు చేస్తావేం?"

"నా మనుమడు దొరేనే" అన్నది మల్లమ్మ. అలా రోజుకు ఒకసారి కొడుకును అలా పిలవడం సరదా ఆమెకు. తల్లి అలా అన్నప్పుడల్లా పొంగిపోతుంది బాల. ఆమెకు యెప్పుడెప్పుడు తన ఇంటికి వెడదామా అని వుంది. అక్కడ స్వేచ్ఛగా తన కొడుకును గురించి ఆలోచించవచ్చు. తమిద్దరూ కలిసి పంచుకునే ఆనందం వేరు.

"బాలా? ఆ పూరీల పని నువ్వు సూడు బిడ్డ పొంగుతయి. నేను చేస్తే కట్టెల్లా ఈడ్చుకుపోతయి" అన్నది.

"మరి నీ మనుమడు లేస్తే ఊపు ఉయ్యాల" అని కొడుకును ముద్దు పెట్టుకొని వంటింట్లోకి వెళ్ళింది. ఆమె పని చేస్తుంటే తల్లి మనుమనికి పాడే జోల వినిపించింది. అమ్మ గొంతు బాగుంది అనుకుంది.

జో అచ్చుతానంద!
జో, జో! ముకుందా.
రార పరమానంద రామ గోవిందా
జో జో !

కాళ్ళ గజ్జలు కొని, కడియములు కొనీ
కన్న తండ్రి రాముండు వచ్చె ఊకుండూ
జో జో !
మేలు గజ్జలు కొనుచు మెడగంట కొనుచూ
మేనత్త శాంతమ్మ వచ్చే ఊకుండూ
జో జో !

"ఆ... ఆ... మేనత్త వచ్చినట్టే గాని, అవతల చుట్టాలు వచ్చారు" కంగారుగా పిలిచింది బాలామణి. అమ్మాయి తల్లిదండ్రులు కాక, మేనత్త ఆమె భర్త వచ్చారు. వారు బాలామణి మర్యాదకు, మాటకు ముగ్ధు లయ్యారు. ఆమె కొడుకుని ఎత్తుకొని వచ్చింది.

"ఎర్రగ, ముద్దుగున్నడు" అన్నది మేనత్త.

"అంత మేనమామ రూపమే. మా యాదయ్య గిట్లనే వుండె" మల్లమ్మ చెప్పింది.

"అదృష్టవంతుడు. అల్లుడేం పనిచేస్తడు." తల్లి అడిగింది.

"ఎవరు? మా బాలమ్మ బర్తా? ఆయన దొరల కొలువు చేస్తడు ఇంటి కాడ దంద (కులవృత్తి) వుంది." అన్నది.

"ఎన్ని బర్లున్నాయి?" ఆశగా బాలామణి మెడలో వున్న నా చూచింది తల్లి.

"రొండున్నయి. ఈ త్యాప యింక పెడ్తరంట" అన్నది మల్లమ్మ తల్లి అవస్థ చూచి కించపడింది బాలామణి.

"మేం పప్పన్నం తిని పోదమంట ఒచ్చినము. ఇగ పెట్టిపోతం యేంటివో చెప్పుండ్రి" మేనత్త అడిగింది.

"ఏం దంద చేసుకునే టోల్లము. మా నుంచి, యెక్వ తక్వ కాద బేకార్ మాటలెందుకు?" వ్యవహార కర్తలా ప్రవర్తించింది.

"పిల్లగాడు, తండ్రి కాన రారేం?"

"వస్తరు..." ఆమె మాటల్లోనే యాదయ్య వచ్చాడు. అత కొత్తవారిని చూచి దర్జాగా ఫోజు పెట్టాడు. తన సైకిల్‌కు కట్టుకువచ్చి జిలేబీ తీసి బాలామణికిచ్చాడు.



"నమస్కారం చెయ్యి..."

"నమస్తే..." అన్నాడు ముఖానపడే జుట్టును పక్కకు త్రోసుకుని.

"ఏం బాబూ, పట్నం నుంచా?" మౌనంగా కూర్చున్న పురుషుడు అడిగాడు.

"అవునండి" అన్నాడు నిలబడి.

"ఎన్ని సేర్ల పాలు తీస్కపోతవు?"

"ఓ సౌ సేర్లు పాలు అయితయి, అన్నీ మాయి కావు, ఊల్లో తెస్తము." వారు మాట్లాడుతుండగానే కొమురయ్య వచ్చాడు. అతడు చిన్న కూతుర్ని తీసుకు రావడానికి వెళ్ళాడు.

"సక్కుబాయి రాలేదా ?" యాదయ్య అడిగాడు.

"పెండ్లికోసారి, పప్పన్నానికోసారా అంటూ తోలలేదురా."

బావి దగ్గర కాళ్ళు కడుక్కొని వసారాలోకి వచ్చాడు.

"ఎప్పుడొచ్చిండ్రు..." అందరినీ పలుకరించి, మనుమడిని యెత్తుకొని ముద్దాడి, కబుర్లు మొదలుపెట్టాడు.

రెండు కాసుల బంగారం, యాభై కాసుల వెండి, ఒక బనారసు చీర అంగీకరించాక సంతోషంగా వాళ్ళు కూతుర్ని యివ్వడానికి ఒప్పుకున్నారు.

తాంబూలాలు పుచ్చుకున్నారు. హృదయము మీద నుండి పెద్ద బండ రాయి దింపినంత తేలికగా ఊపిరి పీల్చారు దంపతులు. కూతురే గనక ధైర్యం చేసి బంగారం ప్రసక్తి తేకపోతే అసలు వివాహానికి అంగీకరించే వారే కాదు. ఆ సంగతి వారికి బాగా తెలుసు. కూతుర్నే దేవతలా చూసుకున్నారు.

"మా ఇంటికి వెళ్ళిపోతానమ్మా."

"మనుమడికి అయిదు నెల్లు రానియ్యే."

"బాగుందమ్మా నా సంసారం ఏం గాను?"

"వీడిని యిక్కడే వుంచిపోవే బాలా" అన్నారు అన్నతమ్ములు మేనల్లుడిని ముద్దులాడుతూ.

"అక్కోయ్... నేను చెప్పిన పేరే పెట్టాలి. బాలకృష్ణుడని..."

"అలాగే లేరా..."

సాయంత్రం తల్లి, తండ్రి వెంట వచ్చి వదిలిపెట్టి వెళ్ళారు మనుమడిని విడువలేక విడిచిపోయారు. బాలకు మనసంతా ఆకాశ దూదిపింజెలా, యెగుర్తున్న మబ్బు తునకలా వుంది. చిన్న ఊయల అన్న కట్టి వెళ్ళిపోయాడు. తన చిన్న ఇల్లు చూచుకుని మురిసిపోయింది రాత్రి యెనిమిదయినా ఆమె యెదురు చూచిన వారు రాలేదు. సాయిలు దొరగారి పాలు తీశాక, తన గేదె కోసం గడ్డి తీసుకుని వస్తాడు. ఆ రోజు అలాగే వచ్చాడు.

"ఏమంటున్నాడే సంటోడు. సందడే లేదు సుమా."

"అది సరే గాని, సీతయ్య దొర లేడా?"

"ఉన్నడు. అదేం ఇంట్లోనే రాత్రింబగళ్ళ కొట్లాటలే. జయమ్మ అన్న కొడుకును తెచ్చుకుంది. ఆయన చెల్లెలి బిడ్డను తెచ్చుకున్నడు. సాయిలు చెప్పుకుపోతున్నాడు. ఆమె చిన్నగా నవ్వుకుంది. వచ్చి కొడుకును ఒకసారి ముద్దు పెట్టుకుంది.

"నిజమైన వారసుడవు నువ్వురా తండ్రీ, బంధువులు యెం గింజుకున్నా ఏం?"

"ఊ...ంగా.." ఏదో తెలిసినట్టు కాళ్ళు చేతులు ఆడించాడు ఆమెకు యెవరయినా చదివితే మరోసారి కుంతి కథ వినాలని వుంది ఆమె పత్రికలలో పెద్ద అక్షరాలతో ప్రింటయిన కథలు చదువగల్గుతుంది సాయిలుకు భోజనము పెట్టింది. అతను పిల్లాడిని అపురూపంగా యెత్తుకుని ఆడుతుంటే గిల్టీగా ఫీలయింది. అతని పాదాలు పట్టుకుని నమస్కరించాలనుకుంది. ఆమె అదిలింపులకు జడిసి యిప్పుడు కొ శుభ్రత నేర్చుకున్నాడు సాయిలు.

"ఏమో అనుకున్నా గాని నీ పెండ్లము గట్టిదేరో" అనే వారందరు రుచికరమైన ఆహారము దొరకడంతో అందరూ అసహ్యించుకునే రూ కండపట్టి ఆరోగ్యంగా కనిపిస్తున్నాడు.



చాదస్తం కూడా తగ్గిపోయింది. నిలకడగా మాట్లాడగలుగుతాడు.

"ఈన్ని నా దగ్గర పండబెట్టుకుంటానే."

"ఓ సంవత్సరము గడిచాక పడుకోబెట్టుకుందువులే" అన్నది. ఎక్కడో హైద్రాబాదు అవుతుంటే పాతకాలం నాటి పందిరి మంచము కొన్నాడు సీతయ్య. అది విశాలంగా పడుకుంటే నల్గురికి సరిపోతుంది. కాస్త ఇరుకుగా అయితే అరడజను మంది సునాయాసంగా పడుకోవచ్చు. మధ్యన బొంత వేసి కొడుకుని పడుకోబెట్టింది. తనూ భోజనము చేసి వచ్చింది. వరండాలో పాత పీట మీద గుర్రుపెట్టాడు సాయిలు.

"ఒట్టి యెడ్డి మనిషి" అనుకుంది. తలుపు వేసుకుందామని తిరగబోయే లోపల ఆమె నడుము చుట్టూ చేయి పడింది. అమ్మో అని అరవబోయి నిగ్రహించుకుంది. సీతారామిరెడ్డి వాడే కునేగా సెంటు పరిమళం నిద్రలో కూడా గుర్తించగలదు. ఇద్దరూ లోపలికి వచ్చారు. తలుపులు వేసింది.

"ఆస్పత్రిలో చూచారు. మళ్ళీ చూడాలనిపించలేదా?" అప్రయత్నంగా ఆమె కళ్ళు నీటితో నిండాయి.

"బాలా....బాబుగాడిని చూడాలని యెన్నిసార్లు మీ ఇంటి మూల వరకు వచ్చి వెళ్ళానో నీకు తెలియదు. నువ్వేమో హాయిగా కూర్చున్నావు పుట్టింట్లో..." ఆత్రంగా కొడుకు వైపు వెళ్ళాడు.

"అమ్మ వద్దంటున్నా మీ కోసం వచ్చాను" అన్నది. అతనికి యెదురుగా అదే మంచంపై కూర్చుని. అతను ఆమె మాటలు విన్నాడో లేదో గాని కొడుకుని వడిలోకి తీసుకుని తన్మయత్వంతో చూచాడు.

"ఏం పేరు పెట్టావు బాలా?"

"మీరు లేకుండానే?"

"మర్యాదలు నేరుస్తున్నావే?"

"ఇప్పుడేం మర్యాద చేశాను?"

"మీరు అని మన్నించి మాట్లాడుతున్నావుగా."

"అంతా మీరు నేర్పిందే" నవ్వింది.

"చెప్పండి ఏం పేరు పెడదామంటారో."

"నువ్వేం ఆలోచించావు?"

"మీతో కలిసే ఆలోచించాలని నేను ఏమీ అనుకోలేదు. వ
వాళ్ళు మాత్రం బాలకృష్ణుడు అని పెట్టమన్నారు" అన్నది. పసివాడు ఇ
యిటూ కదిలాడు. ఆమె కంగారుగా బొంత మీదికి జరిపింది అత
తొడ మీద నుండి.

"సమంగా లేకపోతే కదులుతాడు."

"కృష్ణ అన్న పేరు నాకిష్టమే గాని, నువ్వో బాలవు వున్నావు
అన్నాడు ఆమెను దగ్గరకు లాక్కుని.

"వదలండీ... మోటు మనుషులు" అన్నది బుగ్గ తుడుచుకుంట

"అది కాదు బాలా! పిల్లలు పుడితే అందం చెడిపోతుంద
అంటారు గాని, నీ అందం రెట్టింపయింది." అన్నాడు ఆరాధన నిండ
కళ్ళతో చూస్తూ.

"చాలా రోజులకు చూస్తే అలాగే కనిపిస్తుందట."

"అంటే నెలకోసారి రమ్మనా?"

"నేను చెప్పింది వింటారా?"

"చెప్పి చూడు."

"మా అక్కతో దెబ్బలాడుతారెందుకు? ఏ స్త్రీకయినా భర్త
వాడుగా వుండాలన్న కోర్కె వుంటుంది."

"నేనే సాధిస్తున్నానంటావు?"

"కృష్ణుడు మీద ఒట్టె ఆమెను కొడితే, తిడితే."

"నీకీ ముచ్చట్లన్నీ యెవరు చేరేస్తున్నారు... ఓ అర్థం అయి
సాయిలు తెలివి పెరిగిపోయిందే."

"మరి పెద్దమనుషుల తెలివి తరిగిపోతుంటే వాళ్ళది పెరిగిపో
యేదీ" చేయి చాచింది.

"ఇప్పుడు ఒట్టు... ప్రమాణం అంటూ నా ప్రాణం తీయకు. అవ
ఏమీ అనను సరేనా!"



"అలా కాదు. మీ మగవారిని నమ్మిందెవరట."

"అబ్బో ఈ రోజు కొత్త సత్యం తెల్సిందే" ఆమె చేతిలో చేయి వేసి ప్రమాణం చేశాడు. రెండు మూడు గంటలు అలా గడిపి అతను వెళ్ళి పోయాడు. అతని హృదయము భారమయిపోయింది. రాత్రంతా తన కొడుకుని చూచుకునే అదృష్టం తనకు లేదు? ఎందుకు లేదు. 'నువ్వు ధైర్యం చేస్తే వుందని' మనసు హెచ్చరించసాగింది. మరోవంక పరువు ప్రతిష్టలు అతన్ని వెంటాడసాగాయి. అతను యేదీ తేల్చుకోలేక అశాంతిగా నడుస్తున్నాడు. పిరికివారిని వెంటాడేది అశాంతే కదా!

## 20

కృష్ణుడు బాలామణి ముద్దుబిడ్డడే కాదు, సుగుణకు ప్రాణం. స్నానం చేయించడం, పౌడరు వెయ్యటం అంతా ఆమే చేస్తుంది. అటు యాదయ్యకు, అతని భార్యకు కూడా ప్రాణమే. పేకాటలో పడిపోయిన అన్నకు పెళ్ళి చేయించి ఓ దారిన పెట్టింది. ఆ సత్యము యెవరూ మరిచిపోలేరు. తాతకు, అమ్మమ్మకు, అందరికీ ప్రాణమే. సక్కుకు ప్రాణమే కాని ఉడుక్కుంటుంది.

"అప్పుడే ఆడు మీ నెత్తిన పాలు పోశాడా మగాడు అంటారు?"

"మరి పొయ్యడాయె" తండ్రి ఉడికిస్తాడు.

కృష్ణుడు నికృష్టంగా పెరుగుతాడేమోననుకున్న బాల భయం ఉట్టిదేనని తేలిపోయింది. ఆమెకు చాలా ఆనందంగా వుంది.

"బాలా! బాలా! కృష్ణుడినిలా పంపు జ్యూస్ త్రాగుతాడు" సుగుణ అరిచేది.

"ఈ అలవాట్లన్నీ నేర్పితే నేను యెక్కడ తేవాలి."

"నిన్నెవరు తెమ్మన్నారు? నాకిచ్చెయి వాడివి."

"అయితే తీసుకో" బాలామణి కొడుకును తెచ్చి ఆమె ముందు దింపేసేది. అందరి ఆప్యాయత రంగరించి పోసుకున్న కృష్ణుడు ఆరు నెలలకే సంవత్సరం బాబులా వున్నాడు.

"పిల్లలంటే అంత ఇష్టమా సుగుణా?" విల్సన్ అడిగాడు.

"ఊ.... ఏం" అనలేకపోయింది. విల్సన్ ఈతరం వాడు. కావాలను కుంటే పిల్లలు కలుగుతారు. వద్దనుకుంటే మానుకోవచ్చు అంటాడు శాస్త్ర విజ్ఞానం పెరిగిపోయింది. కొన్ని విషయాలలో శాస్త్ర విజ్ఞానానికి స... వుంది. అది వేరే విషయం, అతను కుటుంబ నియంత్రణ పాటిం... వ్యక్తి. తన సెంటిమెంట్సుతో అతని ఆశయానికి అడ్డుపడటం అభిమ... కాదు.

"మాట్లాడవేం!"

"పిల్లలంటే యెవరికిష్టం వుండదు?"

"నాకు ఇష్టం లేదు" అన్నాడు.

"ఈ సారి కృష్ణుడిని ముద్దు పెట్టుకున్నప్పుడు అడుగుతాను" అన్నది. ఇద్దరూ నవ్వుకున్నారు.

"మా అన్న ఊరికే ముద్దు పెట్టుకోడులే, కూతురు పుట్టి... అవసరమని అల్లుడిని మచ్చిక చేసుకుంటున్నాడు" నవ్వుతూ వచ్చిం... బాలామణి కొడుకును తీసుకుపోదామని.

ఆమె పెట్టుకున్న వరసకు క్షణం తెల్లబోయాడు విల్సన్. ఆమెను అందుకోలేనని తెలిసినా, మనసును అదుపులో పెట్టుకొని ఆరాధించేవా... ఆమెకు తన పట్ల సోదర భావమేనంటే నమ్మశక్యము కాని విషయమే ఒక్క విషయము అతనికి తెలుసు. స్త్రీలు ఏ విషయములోనయినా త్వర... తెగింపు చేస్తారు. తల్లిగా మారిన బాలామణి అనుమానపు ఛాయ... కూడా తనపై సోకరాదని జాగ్రత్త వహిస్తుందని తెలిసిపోయింది.

బాలామణి కొడుకును ఎత్తుకొని విల్సన్ గడప దిగుతుండగా ఆమెకు జయలక్ష్మి యెదురుగా వచ్చింది. ఆమె బాలను యెగా ది... చూచింది.

"ఏమిటే చాలా మారిపోయావ్?"

'కొందర్ని పరిస్థితులు మారుస్తాయి అమ్మగారూ' అందామనుకుంది నోట మాట రానట్టు తప్పు చేసిందానివలె నిలబడింది.



"ఏడే నీ కొడుకు!"

"ఇదిగో..." అందించింది.

"క్రింద దించు..." దూరం జరిగింది.

"శుభ్రంగానే వున్నాడమ్మా!" అన్నది చిన్నబుచ్చుకుని.

"లేడని అనలేదే. నాకు జ్వరం. చిన్న కుర్రాడిని యెందుకు యెత్తుకోవాలని...." వాడిని పరీక్షగా చూస్తుంటే ఆమె ముఖంలో రంగులు మారాయి. పసివాడిలోనే స్పష్టంగా భర్త పోలికలు తెలుస్తున్నాయి. ఆమె హృదయం భగభగమండింది. ఇంతవరకు ఆధారంలేని ఆరోపణలు అనుకున్నవన్నీ సాక్ష్యాలతో రుజువయినట్టు అనిపించింది.

"రండి...." విల్సన్ ఆహ్వానించాడు. మర్యాద కోసం అతని వెంట వెళ్ళిందని బాలామణి గ్రహించింది. ఆ క్షణంలో రెక్కలు వస్తే ఆమెకు దొరక్కుండా గగన మార్గంలో సుదూర తీరాలకు వెళ్ళిపోదాం అన్నంత ఆవేశం కల్గింది. కొడుకును జాగ్రత్తగా హృదయానికి హత్తుకుని ఇంట్లోకి వచ్చింది. ఏ పనీ చేయాలనిపించలేదు. తను అనాలోచితంగా అతనితో సంపర్కం పెట్టుకుందా?

"బాలమణక్కా! పువ్వులు కోసుకుంటాము" పిల్లలు అడిగారు.

"ఊ.... కోసుకోండి" అన్నది. వాళ్ళు ఆశ్చర్యంగా చూచారు. రోజూ ఒక దండకం చదివి, బెదిరించి గాని కోసుకొమ్మని అనేది కాదు.

"వెళ్ళి కోసుకోమన్నాను కదా..." అన్నది చికాకుగా. వాళ్ళు వెళ్ళి పోయారు. అలా యెంతసేపు కూర్చుందో తెలియదు. ఒడిలో నిద్రపోయిన కొడుకును అలాగే పట్టుకుంది. పడుకోబెట్టాలని కూడా అనిపించలేదు.

"రెక్కలు ఇరుసుకొని పంజేసేటోడికి యాడయినా పని దొరుకుద్ది. పో పొమ్మని బెదిరిస్తది. అడ్డమయిన తిట్లు తిడుతుంది." సాయిలు రుసరుసలాడుతూ వచ్చాడు.

"ఏమయింది?" తేరుకొని అడిగింది.

"ఆ యయ్య ముకం జూసి వూరుకున్నా. ఏమయిందో దవాకాన కెల్లి వచ్చిందో, లేదో నానా మాటలంది. ఆమె కొలువు లేకపోతే బతక

మంట. పొమ్మన్నది. వచ్చిన" అతని ముఖంలో కోపఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమెకు అర్థం అయింది. కోపంతో అతడిని ఉద్యోగంలో నుండి తీసివేసిందని. ఒక విధంగా ఆమెకు తృప్తిగానే వుంది. రోజూ ఆమె యెక్కడ పిలుస్తుందోననే భయముండదు.

"పోతే పోనీలే మన గేదెలను చూచుకుంటే చాలు" అన్నది.

"నాకు పని దొరకదనుకుంటున్నావా ఏం? రెండు మూడు నెల్లనాడే యెందరో అడిగిం(డు" అన్నాడు రోషంగా. అతడు భోజనము చేసి లేచాడు. రుమాలు దులుపుకుని భుజాన వేసుకొన్నాడు.

"మళ్ళీ యెక్కడికి?"

"అట్లపోతే పని దొరుకుతదేమో చూస్త."

"ఒక్కనాడు పని లేకపోతే చచ్చిపోవులే."

"అదికాదే ఆల్లకు సూపియ్యాలే, మనమూ చాతగానోల్లము కామని."

"ఊ.... పళ్ళెంలో పట్టుకుని తిరుగుతున్నారా ఏం?"

"చూడు పల్లెం వున్నట్టే పని తీస్కొని వస్త..." అతను వెళ్ళిపోయాడు. బాలామణి భోజనం చెయ్యలేకపోయింది. నోరంతా వెగటుగా, చేదుగా అనిపించింది. కొడుకు ప్రక్కన నడుము వాల్చింది.

పొద్దు యేటవాలింది. కృష్ణుడు లేచాడు. వాడికి పాలిచ్చింది. పాలు త్రాగుతూనే యేడుస్తున్నాడు. వాడి మూగ భాష అర్థం కాలేదు. యెత్తుకుని అటు తిప్పినా, యిటు తిప్పినా యేడ్పు మానలేదు. ఒకవైపు ఉదయం నుండి భోజనము లేక ఒడ్డినట్టున్న వళ్ళు నీరసంగా వుంది. వాడిని భుజాన వేసుకునే టీ కాచుకుంది. టీ గ్లాసుకు యెగబడ్డాడు. సగం గ్లాసు టీ చెమ్చాతో త్రాగిస్తే యేడ్పు మానాడు. మిగిలిన టీ త్రాగుతూ కొడుక్కు తన పాలు అందలేదా అని ఆలోచించింది.

"అక్కో.... కృష్ణుడిని యిలా యివ్వు." నర్సిమ్మ వచ్చాడు.

"ఎందుకురా?"

"ఇయ్యే వదిన తెమ్మంది."



"తీసుకు వెళ్ళు. బయట వదలకు" కొడుకును తయారు చేసింది. నర్సిమ్మ మేనల్లుడిని యెత్తుకున్నాడు.

"అక్కా.... ఓయక్క, సాయిలు బావ యేడున్నడో తెలుసా?"

"ఏడున్నాడురా?" అన్నది. ఆమెకు ఒళ్లు జలదరించింది. అవమానంలో కల్లుపాకలో దూరలేదు కదా?

"గుడిలో హరిదాసు పాండవుల జననము హరికథ చెబుతుంటే వింటున్నాడే" ఫక్కున నవ్వాడు.

"చాల్లే పెద్దవారిని వెక్కిరించకూడదని చెప్పలేదూ?"

"మా పెద్దోడులే.." అల్లుడిని యెగరేస్తూ పరుగులు పెట్టాడు.

"ఒరేయ్.... మెల్లగా" అరిచింది. అప్పటికే అతను దూరంగా వెళ్ళిపోయాడు. ఆమె పని చేద్దామన్నా, చేతులు నీరసంగా వాలిపోయాయి సహకరించమన్నట్టు. ఆమె కళ్ళ ముందు జయలక్ష్మి మెదలుతోంది. తను ఊహించరాని పొరపాటు చేసింది. సాటి స్త్రీ జీవితంలో భాగం తీసుకుంది. అది ఎవరయినా హర్షిస్తే హర్షించవచ్చును. ఆమె మనసు మాత్రం యెదురు తిరుగుతుంది.

"దీపం పెట్టలేదేమే...." సాయిలు గొంతు విని మెల్లగా లేచింది. "గ్యాస్ నూనె లేదా!"

"ఉన్నది" అన్నది మెల్లగా. దీపం వెలిగించింది.

"బుడ్డోడు యేడే?"

"నర్సిమ్మ యెత్తుకుపోయాడు" అన్నది అతనికి కంచము పెడుతూ. సాయిలు కాళ్ళు, చేతులు కడుక్కొని వచ్చాడు.

"ఈ పురాణాలు, శాస్త్రాలు యెవరి కోసమే, మనుషులకు కాదు?"

"కాదని చెప్పేడా హరిదాసు!"

"అట్ల కాదే పాండు రాజంతటోడు తనిష్ట పూర్వకంగా సంతు కావాలని, భార్యను పరాయి మొగోడికాడికి పంపితే అది గొప్పంట. మనసుంటోల్లము చేస్తే తప్పంట."

ఉలిక్కిపడింది బాలామణి. తనూహించినంత అమాయకుడు

కాదన్న మాట. ఈ పూట కూడా అన్నం సహించలేదు. అలాగే కూర్చుంది. మూడు రోజులుగా సీతారామిరెడ్డి రావటం లేదు. అతను హైద్రాబాద్‌లో పని వుందంటూ వెళ్లాడు. అతను వస్తే గాని, అతని హృదయములో తల దాచుకుని యేడిస్తే గాని మనసు శాంతించదేమోననిపించింది.

## 21

కమలమ్మ ప్రణాళికలు వెయ్యటంలో మొదటి నుంచి దిట్ట. ఆడబడుచు ఇంటికి వచ్చి వారం రోజులయింది. ఈ వారంలో క్షుణ్ణంగా ఆమె కుటుంబ పరిస్థితి అర్థం చేసుకుంది. దానికి తగిన ప్రణాళిక సిద్ధం చేసి పెట్టుకుంది.

ఉదయం లేచిన జయ ముఖం పరీక్షగా చూచింది. రాత్రంతా యేడ్చిందనటానికి నిదర్శనంగా కళ్ళు ఎర్రగా వున్నాయి. బొగ్గు తీసుకుని బావి దగ్గరకు వెళ్ళింది. వెనకాలే వెళ్ళింది కమల.

"కాఫీ పెట్టనా అమ్మాయ్."

"నేను వస్తానులే వదినా. చుట్టపు చూపుగా వచ్చినదానివి పనులేం చేస్తావు!" అన్నది. మనసులో మాత్రం 'నీ చేయి పడితే వారం రోజులు వచ్చే కాఫీ పొడి ఈ రోజే అయిపోతుంది తల్లీ!' అనుకుంది.

"ఎంత చిక్కిపోయావు. కళ్ళు వాచిపోయాయి. నీ బాధ యేమిటో చెప్పనిదే యెలా తెలుస్తుంది?" అనునయంగా అడిగింది.

"నాకేం బాధ వదినా!" తప్పించుకోబోయింది. కాని కన్నీరు రాలనే రాలింది.

"నీవు మమ్మల్ని దూరంగా వుంచినా, నిన్ను మేం పరాయిదానివి అనుకోము. కాఫీ నీవే కలుపుకుందువు. పొయ్యి రాజేస్తాను." ఆమె లోపలికి వెళ్ళింది.

ముఖం కడుక్కొని వచ్చింది జయలక్ష్మి. మసిలే నీళ్ళు ఫిల్టరులో పోసింది. కాఫీ దిగే లోపల పాలు కాచి, కాఫీ కలిపింది.

"రాత్రంతా యేడ్చావ్ కదూ?"



"నా బ్రతుక్కి మిగిలింది అదే కద వదినా..."

"ఛ.... ఏం మాటన్నావు. ఎందుకు అంత బాధపడతావు..."

"బాధపడక ఏం చేయను వదినా? ఆ బాలామణితో కాపురమే పెట్టారాయె. నేను నిలదీస్తే ఏం తెలియదంటారు. ఆయన మాటలు నిజమే అనుకున్నాను. మొన్న జంగమ్మ, వాళ్ళ కులందేలే వచ్చి చెప్పితే నమ్మలేదనుకో. నిన్న స్వయంగా నా కళ్ళతో చూచాను. పిల్లాడు.... అదే ఆ బాలామణి కొడుకు అచ్చు ఆయనలాగే వున్నాడు."

"అయ్యో..... ఎంత అప్రతిష్ట."

"అప్రతిష్ట యేమో గాని ఇల్లు గుల్లవుతున్నది. వదినా ఇల్లు ఈయనే కానిచ్చాడంటున్నారు. ఒక్క సంసారం గడవటమే ఈ రోజులలో గగనమయింది. రెండు సంసారాలా?"

"లెక్కంతా నీ చేతిలోనే వుంటుందేమో."

"ఇంటికి వచ్చిన తరువాత, రాకముందే దానికి చేరవేస్తుంటే ఏం చేస్తాం!"

"ఏం చేస్తామని ఊరుకుంటామటమ్మా. ఏదో చేయాలి?"

"అదే ఏం చేయాలో చెప్పు. ఇదంతా నా దురదృష్టం. వద్దు, వద్దు అన్నవారికిస్తాడు పిల్లల్ని. నేనేం పాపం చేశానో. రేపు ఆ సంకర జాతిని తెచ్చి నెత్తిన యెక్కించుకుంటే యేదీ దారి."

"మేమంతా లేమా. నువ్వు నేను చెప్పినట్టు విను."

"ఏమిటో చెప్పరాదూ?"

కమల నోరు విప్పబోయింది. రాజమ్మ దగ్గు వినిపించింది.

"ఆవిడొస్తున్నది తరువాత చెబుతాను" కమల దూరం తప్పుకున్నది. రాజమ్మను చూచి చిన్నగా నవ్వింది.

"పెద్దమ్మగారూ! కాఫీ కలపనా?"

"నాకెందుకమ్మా ఆ షోకులు, మా కాలంలో గంజి త్రాగి బ్రతికాము" అన్నది నిష్ఠూరంగా.

"అదేం మాట. నేను కలిపిస్తాను, మీరు ముఖం కడుక్కురండి"
ఆమె వెళ్ళిపోయింది.

"వదినా! నీకు మతి వుందా? ఇంట్లో వారందరికీ కాఫీలు టిఫినులు పెట్టమని నిన్ను పిలిపించలేదు."

"నీకేం తెలియదు జయా! ఇలాగే మా అన్నను అదరగొట్టాలి మనం ప్రేమతో సాధించవలసిన విషయాలు చాలా వున్నాయి. అయి ఆమె పరాయిదా?"

కాస్త తగ్గిపోయింది. కమల కాఫీ చేసి యివ్వగానే, ఆమె ఊహించినట్టే రాజమ్మ బయటికి వెళ్ళింది అందరితో చెప్పటానికి.

"ఇలా రా జయా! నీ తలంతా చిక్కుపడింది."

ఆమెను కూర్చోబెట్టి తలకు నూనె రాస్తూ, చిక్కులు తీస్తూ అస విషయం చెప్పింది. "అన్నయ్యగారికి కావాల్సింది ఇంట్లో తిరుగే చంటిపాపలు, ఇంట్లోకి రాగానే ప్రేమగా చూచే ఇల్లాలు..."

"ఇప్పుడు నేనాయన్ను కొరుక్కు తింటున్నానా?"

"అబ్బ? ఆ అసహనమే నీకు ముప్పు తెస్తున్నది! నా మాట వి కాస్త విసుక్కుంది.

"ఊ.... చెప్పు."

"నూటికి తొంబయిమంది మొగవారు తమ భార్యల వ చెడిపోతారు. అందుకని జాగ్రత్తగా, ప్రేమగా ఆయనను నీ దిక్కు తిప్పుకో, మా చిన్నాడిని పెంచుకుంటే సందడి. మా పెద్దాడిని తెచ్చుకుం మరో రెండేళ్ళలో పెళ్ళి చేయవచ్చు. మనుమలు, మనుమరాండ్ర తిరుగుతుంటే ఆయనే అన్నీ మానేస్తారు. తెలిసిందా?"

"బావుంది సలహా. మా ఆడబిడ్డ వుండే, ఆవిడ పడనిస్తుందా!"

"ఆమె తలలోని జేజమ్మ దిగి రావాలి. నేను చెప్పినట్టు వి ఆమె కూతుర్ని పెంచుకుంటానని అను. కొడుకు, కూతురు లేని లోటు తీరుతుందని చెప్పు. అప్పుడామె మాట్లాడితే అడుగు."

"వదినా! ఆడపిల్లను పెంచితే పెళ్ళి చేయటం మామూలు మాటా



ఆదీ, మన వెధవ జాతిలో కట్నాలు, కట్నాలు అంటారాయే" విసుక్కుని దూరం జరిగి, బర, బర నెత్తి గోక్కుంది.

"అవును. ఇప్పటి గండం గడిచాక, మనకు అవసరము లేదనుకున్న వారిని పంపించడము పెద్ద ఘనకార్యమా ఏం." ఆ విషయాన్నే కమలమ్మ రక, రకాలుగా చెప్పింది వున్న నాలుగు రోజులలో. ఆమె వెళ్ళిపోయింది. అప్పుడు స్థిమితంగా ఆలోచించింది జయలక్ష్మి. మనుమలు, మనుమరాళ్ళతో ఆడే వయసు కాదు కాని, మేనల్లుడుంటే తనకు మానసిక బలం పుంజుకొనే అవకాశముంటుందని మాత్రం గ్రహించింది.

సిటీ నుండి వచ్చిన సీతారామిరెడ్డి భార్య ప్రవర్తన చూచి నమ్మలేక పోయాడు. అతి సౌమ్యంగా సినిమాల్లో, నవలలో చూపించినంతగా తనను లాలించటం చూచి తెల్లబోయినంత పనిచేశాడు.

"అబ్బ! మళ్ళీ యిన్ని రోజులు మీరు బయట తిరిగితే ఊర్కోను."

"నేను ఆడుకున్నానేమిటి! పని వుంది. ఈ పొలాలు పండేది తక్కువే అయినా, చాకిరీ మాత్రం తప్పదు."

"అసలు యేమయింది?"

"ఏదో మా గొడవలు. ఏమిటి విశేషాలు?"

"ఒక్కమాట నిజం చెబుతారా..." బాలామణితో అతని పరిచయం అడుగబోయింది. వెంటనే వదిన చేసిన హెచ్చరిక గుర్తు వచ్చింది.

"ఏమిటది?"

"ఈ వారం రోజుల్లో నేను యెప్పుడయినా గుర్తుకు వచ్చానా?"

"అమ్మయ్య..." అతను తేలికగా నిట్టూర్చాడు.

"నేను అడిగిందేమిటి? నువ్వు చెబుతుందేమిటి!"

ఆమెకు కోపం వచ్చినా, ప్రేమ కలిగినా భర్తను ఏకవచనంతో సంబోధిస్తుంది.

"వివాహము అయిన తరువాత తిట్టుకున్నా, కొట్టుకున్నా ఒకరి మీద ఒకరికి ప్రేమాభిమానాలుంటాయన్నది నిజం."

"ఇంత తిప్పి చెబుతారేం" కాస్త నిష్ఠూరంగా అడిగింది.

"అది సరే. పొలం విశేషాలేమిటి? సాయిలు నమ్మకంగా వుండేవాడు" అన్నాడు కినుకుగా. నువ్వు తీసివేశావు అని అనలేక.

"సాయిలు లేకపోతే మనకు బ్రతుకు లేదా? పెంటడి కొడుకు పోచిగాడిని పెట్టానులే" అన్నది.

"వాడేం చేస్తాడే! ఆదివారం రాగానే సన్‌డే స్కూలంటూ మిషన్ కాంపౌండుకు వెడతాడు."

"ఇప్పుడా చెత్త కబుర్లెందుకు గాని, నేనో మాట చెప్తాను వింటారా?" అన్నది గోముగా, వీలయినంత మృదువుగా గొంతును మార్చి.

"ఊ..." ఆలస్యమెందుకన్నట్టు చూచాడు పడక మీద నడుము వాలుస్తూ.

"మీకు పిల్లల మీద విపరీతమైన మోజు కదా, పోనీ మళ్ళీ పెళ్ళి చేసుకోండి."

"ఏమిటి?" చికాకుగా చూచాడు.

"అవునండి, రోజూ ఆ వెలితితో ఇద్దరం ఒకరిని ఒకరము అసహ్యించుకుంటూ, ద్వేషించుకుంటూ బ్రతికే కంటే, సహకరించుకుంటే నయం కదూ?"

"నన్నిలా వుండనిస్తే సహకరించినట్టేలే."

"మీకు వివాహమంటే ఇష్టం లేదా?"

"ఆ.... చేసుకున్నాను, చాలు" అన్నాడు కళ్ళ మీద చేయి వేసుకొని.

"పోనీ, ఇల్లు సందడిగా వుంటుంది యెవరినయినా పెంచుకుందామా?"

"ఉమ వుంది కదా."

"అది కాదండీ! ఉమ మీ రక్తం, నా మీద ప్రేమ వుంటుందా? అందుకే ఇద్దరికీ ఉభయతారకంగా వుండే విషయం చెప్పనా?"

"అబ్బబ్బ! ఏమిటే నీ గోల! చెప్పనా, అడగనా అంటూ. అ చెప్పేదేదో ఒక్కసారే చెప్పు."

"అదిగో.... విసుక్కుంటున్నారు."



అతను చిత్రంగా చూచాడు. ఈ పాటికి అలకపాన్పు ఎక్కవలసిన ఇల్లాలు సహనంగా వుందంటే యేదో వుందని ఊహించాడు. అతను అటు ప్రక్కకు తిరిగి పడుకున్నాడు. అతని భుజం మీద గడ్డం ఆన్చింది.

"నా మాట వింటున్నారా?"

"ఊ..." అన్నాడు.

"ఉమ వుంటుంది. అన్నయ్య కొడుకు చందును తెచ్చుకుందామని వుంది. అటు కొడుకు, యిటు కూతురు దొరుకుతారు."

"ఏమిటే నీ పిచ్చి గాని తొలుచూలు కొడుకును మనకిస్తారా?"

"అదంతా నా కొదిలేయండి..." ఆమెను యింకా మాట్లాడనిస్తే మిగిలేది వ్యధ అని తెలుసు. అందుకే ఆమెను దగ్గరకు లాక్కున్నాడు. ఆమె సంతోషంతో కరిగిపోయింది.

## 22

"భలే అమ్మాయిలే. నెల తప్పింది తెలియదా" మార్తమ్మ కూకలు వేసింది బాలను.

"నిజంగా తెలియదమ్మా. వీడు ఏడుస్తుంటే పాలు సరిపోవటం లేదని ఊహించలేకపోయాను. పిచ్చిదాన్ని."

"నయము. యిప్పుడయినా పరీక్ష చేయించుకున్నావు. వెళ్ళు, వెళ్ళి కొస్త రెండు పూటలా కడుపు నిండా భోజనము చేయి".

"గట్ల చెప్పండి పంతులమ్మ. మీరు దగ్గరుండబట్టి సరిపోయింది. లేకుంటే పిల్లగాడిని ఏం చూస్తుంది మా బాలమ్మ..." మల్లమ్మ అందుకుంది. నీరసంగా తల్లి వెనకాల ఇంటికి వచ్చింది బాలామణి. ఆమెకు దిగులుగా వుంది. అప్పుడే ఇద్దరు బిడ్డలా తనకు?

"నువ్వేం ఫికరు చెయ్యకు బిడ్డ. నారు పోసిన వాడు నీరు పొయ్యడా! మనసుంటి గరీబుగాల్లకు రెక్కల కష్టమే దిక్కు."

"అలా ఏం లేదమ్మా. మీరంతా ఆస్తులుండే పిల్లల్ని పెంచారా ఏం?" అన్నది. మల్లమ్మ మనుమడిని చంకనేసుకు పోయింది. బాలామణి నీరసంగా స్థంభానికి చేరబడింది.

"బాలా...." సీతయ్య పిలుపు విని లేచింది.

"మీరా...." నవ్వలేనట్టు నవ్వింది.

"ఏమలా వున్నావు?" చెప్పింది. అతని ముఖం సంతోషంతో విప్పారింది. ఆమె వీపు మౌనంగా నిమిరాడు.

"బాలా నువ్వు యెందుకో బాధపడుతున్నావు. నాతో చెప్పకూడదా?"

"నాకేం బాధ"

"నువ్వు పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తున్నావు మాట. నీ పేర పొలం రాయనా?"

"మీకు వారి మీద ప్రేమాభిమానాలుండాలి గాని, భూమి, పు ఉద్ధరిస్తాయా ఏం?"

"ఆ నమ్మకముంటే చాలు" అన్నాడు. ఆమె భోజనము చే లేదని తెలుసు. అందుకే తనకు ఆకలని ఒండించుకున్నాడు. ఇద్దరు భోజనము చేశారు. అతను రాత్రి యెనిమిది గంటల వరకు వు వెళ్ళిపోయాడు. అతను వెళ్ళాక పాలు తీసి, తమ్ముడి దగ్గరకు బయ దేరింది. కృష్ణుడు తాత బొజ్జ మీద కూర్చుని నవ్వులు కురిపిస్తున్నాడు. ఇంట్లోని వారంతా తమ తమ పనులు వదిలి వాడి ఆటపా చూస్తున్నారు. వాడికేం అదృష్టవంతుడే. తన అమాయకపుటాలోచ నవ్వుకుంది. కొడుకును పిలిచింది. వాడు తాతను గట్టిగా పట్టుకున్నాడు.

"ఆడు రాడే బాలమ్మా. ఈడ్నె వుంచు".

"మల్ల పిల్ల పుడితే ఇక్కడ్నే ఉంచుతదిలే" అన్నది మల్లమ్మ వంక సాభిప్రాయంగా చూస్తూ. ఆమె నవ్వి కొడుకును ఎత్తుకొ వెనుతిరిగింది. ఆమెకు చిన్నారి కృష్ణుడే ఓ రక్షగా కనిపిస్తాడు. మునుపటి భయపడటం లేదు. వసారాలోకి వచ్చి ఆగిపోయింది. సాయిలు చు వెలిగించుకొని కూర్చున్నాడు. అతను చుట్ట కాల్చటము మొదటిసా చూచింది.

"కృష్ణుడు నిదురబోయిండా?"

"ఆడుతున్నడు" అన్నది దింపేస్తూ.



"ఇక్కడ దించేయి..." తన ప్రక్కన చూపాడు. "వాడే వస్తాడు చూడు." రోజూ జరిగే తతంగము. ఆమె నిదురబోయాక వాడిని తెచ్చి పడుకోబెడతాడు సాయిలు. వెళ్ళి పడుకుంది. ఎప్పుడు నిదుర పట్టిందో తెలియదు. తలుపు బాదిన చప్పుడయితే లేచింది.

"తలుపులేసుకుని పడుకో కూడదే బాలా?" మార్తమ్మ అడిగింది.

"తలుపులు వేసుకుంటాను. ఆయన పాలు తీసి వెళ్ళిపోయారు! లేవలేదు.... ఆ... ఇంకా తెల్లవారనట్టుంది."

"అవునే. విల్సన్ పట్టణం పోవాలి."

"ఈ రోజు ఆదివారము కాదా?"

"అవును. కాని వాడు అమెరికా వెళ్ళాలని ప్రయత్నిస్తున్నాడని చెప్పాను కదా."

"ఈ రోజే వెడతాడా?"

"బావుందే, అదేమన్నా హైద్రాబాదా? మద్రాసు వెడుతున్నాడు పాస్‌పోర్ట్ కోసము."

"అలాగా" లేచి పాలు కొలిచి ఇచ్చింది.

"వస్తానే" ఆమె వెళ్లిపోయింది. బాలామణికి అర్థం కానిది ఒక్కటే. ప్రతివాడూ ఉద్యోగం కావాలంటాడు. అది దొరికినాక హైద్రాబాద్ లాంటి పట్టణాలు కావాలంటారు. అక్కడ తృప్తిగా వుంటారా-మళ్ళీ అమెరికా వెళ్ళాలంటారు. ఈ కోరికలకు అంతం వుండదేమో! అంతు వుంటే మృత్యువేనా! అర్థం కాలేదు. ఆలోచిస్తూ కాలకృత్యాలు తీర్చుకుంది. బాలామణి రెండవసారి కొడుకు పుట్టగానే ఆపరేషన్ చేయించుకొంది ఒక ఆడపిల్లయినా కావాలని తల్లి గొడవ చేసింది.

"కృష్ణుడే చాలనుకున్నానమ్మా. నా అజాగ్రత్త వల్ల మరొకడు పుట్టాడు. వీళ్ళను సక్రమంగా పెంచగల్గితే చాలు" అన్నది.

బాలకు దిగులుగా వుంది. తోడుగా వుండే విల్సన్ కుటుంబము అమెరికా వెళ్ళిపోయారు. తనకు యెన్నో విధాలుగా సహాయపడి సహకరించినవారు. వారి పిల్లవాడి లాగే పెరిగాడు కృష్ణ. రెండవసారి

కొడుకును చూసుకున్నప్పుడు సీతారామిరెడ్డి పొందిన ఆనందం యిం
అంతా కాదు.

"నామకరణోత్సవం భారీగా చేయాలి."

"ఎందుకు నల్గురి నోళ్ళల్లో పడడానికా?"

"ఇప్పుడు మన గురించి ఎవరూ చెప్పుకోవడం లేదా వెర్రిదాన"

అతని సరదా కాదనడం యెందుకని అందరికి భోజనాలు చెప్పి వెనకాల చెవులు కొరుక్కున్నా యెదురుగా వచ్చి అనే ధైర్యం ఎవ లేదు. జంగమ్మకు మంటగా వుంది. తమ్ముడికి మళ్ళీ పెళ్ళి చేస్తే అమ్మాయి మారుటి పిల్లల పోరు భరించలేనంటూ వెళ్ళిపోయింది. అంద మల్లమ్మ పిలవగానే వచ్చింది. మల్లమ్మకు కూతురి వైభవం చూపా కోర్కె. జంగమ్మకు చూచి నల్గురిలో యేదో అనాలన్న తపన.

"ఏమే బాలా పిల్లగాడు యెవరిలాగా వున్నడు?"

"నువ్వే చెప్పాలి జంగమ్మ ఒదినా" నవ్వింది బాల.

"మీ ఇద్దరి లాగ లేడు."

"తల్లిదండ్రులే కాకపోతే మేనమామల రూపు వస్తది" పేరంటాలు చెప్పింది.

"మీ చాదస్తం. ఇప్పుడే పుట్టిన పిల్లగానికి పోలికలేం దెలుస్తయి ఓ నెల పోతే తెలుస్తయి" అన్నది మరో ముత్తయిదువ. అందరినీ మింగాలన్నంత కోపం వస్తోంది జంగమ్మకు. కీ యిచ్చి వదిలేసిన మాట్లాడించేది ఆడవాళ్ళతో. అసలు యిప్పుడు తను యెగదోసి మాట్లాడరు అదేం ఖర్మో. పని వుందంటూ భోజనము చేయకనే వె పోయింది. మల్లమ్మ తేలికగా ఊపిరి పీల్చుకుంది. ఇలాంటి వారిని పిలవద్దనుకొంది. బాగా త్రాగిన కొమురయ్య బాబయ్యను నానా తిడుతున్నాడు. కల్లు త్రాగేటప్పుడు న్యాయము బలే గమ్మత్తు వుంటుంది. ఎవడి దగ్గర డబ్బులుంటే వాడిదే న్యాయము లేదా యెవ త్రాగిస్తుంటే వాడిదే న్యాయం. ఇప్పుడు కల్లు కుండకు అధి కొమురయ్య. అందరూ అతడినే వెనుకేసుకు వస్తున్నారు.



"మీ పని నేను జూస్త...." బాబయ్య పై కండువా కసిగా దులుపుకుని వెళ్ళిపోయాడు.

పసివాడికి బలరామ్ అనే పేరు ఖాయము చేశారు. ఆ రాత్రి ఒగ్గువారు మల్లన్న దేవుడి కథ చెప్పారు. ఆ తరువాత కృష్ణుడి మీద పాటలు పాడారు.

"గొల్ల వాడల్ల కృష్ణమూర్తీ
అవతరించినావయ్య కృష్ణమూర్తీ
పల్లని మా సామి కృష్ణమూర్తీ
మము సల్లంగా జూడవయ్య కృష్ణమూర్తీ
అవతార పురుషుడవు కృష్ణమూర్తీ
ఆలమందలు నీవయ్య కృష్ణమూర్తీ"

"ఏందిర గంత మెల్లగా పాడతారు?" వయసు మరచిపోయి, కొమురయ్య చేతులు కలిపాడు. అందరూ కోలాటం ప్రారంభించారు. ఒక్కొక్కరే మొగవారంతా ఆటలో చేరారు.

మేం తక్కువా అన్నట్టు ఆడవారు చేరారు. అందరూ ఒళ్ళు మరచి పోయారు.

చేతులెత్తి మొక్కుతాము కృష్ణమూర్తీ
మా చీరలన్నీ యివ్వవయ్య కృష్ణమూర్తీ"

అంటూ అందరినీ పంపి పండుకుందామని వచ్చింది మల్లమ్మ. ఇద్దరి కొడుకుల మధ్య నిదురపోతున్న కూతుర్ని చూచి తృప్తిగా నిట్టూర్చింది. ఇక ఎవరేమనుకుంటేనేం రామలచ్చుమ్మల్లా ఇద్దరు కొడుకులున్నారు అనుకుంది. అమాయకులకు అదే తృప్తి, రేపు అన్నది వారు ఆలోచించేది చాలా తక్కువ.

"ఇంటికి బోదాం రాయే" కొమురయ్య పిలిచాడు.

"ఇద్దరి పిల్లలతో పిల్లొక్కతి చేసుకుంటదా? నెలరోజులు యిక్కడే వుంటాను."

"ఆడ యెవరు చేస్తారే?"

"కోడలు" అన్నది.

"ఊం.... తలుపు గొండ్లెం పెట్టుకోయే" అతని కిర్రు చెప్పుల చప్పుడు దూరం అయింది.

"మీ అయ్య తాగుడు మానడేమోనే" దిగులుగా చూచింది.

"తాగితే మునుపటిలాగే కొడతాడా?" ఆవులిస్తూ అడిగింది బాలామణి.

"ఏమిటో పిచ్చిదాన్ని నీ నిద్ర పాడయింది."

"లేదులేమ్మా అలసటగా వుండి మాగన్ను పడింది."

"మీ అయ్యతో దెబ్బలు తినలేక తాగనీ, సావనీ అని ఊరుకుంటే కోడలి పోరి ముందు దెబ్బలు తిందునా?"

"మంచి పని చేసినవు. అన్న పేకాట మానేశాడా?"

"ఆ మానేసిండు బిడ్డ. కోడలు పిల్ల గట్టిది" అన్నది తలుపు గడియ వేస్తూ. ఆ తరువాత దీపం తగ్గించి క్రింద చాప పరుచుకొని పడుకుంది.

తల్లి వుండటము వల్ల అలసట తెలియకుండా పనులు జరిగి పోతున్నాయి. కాని మరో ఇబ్బంది వచ్చి పడింది, స్వేచ్ఛగా లేక సీతయ్యతో మాట్లాడలేకపోతోంది. అతనూ అంతే. పిల్లలను దగ్గరకు తీసుకోవటానికి ఇబ్బంది పడుతున్నాడు.

"అమ్మా!" కొడుక్కు నీళ్ళు పోసి తుడుస్తూ పిలిచింది.

"ఏందే!"

"అక్కడ వదిన ఒక్కతీ బాధపడుతుందేమోనే. ఒట్టి మనిషి కూడా కాదాయె."

"పని చేస్తేనే కదా కాన్పు అలకగ అయితది."

"కృష్ణుడు మూడొంతులు మీ దగ్గరే వుంటాడాయె, చిన్నవాణ్ణి చూచుకుంటాలే. వదిన పరాయింటి పిల్ల" అన్నది. మల్లమ్మకు వారం రోజుల తరువాత వెళ్ళక తప్పలేదు.



ఆ రోజు మల్లమ్మ లేదని గ్రహించిన సీతారామిరెడ్డి వస్తూనే బాలను దగ్గరకు తీసుకున్నాడు.

"ఛ... వదులు.... కృష్ణుడు మనవంకే చూస్తున్నాడు."

"సరే లే. ఇలా దగ్గర కూర్చుంటే ఏం మునిగిపోదు." ఇద్దరూ వెళ్ళి మంచం మీద కూర్చున్నారు.

"వీడిని డాక్టర్ చదివిద్దాం. పెద్దవాడిని ఇంజనీరును చేద్దాము బాలా."

"అప్పుడేనా?" కిలకిల నవ్వింది.

"అప్పుడేనా యేమిటి మరో రెండేళ్ళు పోతే కృష్ణుడు బడికెడతాడు."

"బడికి వెడతాడు గాని ఇంజనీరు కాడు."

"బడిలో వెయ్యగానే అవుతారేమిటి?" అలా పిల్లల భవిష్యత్తును గురించి చర్చలతో అర్ధరాత్రి గడిచిపోయిందే తెలియదు.

"ఇంటికి వెళ్ళరా?"

"ఈ రోజు వెళ్ళినా నా గురించి యెవరూ పట్టించుకోరు. మా అత్త మామలు యెవర్నో మంత్రకాడిని తీసుకు వచ్చారు. కూతురికి యేమో జబ్బుందని, దయ్యం పట్టిందని ఊహించి, అది దించే ప్రయత్నంలో వున్నారు. వారికి తోడు పెంటడున్నాడు."

"పోనివ్వండి. ప్రతి స్త్రీకి తల్లి కావాలనే కాంక్ష వుండడంలో తప్పు లేదు."

"అయితే నాకు లేదంటావా?" అతను చిన్న కొడుకు ప్రక్కన పడుకున్నాడు. వాడు చిన్న చిన్న కాళ్ళు పైకి లేపి తన్నినప్పుడు యేదో వింత అనుభూతికి లోనవుతున్నాడు.

"వీడు మంచి ఆటకాడవుతాడు."

"ఈ రోజు కొత్త కొత్త విషయాలు గుర్తుకు వస్తున్నాయేం!" నవ్వింది. ఆమె రెండో వైపు పడుకుంది. అలా పడుకున్నప్పుడు. ఆమెకెంతో తృప్తిగా వుంది. స్త్రీ పురుషులు ఒక లైంగిక జీవితం కోసమే ఒక గూటి క్రింద వుంటారేమో. అనుభవాలు, అనుభూతులు కలిసి పంచుకోవడంలో వుండే తృప్తి మరెక్కడా వుండదేమో? ఒంటరితనము మనిషిని బలహీనపరుస్తుంది. అనవసరమైన ఆలోచనలు అసంతృప్తిని కలుగజేస్తాయి.

"మీరు యిటు వస్తారా! వాడు పాలకు తడుముకుంటాడు."

"అబ్బో! అప్పుడే ఈ చిన్నారి దొరగారికి రాజసం వచ్చింది."

అతను లేచి వచ్చాడు. బాల అవతలి వైపు వెళ్ళింది.

"బాలా! వీడి శరీరం మీద, ఈ పచ్చ గీతలూ, ఎర్ర గీతలు యేమిటి?" అడిగాడు.

"మీరు యెప్పుడూ పసిపిల్లలను చూడలేదా?"

"అక్కయ్యల పిల్లలను, మా సరస్వతి పిల్లలను చూచాను కా దూరం నుంచే సుమా" అన్నాడు. మరో అయిదు నిమిషాలకు నిద్రబోయి గంట తరువాత మేలుకున్నాడు. బాలామణి కృష్ణుడికి గ్లాసులో పాలు త్రాగిస్తోంది.

"నిద్ర పోలేదా?"

"వీడు లేచాడు" అన్నది. బరువుగా వాలిపోయే కళ్ళనెత్తి అతను అటు తిరిగి పడుకున్నాడు. మరో రెండు గంటలకు యిటు తిరిగాడు. ఈసారి చిన్నవాడికి గుడ్డలు మారుస్తోంది.

"నిద్ర పోనే పోవా?"

"పోయి, మేలుకున్నాను."

"యెప్పుడు పడితే అప్పుడు లేవడానికి వీలవుద్దా బాలా.... అ"

"అదే అలవాటు అవుతుంది. దాదాపు రాత్రంతా ఇద్దరితో నిద్ర వుండదు." అన్నది.

"ఆరోగ్యం దెబ్బ తినదూ?"

"తల్లికి ఆ ఓర్పు నేర్పు ప్రకృతే యిచ్చిందేమో" వాడిని పక్కలో వేసుకుని నిద్రబోయింది బాలామణి. అతనికి చిత్రంగా కనిపించింది. ఎప్పుడు పడితే అప్పుడే లేవడం, నిద్రబోవడం కూడా ఒక కళేననిపించింది.

"అమ్మా..." కృష్ణుడు లేచాడు.

"రా...." కళ్ళు విప్పకుండానే చేయి చాపి వాడిని తీసుకుని పొట్ట మీద వేసుకుని జోకొట్టింది. ఇద్దరూ గాఢంగా నిద్రబోయారు. అతను అలాగే చూస్తూ నిద్రలోకి జారిపోయాడు.



# 23

జయలక్ష్మి కోపం తారాస్థాయికి వెళ్ళింది. పెంటడు అపరాధిలా నిల్చున్నాడు.

"ఈ గడ్డంతా అమ్ముకొని నాటకం ఆడుతున్నావన్న మాట కదూ?"

"లేదమ్మా, అమ్మినోని నోట్లో మన్ను పడని..."

"ఇప్పుడు నేను పొమ్మంటే నోట్లో మన్నే పడుతుంది. చెప్పు అమ్మావా లేదా?"

"ఎంత ఒట్టు అంటే అంత ఒట్టు మీ బాంచను. నేను అమ్ముకుంటానా? మీ ఉప్పు తినేటోడ్ని...."

"మా ఉప్పు తింటావు కాబట్టే మాకు యెసరు పెట్టావు. మా కూరగాయలు నీ భార్య అంగట్లో అమ్ముతుంది. మా గింజలు నువ్వు కొట్టుకు తీసుకువెడతావు. మా గడ్డి అమ్ముకుంటారు."

"ఎంతెంత మాటలంటున్నారు..."

"నేను అబద్ధం ఆడుతున్నానా! నాకు ఇంట్లో బయటా దోపిడీ చాతకాదు. నేను యెటయినా వెళ్ళిపోతాను" ఆవిడ కోపం రోషంగా మారింది. ఉయ్యాల బల్లమీదున్న భర్త మాట్లాడకపోవడం అవమానంగా భావించింది.

"ఏమండీ వింటున్నారా?"

"ఏమిటీ?" తాపీగా అడిగాడు.

"పెంటడు చేసిన నిర్వాకము."

"నాకు ఆనాడే తెలుసే పిచ్చిదానా." లేచాడు. "ఏమిట్రా లేనిపోనివి చెప్పి వాడిని వెళ్ళగొట్టించావ్. నువ్వు చేసిన ఉద్ధరింపేది! ఈసారి దొరికితే పోలీసులకు వప్పకిస్తాను వెళ్ళు...."

అతను వెళ్ళిపోయాడు. సీతయ్య మనసులో బాలామణి మాటలు మెదిలాయి.

"మీలాంటి దొరలవల్లే మాలాంటి వారం దొంగల మవుతున్నాము. చాలినంత జీతం యిస్తే యెవడూ దొంగతనం చేయడు." అది నిజమా

అని చాలాసార్లు తర్కించుకున్నాడు. కొంతవరకు నిజమే అనిపించింది. రక్షణ లేదన్న భయంవల్ల కాబోలు దొరికినంతవరకు అందుకోవాలని చూస్తారు పనివారు.

"సాయిబ్బును పిలిపించుదామా?"

"వాడెక్కడ వస్తాడే? నాలుగు గేదెలు, ఆవులున్నాయి" అన్నాడు

"అవన్నీ మీరిచ్చినవే కదూ?"

"ఇదీవరస! నీకు అన్నీ అనుమానాలే. నీకు తెలియకుండా దగ్గర డబ్బెక్కడిదే?"

"పంట అమ్మి, కూరగాయలమ్మి నాకు లెక్కలు చెబుతున్నారేమిటి? ఈ ఇంటి సొమ్ము అడ్డమయిన వాళ్ళు తిన నోచారు" రుసరుసలాడింది. ఆ రోజు ఆవిడ పట్టుదలగానే వుంది. బాలామణి విషయం యేదో ఒకటి తేల్చుకుందామని? అతనూ ఓ నిశ్చయానికి వచ్చాడు అవసరమయితే విషయాలు చెప్పేద్దామని. ఇంతలో వరమ్మ పిలిచింది కూతుర్ని.

"ఏమిటే?"

"తాడు తెగేవరకు లాగకూడదమ్మా. ఈ రోజు చందు వస్తాడు. వాడిని దత్తత తీసుకునేందుకు అంగీకరిస్తే చాలు" నచ్చచెప్పింది. జయ తన కోపం దిగమింగింది. వారు వ్యవసాయం విషయంలో తర్జన భర్జన జరుపుతుండగానే చందు వచ్చాడు. అతని పూర్తిపేరు చంద్రశేఖరరెడ్డి. అందరూ చందూ అనే పిలుస్తారు. మెట్రిక్‌లో తప్పాడు.

"నమస్తే మామయ్యా!"

"నమస్తే రా... రా.... అంతా కులాసాగా వున్నారా!"

"అంతా బావున్నారు, తాతయ్యే లేరని చిన్నాడు బెంగ పెట్టుకున్నాడు."

"చిన్నాడేనా? మీ నాన్న బెంగపడ్డారనుకొన్నాను."

"మా అన్నను అననిదే తోచదు." ముసిముసిగా నవ్వింది జయ. ఓ పదినిమిషాల తరువాత జయ ఇంట్లోకి వెళ్ళి వచ్చింది.



"చందూ! అన్నం తయారుగా వుంది. భోజనం చేస్తావా, కాఫీ కావాలా? మీ అమ్మ అర్ధలీటరు గ్లాసుతో అలవాటు చేసిందా యేం?" అని అడిగింది.

"ఏమిటే ఆ పిచ్చి ప్రశ్న! కాఫీ యివ్వు. స్నానంచేశాక భోజనం చేస్తాడు గాని...."

"రికమండేషన్ చేస్తున్నారు. మీకు దొరుకుతుందనా? ఆ పప్పులేం ఉడకవు..."

"జయా!" వరమ్మ పిలిచింది. జయ లోపలికి వెళ్ళింది. ఆమె యిచ్చిన రెండు కాఫీ గ్లాసులు చేతుల్లో పట్టుకుంది. వాటి వంకకు చూచిన ఆమె మనసు గిలగిలలాడిపోయింది.

"మనుమడికి అప్పుడే ఇవ్వకపోతే మొలకెత్తుతాడటే అమ్మా?"

"అది చల్లారిపోతుంది యిచ్చిరా."

"ఊం....." ఆమె కాఫీ గ్లాసులు తెచ్చి చెరొకటి ఇచ్చింది.

"చాలా వుందేమో కాసింత తీసివేయనా?"

"ఫరవాలేదులే" అన్నాడు భర్త. మధ్యాహ్నం కబుర్లతో హాయిగా గడిచిపోయింది.

"రెడ్డీ..." రాంరెడ్డి అల్లుడిని పిలిచాడు. వివాహమయినది మొదలు ఆయన అల్లుడిని అలాగే పిలుస్తాడు.

"ఏమిటి మామయ్యా?"

"నీతో ఒక విషయం చెప్పాలయ్యా."

సీతయ్య వెళ్ళి అతని దగ్గర కూర్చున్నాడు.

"అపుత్రస్య గతిర్నాస్తి అన్నారు పెద్దలు. మొన్న మేము తీసుకు వచ్చిన అతను శాస్త్రాలు, సాముద్రికం తెలిసిన పండితుడు. జయకు సంతాన ప్రాప్తిలేదని చెప్పాడు."

"పోనివ్వండి, యెవరికి యెంత ప్రాప్తో అంతే దొరుకుతుంది."

"అలా అని మనం ఊరుకుంటామా? మానవ ప్రయత్నం చేయాలి కదా!"

"ఏం చేద్దాం చెప్పండి?"

"సంతాన హీనులయినవారు దత్తత చేసుకోవాలని శాస్త్రాలు చెబుతాయి."

"అది కాదండీ..."

"నాకు తెలుసు బాబూ నువ్వేం చెబుతావో, అనాదిగా పురుషుడు బయట తిరుగుతాడు కాబట్టి రెండు జీవితాలు అనుభవిస్తాడు. సంఘం దాన్ని గురించి పట్టించుకోదు. బయట జీవితం బయటవరకే పరిమితం చేయాలి రెడ్డీ. వారిపై అపరిమితమయిన అనురాగం వుండవచ్చు, అది వేరే విషయం."

"వారు.... అంటే భార్యకు తప్ప మరో స్త్రీకి పుట్టినవారు వారసులు కారా?"

"కారు. చరిత్ర తిరగేయి. పట్టపుదేవికి పుట్టినవారే అర్హులని నిర్ణయించారు."

"దానిని ఆమోదించిన వారికంటే యెదురు తిరిగినవారు యెక్కువ కనిపిస్తారు."

"అదంతా చరిత్రకారుల చమత్కారం. అదంతా యెందుకు బాబూ! నువ్వు దత్తత చేసుకుంటే యేదో మా అమ్మాయికి రక్షణ దొరుకుతుందనే గాని, నీ ఆస్తి ఆశించి కాదు. నీకు దగ్గర వారుంటే నువ్వు పంచిపెట్టుకో" అన్నాడు.

"ఈ విషయంలో నన్ను క్షమించండి" లేచాడు.

"రెడ్డీ."

"అవును మామయ్యా. మాకిప్పుడు వయసు మళ్ళిందా, యెవరో ఒకరు చెప్పింది కొలమానం అవుతుందా?"

"నా మాట విను రెడ్డీ!"

"ఈ ఒక్క విషయంలో మన్నించండి" అన్నాడు. జయలక్ష్మికి భర్తపై విపరీతమయిన కోపం వచ్చింది. ఆమె భోజనం మానేసింది. రెండు రోజులు గడిచాయి. రాజమ్మకు ఆందోళనగానే వుంది. సరస్వతికి కబురు



చేసింది. ఆమె అన్నకు వచ్చి నచ్చచెప్పాలని చూసింది. సగం వాటా తనకు కూతురు ద్వారా ముడుతున్నప్పుడు ఆ మాత్రం చేయకపోతే యెలా?

అతను ఒక్కడయ్యాడు. ఇంట్లో అందరూ ఒక్క పట్టుపట్టారు. శాస్త్రాలు, పురాణాలు విప్పారు. గోవిందరావు వాళ్ళ మాటే నిజం అన్నాడు.

"నా కూతుర్ని అన్యాయం చేయకు బాబూ" వరమ్మ అర్థించింది. ఇప్పుడు జరుగుతున్న అన్యాయమేమిటో అర్థం కాలేదు.

"అన్నయ్యా! కలకంఠికంట కన్నీరొలికిన సిరి ఇంట వుండనొల్లదు" అంటారు. ఇది నీ ఆస్తి. దత్తత చేసుకున్నంత మాత్రాన నీకిష్టమయిన వారికి యిచ్చుకునే అధికారం వుండదా ఏం? నేను ఆ గొల్లమ్మాయి విషయం విన్నాను. ఆమెకు నువ్వు యేది చెయ్యాలన్నా ఉపవాసాలు, గొడవలు బయలుదేరుతాయి."

"అది కాదమ్మా. వాళ్ళు నా స్వంతపిల్లలు. వారుండగా యింకొకరిని దత్తు చేసుకోవడం ఏం బావుంటుంది?"

"స్వంత పిల్లలని నీ మనసులో అనుకోవాలే గాని పైకి చెప్పగలవా అన్నయ్యా? ఈ విషయం పరువు ప్రతిష్టలకి సంబంధించింది. అదీకాక వర్ణసంకరమయిన పిల్లలు ఈ ఇంటికి వారసులా?"

"సరస్వతీ!"

"నిజమన్నయ్యా! దత్తత చేసుకోగానే నీ ఆస్తి అంతా రాయడం లేదు కదా! ఏదో ఇంటికి దీపం పెట్టేవారుంటారన్న తృప్తి మిగులుతుంది" అన్నది.

అతను మరోరోజు ఆలోచించాడు. జయ హఠం వదలలేదు. అత్తమామలు అభోజనంగా గడుపుతున్నారని తెలిసింది. సీతారామిరెడ్డి తెగింపు గలవాడు కాదు. భయపడిపోయాడు. మామగారిని పిలిచాడు.

"ఏం రెడ్డీ?"

"జయ ఇష్టప్రకారమే దత్తత జరుగుతుంది. నా షరతులు కొన్ని వున్నాయి."

"చెప్పు బాబూ!"

"చందుకు నేను యిచ్చిందే తీసుకునే హక్కుంటుంది. అలాగే ఉమకు వివాహం చెయ్యడం వరకే మా బాధ్యత. ఆస్తిలో హక్కుల ప్రసక్తిలేదు... వుండదు."

"నీ ఇష్టం బాబూ."

"అయితే దత్తత చేసుకోమనండి."

"ఆ మాట నువ్వు చెప్పు నాయనా. ఏనాడయితే నీ ఇంటికొచ్చిందో ఆనాడే నీ భార్య నీ సొత్తు అయింది".

సరస్వతికి ఈ విషయం నచ్చలేదు. రెండు నిముషాల తరువాత ఏం ఆలోచించిందో, ఆమె పెదవుల మీద చక్కటి చిరునవ్వు నాట్యం చేసింది.

"సరసూ! అలా ఊర్కుంటావేమే. సగం ఆస్తి రాస్తేనే పిల్లను వుంచుతానని అనవే" తల్లి పొడిచింది.

"మన పిల్లలేకపోయినా బాధపడేవారు లేరు. ఎలా సగం ఆస్తి రాదో నేను చూస్తాన్లే...."

"ఉష్! అన్నయ్య...." మోచేతితో పొడిచింది రాజమ్మ. సీతయ్య వెళ్ళి భార్యను లేపాడు.

"నన్ను భోజనం చేయించడానికి అంటున్నారు" అపనమ్మకంగా చూచింది.

"లేదు జయా. హృదయపూర్వకంగా అంటున్నాను. నీది నీవు యెవరికిచ్చుకున్నా ఫరవాలేదు."

"మళ్ళీ నా ప్రసక్తి యెందుకు?"

"మనిద్దరి మధ్య సరైన సామరస్యం లేకపోతే నీ నా ప్రసక్తి దానంతట అదే వస్తుంది. నీ అభీష్ట ప్రకారమే చందును దత్తత చేసుకుందాం. ఉమకు వివాహం చేద్దాం సరా?"

"అది రాసేవరకు నేను నమ్మను" అన్నది మొండిగా.

గోవిందరావుకు కబురు చేశాడు. అతను స్టాంప్ కాగితాలు



తీసుకొని వచ్చాడు. అదంతా వ్రాశాడు. సీతారామిరెడ్డి ఆస్తిపైన ఆయనకే హక్కు వుంటుంది. అంత పడరాని పరిస్థితులు వస్తే సగం ఆస్తి అతనికిచ్చి పంపివేయాలి. ఉమ వివాహం చేసి పంపాలి. ఆ ఇంటి ఆడపిల్లలా అన్ని లాంఛనాలు అందుతాయి అని వ్రాసి సాక్షుల యెదుట సంతకం చేశాక అతని హృదయం యెందుకో తేలికయింది. ఇంట్లో వారందరి ముఖాలు తేటగా మారి కలకలలాడాయి. అందరూ లేచి భోజనాలు చేశారు.

"శాస్త్రోక్తంగా ఆ ముచ్చటకాస్తా తీరితే..." రాంరెడ్డి ప్రస్తావించాడు. దానికి అందరూ అంగీకరించారు.

"ముహూర్తం పెట్టించండి" అన్నాడు సీతయ్య.

"ఇక్కడ వద్దండీ! హాయిగా ఏ తిరుపతి కొండమీదో జరిగితే పుణ్యం పురుషార్థం కలసి వస్తుంది" జయలక్ష్మి ప్రస్తావించింది.

"అంతదూరం యెందుకమ్మా, హాయిగా యిక్కడయితే నల్గురూ వస్తారు కదా" వరమ్మ అన్నది.

"అమ్మా యిటు రా-" తల్లిని దూరం తీసుకువెళ్ళింది. "నీకు ముందుచూపు లేదమ్మా. ఆ పిల్ల సన్నాసులు అచ్చం ఆయనగారి పోలికే వున్నారు. రేపు దత్తత జరుగుతుంటే ఏదయినా గల్లంతు చేస్తే."

"అంతేకాదు మా అత్తకు యెప్పుడెప్పుడు కూతుళ్ళకు దోచి పెడదామా అని వుంది. ఈ అవకాశం పోనిస్తుందా? ఓయమ్మో వాళ్ళంతా వస్తే కొంప గుండం కాదూ?" వరమ్మ ఆశ్చర్యంగా కూతురివంక చూచింది. మరొకరయితే భర్తను వదిలేస్తాం అనుకునేవారు. డబ్బు ఖర్చు లేదనుకుంటే ఏ విషయంలో బాధపడదని అర్థం అయింది. ఆమె ప్రతి పాదనను అందరూ అంగీకరించారు. ఆమె మనసు తేలికగా వుంది. అప్పుడే పురోహితుడిని పిలిపించి ముహూర్తం పెట్టించారు. ఆమె అన్న గారికి, వదినగారికి కబురు చేసింది. ఆడపడుచులందరకు కార్డు ముక్కలు వ్రాయించింది. సరస్వతి ముఖం మాడ్చుకుంది. వరమ్మ కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ అన్నీ గమనిస్తోంది.

# 24

బాలామణి పాలు తీసింది. మూడు రోజులుగా సాయిలుకు జ్వరం వస్తున్నది. ఇద్దరి పిల్లలతో, గేదెలను చూసుకోవడం యాతనగా వుంది. తండ్రో, తమ్ముడో మేపడానికి తీసుకువెడుతున్నారు. పాల చెంబులు ప్రక్కనపెట్టి, గేదెలకు గడ్డితెచ్చి వేసింది.

"అమ్మ-నేను...." పడుతూ లేస్తూ వచ్చాడు కృష్ణ.

"చేసే వయసువస్తే యెక్కడ దాక్కుంటావోలే" ఒంగి కొడుకు బు ముద్దు పెట్టుకుంది.

"నువ్వు డాక్టరీ లేదా ఇంజనీరు చదవాలిరా" అన్నది.

"ఏంది బిడ్డా" పాల డబ్బా పట్టుకొని కొమురయ్య వచ్చాడు. "మా యెవలి మనుమడు!" గర్వంగా మీసం మెలిపెట్టాడు.

"నీ మనుమడేలే బడాయి..... ఇంత పొద్దుటే వచ్చావేం?"

"పాలు పిండనీకి సాయిలుకు పెయి బాగలేదు. మల్ల మస్తు వస్తవంటని వచ్చిన బిడ్డ" అన్నాడు.

"పోసుకో" అతని ముందు చెంబులు పెట్టింది. కృష్ణుడు వె అతని మెడలమీద యెక్కాడు.

"నీ కొడుకు పజ్జెయ్యనిస్తాడా? జల్దీ పొయ్యి పోతా. సీతయ్యలి బర్లను పిండుకోవాలె."

"ఆ జయమ్మ నిన్ను పాలు తీయనిస్తుందా?"

"ఆ మేడుంది బిడ్డా? ఆమె అన్న కొడుకును దత్తు జేసుకుం దంట. తిరుపతి పోయింద్రు."

"ఏమిటీ?"

"అవును" మళ్ళీ చెప్పాడు. బాలమణి కాళ్ళక్రింద భూమి గిరగి తిరుగసాగింది.

"మొగపిల్లగాన్ని, ఆడపిల్లను ఇద్దర్నట. ఏటో ఎర్రిగాని పెంచు నోల్లు వారసులయినారు. దిగులా కృష్ణయ్యా." మనవడిని దింపి పా



పోసుకుని వెళ్ళిపోయాడు. కాని కూతురి హృదయంలో అగ్ని రగిల్చి పోయానని తెలియదు. బాలామణి హృదయం భగ్గుమంది. అతను అన్న మాటలన్నీ ఉత్తవేనా? తన వాంఛ తీర్చుకోవాలనే అన్నాడా? ఏమో, మొగవాడి మాటలు నమ్మి బాగుపడిందెవరట. ఆమెకు రోషం, కోపం పోటీపడి వచ్చాయి. వాటినుంచి ఓ నిర్ణయం కూడా వచ్చిందనే చెప్పాలి. తను భార్యగా తన స్థానం సుస్థిరం చేసుకోకపోయినా తల్లిగా చేసుకోక తప్పదు. తను అభిమానం వదిలితే, అతనితో పోట్లాడగలదు. అతని పిల్లలే వారని నిరూపించగలదు. కాని, అది ఇష్టం లేదు. జీవితంలో మొదటిసారిగా తమ సన్నిహితత్వం గురించి ఆలోచించింది. పునాదిలేని మేడలు కట్టుకుందని అర్థం అయింది. తన అజాగ్రత్తకు నిందించుకుంది. ఏ ఒక్క పనిచేయలేక పోయింది. పిల్లలు గొడవ చేస్తుంటే పాలు తాగించింది. ఆమె కళ్ళముందు యెన్నో సుందర దృశ్యాలు తాను, అతడు కలసి ఊహించినవి కదిలిపోతున్నాయి. అసహాయంగా యేడ్చింది.

"ఇంకా వన్నం వండలేదే...." సాయిలు వచ్చాడు. అతనికి బాలామణి అంటే ఆరాధన. అందరి దగ్గర ఆమెను గూర్చి పొగుడుతాడు.

"ఊఁ..." తలెత్తి అతన్ని చూచి బావురుమంది బాలామణి.

"అసలేం జరిగిందే!" కంగారుగా ఆమె దగ్గరగా కూర్చున్నాడు. ఆమె వీపుపై చేయి వేశాడు. వివాహమయిన తరువాత మొదటిసారిగా ముట్టుకున్నాడు సాయిలు.

"ఏంలేదు" అన్నది పమిటతో కళ్ళు ఒత్తుకుని.

"ఎందుకు యేడుస్తున్నావు మరి?"

"ఏదో గుర్తుకువచ్చి..." అన్నది. అతని స్పర్శ తండ్రి స్పర్శలా చల్లగా వుంది.

"పెయి బాగలేకపోతే పండుకోయే. ఇన్ని బియ్యం కడిగి పొయ్యి మీద పెడ్త...." లేచాడు.

"నువ్వు పిల్లలను చూస్తుండు, నిమిషంలో వంటయిపోతుంది." ఆమె వెళ్ళింది. అన్నట్టే అరగంటలో అన్నం కూర చేసింది. ఎంగిలి పడి

లేచింది. మనసు బాగా లేనప్పుడు రేడియో వింటుంది. రేడియో తిప్పింది

"ఆకాశవాణి.... కేంద్రం. ఈనాటి కార్మికుల కార్యక్రమంలో "వారసులు" నాటిక వింటారు. రచన, నిర్వహణ శ్రీగోపి, వారసులు నాటిక...."

"చంద్రం.... బాబూ చంద్రం? ఈరోజు ఫ్యాక్టరీకి వెళ్ళవురా."

"అమ్మా! నేను ఫ్యాక్టరీకి వెడతానుగాని, నా తండ్రి యెవరో చెప్పమ్మా?"

"బాబూ!" ఏడుపు గొంతు.

"అవునమ్మా! నాకు తండ్రేలేడని అవమానించిన ఆ మేనేజరుకు బుద్ధి చెప్పాలి. నా తండ్రి పేరుచెప్పి నోరు మూయించాలి."

"నీ తండ్రి పేరు చెప్పి వారి నోరు మూయించగలవు, కాని బుద్ధి చెప్పలేవు. చంద్రం, మనలాంటివారికి యిలాంటివి అలవాటే బాబూ. ఇవేవీ మనసులో పెట్టుకోకు...."

"అమ్మా! ప్రతిసారి నా మాట తప్పిస్తావు. ఈ రోజు చెప్పకపోతే తల పగులగొట్టుకుంటాను..."

"చంద్రం.... యెలా చెప్పన్రా! నీ తండ్రి.... నీ తండ్రి...."

"చెప్పమ్మా.... నా తండ్రి...."

"నీ తండ్రి నీవు పనిచేసే ఫ్యాక్టరీ యజమాని వరప్రసాదరావు."

"అమ్మా!"

"అవున్రా! ఆయనే మీ తండ్రి..."

"మరి.... మరి నేనుండగా వారసులు లేరని మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడా?"

"అవును నాయనా. నువ్వు ఉంపుడుకత్తె కొడుకువు, వారసుడివి కాలేవురా...."

"అమ్మా! ఎంత దారుణం, క్షణికమయిన ఆనందం కోసం శాశ్వతంగా జీవితాలకు మచ్చ చేస్తారా? ప్రాణంలేని సాంఘిక ఆచారా కోసం ప్రాణమున్న మనుషుల్ని సజీవంగా దహనం చేస్తారా? నిజ



జీవచ్ఛవంలా బ్రతకమని శాసించిన ఆ జమీందారు అంతు చూస్తాను..."

"వద్దు చంద్రం వద్దు. డబ్బుగలవారి జీవితాలు పరువు ప్రతిష్ఠలన బడే చట్రంలో బిగించి వున్నాయిరా. సాహసించినవారికి ఆ చట్రం ఉరితాడు అవుతుంది. నా మీద యేమాత్రం గౌరవం వున్నా ఆ పని విరమించుకో..."

"లేదమ్మా గౌరవముంది కాబట్టే నీ ఔన్నత్యం లోకానికి చాటుతాను. చీకట్లో చేసిన తప్పులు ఒకనాటికయినా వెలుగులోకి వస్తాయని తెలియజేస్తాను."

"చీకటి తప్పులు వెలుగులోకి వస్తే సహించలేరురా, నా మాట విను..."

"లేదమ్మా, వారసుడిగా నాకు ఆస్తి అక్కరలేదు. కార్మికుడిగా హాయిగానే వున్నాను. కారులో తిరగకపోయినా నాలాంటివారి కష్టసుఖాలు అర్థం చేసుకుంటాను. మేడల్లో వుండకపోయినా, సాటివారితో గౌరవంగా బ్రతుకుతాను. నాకు తండ్రి వున్నాడని నిరూపించడం కోసమేనమ్మా..."

"చంద్రం.:. వెళ్ళిపోయావా... ఆ కసాయి వారి సంగతి నీకు తెలియదురా... భగవంతుడా! నీకేం అపకారం చేశాను. కన్నవారిని కాలం కాటేసినా నిబ్బరంగా వున్నాను. నా సర్వస్వం దోచుకుని బయటికి గెంటిన జమీందారును ఒక్కనాడు శపించలేదు. ఆశాదీపం,నా చంద్రుడనుకున్నాను. వాడిని ఏం చెయ్యదలచావు!" ఆమె అలా విలపిస్తుండగానే మ్యూజిక్ స్థాయి పెరిగి మళ్ళీ తగ్గిపోయింది.

"కాంతమ్మగారూ..... కాంతమ్మగారూ...."

"ఎవరు నాయనా!"

"నేనండీ చంద్రం స్నేహితుడు రమేష్‌ని...."

"రా నాయనా..."

"మీరే రావాలండీ. చంద్రం జమీందారింట్లో దొంగతనం చేయ బోయాడట. వారి మనుషులు అతన్ని కొట్టారండి. అతని పరిస్థితి యేమంత బాగాలేదు. ఆస్పత్రికి తీసుకువెడుతున్నాం."

"చంద్రం...."

వినలేకపోయింది బాలామణి రేడియో కట్టేసింది.

"అమ్మా...." కృష్ణ భయంగా చూచాడు.

"కృష్ణా!" వాడిని హృదయానికి హత్తుకుంది. "మీకలాంటి స్థితి రాదురా.... రానే రాదు..." ఆమె కన్నీరు తెగిన ముత్యాలసరంలా జారి పడుతుంది. సాయంత్రానికి ఓ నిర్ణయానికి వచ్చింది. ఆమెకెంతో హాయిగానూ, తేలికగాను వుంది మనసు. ఇప్పుడామె తనూ, తన కోర్కెలు గుర్తు లేవు. ఒకటే గుర్తుంది-తన కొడుకు భవిష్యత్తు మనసులో నుంచి సీతారామిరెడ్డి బొమ్మ తొలగించాలని ప్రయత్నం చేసింది. ఒక్కరోజులో తొలగిపోవడం సాధ్యమా? మొగవాడు యెంత నయవంచన చేస్తాడు అయినా స్త్రీ అతని పంచనే వుంటానంటుంది. ఆ పాత పద్ధతికి స్వస్తి చెప్పాలి. అర్ధభాగం అంటే డమ్మీగా పడివుండే అర్ధభాగం కాదని నిరూపించాలి. త్వరగా లేచి పిల్లలకు పాలు త్రాగించుకొని, తనూ టీ చేసుకుని త్రాగి తండ్రి దగ్గరకు బయలుదేరింది.

* * *

"నాయనా! నీకు పట్నంలో యెవరైనా గుర్తున్నారా?"

"ఎందుకు బిడ్డా?"

"నాకీ ఊర్లో వుండాలని లేదు. నా కొడుకులను చదివించుకోవాలని వున్నది. పట్నం వెళ్ళిపోతాను."

"సాల్లె బిడ్డ, నీ మొనగాల్ల సదువు ఈ ఊర్ల లేదా? ఆ పోరలను జూడకుండ మేముంటమేందమ్మా?" అతను నవ్వాడు తేలికగా. ఎలా అర్థం చేసుకోవాలో తెలియక చిన్నవాడిని చంకన వేసుకుని, పెద్దవాడిని నడిపించుకుంటూ ఇంటికి వచ్చింది. ఇంటిముందు నిలబడి చుట్టూ పరికిస్తున్న మార్తమ్మ కనిపించింది.

"మీరా, యెప్పుడు వచ్చారు?"

"ఓ అయిదు నిమిషాలయింది. మిషన్ కాంపౌండులో మిస్సమ్మకు డ్రైవరుగావున్న రోజర్స్ పెళ్ళి అయింది. అందుకే చూచిపోదామనిపించింది. రెండూ కలసి వస్తాయని వచ్చేశాను." మార్తమ్మ బాలామణి కొడుకులను యెత్తుకుని ముద్దు పెట్టుకుంది. తను తెచ్చిన పిప్పరమెంట్లు వారికిచ్చింది.



"విల్సన్‌కు పిల్లలా అమ్మా?"

"ఒక కూతురు పట్టింది. వచ్చే సంవత్సరం వస్తానని రాశాడు. హైద్రాబాద్ దగ్గిర వాడికోసం నర్సింగ్‌హోమ్ కట్టిస్తున్నాను. నెల, నెలా డబ్బు పంపుతున్నాడు. నేను, సుగుణ తండ్రి ఊర్కెనే కూర్చుంటే ఏం తోస్తుంది. అందుకే చిన్న నర్సరీ బడిపెట్టాము" అన్నది.

"నర్సరీ అంటే?"

వివరించిందామె. బాలామణి ఆలోచనలు పరి, పరి విధాలుగా పోయాయి. ఆమెకు ఉప్మా, కాఫీ చేసిచ్చింది.

"అమ్మా! మీ బడిలో నా కొడుకులను చేర్పిస్తే చేర్చుకుంటారా?"

"చేర్చుకుంటాం. కాని బోర్డింగ్ బడికాదు కదా. అంటే అదేనే నీ పిల్లలను వుంచడానికి హాస్టల్ లాంటిది లేదు కదా."

"నా పిల్లలతో నేనూ వస్తానమ్మా."

"ఈ ఊరు విడిచి వస్తావుటే?"

"ఈ ఊళ్ళో నాకు మడులున్నాయా, మాన్యాలున్నాయా! పాలమ్ముకోవడమే కదా. ఎక్కడయినా చేస్తాను. మీ పంచన చిన్న పాక వేసుకోనివ్వండి, చాలు. లేక అద్దెకు దొరికినా చాలు." మార్తమ్మ పరీక్షగా చూచింది. ఎన్నో అడగాలని వుంది. అడిగితే సభ్యతకాదని కూడా తెలుసు. అందుకే మౌనం వహించింది.

"మీరు రాకపోతే నేను మా చెల్లి వాళ్ళింటికి వెడదాం అనుకున్నానమ్మా. కాని బంధువుల పంచను చేరడం అంత మంచిది కాదేమో. మిమ్మల్ని దేనికీ విసిగించను. అవసరమయితే నా చేతనయిన సాయం చేస్తాను."

"నీ సంగతి నాకు తెలియదటే పిచ్చిదానా! ఆ రక్షకుడే అందరికీ అండగా వుంటాడు. ఎప్పుడు బయలుదేరతావు?"

"మీరిప్పుడంటే యిప్పుడే బయలుదేరతాను. సామాన్లు, గేదె సాయన్న తెస్తాడు" అన్నది. సాయిలు అభిమానానికి కరిగిపోయిన బా అతన్ని సాయిలు అని పిలువలేకపోతుంది. అందుకే గౌరవంగా సాయ్ అంటుంది.

"బాలా!"

"ఏమిటమ్మా?"

"ఈ నిర్ణయానికి యెందుకు వచ్చావు?"

"ఏ నిర్ణయానికమ్మా?"

"నీ పిల్లలను తీసుకుని నీ వాళ్ళందరినీ వదిలి వెళ్ళాలనే ఉద్దే యెందుకు కల్గింది?"

"నా వివాహం ఊరివాడితో అయిందమ్మా. కాని పరాయివా అయితే నా వారిని విడిచిపోనా ఏం?"

"నా ఉద్దేశం అది కాదు..." సీతారామిరెడ్డిని విడిచి యె వెడతావని అడగలేకపోయింది.

"ఏ ఉద్దేశమయినా మీరు అడగదలచిందేదో నాకు తెలుసు. అ విషయాలలోలాగే కొందరి కలయిక స్వార్థంతో కూడి వుంటుంది. న అవసరాలకోసం నేను తాపత్రయపడినప్పుడు యెదుటి వారిని విం లాభమేమిటి చెప్పండి."

"ఓ..... మై ఛైల్డ్, నువ్వేగనక చదువుకుని వుంటే...."

"అనుభవాలు చదువుకాదా అమ్మా?"

"అనుభవాల కూర్పే చదువు అన్నాడమ్మా ప్రసిద్ధ విద్యావేత్త" అ ఆర్తిగా బాలామణి తల నిమురుతూ.

"నా నిర్ణయం సబబు అవునో కాదో కాలమే నిర్ణయించాలి. న పిల్లలకు నేను తల్లిగా మిగలాలని కోరుకుంటున్నా."

"బాలా..." మార్తమ్మ బాలామణి తలను గుండెల్లో పొదుపుకు తనొక్కనాడు ఈ పిల్ల తన కోడలు అవుతుందేమోనని భయపడిన ఘ గుర్తుకు వచ్చింది. రెండు వేడి కన్నీటిబొట్లు రాలి ఆమె తలపై పడ్డా



# 25

బంధుజనమంతా రెండు వర్గాలుగా యేర్పడి ఇంట్లో విందులు ఆరగిస్తున్నారు. ఒక వర్గం జయలక్ష్మి వైపువారు, మరొకవర్గం సీతారామిరెడ్డి వైపువారు. ఇద్దరిమధ్యా అతను వారధిలా తిరుగుతున్నాడు. అతని మనసు మాత్రం బాలామణి చుట్టూ, పిల్లలచుట్టూ పరిభ్రమిస్తున్నది. ఆమె తనపై కోపగిస్తుంది తప్పక. సగం ఆస్తి తన ఆధీనంలో వుందంటే క్షమిస్తుంది అనుకున్నాడు. సాయంత్రం నాలుగు గంటలకు అతనికి తీరికచిక్కింది.

"నాలుగు రోజులు అయింది పొలం వెళ్ళి, అలా వెళ్ళొస్తాను" అన్నాడు. ఈ మధ్య జయలక్ష్మి వేగులను పెట్టిందని అర్థం చేసుకున్నాడు. అందుకే మొదట పొలం అంతా తిరిగి, జీతగాళ్ళకు పనులు పురమాయించి, చీకటి పడుతుండగా బాలామణి ఇంటివైపు వెళ్ళాడు.

ఎప్పటిలా దీపాలు వెలగడంలేదు ఆ ఇంట్లో.

కారు చీకటి కమ్మినట్టుంది ఆ ఇల్లు. పరిసర ప్రాంతాలన్నీ నిశ్శబ్దంగా వున్నాయి. బాలామణి పుట్టింట్లో వున్నా, ఇంటి ఆవరణలో వున్న గేదెలు యేమయినట్టు?

తను చెప్పి వెళ్ళలేదని కోపగించిందా బాలామణి? ఏమో! తలుపు తడిమాడు. తాళంకప్ప చేతికి అమిరింది. చుట్టుపక్కల యెక్కువగా ఇళ్ళు కూడా లేవు. ఒక్క మార్తమ్మ ఇల్లుంది. దానిలో యెవరో ఫాదర్ వుంటున్నాడు. వారానికి ఆరురోజులు బయటే గడుపుతున్నాడు. వెనక్కు తిరిగాడు. అటుగా వెడుతున్న నర్సింహ కనిపించాడు.

"నర్సింహా! మీ అక్క యెక్కడుంది?"

"మా యక్క పట్నం బొయ్యింది. మాకు పొద్దే పోతలేదు పిల్లలు లేక" అన్నాడు ఆగి.

"సాయిలు, గేదెలు యేమయ్యాయి?"

"అందరూ పట్నమే పొయ్యింద్రు, ఆడనే వుంటరంట."

"ఏమిటి?"

"అవును దొర. మా యక్క పిల్లలను సదివించుకుంటదంట మా అయ్య చెప్పలేదూ? ఆఁ.... మరిచిపోయిన. ఈ ఇల్లు నీకు యియ్యమని చెప్పింది." అతనికి యేమీ అర్థం కావటం లేదు. మెల్లగా కొమురయ్య ఇంటికి వచ్చాడు. అతనింటికిలా రావడం మొదటిసారి. కొమురయ్య హడావుడిచేసి మర్యాదలు చేశాడు. విషయం మాత్రం నర్సింహ చెప్పింది చెప్పాడు. అంతకంటే పిసరంతకూడా ఆచూకీ దొరకలేదు.

"మళ్ళీ యెప్పుడు వస్తుంది?"

"ఏమో దసరా పండక్కి వస్తుందేమో" యాదయ్య చెప్పాడు. ఏ మాసం, దసరా రావటానికి యెన్ని రోజులు పడుతుందని! ఇంకా యెక్కువగా యేదయినా అడిగితే బాగోదని చెప్పి, మెల్లగా లేచాడు.

"పట్నంలో ఆమె వుండేది యెక్కడ!"

"శాలిబండ దగ్గర..." అడ్రసు చెప్పాడు కొమురయ్య. ఆయన లేచి మెల్లగా బయటికి వచ్చాడు. అతను యెన్ని చికాకులయినా కృష్ణుడితో ఆడి మరచిపోయేవాడు. చిన్నవాడిని ముట్టుకుంటే చాలు ఒళ్ళు పులకరించి యేవో లోకాలకు వెళ్ళిపోయేవాడు. తను యెంత బరువును మోసుకు వచ్చాడు, అది బాల సమక్షంలో తీర్చుకోవాలని ఆశించాడు.

అతనికి మెల్లగా అర్థం కాసాగింది. బాలామణి తనమీది కోపంతో వెళ్ళిపోయిందని.... ఆమె అందరిలాంటి స్త్రీ కాదని అతనికి తెలుసు. అతని మేనమామ యిలాగే ఓ ఈడిగ స్త్రీని చేరదీశాడు. ఆమె అతడ్ని యెన్ని విధాలుగా దోచుకోవాలో అన్ని విధాలుగా దోచుకుంది. బాలామణి అలా కాదు. ఆమెకు స్వార్థం అంటే యేమిటన్న విషయమే తెలియదు.

సంతోషం కొద్దీ తనిచ్చాడే తప్ప, యేనాడూ ఆమె యిదివ్వమని అడగలేదు. అప్పుడే రెక్కలు కట్టుకుని వెళ్ళి ఆమె ముందు వాలిపోవాలని వుంది, కాని బస్సులేదని తెలుసు. అందుకే ఇంటికి వచ్చాడు. అతనికి కంటపడిన దృశ్యము చికాకును కలుగజేసింది. ఒకవైపు చందు కూర్చుని భోజనం చేస్తున్నాడు. అతనికి కమలమ్మ, జయ యెంతో ప్రేమగా వడ్డిస్తున్నారు. మరోవైపు ఉమ కూర్చుంది. సరస్వతి, రాజమ్మ ఆడపిల్లను తినమని బలవంతం చేస్తున్నారు.



"ఈ పిట్ట మేత తిని ఏం బతుకుతావే పిల్లా!" రాజమ్మ కసురుకుంటోంది.

"అదింకా చిన్నపిల్ల, వయసు వచ్చినవాడు ఈ చందు నాలుగు మెతుకులు తినలేకపోతున్నాడు..." కమలమ్మ గొణుక్కుంది.

ఆ వేరువేరు వడ్డింపులూ, బలవంతాలూ యేమిటో అర్థం కావడం లేదు. "ఇద్దరూ ఈ ఇంటి పిల్లలు. వారికి వడ్డించేది ఒక పంక్తినే. జయ ఆ విషయం చూచుకుంటుంది" అని అనాలన్నంత ఆవేశం కలిగింది. కాని అనలేడు. చికాకుగా చూశాడు. మెల్లగా చెక్కమెట్లు యెక్కి పైకి వెళ్ళాడు. అతని వెనుకే సుడిగాలిలా వచ్చింది జయలక్ష్మి.

"మా వదినది పెద్ద చెయ్యే గాని, ఈ చందుగాడికి ఎవరి పోలిక అబ్బిందో పట్టెడన్నం తినలేడు. ఒక్క కోడిముక్క వేస్తే తీసి ప్లేటులో పెట్టాడు..."

"ఏమిటే వెధవ కబుర్లు! ఎవరూ తిండి తినకపోతే నీకు సంతోషమేగా? బాగా మిగులుతుందని సంతోషించు."

"నేను యెంత సంతోషంగా చెప్పబోయినా కసురుకుంటారు. ఇప్పుడేమన్నానని-"

"మరి యేమిటే వెధవ కబుర్లు, ప్రతిమనిషి చేసే పనులు పట్టకోనమని మరచిపోతున్నావు. ఒకడు యెక్కువ, ఒకడు తక్కువ తింటుంటారు."

"అసలు నా మాటంటేనే మీకు గిట్టదు. మీ అమ్మ ఇంట్లోని నెయ్యంతా దిమ్మరిస్తున్నది ఆ పిల్లదానికి."

"జయా! నీకు పిల్ల కావాలనే మోజు తీర్చాలని దత్తతకు అంగీకరించాను. ఇలా మీరిద్దరూ పిల్లల తరపున వకాల్తా తీసుకుంటారని తెలిస్తే అసలు ఈ విషయం పట్టించుకునేవాడ్నే కాదు" కాస్త విసుగ్గా కోపంగా అన్నాడు.

"అదికాదండీ."

"ఏది కాదు? ఈ తిండ్లు తూకం వేసుకుంటూ కూర్చోవద్దు. ఒక్క క్షణం ప్రాణానికి సుఖం వుండదు కదా. నువ్వు అరుపులు అరుస్తూ

వుండు. నాకు తిక్కరేగితే సన్యాసుల్లో కలిసిపోతాను" అన్నాడు. ఆమెకు చాలా వింతగా అనిపించింది. భర్త అంత గట్టిగా మాట్లాడగలడని తెలియదామెకు. "ఊ.... ఏదో ఆత్మీయులని చెప్పాను బాగానే వుంది" విసుక్కుని వెళ్ళిందామె. ఆ రాత్రంతా అతని కళ్ళముందు కృష్ణుడే తిరుగుతున్నాడు. చిన్నవాడితో పెద్దగా పరిచయం లేదు. కలతనిద్రలో రాత్రంతా గడిపాడు.

మర్నాడు ఉదయం లేస్తూనే, బావి గట్టుదగ్గర ముఖం కడిగాడు. పట్నం వెళ్ళి యెప్పుడెప్పుడు బాలనూ, పిల్లలనూ చూద్దామా అని వుంది.

"అన్నయ్యా!"

"ఎవరూ? నువ్వా సరస్వతి! ఏమిటమ్మా యిలా వచ్చావు?"

"ఒక్క విషయం చెప్పాలన్నయ్యా."

"ఏమిటమ్మా?"

"జయలక్ష్మి నా పిల్లను చూస్తుందన్న నమ్మకం నాకు లేదు" బావి చప్టామీద కూర్చుందామె.

"ఉమ పసిపిల్ల కాదు కదా సరసూ! నేనూ, అమ్మా వున్నాము."

"ఏమిటో అన్నయ్యా, ఆవిడ ధోరణి మారదిక."

"అది తెలిసే అమ్మాయినిచ్చావ్, నేను బయటికి వెడుతున్నాను అనవసరమైన అనుమానాలు, సంకోచాలేం పెట్టుకోకు తెలిసిందా?"

"అలాగే-" ఆమెకు మాట్లాడే అవకాశము యివ్వకుండానే అతను వెళ్ళిపోయాడు.

"సరస్వతీ" రాజమ్మ బయటికి వచ్చింది. ఇద్దరూ చాలాసేపు గుసగుసలాడారు.

## 26

విల్సన్ కోసం కట్టే నర్సింగ్ హోమ్ భవనం దాదాపు తయారయి నట్టే లెక్క. బాలామణి వచ్చిన దగ్గర నుంచి పని చురుకుగా సాగుతోంది ఈవిడే గనక ఇంజనీరయితే మన ప్రాణాలు తీసేది అనుకునే వారు



మేస్త్రీలు. సాయిలు మామూలుగా తన గేదెలని చూచుకుంటున్నాడు. రోజుకు మల్లెనే తన పని పూర్తి చేసుకుని వచ్చి, వాటర్ హౌస్ దగ్గర కాళ్ళు కడుగుకుంటోంది.

"బాలా!"

ఆమె తిరిగి చూచింది. చిరపరిచితమైన చూపు, పిలుపు అది. ఒక్కసారి వెళ్ళి అతని వడిలో వాలిపోవాలనుకుంది. కాని వెంటనే కర్తవ్యం, పిల్లలు కళ్ళముందు మెదిలారు.

"ఎవరూ?"

"బాలా!" ఆశ్చర్యంగా చూశాడు.

"నా పేరు బాలామణి. మీకేం కావాలి?"

"బాలా!" అతను దగ్గరగా వచ్చాడు. "ఎందుకు అంత కోపం వచ్చింది."

"కోపమా! లేదే" అన్నది యెత్తి కట్టిన కుచ్చిళ్ళు క్రిందకు జార్చి, చేతులు పమిటకు తుడుచుకుంది.

"కోపం లేనిదే అడ్రసు యివ్వద్దని చెప్పావా. నేను పట్నం రావడం యిది మూడవసారి."

"అలాగా యెందుకు వచ్చారు?"

"నిన్ను చూడాలని-"

"సీతయ్య దొరా! పరువు, మర్యాద గలవారు చేసే పనులేనా యివి. ఒక రైతు బిడ్డ, గొల్లపిల్ల కోసం వస్తే, యెవరయినా చూస్తే, మీ భార్యతో చెబితే, మీ పరువు ప్రతిష్ట యేం గాను."

"బాలా, నా మాట విను-"

"నాకు యెవరిమాట వినవలసిన అవసరం లేదు" విసురుగా వెనుతిరిగింది.

"వినకపోయినా చెప్పాల్సిన బాధ్యత నాకుంది."

"వినను అని చెప్పానుగా. ఏం చెబుతావు? మనిద్దరిమధ్య అనుబంధం చీకటిలో పెరిగింది. చీకట్లో కలిసిపోవాలని చెబుతావు. నీకిష్టం లేకపోయినా, భార్యకోసం దత్తత చేసుకున్నానని అంటావు..."

"అనటం కాదు బాలా! జరిగింది అంతే."

"పిరికివాడిలా నువ్వు నేరం యెవరి మీదికి నెట్టినా, నేను నిజమే చెబుతున్నాను. నేను నా కోసం వచ్చేశాను. నన్ను యెవరూ బలవంతం చెయ్యలేదు."

"బాలా- నిజం చెబుతున్నాను. నాకు దురుద్దేశం లేదు."

"ఈ వాదు యెందుకు? ఒక్క ప్రశ్నకు సూటిగా జవాబు కావాలి" అన్నది.

'అడుగు.....' అనే ధైర్యంలేక తలయెత్తి దించాడు.

"కృష్ణుడు యెవరి కొడుకు?"

"బాలా....." అతను జవాబు చెప్పలేను అన్నట్టు హౌస్ చప్టామీద కూర్చుండిపోయాడు.

"మీ కొడుకని మీకు తెలుసు. పదిమందిలో అంగీకరించే ధైర్యం లేదు. నేనో ఉంపుడుకత్తెను....." దుఃఖమాగలేదు. రెండు చేతుల్లో ముఖం దాచుకుంది. ఆమె యెన్నోసార్లు అతనిముందు దుఃఖించకూడదని చేసుకున్న నిర్ణయం సడలిపోయింది. తన బేలతనం బయట పెట్టుకో రాదనుకున్న అభిప్రాయం ఆవిరి అయ్యింది.

అతను ఆమె దగ్గరగా వచ్చి తలమీద చేయివేశాడు. దూరంగా కూలీలు వెళ్ళిపోతూ మాట్లాడుతున్న మాటలు వినిపిస్తున్నాయి. సంధ్య చీకట్లు పరిసరాలను అలముకున్నాయి.

"దూరంగా వుండండి. నేనిప్పుడు మీకేం కాను. మరొకరి మనిషిని"

"బాలా?" ఆ మాట వినలేను అన్నట్టుంది అతని వాలకం.

"నమ్మినా, మానినా నిజం అంతే-" అతను బాధపడుతున్నాడని గ్రహించాక కఠినంగా అన్నదామె.

"ఎవరి మనిషివి!" అడగలేక అడిగాడు.

"ఎవరి మనిషినయినా పైకి చెప్పుకునేందుకు వీలులేదు కద సీతయ్య దొరా. ఎప్పుడయినా నా నోటితో మీ మనిషిని అని చెప్పుకున్నా! అందరూ వాడుకున్నారేమో అంతే..."



"అతను నీ పిల్లలను వారసులుగా అంగీకరించాడా?"

"సరసులయిన మొగవారికి వారసులు అవసరం లేదు. కన్నవాడే అంగీకరించనప్పుడు అవతలివాడికేం ఖర్మ."

"పిల్లలు తండ్రి దగ్గర మాత్రమే అభిమానం చూపాలా? ఎవడి దగ్గరో వున్నట్టు అతని దగ్గరే వుంటే!"

"ఉండవచ్చు. అది నా యిష్టం?" అన్నది నిర్లక్ష్యంగా. మాటలు పెరిగాయి. ఆడదన్న అహంకారంతో అతను మాట్లాడాడు. తరతరాలుగా మొగవాడు చేస్తున్న అన్యాయాలకు విరిగిన స్త్రీగా, స్త్రీ జాతికి ప్రతినిధిగా బాలామణి మాట్లాడింది. వాదం పెరిగింది. రోషంగా వెనుతిరిగాడు సీతారామిరెడ్డి.

"ఒక్కసారి పిల్లలను చూస్తాను."

"ఆ పిల్లలు నీ పిల్లలన్న నమ్మకమేమి దొరా! గాలికి పెరిగే కంచలాంటివి మా జీవితాలు. వాటికి కాపు అవసరం లేదు. నేను పెంచుకున్నట్టే నా పిల్లలు ఆశలు పెంచుకోవడం యెందుకు."

"బాలా! వాళ్ళు నిన్ను నిలదీసిననాడు..." కసిగా అన్నాడు అతను.

"నిలదీసి అడిగే పరిస్థితి రాదనే నా నమ్మకం. అలా వస్తే నేనంటూ ఈ భూమ్మీద బ్రతికి వుండను తెలిసిందా?"

"ఊఁ...." అతను రోషంగా వెనుతిరిగి వెళ్ళిపోయాడు. అంతవరకు రావాలా వద్దా అంటూ నిలబడిన మార్తమ్మ త్వరగా వచ్చింది.

"ఏమిటమ్మా బాలా యిది?"

"ఏముందమ్మా! అభిమానం గల స్త్రీగా..." చెప్పలేకపోయింది. రెండు చేతుల్లో ముఖం దాచుకుంది.

"ఊర్కో బిడ్డా- ఆ ప్రభువు నిన్ను క్షమించి; కరుణిస్తాడు" ఆమె తలను హృదయానికి హత్తుకుంది.

"నేను- మడులు మాన్యాలు అడగలేదమ్మా! నగలు నాణాలు కోరలేదు. తన పిల్లలుగా గుర్తించమన్నాను. అది అత్యాశా! నా కోరికను

సమాధిచేస్తూ, బంధువుల పిల్లలను వారసులుగా తెచ్చుకున్నాడు. ఇంత కంటె అవమానం యేముందమ్మా?" వెక్కిళ్ళ మధ్యన అడిగింది.

"మంచిపనే.... చేశావు. ప్రతి తల్లీ నేర్చుకోదగిన రీతిగా ప్రవర్తించావ్. గుండె దృఢపరుచుకో...." యెంతో ఆప్యాయంగా అన్నది. ఆ తల్లి హృదయంలో తలదాచుకున్న చిన్నారి తల్లి ఉపశమనం పొందింది.

"ఏడున్నవే.... చిన్నోడు కుడితితొట్టెల పడుతుండే" సాయిలు కేకలు వేస్తున్నాడు.

"ఈ పిల్లలు ఒక్కచోట వుండరు కద!" విసుక్కుంది.

"ఒక్కచోట వుంటే నీ పిల్లలు యెలా అవుతారు. వెళ్ళి చూడు" నవ్వింది మార్తమ్మ. బాల వెళ్ళేసరికి సాయిలు ఇద్దరి పిల్లలకు జిలేబీలు పెడుతున్నాడు.

"ఎక్కడివి!"

"కొనుక్కొచ్చినలే. నీకు యేమయితరన్న బయం లేదే. నల్లగా కాడ ఆడుతుండరు."

"సరి అలవాటు పడాలి. రేపు పాలు, పెరుగు కొట్టుపెడితే యెలా వాళ్ళను చూస్తూ కూర్చుంటే కాలం గడుస్తుందా?"

"అట్లని పోరలను ఆగము చేస్తామా?"

అతని అభిమానానికి బాల కళ్ళు చమర్చాయి. ఒంగి అతని పాదాలు కళ్ళకు అద్దుకోవాలనుకుంది. మరీ నాటకీయంగా వుంటుందని ఊరుకుంది.

"రేపు బోయి మా లస్మత్తను తోలుకొస్తానే. పిల్లలను చూసు కుంటది" అన్నాడు.

బాల మనసు మరోసారి గతంలోకి వెళ్ళి వచ్చింది. ఇప్పుడామెకు యెవరిమీద కోపం రావడం లేదు. విధిని కొన్నిసార్లు నమ్మాలి. తను భార్యగా పనికి రానిదయింది. తల్లిగా తన విధులు నెరవేర్చాలన్న కాంక్ష తప్ప మరే కాంక్ష లేదామెలో. సాయిలుకు, పిల్లలకు అన్నాలు పెట్టింది. వారు భోజనాలు చేయగానే తనూ భోజనంచేసి, మేను వాల్చింది.



అలసిపోయిన శరీరం నిద్రాదేవి ఒడిలోకి వరిగి పోయింది. తన ప్రణయ గాథ ఎలా మరచిపోవాలని తపన పడిన బాలకు, యిప్పుడు ఒక్క నిమిషం ఆలోచించే తీరికే వుండదు. పడక చేరినప్పుడు మసక, మసకగా కనిపించే ఆకారాన్ని చూద్దాం, గుర్తుకు తెచ్చుకుందాం అనుకునే లోపల నిదుర ఆహ్వానిస్తుంది. అందుకే అన్ని సమస్యలు మరచిపోవాలంటే శరీరం అలిసిపోయే వరకు పనిచేస్తే నిద్ర దానంతటది అదే వస్తుంది. మరో ఆలోచనకు తావుండదు.

"ఓయ్ అప్పుడే నిద్రా... చిన్నాడికి పాలుగావాల్నేమో-" విసుక్కుంటూ లేచిన సాయిలు కిరసనాయిలు పొయ్యిమీద పాలు కాచాడు. పంచదార వేసి కలిపి తలదగ్గర పెట్టుకున్నాడు. గది తలుపులు బిగించి, కృష్ణుడి ప్రక్కన చేరాడు సాయిలు.

## 27

మల్లమ్మ హృదయము కుత, కుతలాడుతున్నది. ప్రక్కింట్లో మల్లమ్మ కథ చెబుతున్నారంటే వెళ్ళింది. అక్కడ పండు ముసలమ్మ, ఆ ఇంటామె అడగనే అడిగింది.

"ఏందే మల్లీ! పోరిని యేమేమో అంటున్నారు!"

"ఏమంటున్నరే అత్త?"

"ఏందో చేసుకున్న పాపం కంటే యిన్న పాపం గొప్పదంట..."

"సరిగ్గ జెప్పత్తా?"

"నేను జెప్త... బయమా! నీ బిడ్డ... పట్నంలో కానొచ్చిన వాడినల్లా యేరేస్తుందట" జంగమ్మ అందుకుంది.

"ఏమిటే బర్లుతున్నావు!" మల్లమ్మ ముఖమంతా ఎర్రగా మారిపోయింది.

"అయ్యో! గామాత్రం తెలువదా! ఈడ సీతయ్యదొర ఒక్కడే అయితే సరిపోయింది" నిర్లక్ష్యంగా అన్నది.

"నీ నోట్ల మన్నుపడ, నీ నోట్ల దుమ్ముపడ. నా పిల్ల అసుంటి పిల్లలు నీకున్నారే, నా పిల్ల నన్నోళ్ల నోర్లు పడిపోతాయి" మల్లమ్మ ఆవేశం ఆపుకోలేక యేడ్చేసింది.

"కత యినక యేందర్రా!" మళ్ళీ అమాయకురాలిలా అడిగింది ఆ ఇంటావిడ. కొందరి తత్వమే అంత. గిల్లి జోల పాడినట్టు ప్రవర్తిస్తారు. మల్లమ్మ తిడుతూ లేచింది.

"ఏందమ్మో! మాలావు యెగిరి పడుతున్నావు? సీతయ్య దొరతో యేసిన యేశాలు యెవరికి తెలియదంట-కాదని వొక్కరిని అనమను." జంగమ్మ మాటలు వినలేనట్టు లేచి వచ్చేసింది. తనకా నిజం తెలుసు. కూతుర్ని తప్పుపట్టలేనని తెలుసు. ఆవేదనగా ఇంటికి వచ్చింది. ధనవంతుని అండన వుంది కాబట్టి తమలో తాము యెన్ని అనుకున్నా బయటికి అనలేదు. ఈనాడు వారిద్దరికి పడలేదని తెలుసు. అందుకే అందరూ కాకుల్లా పొడుస్తున్నారు. వెధవ డబ్బు, ప్రాణంలేని పైసా అంటారేగాని దానికి యెంత శక్తి వుందని... ఈ విషయము భర్తకు తెలిస్తే జంగమ్మ ప్రాణం తీస్తాడు. అందుకే మామూలుగా తిరిగే ప్రయత్నం చేసింది. కొమురయ్య సారా కొట్టునుండి వచ్చాడు. అతని మాటలు ముద్ద ముద్దగా వున్నాయి.

"బర్లకు పచ్చిగడ్డిలేదే! కోడలు, అత్త బుర్కేసుకుంటే యెట్లనే..." అరిచాడు అతను. మల్లమ్మ కొడవలి, తాడు తీసుకుని బయలుదేరింది. బాలామణి వుండగా సీతయ్య పొలంలో గడ్డి యదేచ్ఛగా కోసుకునేది. గేదెలు తృప్తికరంగా పాలు యిచ్చేవి. ఇప్పుడలా వెళ్ళడానికి జంకుగా వుంది. అందుకే వొడ్డుపొడవున కనిపించే వరాల గడ్డీ చెక్కి తెచ్చుకునేది. వెళ్ళి బయట వరం గడ్డి కోసింది.

"అట్లా లోపలికి వెళ్ళు మల్లమ్మా! కావలసినంత గడ్డి వుంది" సీతయ్య గొంతు విని తల యెత్తింది. లోపలి వరం మీద నిల్చున్నాడు. అతన్ని చూడగానే ఆమెలోని ఆవేశం, ఆవేదన కట్టలు త్రెంచుకో బోయాయి. కాని పేదవాడి కోపం పెదవికి చేటు అన్న విషయము తాను



యెరగంది కాదు. ఒక్కసారి తలెత్తి అతన్ని కొరకొర చూచి తల దించుకుంది.

"మల్లమ్మా!" ఈసారి అతని పిలుపు దగ్గరగా వినిపించింది. మళ్ళీ పని ఆపి అతని వంక చూచింది.

"బాలామణి పట్నం యెందుకు వెళ్ళిపోయింది?"

"నాకేం తెలుసు దొరా!" అన్నది.

"తనకేం తక్కువయింది. తను అడిగింది యేదయినా కాదని అన్నానా!.... ఆడవారిని నమ్మరాదు. కొత్త ఒక వింత పాత ఒక రోత"

"దొరా...."

"అవును మల్లమ్మ, మన ఊరి అమ్మాయి కదా-మంచి, చెడు అడుగుదామని వెడితే "నా ఇష్టం వచ్చిన వాడితో వుంటా" నంది. అసలే పట్టణవాసపు మనుషులు, తనను ఉద్ధరిస్తారా!" మల్లమ్మ తల తిరిగి పోయింది. నిప్పులేనిది పొగరాజదు అంటారు. అది నిజమేనా? అని ఆలోచనలో పడింది.

"ఈసారి కనిపిస్తే చెప్పు. తను పొరపాటు చేసినా, నేను మనసులో పెట్టుకోను. పిల్లలు చదివి పెద్దవారు కావాలి. అదే నా కోర్కె" అన్నాడు సౌమ్యంగా.

"అట్లనే చెప్త అయ్యా" అన్నది.

"లోపలికెళ్ళు కావలసినంత గడ్డి దొరుకుతుంది" అన్నాడు. అతనికి బాలామణి యెడబాటు సహించలేనిదిగా వుంది. ఆమెను చూడగానే ఎండలో నుండి నీడకు చేరినవాడు పొందే హాయి, అనుభూతి పొందేవాడు. కొన్ని సంఘటనలకు అర్థం చెప్పలేనట్టు చిత్రంగా జరిగి పోతుంటాయి. సీతారామిరెడ్డికి పరస్త్రీ వ్యామోహం లేదు. అలాంటి నైజమే అయితే అతని డబ్బును ఆశించి వచ్చే స్త్రీలు కోకొల్లలు. అతను ఆత్మీయత కోసం అలమటిస్తూ బాలామణి చెలిమి కోరాడు. అందుకే మరో స్త్రీ కావాలని కోరడం లేదు అతని మనసు. బాలామణి చురుకయిన స్త్రీ, అభిమానము. అభిజాత్యమున్న యువతి. అభిమానముతోనే సాయిల్ను పెళ్లి చేసుకుంది.

అభిజాత్యముతోనే రెడ్డిని వదిలింది. ఆమెకు కావల్సింది ఒక శారీరక వాంఛలు నెరవేరటమే కాదు. తనను భర్తగా కాకపోయినా, వ్యక్తిగా అతను గౌరవించాలని, తన పిల్లలే వారసులవుతారని వాంఛించింది. దానిపై తిరుగులేని దెబ్బతీశాడు సీతయ్య దత్తు చేసుకుని. అతని సంతానం కోసం మరో వివాహము చేసుకున్నా అంత బాధపడేది కాదు.

సీతయ్య దూరం అయ్యాడని తెలియగానే పెద్దశోకం తీసింది మల్లమ్మ. తన కూతురును వెనకేసుకుని వచ్చి, జంగమ్మతో దెబ్బలాడింది. దొర అబద్ధం చెప్పుతాడా?

"ఏమయిందే మల్లమ్మా... ఊకో.... ఊకో" ప్రక్కనే గడ్డికోస్తున్న తెనుగ గౌరమ్మ వచ్చి ఆమె గడ్డం పట్టుకుని ఊర్కుండబెట్టింది.

"ఏం లేదులే" గౌరమ్మ చేయి పక్కకు నెట్టింది.

"ఏం లేనిది యెవరయినా యేడుస్తారే?"

"ఏందోనే పిల్లలు లేనోల్లే సుకపడ్తరు" అన్నది.

"నీ కొడుకు కొట్లాట మొదలు పెట్టినాడే మల్లమ్మా?"

"ఒక్క కొడుకని కాదు, అందరూ అంతే" అన్నది ముక్కు చీది గడ్డిమోపు యెత్తుకుంది.

"ఏం నీల్గుడే. అడిగితే ఓ చెయ్యి యెయ్యనా?" గౌరమ్మ వెళ్లిపోయింది. మల్లమ్మ ఇంటికి వచ్చేసరికి బండబూతులు తిడుతున్నాడు కొమురయ్య. గడ్డిమోపు వాకిట్లో వేసి, బావి దగ్గర కాళ్ళు చేతులు కడుక్కుని వచ్చింది.

"ఏంది అట్ల బర్లుతవు?"

"కోడల్ని నెత్తిన ఎత్తుకున్నవు. అది జూడు. యేడ పని ఆడ బెట్టి సీర్మకు పోయింది సీర్మకు....."

"ఏం కావాలె. రొట్టె అయితే నేను చేస్తలే" అన్నది. ఊరికి అయిదు మైళ్ళు వున్న మైలవరంలో డబ్బా థియేటరుంది. అక్కడికి కొత్త సినిమా రాగానే అందరూ వెడతారు. మల్లమ్మ కుర్రవాళ్ళ సరదాలే అని వూర్కుంటుంది. కొమురయ్య త్రాగినప్పుడు సహించలేడు.



రొట్టెలు తెచ్చి అతని ముందుంచాక నెమ్మదిగా కూతురి విషయము యెత్తింది.

"మన బాలమ్మను అందరూ యేదో అంటున్నరు."

"ఏమన్నరే!" విరిచిన రొట్టె చేతిలో పట్టుకొని అడిగాడు.

"పట్నంలో యెవర్నో-" మాట పూర్తికాక ముందే అతని చేతిలోని రొట్టె బలంగా ఆమె ముఖాన్ని తాకింది.

"ఏందే కూశావు? నా బిడ్డను ఒంక పెట్టె దమ్ము లెవరికున్నయే" లేచి ఆమెను కాలితో నెట్టాడు.

"నీ ఇంట్ల మన్నుపడ. అందరన్న మాటంటి.... సీతయ్య దొర గూడ అనె."

"నా బిడ్డ అగ్గే... అగ్గి. ఆ సాయిలు కిచ్చినము గదా, అని సీతయ్యతో సవాసం చేసిందే. తప్పేం? భారత కతలో కుంతి చెయ్యలే. ఆమెను పతివరత అంటలే!"

"ఆల్లంటే దేవతలు..."

"నోరు ముయ్యవే పక్కటెంక బొక్కలు యిరగొడ్త యేమనుకున్నవో..." భర్త ఉగ్రరూపం చూచి ఒక మూలకు నక్కింది మల్లమ్మ. కొమురయ్య అలసిపోయే వరకు తిట్టి పడుకున్నాడు, రెండురోజులు గడిచాయి. కాని మల్లమ్మ మనసు కుదుటపడలేదు.

"ఒరేయ్ యాదయ్యా! సెల్లెను చూసి వస్త బిడ్డ పిల్లలు కండ్లల్ల తిరుగుతున్నరు."

"పోతే పోగాని కృష్ణుడిని తోలుకురాయె."

"ఆలు తోల్తే తోలుకొస్త" అన్నది. పిల్లలకని మీగడపాలు సత్తు మరచెంబులో పోసుకుంది. ఉలవలు వేయించి మూట కట్టుకుని బయలు దేరింది.

"అశేయి! ఆడ నా పిల్లను యేమన్న అంటివా బొక్కలిరగదంతా?"

"నాకు గాయింత తెలవదా!" అన్నది. అవస్తలుపడి కూతుర్ని నివాసం చేరుకుంది మల్లమ్మ. కూతుర్ని చూచి మరోసారి బావురుమంది.

"ఏమిటమ్మా? ఏమయింది?" బాలామణి ఆదుర్దాగా అడిగింది.

"నువ్వు.... నువ్వు నా బాలవేనా!" వెక్కిళ్ళ మధ్య అడిగింది. కొందరు పట్టణవాస జీవితములో నాజూకు తేలుతారు. బాలామణి పల్లెలో నాజూకుగా వుండేది. ఇప్పుడు మొరటు దేలి, కమిలిపోయిన ముఖంతో వున్నది.

'నా బిడ్డ నిజంగ అగ్గి' అనుకున్నది.

"మళ్ళీ నాయన కొడుతున్నాడా అమ్మా?"

"ఏం లేదు బిడ్డ. కుట్టుడిని చూడక శాన దినాలయింది. ఎంతో దుఃఖ మాపుకోలే..." అన్నది, మనమల్ని దగ్గరకు లాక్కుని హృదయానికి హత్తుకుంది.

"ఎప్పుడొచ్చినవే మల్లమ్మ?" లస్మక్క వచ్చింది. ఆమె చేతిలో కూరగాయల సంచి వున్నది.

"నువ్వెప్పుడొచ్చినవు!"

"నా అనుకున్నోల్లంత యెల్లగొడ్తే యెడ్డోడు అనుకున్న సాయిలు పిల్లల జూసుకుని పడి వుండమన్నాడు" అన్నది ఎగచీదుతూ. మల్లమ్మకు నిశ్చింతగా వుంది. పిల్లలను చూచుకోవటానికో పెద్ద దిక్కు వుంది, చాలు అనుకుంది.

కూతురి దగ్గర నాల్గురోజులుండి ఇంటికి బయలుదేరింది మల్లమ్మ. సాగనంపుతూ బాల బస్‌స్టాండ్ వరకు వచ్చింది.

"సీతయ్య దొర.... ఒకటే ఇదయిండే..."

"అమ్మా- ఆయనకేం? దొర, భూస్వామి. ఏది కావాలన్నా కొనగలడు. నేను యిప్పుడు యెవరికీ యేం కానమ్మా. నా పిల్లలకు మాత్రం తల్లిని.... అంతే. అతనికేం కొడుకూ, కూతురూ..." బాలామణి పాత జ్ఞాపకాలు గొంతుకడ్డంపడి మాట బయటికి రాలేదు.

"ఊకో బిడ్డ-" కూతురి తల హృదయానికి హత్తుకుంది మల్లమ్మ



# 28

ఇంట్లో శాంతి భద్రతలు యెలా నెలకొల్పాలో సీతయ్యకు అర్థం కాలేదు. చంద్రశేఖర్, ఉమలు మాత్రం బాగా ఒళ్ళు చేశారు అత్తాకోడళ్ళ పోటీలో. జయమ్మకు అల్లుడిని చూడగానే కొండంత అండలా కనిపిస్తుంది.

"చంద్రం ప్రొద్దస్తమానం పొలాల వెంట ఏం తిరుగుతావు! మెట్రిక్‌కు మళ్ళీ కట్టరాదూ?" జయమ్మ అడిగింది.

"మళ్ళీ పరీక్షలకు చదవాలంటే ట్యూషన్ కావాలత్తా- అమ్మా"

"దానికేం భాగ్యంరా. ఎంతలో దొరుకుతాడు మాష్టారు?"

"నెలకు ముప్పై అయినా యివ్వాలమ్మా" అన్నాడు గోముగా. అతనికి కన్నతల్లి నేర్పిన పాఠాలు బాగా గుర్తున్నాయి.

"ముప్పై రూపాయలా?"

"అవునమ్మా! అదేం గొప్పది, రేపు నేను పరీక్ష పాసయితే అంతకు రెట్టింపు సంపాదన వస్తుంది."

"అలాగా! అయితే మీ మా... నాన్నగారికి చెప్పి మాష్టార్ని చూడమంటాను లేరా" అన్నది. కాని ఆమె మనసు బితుకు బితుకుమంటూనే వుంది. ఎంత అల్లుడయినా చూస్తూ చూస్తూ నెలకు ముప్పై రూపాయలు తగలేస్తుందా?

రాత్రి భోజనాల దగ్గర చంద్రం మళ్ళీ ట్యూషన్ విషయం ఎత్తాడు. ఊర్కుండలేని సీతయ్య కల్పించుకున్నాడు.

"ట్యూషన్ యెందుకురా, హెడ్‌మాష్టారితో చెబుతాను. హాయిగా మళ్ళీ బడిలో చేరు" అన్నాడు.

"వాడన్నది కాదంటారేం మీరు?" గయ్యిన లేచింది. భర్త అన్న మాట కాదనాలని ఆమె ఉద్దేశం.

"ఎంత డబ్బు అవుతుందో ఆలోచించావా?"

"అయితే అయింది. ట్యూషన్ చెప్పించి తీరాల్సిందే" చంద్రశేఖరం చిన్నగా నవ్వుకున్నాడు.

చంద్రం, సీతయ్య, గోవిందరావు ప్రయత్నించి, ఏసురత్నం అనే టీచరును ట్యూటరుగా కుదిర్చారు. అతను టంచనుగా అయిదు గంటలకు వచ్చి ఆరున్నరవరకు వుండేవాడు.

రాజమ్మ మనసు కుతకుతలాడిపోతోంది. రక్తసంబంధం అయిన పిల్లకేమో ప్రభుత్వపు బడి, కోడలి చుట్టానికేమో ప్రయివేటా! ఆమె తీవ్రంగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది. ఒకరోజు ఏసురత్నం దగ్గరకు వచ్చింది.

"పంతులూ!"

"ఏమమ్మా?"

"ఈ పిల్లముండ వీధులు పట్టుకు తిరుగుతోంది. నాల్గు అక్షరాలు చెప్పు. మా కాలంలో చదువులంటే చాకలిపద్దులకనేవారు. ఇప్పుడు మొగాళ్ళతో సమంగా చదివి...." అన్నది.

"మంచిదమ్మా. అమ్మాయిని కూర్చోమనండి."

"ఒసేయ్ ఉమా! రామ్మా, పంతులుగారు చెప్పింది బుద్ధిగా చదువుకో-" రాజమ్మ చెప్పింది.

"అలాగే అమ్మమ్మా?" ఉమ పుస్తకాలు తెచ్చుకుంది. మాష్టారు చెబుతాడో లేదోనని బయటి గుమ్మంలో కూర్చుని పర్యవేక్షిస్తుంది రాజమ్మ.

మాష్టారు రకరకాల పిల్లలతో, తల్లులతో, తండ్రులతో కలసిమెలసి పనిచేసినవాడు. అతనికి ఆ ఇంటివారి మనస్తత్వం బాగా అర్థం అయింది. అత్త కూర్చున్నప్పుడు ఉమకు శ్రద్ధగా చదువు చెప్పేవాడు. కోడలు కూర్చున్నప్పుడు చంద్రానికి చెప్పేవాడు. ఆ నటన బహు కష్టంగా వుండి. ఇద్దరూ ఒకేసారి వచ్చినప్పుడు అతని పని ఇరకాటంలో పడేది. వాళ్ళ భావం చూపుల్లోనే బయటపడేది. పల్లెటూళ్ళలో ఆ మాత్రం డబ్బిచ్చేవారు అరుదే. అతను ఆలోచించి, వొక నిర్ణయానికి వచ్చాడు. సాయంత్రం పాఠం ముగించి బయటకు వచ్చాడు.

సీతారామిరెడ్డి బయటి వరండాలో కూర్చుని మంగలివాడిచేత వొళ్ళు పట్టించుకుంటున్నాడు.

"రెడ్డిగారూ!"



"రండి పంతులుగారూ" చిరునవ్వుతో ఆహ్వానించారు సీతయ్య. అతనికి మాష్టారంటే ప్రత్యేకమైన అభిమానం కల్గింది. అతను సీతయ్యా అంటూ తన పేరు చెడపకుండా రెడ్డిగారూ అంటూ హుందాగా పిలుస్తాడు. అతను వెళ్ళి సీతయ్య ప్రక్కన కొద్దిదూరంలో కూర్చున్నాడు.

"ఏమిటి విశేషాలు చెప్పండి."

"ఏం లేవండి. రేపటినుండి పిల్లలను మా ఇంటికి పంపండి. మరింత ఆలస్యం అయినా ఫరవాలేదు. ఇక్కడ కొలచినట్టు చెప్పడం చేత కావడంలేదు" అన్నాడు.

"అట్లాగా!....పుట్టెడు ఆముదంలో పడ్డా అంటినంతే అంటుతుందని సామెతుందిగా, యెంత చెప్పినా గ్రహింపుగలవారికి చాల్లెండి" అన్నాడు.

"అదేమన్నమాట? చదువుకుని వ్యవహారాలు నడుపగల సమర్థుడు కావాలి మగబిడ్డడు. వెళ్ళనివ్వండి" లోపలనుండి అప్పుడే వచ్చిన జయలక్ష్మి అన్నది. ఆయన భార్యవంకకు చూచి, తల వంచేసుకున్నాడు.

"మంచిదమ్మా, వస్తాను" అతను వెళ్ళిపోయాడు.

జయలక్ష్మి చంద్రాన్ని పంపడానికి అంగీకరించడానికి కారణం లేకపోలేదు. ఇంట్లో తన అల్లుడితోసహా ఉమ చదువుకోవడం బొత్తిగా నచ్చలేదు. బయటికి ఆడపిల్లను పంపరన్న ధీమా వుంది.

మర్నాడు ఉమ తయారవుతున్నది. బయట ఆమెకోసం చంద్రం వేచి చూస్తున్నాడు.

"ఎక్కడికే ఉమా?" జయమ్మ అడిగింది.

"చంద్రం, నేను ట్యూషన్‌కు వెడుతున్నాము."

"చంద్రం అనొద్దని యెన్నిసార్లు చెప్పానే? అన్నయ్యా అంటే అరిగిపోయావా?"

ఆమె భయం ఆమెకుంది. నిజానికి వాళ్ళిద్దరూ అన్నా, చెల్లెళ్ళ వరసయినా పాపిష్టి మనసులు మారవచ్చు. అందుకే ప్రతినిముషం వరుసలను గుర్చి హెచ్చరిస్తుంది.

"ఇకనుండి అలాగే అంటాన్లే అత్తా" పుస్తకాలు తీసుకుని బయలు దేరింది.

"ఉమా! నీకు బుద్ధుందటే! రెడ్డి కొంపలో పుట్టావు. అప్పు సాయెబుల కంటె మనకు బురఖా యెక్కువే తల్లీ! మాయదారి కాలం మండిపోనూ!"

"ఇప్పుడేమంటావత్తా?"

"బుద్ధిగా ఇంట్లో వుండు. బలిజే రామమ్మ దగ్గిర కుట్లు-అల్లికలు నేర్చుకో."

"అదికాదత్తా, నాకు ఇంగ్లీషు బొత్తిగా రాదు."

"నీ ముఖం, ఇంగ్లీషు యెందుకే ఎంగిలి పీసు!" వెటకారం చేసింది.

"ఉమా!" బయటి నుండి చంద్రం పిలిచాడు.

"మొగపిల్లవాడివి నీ వెంట అదెందుకురా!" కసురుకుంది. అతను వెళ్ళిపోయాడు. ఉమ బిక్కమొహం వేసింది.

"వెళ్ళనియ్యరాదు జయమ్మా! పన్నెండేళ్ళ పిల్లకేం బురఖా!" రాజమ్మ సౌమ్యంగా అడిగింది. ఇక్కడ పెద్దకోడల్ని పెద్దగా ఆక్షేపించలేక పోయింది. కోడలు కాపురానికి వచ్చినప్పుడు బురఖా పాటించదని యాగీ చేసిన విషయము మరిచిపోలేదు.

"పన్నెండేళ్ళంటే చిన్న పాపాయి అనుకుంటున్నారా? రేపు యెట్చొచ్చి యెటుపోయినా పెంపుడు కూతురు కాబట్టి అశ్రద్ధ చేశానంటారు."

"చదివించితే ఆ మాట యెవరంటారే అమ్మా! ఏదో కాలంతో పాటు మనమూ మారాలి."

"మారిన వరకు చాల్లెండి."

రాజమ్మకు తల కొట్టేసినట్టయింది. సీతయ్య ఈ వాదం వింటూనే బయటివాడు బయటే మాయం అయ్యాడు. అతను ఇద్దరి నడుమ నలిగిపోలేక, వెళ్ళి గోవిందరావింట్లో దూరాడు.

"రావయ్యా, రా....చాలా రోజులయింది" అతను పేకముక్కలు కలుపుతూ ఆహ్వానించాడు. అక్కడ ఊరి పంచ కమిటీ మెంబర్లు, తదితర పెద్దల్లంతా ఉన్నారు.



"ఏమిటోయ్! ఆ యాదిగాడు తెగ నీల్గి పోతున్నాడంట..." రిజర్వు సీటులో కులం అడ్డుపెట్టుకు కూర్చున్న యెరుకలసామి అడిగాడు.

"ఆఁ.... అవునంట. పాలల్ల నీళ్ళు కలుపుతున్నారని మా కోమటిండ్లకు పాలు పోయించుకోవటానికి రావటమేలేదుట" పరమయ్య నడుము దగ్గర గోకేసుకున్నాడు.

"వినండయ్యా ఈ గోవిందన్న వేదం అంటే వినరు. ఊళ్ళో నాలుగు పైసలు వెనకేసుకున్నవాడిని నానా తిప్పలు పెట్టాలయ్యా" గోవిందరావు పేక కలిపాడు.

"ఈ పేకాట క్లబ్బులో మెంబరు కాని వాడిని, ఎర్రగాకులదేశం పంపాలయ్యా" కంసాలి పాండురంగం నవ్వాడు. వీళ్ళందరిది ఒక గ్రూపు. రాత్రింబవళ్ళు పేకాటతో పందుకొడుతూ గడుపుతుంటారు. పేకాటకు డబ్బు తక్కువకాగానే ఊళ్ళో కష్టం చేసుకుని బాగుపడుతున్న వాడిని సూక్ష్మదర్శినితో చూస్తారు, యెవరు పచ్చగా బ్రతుకున్నారా అని. వాళ్ళ చిన్న చిన్న తప్పులు పట్టుకుంటారు. నెలరోజుల క్రితం జరిగిన సంఘటన గుర్తుకువచ్చింది సీతయ్యకు.

## 29

వీరయ్య ఒకరి జోలికి వెళ్ళడు. తన కష్టసుఖాలు వెల్లడించుకోడు కూడాను. తన పనులు తను చేసుకొని వున్నదాంతో గుట్టుగా కాలక్షేపం చేసుకునే మనిషి. అతనీమధ్య బండిఎడ్లతో యేదో కిరాయిలకు నడిపించుకుని నాలుగు డబ్బులు చేర్చుకున్నాడన్న వార్త పాండురంగం మోసుకు వచ్చాడు. తెల్లవారేపాటికి అతని దగ్గర డబ్బు లాగే పథకం ఆలోచించాడు గోవిందరావు. ఎంతయినా కరణం బుర్రాయే, మరి తెల్లవారగనే హుటాహుటీగా వీరయ్యను పిలిపించారు. తనేం తప్పు చేయనిదే భయపడవలసిన పనిలేదని ధైర్యంతో వచ్చాడు.

"దండాలు.... పిలిపించిండ్రంట" వినయంగా అడిగాడు.

"ఏటిగట్టున వాయిల్ పొదలు నరికావా?"

"ఆ(.... నరికిన, నే నొక్కన్నేనా ఏం? ఊరంతా తెచ్చు కుంటున్నారు.

"ఊరివారి సంగతి నిన్ను అడగలేదయ్యా. నీ సంగతి చెప్పు" చార్మినార్ సిగరెట్టు స్టైయిలుగా వెలిగించాడు సామి.

"కొట్టిన అంటి గద."

"ఎవల్లనడిగి కొట్టినవు" తీవ్రంగా అడిగాడు.

"అది గవర్నమింటోల్ల బంజరు భూమి, యెవరి నడగాలి."

"ఇదిగో వీరయ్యా, అతితెలివి చూపించకు. పంచకమిటీ మెంబర్లు గాడిదలు గాయటానికి వున్నారయ్యా! తియ్యి జుల్మానా?"

"నేనేం తప్పుచేశానని."

"ఇంకా ఏం తప్పు చెయ్యాలి? అడిగినప్పుడు తిన్నగా వినాలి, ఎదురు చెప్పడమే ఓ తప్పు" గోవిందరావు నిర్ణయం చేశాడు. లబో, దిబోమంటూ కట్టక తప్పలేదు. పాతిక రూపాయల జుల్మానాకెదురు తిరిగినందుకు గేండ్ల నర్సిమ్మను నానా అవస్తలు పెట్టి, కులం నుండి వెలివేయించి చివరకు రెండు వందల రూపాయలు వసూలు చేశారు. అది తలుచుకుని యిచ్చేశాడు యాభైరూపాయలు. వీరయ్య వెళ్ళిపోయాక అందరూ గర్వంగా నవ్వుకున్నారు.

"మనము తెల్లోల్ల కంటే ఘనులం..." మీసం మెలి వేశాడు గోవిందరావు.

"ఒక్క గాడిద కొడుక్కి దమ్ములు లేవు, పైకి రిపోర్టు యివ్వటానికి" పగలబడి నవ్వాడు పరమయ్య.

"శేటుగారూ! మనకంటే యెక్కువ వారికే తెలుసయ్యా లిటిగేషనులు. పైకి కాగితం పెడితే ప్రాణముండగా తేలే విషయం కాదని...." పాండురంగం నవ్వాడు.

ఈ విషయాలన్నీ గుర్తుకు తెచ్చుకుని ఆందోళన చెందాడు సీతయ్య. సక్రమమయిన బంధమయితే యాదయ్య తనకు బావమరిది అవుతాడు. ఊళ్లో పూర్తిగా నిరంకుశత్వం ప్రారంభించారు.



"యాదయ్య ఏం చేశాడు?" చివరకు ధైర్యంచేసి అడిగాడు.

"ఏం? అతడి గురించి ప్రత్యేకంగా అడుగుతున్నావ్?" గోవిందరావు సీతయ్య వేసిన ముక్కకాక తనకు కావలసిన పేకముక్క తీసుకున్నాడు. అది యెవరూ గమనించలేదనుకున్నాడు. కాని గమనించినా చూడనట్టు నటించసాగారు అందరూ.

"ఆ మాత్రం ఊహించలేనా? ఎంతయినా పాత సంబంధం" ఫక్కున నవ్వాడు పరమయ్య.

"పాత సంబంధమో, క్రొత్తదో అదటుంచండి. యాదయ్య ఏం చేశాడని? ఆ పిల్లవాడు మనము అడిగినట్టు జుల్మానా యిచ్చే బాపతు కాదని హెచ్చరిస్తున్నాను."

"అది నువ్వు వెనుక వుండి చేయూతనిస్తే ధైర్యంగానే వుంటాడులే" వెటకారంగా అన్నాడు గోవిందరావు. "ఇదిగో సీతయ్యా! ఊళ్లో మనుషుల్ని మన చేతిలో యెలా వుంచుకోవాలో మాకు తెలుసు. నీకేమయినా అభిమానముంటే పాతికో పరకో సాయం చెయ్యి."

"అవును నాలుగు పైసలు సంపాదించాక ఊళ్ళో పెద్దా, చిన్నా అంటే మర్యాద వుండాలి. నాలుగు పైసలు ఖర్చుచేసి జల్సా చేయాలి. గడ్డికుప్ప కాడి కుక్కలా ప్రవర్తిస్తే కాస్త హెచ్చరిస్తాం" పాండురంగం జవాబు.

సాయంత్రం యాదయ్య రానేవచ్చాడు. అతన్ని చూడగానే బాలామణి గుర్తుకు వచ్చింది సీతయ్యకు. ఓ నిట్టూర్పు వదిలాడు.

"ఏందో పిలిచారట."

"అవునోయ్. మా పెద్ద ఇళ్లోళ్ళంతా పాలల్లో నీళ్ళు కలిపి పోస్తున్నారని నింద వేస్తున్నావట" పరమయ్య ప్రశ్న.

"నింద కాదండీ నిజం" అన్నాడు యాదయ్య.

"ఏమిట్రో ఒల్లు తీపరంగా వుందా ఏం?"

"మేం కష్టం చేసుకునే వాళ్ళం దొరా. తీపరంగా వుంటే మీకే వుండాలి."

"ఏమిట్రా కూశావ్?" పాండురంగ లేచాడు.

"ఊరివారి బంగారం దిగమింగినట్టు కాదు పాండురంగయ్యా! జర మంచిగా మాట్లాడు."

గతుక్కుమన్నాడు పాండురంగం. అందరికి పట్టా గొలుసులు చేసి ఇస్తానని యాభై రూపాయలు గొల్ల ఇండ్లలో తీసుకు వచ్చి ఏరుకు తిన్నాడు. గట్టిగా మాట్లాడితే వీడు యేదోచేస్తాడని భయపడి పని వుందంటూ లేచిపోయాడు.

"ఇదిగో మా వాళ్ళు పాలల్ల నీళ్ళు కలిపినట్టు నిరూపించకపోతే నీవు నూర్రూపాయల జుల్మానా కట్టుకోవాలి" పరమయ్య అన్నాడు.

"నిరూపించకపోతే కదా..." నవ్వాడు యాదయ్య.

"ఏమిట్రా ధీమా?"

"మీరంతా పెరడు వైపుకు రండయ్యా..." యాదయ్య దారి తీశాడు. గోవిందరావు ఇంట్లోకి పోబోయాడు.

"ఆఁ... ఆఁ... ఆగండి పంతులూ, మీరిలాగే రావాలి" అన్నాడు. అందరూ వెళ్ళారు. స్థాణువుల్లా నిలబడి పోయారు. గోవిందరావు భార్య సగం చెంబు పాలలో సగం చెంబు నీళ్ళు కలుపుతున్నది.

"అమ్మ...... అందరూ నీల్లపాలంటారు పోసుకోరు" జీతగాడు నసుగుతున్నాడు.

"గొల్లోల్లు పోసుకోకపోతే పాల సరఫరా కేంద్రంలో పొయ్యాలి" ఆవిడ ఆదేశాలు యిస్తున్నది.

"చూచారా? మీరంతా పెద్దలు. నాకు వందరూపాయలు జుల్మానా వేస్తామన్నారు. మీకెంత వెయ్యాలి."

గోవిందరావు కొర, కొర చూచాడు. పరమయ్య పళ్ళు కొరికాడు.

"మా వృత్తి పాలమ్ముకోవడం. కొన్నిసార్లు పాలలో నీళ్ళు కలిపి అమ్మకపోతే మాకు గడవదు. చిక్కటి పాలధర ఎక్కువంటే ప్రక్క వ్యాపారితో పోల్చి అతను పావలాకే పావులీటరు పోస్తున్నారు అంటూ అలాంటప్పుడు మాకు తప్పదు. ఎన్నో రకాల సంపాదన వున్న మీకు వచ్చింది" యాదయ్య సవాలుకు జవాబు లేదు.



"చాల్లే ఇదొక్కటేనా? నీ చెల్లెలు ఊర్ల ఉండగానే, మేం జుల్మానా వెయ్యాలనుకున్నాం."

"పరమయ్యా! నా చెల్లెలు పేరెత్తితే చెయ్యి విరగగొడతాను. అప్పుడు సీతయ్య దొర యిచ్చే అప్పులు పోతాయని అనలేదు కదూ! నా చెల్లెలు మనసున్న మనిషి. నీతిగల స్త్రీ. నీలాంటిది కాదు. ఈనాడు మేం నీ యెదుట నిలబడి మాట్లాడుతున్నామంటే అదంతా ఆమె చలువే..." చకచకా వెళ్ళిపోయాడు.

"వీడు కొరకరాని కొయ్య."

"నరుకుదాం" గోవిందరావు అన్నాడు.

"ఈ మూకంతా రాత్రి బడిలో చదువుకుంటారట. అందుకే తెలివి మీరి పోతున్నారు. వాడిమాట చూడండి, ఎంత స్వచ్ఛంగా వుందో!"

"ఆ ముండ.... వీడి చెల్లెలు యెవడినో పెద్దాడినే పట్టిందట కదా?"

"పరాయి స్త్రీల గురించి తప్ప మనకేం మాటలు లేవా?" సీతయ్య విసుక్కున్నాడు.

"నువ్వంటే చేతల మనిషివి. మేము మాటల వాళ్ళమేగా" అక్కడుంటే వాదం ముదురుతుందని లేచి బయటికి వచ్చేశాడు సీతయ్య. అతని మనసంతా చేదు మింగినట్టుంది. విల్సన్ కనిపించి తనకు, బాలామణికి ఎలాంటి సంబంధం లేదని చెప్పాడు. ఆమె తన సంతానాన్ని వారసులుగా అంగీకరించక, దత్తు తీసుకున్నందుకు కోపగించిందని తెలిసినప్పటి నుండి, గుండెలో యెవరో గునపం దిగేసినట్టు బాధపడ్డాడు. నిజమేగదా సంతానం వుండగా శాస్త్రోక్తంగా దత్తు చేసుకోవటం ఏమిటి? పొలంవైపు వెళ్ళి తామిద్దరూ ఆనందంగా గడిపిన రోజులు గుర్తు చేసుకున్నాడు.

# 30

"నువ్వన్నమాట బావుంది. కాని నెలనెలా అంత ఫీజు కట్టడం నావల్ల కాదన్నయ్యా!"

"బావుంది మరి ఎడ్యుకేషన్ స్టాండర్డుగా వుండాలంటే ఫీజు కట్టవలసిందే" ఆఖరు దమ్ములాగి సిగరెట్ దూరంగా వేశాడు విల్సన్.

"ఇంతవరకు అమ్మగారు నేనేదో పని చేస్తున్నానని ఫీజులు తీసుకోలేదు. ఇప్పుడెలా? వ్యాపారంలో ఏం మిగులుతుందని? కష్టతరంగా అయిదుగురి పొట్ట గడవాలి" అన్నది.

"అలా అయితే ఒక పని చేయి. అప్పుడప్పుడు నా నర్సింగ్ హోమ్‌లో చేరినవారు తమ దగ్గర యెవరయినా వుండాలనుకుంటారు. అందువల్ల డబ్బు వస్తుంది. అది ఫీజు కడదాం. కృష్ణుడిని పంపించు" అన్నాడు. కృష్ణ ఫీజు కట్టడం అతనికో సమస్య కాదు. ఆత్మాభిమానం గల బాలామణి అది స్వీకరించదని తెలుసు. అందుకే యేదో యేర్పాటు చూడాలని కృష్ణుడికి పార్టుటైం జాబ్ చూపాడు.

"మాట్లాడవు!"

"ఆస్పత్రి అనగానే అనేక రోగాలుంటాయి. పసివాడిని యెలా పంపను" అన్నది దిగులుగా.

"అంటువ్యాధులయితే నేను పంపమంటానా? వాడి ఆరోగ్యానికి గ్యారంటీ వుంటాను చాలా?"

"సరే...." బాలామణి వెళ్ళిపోయింది. సరే అన్నమాట ఆమె హృదయపూర్వకంగా అనలేదని అతను గ్రహించాడు. 'తల్లి హృదయం' అనుకున్నాడు.

"నాకు ఇష్టంలేదు విల్సన్!" మార్తమ్మ అన్నది.

"నీవు కూడా గ్రహించలేదంటే నవ్వు వస్తుందమ్మా, ఆ తలతిక్క మనిషి అయాచితంగా లభించే సాయం తీసుకొంటుందా? అందుకే ఓ పని పేరు చెప్పడం..." నవ్వాడు.

"అలా అయితే ఫర్వాలేదు" ఆవిడ లోపలికి వెళ్ళిపోయింది. ఆడది అబల. అసహాయురాలు యెందుకవుతుంది? మొగవాడి దురాచారాల వల్లనా? కాదు ఆత్మవిశ్వాసం లేక. బాలామణికి యెవరు సహాయపడ్డారు? ఆత్మవిశ్వాసంతో ముందుకు వచ్చింది. తనలాంటి వారు చేయూతనిచ్చారు.



అంతే! అతని ఆలోచనలు ఒక్కటే, గడిచిన సంఘటనలని నెమరువేయసాగాయి. ఏ జన్మబంధమో, ఒక అనుబంధంగా మార్చి అన్నా, చెల్లెళ్ళ ఆప్యాయతను పంచుకున్నారు. బాలామణి ఇంటికి వచ్చింది. ఒక గది. గది ముందు కొట్టు. కొట్టులో లస్మక్క కూర్చుంది. కాసింత పెరుగే మిగిలివుంది. వెడల్పాటి మట్టిచట్టిలో వున్న పెరుగు ఒక్క దగ్గరకు చేర్చింది.

"రేపొద్దున్నే అమ్ముకొస్త బిడ్డ. దుకానము కట్టేద్దునా!"

"కట్టెయి" లోపలికి వెళ్ళింది. చాపమీద పరచిన గళ్ళ దుప్పటి ఒక మూలకు ఉంగ చుట్టుకుపోయింది. ఒట్టి చాపమీద ఇద్దరు పిల్లలు నిదురబోతున్నారు. అవతలి ప్రక్కన సాయిలు గుర్రుపెట్టాడు. లస్మక్క కొట్టులోనే ముడుచుకుంటుంది. బాలామణివచ్చి గిన్నెలు చూచింది, అందరూ భోజనము చేసినట్టున్నారు. అడుగున తనకు సరిపడే అన్నం వుంది. తినాలనిపించలేదు. గ్లాసుడు నీళ్ళు ముంచుకుని తాగి వచ్చేసింది. ఎదురుగా అద్దంలో తన ప్రతిబింబం చూచుకుని ఆశ్చర్యపోయింది. చిగురుటాకు లాంటి అందం మాయం అయింది. జుట్టు పలచబడి నుదురు పెద్దగా కనిపించింది. అందమైన దోస పలుకుబొట్టు స్థానాన నయాపైసంత బొట్టు పెట్టుకుంది. జుట్టు గట్టిగా లాగి బర్మాముడి వేసుకుంది. మెడలో రెండు వరసల నల్లపూసలు తప్ప ఏం కనిపించలేదు. చెవులకు నీరుదిగిన కమ్మలున్నాయి. తన రూపు అలా అయిందని ఆమె బాధపడలేదు. తన పిల్లల భవిష్యత్తు యేమిటా అనే బాధపడుతుంది. దుప్పటి సరిజేసి ప్రక్కన ఒదిగింది.

"లైటు తీసివేయనా?" లస్మక్క మాటకు లేచి మధ్య తలుపు చేరవేసి లైటుతీసి పడుకుంది. నిద్రాదేవి ఆమెను వెలివేసింది.

'బాలా! నీతో గడిపిన ఈ మధుర క్షణాలే నాకు గుర్తుపెట్టుకోతగినవి సుమా! మీ అక్క ఒట్టి అడవి మనిషి' అన్నవాడు... మగవాడు.

'మన కృష్ణుడిని అల్లాటప్పా చదువు చదివిస్తానేమిటి. కలెక్టరవుతాడు నా కొడుకు' అన్న తండ్రి ఒక స్త్రీ లోలుడా? అంటే అతనికి ఉంపుడుకత్తెగా వుంటే పిల్లలకు రక్షణ దొరికేది. అలాంటి రక్షణా తను

ఆశించింది. దొర్లి, దొర్లి తెల్లవారు జామున నిద్రలోకి జారిపోయింది బారెడు ప్రొద్దు యెక్కినా మెలుకువ రాలేదు.

"తీసుకునే అణా పాలకు కొసరు కావాలా?" అరుస్తున్నాడు కృష్ణ

"టీ త్రాగి పోరా....." సాయిలు పిలుస్తున్నాడు.

"వస్తాను నాన్నా. రాముడికి టీ యిచ్చి పంపు. ఇప్పుడేగా గిరో వుండేది" విసుక్కున్నాడు. ఉలిక్కిపడి లేచింది బాలామణి. ఆరేళ్ళ వాడిలా కొట్లో హడావిడిపడుతున్న కొడుకును మురిపెంగా చూసింది వెంట్రుకలు జాడించి ముడేసుకుంది.

"ఏందే పెయి బాగలేదా?" సాయిలు అడిగాడు ఓ ప్రక్కన కూర్చుని టీ ఊదుకు త్రాగుతూ.

"ఏమయిందో! రాత్రి నిద్ర రాలేదు" లేచి బట్టలు దులిపి ట్రంకు పెట్టెమీద పెట్టింది. చాపచుట్టి మూలకు పెట్టింది. కచ్చిక, చెంబులో నీళ్ళు తీసుకుని బయటికివెళ్ళి రోడ్డువారగా పళ్ళు తోముకుంటూ, ఓ చిన్న రాయిపై కూర్చుంది. సిపాయివారు పెద్ద పెద్ద చీపుర్లతో ఊడుస్తున్నారు జనము హడావిడి మొదలు కాలేదు, పలుచ పలుచగానే వున్నారు. ముఖం కడిగి వచ్చింది. రాముడు తల్లికి టీ యిచ్చాడు.

"అమ్మమ్మ యేదిరా?"

"ఆకు, వక్క తెచ్చుకుంటానని వెళ్ళింది. ఇంతవరకు రాలేదు దారిలో యెవరయినా ముచ్చటకు దొరికారేమో...." అన్నాడు. టీ త్రాగుతుంటే ఆమెకు కొడుకు అదిలింపులు వినిపించాయి.

"మా అమ్మ యెందుకు? ఏమిటో నాతో చెప్పు."

"అది కాదబ్బాయి, ఈ నెలాఖరువరకు అరువుగా యివ్వు..."

"ఇక్కడ అరువు బేరం లేనేలేదు."

"ఎప్పుడూ తీసుకు వెడతాను. మీ అమ్మను పిలువు."

బాలామణి లేచి వెళ్ళింది. తను అరువిస్తే కొడుకు అభిమానం దెబ్బతింటుందేమో! అటు గొప్పవారు యిటు కూలి జనం బాగానే వున్నారు. మధ్యతరగతి వారు నలిగిపోతున్నారు. అరువు తప్పని తెలిసీ



చెయ్యక తప్పడం లేదు. ధరలతోపాటు కూలి పెరిగిందిగాని జీతాలు పెరగలేదు.

"కృష్ణా! ఈ ఒక్కసారికి..." భయపడినట్టు నసిగింది.

"ఇట్లా చేస్తే బాగా ఉద్ధరిస్తాం" విసుగ్గా ఆమెకు పాలు పోశాడు. ఆతనికి సీతారామిరెడ్డి మెతక రాలేదు. స్వతంత్రంగా బ్రతికే సత్తా వుందని తెలుసుకుంది.

"అమ్మా!" కొట్టుమీద తమ్ముడిని కూర్చోపెట్టి వచ్చాడు కృష్ణ. సాయిలు పాలకు వెళ్ళాడు.

"ఏమిట్రా?"

"నన్ను ఆల్ సెయింట్స్‌లో వేస్తున్నావా!"

"ఊ...." అన్నది యెటో చూస్తూ.

"అదేమిటమ్మా! నేను బడిలో చేరటం ఇష్టం లేదా?"

"ఇష్టమా!.... అది కాదురా ఫీజు డబ్బు కోసం అప్పుడప్పుడు డాక్టర్‌గారి దగ్గర పనిచేయాలి?"

"ఓ యస్! తప్పక చేస్తాను. రేపటినుండి నాన్న, నేను ఒక వీధిలో పాలుకూడా యిస్తాం."

"ఏం పాలు?"

"పాల బూత్ నుండి ఇల్లిల్లు తిరిగి యిస్తాము."

"కృష్ణా!" ఆమె వాడిని దగ్గరకు తీసుకుని కన్నీరు నింపింది.

"వదులు- వదులమ్మా?" వదిలించుకున్నాడు.

ఆ రోజంతా అన్యమనస్కంగా గడిపింది. తెల్లవారి లేస్తే యెన్ని అవసరాలు? తనూహించినట్టు, ఆశించినట్టు పిల్లలను పెంచగలదా?

మర్నాడు వెళ్ళి యూనిఫారం, బూట్లు కొన్నది. మార్తమ్మ ఒక బ్యాగు ప్రజెంటు చేసింది.

"అమ్మా! నేను అన్నయ్య బడిలో చేరుతానే" రాము మారాం మొదలు పెట్టాడు.

"వచ్చే ఏడు చేరుదువురా." కృష్ణ యూనిఫార్మ్ వేసుకుని,

రెండు గోధుమ రొట్టెలు చిన్న సత్తుడబ్బాలో వేసుకుని బడికి వెడుతుంటే కళ్ళ పండుగగా చూచుకుంది.

"పిల్లలు తల్లిలా ముత్యాల్లా వున్నారు. ఆ తండ్రి.... కోతిముఖం!" పక్క ఇంటివారు అనుకోవడం విన్నది. ఒక దీర్ఘమయిన శ్వాస విడిచింది. సాయిలు అమాయకుడే కావచ్చు కాని ఆమెకు ఒక మహోన్నతమయిన వ్యక్తిలా కనిపిస్తాడు. అతను పాలు తీసుకుని వచ్చాడు.

"ఇంతాలస్యం అయింది, పాల వ్యాన్ రాలేదా?"

"ఇంత పొద్దున పంపుతున్నావేమిటి కృష్ణుడిని?" అతను డబ్బా క్రిందబెట్టి అడిగాడు.

"మొదటిరోజు కదా. అసలు యెక్కడలేని ఆదుర్దా! వెళ్ళనీ. ఒకరోజు గేటుముందు నిల్చుంటే వాడే సమయానికి వెడతాడు" అన్నది పాలు గిన్నెలోకి ఒంపుతూ.

"మన కుట్టుడు దొరబాబులా వున్నాడే..." అతను మురిసిపోతూ జేబులోనుంచి పిప్పరమెంట్లు తీశాడు.

"రాముడూ.... ఇవి తీసుకో బిడ్డ..."

"నాన్నా మేమింకా చిన్నపిల్లలమా ఏం! పిప్పరమెంట్లు ఒద్దు" అన్నాడు గారాలుపోతూ.

"మరేం కావాలి?"

"నువ్వు రోజూ వెళ్ళి పనిచేస్తావు చూడు మిఠాయికొట్లో అక్కడి మిఠాయి కావాలి. అన్నకేమో.... షష్టి ఇష్టం. నాకేమో జిలేబి..."

"ఇంకా నయము. లడ్లు, కోవాబిళ్ళలు ఒద్దా?" బాలామణి వెక్కిరించింది.

"ఏందే... పెద్ద సుతారమన్నట్టు చేస్తున్నావేం? నా పిల్లలు రోజు మిఠాయి తింటారు సూడు" అన్నాడు.

"నువ్వు తయారు చేస్తావా?"

"చేస్తానే. మిఠాయి దుకాణం అతడు పని చేపిచ్చుకుంటడు గాని,



పైసలడిగితే సస్తడు. వచ్చేనెల నుంచి చిన్నది మనమే పెట్టుకుందాము" అన్నాడు.

సాయిలు మాటలు తమాశ క్రింద తీసుకుంది. కాని అతను నిజంగానే ఆ ఉద్దేశంలో వున్నాడని వారం రోజుల్లో తేలిపోయింది. ఎవరో అమ్ముతుంటే కళాయి, చిల్లుల గరిటె కొన్నాడు.

"మనము ఒకరిదగ్గర పనిచేస్తే నానా మాటలు అంటారు" అన్నాడు ఉపోద్ఘాతము లేకుండానే.

"డబ్బుందా?" విసురుగా అడిగింది.

"అదే వస్తుందిలే" అన్నాడు. సాయంత్రం రాముడు బడి నుండి వచ్చాక అసలు విషయం అర్థం అయింది.

"అమ్మా!" గావుకేకలు పెట్టాడు.

"ఏమిట్రా యేమయింది?"

"నాన్న ఆ కొట్లో పని చెయ్యొద్దమ్మ. వాళ్ళకు చచ్చే పొగరు. హేళన చేస్తారు" ఒగరుస్తూ చెప్పాడు.

"అసలు విషయము చెప్పరా!"

"ఆడంగి ముత్తయ్య అంటుంటే నాన్న ఊర్కుంటాడేం? నేను జమాయించి రెండు గుద్దులు గుద్దాను. మా నాన్న పేరెత్తితే ఎముకలు విరిచి మూసీ నదిలో పడేస్తానని చెప్పాను" రోషంగా భుజానికి వున్న సంచి మూలకు గిరాటు వేశాడు.

"ఏమిటిరా!....." ఆమె కొడుకును చూస్తూ కూర్చుండిపోయింది. ఒకవైపు ఆనందంగా వుంది. మరోవైపు దిగులు పట్టుకుంది. కృష్ణ కోపిష్టి కాదు. రాముడికి కోపం వస్తే ఆగదు.

"నాన్నా! మళ్ళీ యెవరేమన్నా చెప్పు. నీ జోలికి రాకుండా నేను చూస్తాను" గర్వంగా తలెగురవేశాడు రాముడు. ఆ రోజు నుంచి అతను ఉద్యోగానికి స్వస్తి చెప్పి స్వంత వ్యాపారం ప్రారంభించి, కొడుకులకు మాత్రం రోజూ స్వీట్ తేవడం మరిచిపోలేదు.

సోమరిపోతులు యితరుల ఉన్నతికి యేడుస్తూ నినాదాలతో

బ్రతుకుతారు గాని, పనిచేసేవారికేం తక్కువ. బాలామణికి క్షణం తీరిక వుండడం లేదు. ఏమాత్రం తీరిక దొరికినా ఇద్దరు కొడుకులను తీసుకుని మార్తమ్మ దగ్గరకు వెళ్ళిపోయేది.

"నాకా పెద్ద చదువురాదు. ఆయనా అయోమయం మనిషి. మీరయినా చూడండి" అనేది.

"ఏమిటే చూచేది! నీ కొడుకులకేం?" అంటూనే వాళ్ళను ప్రశ్నించేది. సంతృప్తిగా తలాడించేది.

ఆమెకు యిప్పుడు శారీరక వాంఛలు లేవు. అందంగా కనపడాలన్న తాపత్రయం లేదు. కృష్ణుడు, రాముడు అంటూ, ప్రతి అణువు ఆక్రోశిస్తుంది. ఆమెకు రెండు కళ్ళులా మిగిలింది కొడుకులిద్దరే. ఆమె పెంపకమయితేనేం, అతను చూపే ఆప్యాయత అయితేనేం పిల్లలిద్దరికి తండ్రి అంటే ప్రేమాభిమానాలున్నాయి. తల్లికి జంకుతారు. అతడి దగ్గర మారాం చేస్తారు. అప్పుడప్పుడు యాదయ్య, సక్కు, కేశవులు వచ్చిపోతుంటారు. తల్లీ తండ్రీ నెలకొక్కసారయినా వస్తుంటారు. బాలామణి నిలదొక్కుకుంది.

దీపాలు వెలిగించి బయటికి వచ్చింది బాలామణి కొబ్బరికాయ, అగరొత్తులు తీసుకుని వచ్చాడు సాయిలు. అతడు స్నానం చేశాడు.

"ఎక్కడికి?"

"చిన్నాడు ఇంటికి రాగానే వచ్చి కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్నానే" సాయిలు హడావుడి చేశాడు. పిల్లలిద్దరి పోటీలతో బయట అమ్మకం చేస్తున్నారు.

"నేను కనిపించే దేవుడికే మొక్కుతాను."

"ఓయమ్మ? నీకు దేవుడు కనిపిస్తున్నాడా!" సాయిలు అడిగాడు.

"ఊఁ..." వంగి అతని పాదాలకి నమస్కరించింది.

"ఇదేందే..." సాయిలు దూరంగా జరిగాడు.

"నాకు కనిపించే దేవుడివి" కళ్ళు ఒత్తుకుంది.

"నీ పెయి బాగుందా?"



"సాయిలూ!.... చదివాం. సంస్కారవంతులమంటారు. వారెవ్వరు నీ అంత ప్రేమమూర్తులు కారు... కాలేరు."

"ఏందే... ఊకే గట్లంటవూ? పాండురాజు భార్య కుంతి సంతు తెచ్చుకోలేదూ!" అతడి విశ్లేషణకు ఆశ్చర్యపోయింది. సాయిలులా తన బలహీనతకు కారణాలు వెతికే పురుషులెంతమంది? ఈ సభ్య సమాజంలో తను అనర్హుడని తెలిసినా వివాహం చేసుకుని భార్యలను సాధించే భర్తలు తనకు తెలుసు.

"పదవే- మల్ల ఆడముండలు జమ అయితరు" అన్నాడు. మంత్రముగ్ధలా అతని వెంట నడిచింది.

## 31

"అన్నయ్యా! పూర్తిగా పేకాటకు దాసులు అయిపోయారు. సరిగ్గా దీపావళికి అయిదు రోజులు ఆయన ఇంట్లో అడుగుపెట్టి. ఏం చేయను!" జయలక్ష్మి దీనంగా అన్న ముందు కన్నీరు కార్చింది.

"అదేదో నేను తేల్చివేస్తానుండు" అనంతరెడ్డి లేచాడు.

"ఇటు చంద్రం మూడుసార్లు కట్టినా పరీక్ష తప్పాడు."

"మా దగ్గరుండగా చక్కగా చదువుకొనేవాడు. అయినా పిల్లలకు కావాల్సిన స్వేచ్ఛ, తిండి వుండాలి" అన్నాడు.

"మా ఇంట్లో తిండి లేదంటావు అవునా!" అంతెత్తున లేచింది.

"అబ్బబ్బ! అలా అన్నానా! ఏదో మేం వేలంవెర్రిగా పెంచాం. వాడెలాగూ యిక చదవడు. చదివి ఉద్యోగం చేసినా మీదగ్గర యెవరుంటారు? ఆ మూడు ముళ్ళు వేయించేయి."

"నిండా ఇరవైలేవు అప్పుడే పెళ్ళా?"

"నీ ఇష్టం జయా! అటు నీ భర్త ఇంటిపట్టున వుండడు. అది ఆసరాగా చేసుకుని పిల్లవాడు బయట తిరిగితే నువ్వేం చేయగలవు చెప్పు? అమ్మాయి ఉంటే అడ్డు పెడుతుంది."

"అదీ నిజమేనన్నయ్యా! మరి అమ్మాయి-"

"మా బావమరిది కూతుర్ని పేరు పెట్టుకున్నాం, అతడే యిస్తాడు"

"అదేదో త్వరగా మాట్లాడన్నయ్యా!" ఆమె కళ్ళముందు యెంతో ఉన్నతమైన భవిష్యత్తు కనిపించింది.

అనంతరెడ్డి తిన్నగా గోవిందరావు ఇంటికి వెళ్ళాడు. అందరూ తమను తాము మరచిపోయి పేకాడుతున్నారు.

"సీతయ్యా?" అనంతరెడ్డి పిలిచాడు.

"ఓ..... బావగారా! యెప్పుడు వచ్చావ్?"

"రాత్రి..."

"సీతయ్యా! కార్డుషో అయ్యా. పడెయ్యి కార్డు" పాండురంగ అరిచాడు. పది, పదిహేను నిమిషాలయినా మళ్ళీ యిటు తిరగలేదు ఇప్పుడు మళ్ళీ పిలిచాడు.

"ఈవాల్టికి నాల్గురోజులయిందట ఇంటికి రాక..."

"ఇది మంచి కాలక్షేపం బావా!" నవ్వాడు. ఆ నవ్వు నవ్వులా లేదు. అందంగా, ఆరోగ్యంగా వుండే సీతయ్యేనా అన్న అనుమానం కలిగింది. లోతుకుపోయిన కళ్ళూ, పీక్కుపోయిన దవడలు, ఎర్రని కళ్ళు నిదురలేమిని సూచిస్తున్నాయి.

"కాలక్షేపం సరే.... ఇల్లు ఒకటి వుందని మరిచిపోతే యెలా?"

"ఇల్లు కావల్సినవారు ఇంట్లో వున్నారుగా-"

అరగంట వాదించి, సీతయ్యను అక్కడి నుంచి లేపాడు. ఇద్దరూ ఇంటిముఖం పట్టారు.

"బావా! యెక్కడయినా మా ఉమకు సంబంధం చూడు. దాని వయసు చిన్నదే కాని, ఆ అమ్మాయి పెళ్ళయిపోతే, మా ఇంట్లో పోట్లు తగ్గుతాయేమో. ఇటు అమ్మ, అటు జయ నన్ను ఊపిరిపీల్చుకోనివ్వరు."

ఆయన జాలిగా చూచాడు. స్త్రీ ఆలోచనలు సక్రమంగా లేకపోతే ఆ ఇల్లు యెంత నరకమో ఊహించాడు! కాని ఏం అనలేదు.

"ఈ పేక, ఈ వ్యసనాలు సరదా అనుకుంటున్నావా! నన్ను నేను మరచిపోవాలని చేస్తున్నాను."



"నీతో అంగీకరించను సీతయ్యా! నువ్వు కాస్త గట్టిగా వుంటే వాళ్ళే దారికొస్తారు."

"నేను యేనాడో వదిలేసుకున్నాను బావా!"

ఇద్దరూ ఇంటికి వచ్చారు. జయలక్ష్మి రుస, రుసలాడుతూ యేదో అనబోయింది. అనంతరెడ్డి కళ్ళతోనే వారించాడు. స్నానం, భోజనం కాగానే, ఉయ్యాల బల్లమీద పడి ఒళ్ళు మరిచి నిదురపోయాడు.

"ఇదీ వరస?" గుడ్లనీళ్ళు కుక్కుకుంది జయమ్మ.

"అదికాదు జయా. మీ అత్తా కోడళ్ళు యెందుకు పోట్లాడుతారు."

"కృష్ణా! రామా అంటూ మూలపడి వుండదు. లేని గొడవలు, పేచీలు పెడుతుంది. చంద్రాన్ని యెక్కడ యెక్కువ చూస్తానో అని వేయి కళ్ళతో కనిపెడుతుంటుంది" అన్నది నిరసనగా.

"అదంతా మంచిదేనమ్మా. మీ తగాదాల మూలంగా బావ ఇల్లు వదిలాడు. ఏదయినా నిదానంగా పరిష్కరించుకోవాలి."

"ఆ ముసలమ్మ వున్నంతకాలం నా ప్రాణానికి సుఖం లేదన్నయ్యా" అన్నది.

"అది చాలా పొరపాటుగా ఆలోచింపచేసే భావన. మన అమ్మ మన దగ్గరలేదా?"

"అమ్మకు, ఈవిడకు పోలికా!"

"ఎందుకు లేదు పిచ్చితల్లీ! ఆత్మలన్నీ ఒక్కటే. ఆకలంతా ఒక్కటే. బావకూడా విసుగెత్తిపోయాడు. ఉమకు సంబంధం చూడమంటున్నాడు."

"చూశారా ఆయన కుళ్ళు బుద్ధి. ఇటు మనం చంద్రానికి సంబంధం చూస్తున్నామనగానే తన చెల్లెలు యెక్కడ అన్యాయం అయిపోతుందోనని...."

"అయ్యో?" నిస్సహాయంగా తలపట్టుకు కూర్చున్నాడు.

"అదేమిటన్నయ్యా?"

"నీకేదీ సక్రమంగా అర్థం కాదా జయా? ఇంతవరకు చంద్రం విషయము బావతో అనలేదు నేను."

"అన్నా, అనకపోయినా కుళ్ళుందిలే" అన్నది. అనంతరెడ్డికి భయం పట్టుకుంది. చెల్లెలి ప్రవర్తన యిలా వుంటే తన బావ ఏ క్షణంలోనయినా మనసు మార్చుకోవచ్చు. సన్యసించినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఏం చేయాల అని ఆలోచిస్తూ నడుం వాల్చాడు.

సాయంత్రం మళ్ళీ సంబంధాల గొడవ వచ్చింది. అప్పుడు రాజమ్మ కూడా చెవుల దుమ్ము దులుపుకుని మరీ కూర్చుంది.

"మంచి సంబంధం, సంప్రదాయమయిన కుటుంబం. చూడు నాయనా! ఆడపిల్లనిస్తే మళ్ళీ మనకు ఎదురు చూడకుండా వుండాలి."

"అలాగే అత్తయ్యా?"

"అన్నయ్యా గంతకు తగ్గ బొంత అన్నట్టుండాలి. మరీ గొప్పలకు పోయి పదివేలు, ఇరవైవేలు అంటే మనవల్ల యేమవుతుంది. మీ బావ ఉద్యోగస్తుడా" జయమ్మ అందుకుంది.

"పదివేలు ముష్టివాళ్ళిస్తున్నారు" రాజమ్మ గొంతు గుర గురలాడింది.

"మీరేమన్నా దాచిపెట్టారేమో యివ్వకూడదూ!"

"నేను దాచిపెట్టకపోయినా వాళ్ళ తాత సంపాదించిన ఆస్తి వుంది."

"ఓయబ్బ మాలావు ఆస్తి. పొలముండగానే సరా? దానికి యెవ్వి చేస్తే రూపుకు వస్తుంది!"

"నా కొడుకే చేస్తున్నాడే, నువ్వేం చేయడం లేదు. ఓ రెండు ఎకరాలు అమ్మి యిస్తాం."

ఒకరిమాట ఒకరు ఖండించడం తప్పితే మరే ధ్యేయం లేనట్టున్న వారి ధోరణి చూస్తుంటే అనంతరెడ్డికి మతిపోసాగింది. ఇద్దరిని వారించి నోరు మూయించేవరకు అతనికి జ్వరం పట్టుకున్నంత పనయింది.

అతడు త్వరగా వెళ్ళిపోయాడు. ఇద్దరికీ సంబంధాలు కుదిర్చారు. ఉమకు కుదిర్చిన వరుడు బి.కాం. చదువుతున్నాడు. వాళ్ళు 'క్యాష్' కావాలని అడగలేదు. అమ్మాయికి పదిహేను కాసుల బంగారం, వెయ్యి రూపాయల చీరలు; అబ్బాయికి బట్టలు, వాచీ పెడితే చాలన్నారు. ఒక్క సంవత్సరం



చదువుకు ఆర్థికంగా సహాయం చెయ్యాలన్నారు. దానికి అంగీకరించాడు సీతారామిరెడ్డి.

చంద్రానికి పదివేల రూపాయల కట్నం, లాంఛనాలు యిస్తామన్నారు అనంతరెడ్డి అత్తగారు. అందరూ సంతోషించారు.

"ఏమండీ, పదిహేను కాసుల బంగారం కొనిపెడతారా?" భర్తను నిలదీసింది.

"కొనడానికి బంగారం చవగ్గా వుందా ఏం? అమ్మది వుందిగా పని వెళ్ళమారిపోతుంది" అన్నాడు నిశ్చింతగా.

"ఏమోనండీ న్యాయంగా ఆ బంగారం నాకు చెందాలి." ఆయన మాట్లాడలేదు. ఆమె విసుక్కుని వెళ్ళిపోయింది. రాజమ్మ వచ్చింది.

"ఏమిట్రా తండ్రీ! ఇంత అన్యాయం? అందుకే అన్నారు కాబోలు 'అయిన వాడికి ఆకున పెడతారు, కాని వాడికి కంచాన పెడతారని'. తెచ్చుకునేది పదివేలు. ఇచ్చేది ఇంత తక్కువ. సరస్వతి పిల్లనిచ్చేనాడే అంది. అన్నయ్యకు అత్తగారే యెక్కువని. కుక్కపేగు ముండను కాదు కాకూడదని, పిల్లలులేని వాడని యిప్పించాను" కళ్ళు ఒత్తుకుంది. అతనికి తెలుసు నోరువిప్పితే రగడ అవుతుందని పని వుందంటూ బయటికి వెళ్ళిపోయాడు.

సరస్వతి వస్తూనే ఇంట్లో కురుక్షేత్రం ప్రారంభమయింది. నాలుగు రోజుల తరువాత యుద్ధవిరమణ జరిగింది. ఉమ పేర అయిదువేల రూపాయలు బ్యాంకులో వేయడానికి నిర్ణయమయింది.

జయలక్ష్మికి ఆయుధం దొరికితే వదినను, అన్నను, అత్తను, ఆడపడుచులను చంపెయాలన్నంత కోపంగా వుంది. పళ్ళు పటపటలాడిస్తూ తిరుగుతోంది. ఆ ఇంట్లో రెండు పార్టీలు యేర్పడ్డాయి. ఒకరిని ఒకరు యెన్నికల్లో ఎలా వెంటాడుకుంటారో అలాగే గొడవపడుతున్నారు. ఇంట్లోకి రావాలంటే ఇంటి యజమానికి భయంగా వుంది. ఈ రెండు పెళ్ళిళ్ళు నిర్విఘ్నంగా జరిగితే కొంతయినా ప్రశాంతత యేర్పడవచ్చునని ఆశించాడు. పరికోత పేరుతో రాత్రింబవళ్ళు పొలం దగ్గరే వుండి పోయాడు.

ఒకరోజు జయలక్ష్మి భర్త దగ్గరకు బయలుదేరింది. ప్రపంచ వింతల్లో ఒక వింత అయినట్టు అందరూ చిత్రంగా చూచారు. అతనూ అలాగే చూచాడు. అతనికి ఏకాంతంగా వుంటే యేవేవో అందమైన విషయాలు గుర్తుకువస్తున్నాయి. తనను వెతుక్కుంటూ వచ్చిన భార్యను పలుకరించక పోవడం అమానుషమే అవుతుందనిపించింది.

"ఇంట్లో పనులు అయ్యాయా జయా?"

"అవుతున్నాయి. మీ చెల్లెలు భుజస్కంధాలపై వేసుకుందిగా."

"నువ్వూ చేస్తూనే వున్నావుగా. మనింట్లో చాలా సంవత్సరాల తరువాత జరిగే శుభకార్యమిదేగా?"

"అందుకే మీ చెల్లెలు మనల్ని అప్పులపాలు చేసిగాని వదిలేలా లేదు. ఆ ఖర్చు, ఆ లెక్కలేమిటో అర్థం కావడం లేదు."

"ఆడపిల్ల పెళ్ళి కాదూ..."

"చాల్లెండి సమర్థింపు. ఆవిడ బట్టలు పెట్టాలని యేమేమో ఆలోచిస్తోంది. మీరు అంగీకరించారంటే నా ప్రాణం యిస్తాను?" ఆవిడ ఛాలెంజ్ చేసింది. మాటా, మాటా పెరిగింది. అతను సహనం కోల్పోయాడు.

"జయా! ఇంతవరకు నువ్వు అన్న మాటలన్నీ సహించాను, నీ ఆగడాలు భరించాను. ఇక సాగవని చెబుతున్నాను. మనకు పిల్లలు లేరు. ఈ పరిస్థితిలో మీ అన్న కొడుకయినా, నా చెల్లెలు కూతురయినా ఒక్కటే. నువ్వే మాత్రం అల్లరిచేసినా ఇద్దరినీ పంపివేసి నాకు కావాల్సిన వారిని తెచ్చుకుంటాను" అన్నాడు.

జయలక్ష్మి అదిరిపోయింది. భర్త రౌద్రాకారం మొదటిసారిగా చూచింది.

"ఎవరా కావలసినవారు?" నీరసంగా అడిగింది.

"ఎవరయితేనేం? నాకిష్టమయింది నేను చేస్తాను."

"అవును అందరూ నన్ను బెదిరించే వారే." రక రకాల ఆలోచనలతో ఇల్లు చేరిందామె.

"ఎక్కడికి వెళ్ళావు వదినా! కంసాలి వీరాచారి వచ్చాడు. గాజులకు,



గొలుసుకు బంగారం యిస్తావని చూస్తున్నాడు." సరస్వతి సౌమ్యంగానే అడిగింది. జయలక్ష్మితో మంచిగా వుండి తనకు కావల్సినవి సాధించు కోదలచింది.

"ఇప్పుడు గాజులు చేయిస్తే సంవత్సరంలోపే బిగుతు అవుతాయి. పాత నగలే వుండనీ, ఆమెకు తెలిసిన తర్వాతే నచ్చిన డిజైన్లు చేయించు కుంటుంది" అన్నది. వారిద్దరి సౌమ్యత చూస్తే ఒకరిని మించి ఒకరు నటిస్తున్నారని తెలిసిపోయింది.

"ఇవ్వకపోతే ఊరుకునేది ఈ సరస్వతేనా." లోలోన హుంకరించింది సరస్వతి. పైకి నవ్వి ఊరుకుంది.

## 32

వివాహమంటపంలో వధూవరులు కూర్చున్నారు. సరస్వతి కూడా వేడిగా కన్యాదానం చేయడానికి కూర్చున్న దంపతుల దగ్గరకు వచ్చింది.

"జయా! బంగారం అడుగుతుంది ఉమ అత్తగారు."

"పైన బీరువాలో వుంది తీసుకురా వదినా." బొడ్లో దోపుకున్న తాళం చెవులు తీసి యిచ్చింది జయలక్ష్మి. ఆమె ఉదారతకు, నమ్మకానికి ఆశ్చర్యపోయింది. అపనమ్మకంగా చూడసాగింది. వదినగారిలో యింతటి మార్పా!

"రాంరెడ్డి నాం నీం నౌ పౌత్రీ - ఏమ్మా ప్రధానం కావాలి.... సువర్ణం పట్టువస్త్రాలు తేవాలి-" బ్రాహ్మడు మంత్రం చదివినట్టే సాగదీశాడు.

సరస్వతి పైకి వెళ్ళి గదిలో అడుగుపెట్టి నిర్ఘాంత పోయింది. బీరువా తీసి వుంది. అందులో వున్న చీరలు, వస్తువులు చిందరవందరగా పడి వున్నాయి. బంగారు నగలు గాని, డబ్బు గాని కనిపించలేదు. అవి దాచిపెట్టే చిన్న పెట్టె ఖాళీగా వుంది. ఒక్కసారి ఊపిరి ఆగిపోయినట్టు అనిపించింది. ఇంటి కప్పు కూలి మీద పడుతుందేమో ననిపించింది. ఇదంతా తనపై దొంగతనం వెయ్యాలని చేసినపని కాదు కదా! ఆమె

బుర్ర పనిచెయ్యడం మొదలుపెట్టింది. వెళ్ళినంత వేగంగా క్రిందకు వచ్చింది. "అత్తయ్యా!" అని గావుకేక పెట్టింది. ఏదో సర్దుతున్న జయలక్ష్మి తల్లి వరమ్మ అటు చూచింది.

"ఏమిటమ్మా"!

"ఒక్కసారిలా వస్తారా!"

"పద" ఇద్దరూ పైకి వెళ్ళారు.

"మీ అమ్మాయి గదిలో యెవరో దొంగ జొరబడ్డాడు అత్తయ్యా నేను మీ ముందు నుండే వచ్చాను. నన్నే దొంగను చేసే ప్రమాదం వుందని..."

"ఆ...అయ్యో! శుభమా అంటూ పెళ్ళి జరుగుతుంటే యెవరికి చేతులు వచ్చాయే..." ఆమె గుండెలు బాదుకుంది.

"విచారించడానికి చాలా సమయముంది అత్తయ్యా. గదికి తాళం వెయ్యండి. వస్తాను" క్రిందికి దిగి వచ్చింది. క్రొత్త చీర, తన మెడలోని గొలుసు, చేతిగాజులు తీసి ఉమ అత్తగారి చేతిలో పెట్టింది.

"వదినా! ప్రధానం జరుగుతుంది. ఇవ్వండి" అన్నది.

జయలక్ష్మి తనను చూసి ముసి, ముసిగా నవ్వినట్టు అనిపించింది. ఏ గల్లంతు లేకుండా వివాహం ముగిసింది. అమ్మాయిని తీసుకుని వరుని తరఫు వారు ప్రయాణం అయ్యారు. వధువు వెంట సరస్వతి తోడికోడలు, పిల్లలు బయలుదేరారు.

"ఎల్లుండి ఉదయం బస్సుకు బండి పంపండి" ఉమ అత్తగారు చెప్పింది.

"వదినా! ఒక చిన్న సవరణ. మా ఊరికి రావాలి." అందరూ తెల్లబోయినట్టు చూచారు.

"అదేమిటే అమ్మాయ్, మనుగుడుపులయ్యాక మరోసారి తీసుకు పోదువు గాని...." రాజమ్మ అడ్డు వచ్చింది.

"మనుగుడుపులా! యెక్కడయితేనేం?.... మీకు ఆలస్యం అవుతుంది" బంధువులను పంపి వచ్చింది సరస్వతి. భర్తను ప్రయాణం



కమ్మని పిల్లలతో తనూ ప్రయాణం అయింది. సీతయ్య అయోమయంగా చూస్తున్నాడు.

"అన్నయ్యా! వెళ్ళొస్తాం. దేనికయినా పెట్టిపుట్టాలి. నీకు కాలు నొచ్చినా, చెయ్యి నొచ్చినా నా కూతురు నీ రక్త సంబంధం కాబట్టి చూస్తుందని ఆశపడ్డాను" గొంతు పూడుకుపోయింది.

"ఏమయిందమ్మా! ఉమకేం తక్కువ!"

"దానికేం తక్కువన్నయ్యా? కన్నవారం వున్నాము, అటు భర్త వున్నాడు. నా బాధల్లా నీకే యెవరూ లేరే అని....వదినా నీ డబ్బు, దస్కం, నగ, నట్రా దొంగతనం కాలేదు. నువ్వాడిన నాటకం యిది. వేడి నీటితో ఇల్లు తగలబెట్టే పద్ధతులు మానెయ్యి."

"చూచారా? ఒక వైపు సొమ్ము పోయి ఏడుస్తుంటే!" జయమ్మ ఏడుపు గొంతుకతో అంది.

"సొమ్ము యెక్కడికీ పోలేదు. కట్టుకొని ఊరేగు. మా నాన్నగారి సంపాదనకు నిజమయిన వారసులం మేము. మాకు చెందాల్సింది యెవరికో చెందచేస్తున్నారు వస్తాను" ఆమె బయలుదేరింది.

"జయా! ఏమిటిదంతా!" సీతయ్య అడిగాడు.

"నీ చేతగాని తనమురా- నేను వెడతాను. ఊరివారికి పట్టంకడితే చూస్తూ ఊరుకుంటానా? నా బిడ్డ, పిల్లలు నలుగురు నాలుగు పిడికిళ్ళ అన్నం విదిలిస్తే చాలురా నా బ్రతుకు వెళ్ళమారిపోతుంది" నానా శాపనార్థాలు పెడుతూ రాజమ్మ వెళ్ళిపోయింది. కోపం చల్లారితే వారే వస్తార్లే అనుకున్నాడు సీతయ్య. వర్షం కురిసి వెలిసినట్టుంది. ఒంటరిగా వున్నప్పుడు భార్యను అడిగాడు అతను.

"జయా! నిజంగా నగలుపోయాయా?"

"మీరు నా మాట నమ్మడం లేదన్నమాట, అవును లెండి. మీరు గౌరవంగా చూస్తే అందరూ చూచేవారు. అంతా నా ఖర్మ." ఏడ్చింది జయలక్ష్మి.

"ఇప్పుడు యేమన్నానని? ఊరికే అడిగాను. అది తప్పా!" చికాకుగా లేచాడు. బయటికివెడితే గాని మనశ్శాంతి లభించదు.

"బావా! ఒక్క నిమిషం ఆగు" అనంతరెడ్డి పిలిచాడు.

"ఏమిటి?"

"మా బావమరిది మీతో మాట్లాడాలి అంటున్నాడు."

"ఏమిటండీ!" కూర్చుని అడిగాడు. ఆయన కూతుర్ని చంద్రశేఖర్‌కు ఇస్తున్నారు.

"ఏమీలేదు అన్నగారూ? కుమ్మరింటికి వెళ్ళితే కుండ పదిసార్లు కొట్టి చూస్తామా! ఆహాఁ ఓటిదా, గట్టిదా అని, అలాంటిది నా పేగు మీ మెడలో వేస్తున్నాను....."

"నాకేం అర్థంకావడం లేదు. సూటిగా చెబుతారా?"

"అంత తొందరయితే యెలా! అదే నా కూతుర్ని మీ అబ్బాయి కిస్తున్నాను. అబ్బాయి చదివినవాడా! కాదు. కేవలం మిమ్మల్ని చూసి..."

"ఏమిటన్నయ్యా! మనసులో గుద్దులాట. స్పష్టంగా చెప్పు" కమలమ్మ కసురుకుంది.

"అదే- అదే చెప్పబోతున్నాను. ఇందాక మీ చెల్లెలు, మీ అమ్మ బెదిరించి వెళ్ళారు. రేపు రక్త సంబంధీకులం. నీదేం లేదన్నా ఆశ్చర్యం లేదు. అందుకని .... అందుకని ఆస్తి అబ్బాయి పేర పెట్టాలి. మా అభిలాష మీరేదో అన్యాయం చేస్తారని కాదు మా నిశ్చింత కోసం."

"ఏమిటీ- ఏమన్నారు?" సీతయ్య మళ్ళీ ఉయ్యాల బల్ల మీద కూర్చున్నాడు.

"అవును అన్నయ్యగారూ! మా పేగు తెంపి మీ మెడలో వేసిన నాడే చంద్రశేఖరం మీవాడయ్యాడు. కాని 'లా' అంటూ ఒకటి యేడ్చిందిగా! అందుకోసం" లౌకికంగా మాట్లాడింది కమలమ్మ. అనంతరెడ్డి మవునంగా వున్నాడంటే భార్యను సమర్థిస్తున్నాడని అర్థం."

"నేను...నేను ఆలోచించాలి" ఆయన లేచాడు. ఆస్థి అంతా వాడి పేర పెట్టాక తన విలువ యెంత? అతనికి ఊపిరి ఆడనట్టు వుంది.



ఏది పోయినా లెక్కచేయదు గాని డబ్బు దగ్గర భార్య యెవరికి కొరుకుడుపడదని తెలుసు. అందుకే పైకి వెళ్ళి ఆమెను పిలిచాడు.

"ఏమిటి?" వచ్చి అతని ఎదుట ముక్కాలిపీట మీద కూర్చుంది.

"వాళ్ళన్న మాటలు విన్నావా జయా?"

"కాని మాటలేం అన్నారు?"

"అది కాదు. ఆస్తంతా అబ్బాయి పేర పెట్టమంటారేం?"

"ఎవరి తాపత్రయం వారిది. మీ చెల్లెలు తక్కువ మనిషా. దొంగలు పడినా, యేడిస్తే ఆడపిల్లలకు అరిష్టం అని ఊరుకుంటే, రోషంగా వెళ్ళిపోతుందా? రేపు ఆస్తి మాదంటూ దావా వేసినా వేయవచ్చు."

భార్య వంక ఆశ్చర్యంగా చూచాడు. అందరూ కలిసి ఓ తీర్మానానికి వచ్చాక తన దగ్గర ఆ ప్రస్తావన యెత్తారని తెలిసింది.

"ఆస్తి అంతా తన పేర పెట్టాక అబ్బాయి చూడకపోతే?"

"కన్నవారే చూడడం లేదీ రోజుల్లో. అయినా ఆ పిల్లలను గూర్చి నాకు బాగా తెలుసు. మాటకారితనం లేదు. మనమంటే ప్రేమాభిమానాలున్నాయి" అన్నది. అతను వెళ్ళి గోవిందరావు శరణు కోరాడు. అతను అభయమిచ్చాడు. ఆ రాత్రంతా పేకాట ఆడి మర్నాడు వచ్చారు. గోవిందరావు ఖచ్చితంగా అడిగేశాడు.

"దత్తత తీసుకున్నారు, అది చాలు. వారి ఆస్తికి చంద్రశేఖరరెడ్డి వారసుడనడానికి యింకా ఆస్తులు రాయడం దేనికి? మీకెంత భయముంటుందో, మీ విషయంలో ఆయనకు అంతే భయముంటుంది."

"గోవిందరావుగారూ! ఆయనకేమన్నా అయితే మేమంతా లేమా!" అనంతరెడ్డి అడిగాడు.

"మీ పిల్లవాడికేం జరిగినా చూచుకోవడానికి మేమున్నాము. కావాలంటే స్టాంప్ కాగితంపై రాసిస్తాను" వాదోపవాదాలు జరిగాయి. కరణానికి ఉచ్చు బిగించడం బాగా తెలుసు. అతని ముందు వీరి తెలివితేటలు పనికి రాలేదు. ఇద్దరూ బయటికి వెళ్ళిపోయాక ఇంట్లో వున్నవారంతా జయలక్ష్మిని చుట్టుముట్టారు.

"ఎవతెతోనో మీ ఆయన తిరిగాడన్నావు కదా జయా! దానికి పిల్లలున్నారా?" కమలమ్మ అడిగింది.

"ఉన్నారు వదినా! ఇద్దరు కొడుకులు."

"మరింకేం. రేపు ప్రొద్దున్న వాళ్లే నీ పిల్లలంటూ నెత్తిన పెడతారు. అప్పుడు నీ పాట్లు బయటపడతాయి. మా పిల్లాడికేం? ఉన్న దాంట్లో బ్రతుకుతాడు."

"నీ సోది యేమిటే. అసలే అమ్మాయి బాధపడుతుంటే. ఆ గోవిందరావు నక్క జిత్తులవాడిలా వున్నాడు. ఆస్తి బావ పేరే వుంటే వాడికి లాభం. రోజుకింత తరిగిస్తూ ఆడవచ్చు" అనంతరెడ్డి అన్నాడు.

"మాకోసం కాకపోయినా, మీకోసమయినా వుండాలి కదా..." అందరూ కలిసి ఓ ప్రణాళిక ఆలోచించారు. మంతనాలు జరిపి జయలక్ష్మికి పురి యెక్కించి తప్పుకున్నారు. రెండవరోజు భర్త రాగానే విరుచుకుపడింది.

"వాళ్ళు పిల్లనివ్వరట."

"ఈ ప్రపంచంలో పిల్లలకే కరువా?" సీతయ్య చొక్కా విప్పేసి చేదబావి వద్దకు వెళ్ళాడు. జీతగాడు వచ్చి నీళ్ళు తోడిపోశాడు.

"మరొకరయినా అదే మాట అడుగుతారు కదా?"

"మన అభిప్రాయంతో ఏకీభవించేవాడే మనకు పిల్లనిస్తాడు" అన్నాడు నిర్లక్ష్యంగా.

"రోజు రోజుకూ మీ ధోరణి చూస్తుంటే నాకు అనుమానంగానే వుంది. ఈ ఆస్తి మా పేర పెట్టకపోతే నేను ప్రాణం తీసుకుంటాను."

"రోజుకో వెధవ బెదిరింపు, తీసుకో పో" అతనికి అసహనం ఎక్కువయింది.

జయలక్ష్మి ప్రాణం తీసుకోలేదు గాని అన్నం మానేసి అలక సాగించింది. వరమ్మ లబోమంది. తన కూతురి ప్రాణం కాపాడమని అల్లుడిని ప్రాధేయపడింది. సీతయ్య చలించలేదు. ఒకటి, రెండు, వారం రోజులు గడిచేసరికి ఆయన కంగారు పడక తప్పలేదు. భార్య స్థితి యిలా



వుంది. శూలాల వంటి మాటలు వుపయోగించి ఉత్తరం రాసింది చెల్లెలు. తల్లికి భుక్తి గడిచే మార్గం ఆలోచించమని వ్రాసింది. నెల రోజులలో యేదో ఒకటి తేల్చకపోతే కొడుకు చనిపోయాడని భావించి తనే పోషిస్తానని వ్రాసింది.

మళ్ళీ బంధువులు, ఊరి పెద్దలు దిగారు. కొంత పొలం రాజమ్మకు రాశారు. సగం దత్తపుత్రుడికి మిగిలిన సగం సీతయ్య, జయమ్మలకు రాయించారు. వారిని బాగా చూచుకుంటే మిగిలిన సగం కూడా వారికి అందుతుందని వ్రాసుకుని సంతకాలు పెట్టారు.

ఆ తరువాత 'జయలక్ష్మి తన అలక నిరాహారదీక్ష' ఉపసంహరించుకుంది. చంద్రశేఖరరెడ్డి వివాహం వైభవంగా జరిగింది. తన తోబుట్టువులు లేని లోటు చాలా కనిపించింది ఆయనకు. అప్పగింతలు పెడుతుంటే నవ్వుకున్నాడు. అమ్మాయికి రక్షణ అంటూ ఆస్తి రాయించుకున్నాక, యింకా అప్పగింతలు యెందుకో అర్థం కాలేదు. పెళ్ళికి వచ్చిన బంధువులంతా వెళ్ళిపోయారు. జయలక్ష్మికి చాలా సంతోషంగా వుంది. తను అనుకున్నది సాధించింది. హాయిగా ఉయ్యాల బల్లమీద కూర్చుని పెద్దరికం ప్రదర్శించవచ్చు. కోడలు, కొడుకు తనను పువ్వులలో పెట్టి చూచుకుంటారు. అమ్మాయి లక్ష్మి కూడా నిదానస్తురాలిలా కనిపించింది. ఓ సామెత వుంది. 'తాళ్ళు దాటితేగాని తెలియదట బ్రాహ్మణులెవరో దాసరులెవరో!' అలా కొంత సమయం పోతే గాని తెలియదు అందరి స్వభావం.

## 33

కొట్టు తలుపు వేసి బాలామణి కొడుకు రాక కోసం చూస్తున్నది. క్రిస్టమస్ సెలవులని ఆస్పత్రిలో సహాయం చేస్తున్నాడు కృష్ణ. "తనో పెద్ద డాక్టరయినట్టు ఫోజు" అనుకుంది బాలామణి. రాము భోజనం చేసి గుర్రుపెట్టాడు. సాయిలు 'దేవుని సీన్మ' వచ్చిందంటూ వెళ్ళాడు. లస్మక్క మరణించి సంవత్సరం దాటింది. ఇల్లు ఇరుకుగా వున్న మాట వాస్తవమే.

కాని అది వదలాలంటే ఇష్టం వుండదు బాలామణికి. ఎందుకో కలిసివచ్చిన ఇల్లు అనిపించింది. రెండువేల రూపాయలు విల్సన్ ద్వారా బ్యాంక్‌లో వేసింది. చవకగా స్థలాలు దొరుకుతున్నాయని అంటారు. ఉన్న డబ్బు కాస్త ఖర్చు చేస్తే యెలా! అన్న ధ్యాస పట్టుకుంది. ఉండనీ, నా పిల్లలు చదువుకుంటే యింకా మంచి ఇళ్ళు కట్టుకుంటారు అనుకున్నది.

"అమ్మా! ఇలా యెదురుచూస్తూ నిల్చోవద్దని చెప్పలేదా! ఎనిమిది గంటలు కాగానే తినెయ్యాలి. బయట చలి చూడు!" తన భుజాల మీదున్న స్వెట్టర్ తీసి తల్లికి కప్పాడు కృష్ణ.

"ఇంతసేపూ ఏం చేశావురా!"

"మన ఊరు రెడ్డిగారట అమ్మా. ఒళ్ళు తెలియని జ్వరంతో జీతగాని వెంటవచ్చాడు. అతనికి స్పాంజింగ్ చేశాను."

"అయితే స్నానం చెయ్యి."

"నన్ను డాక్టర్ ఫోజులు అంటావు గాని నువ్వు డాక్టరువే" కిలకిలనవ్వాడు. ఆ నవ్వులో పన్నెండు సంవత్సరాల వెనుక జరిగిన రహస్య ప్రణయం పువ్వులా తళుక్కున మెరిసినట్టయింది.

కృష్ణ రెండు చెంబుల నీళ్ళు పోసుకుని వచ్చేశాడు.

"ఆ...ఆ....ఆ...చలి...అమ్మ వేడి అన్నం..." వచ్చి కూర్చున్నాడు కృష్ణ ఇద్దరికి వడ్డించింది. ఆమ్లెట్టు, చారు పెట్టింది కృష్ణకి. అతను అటు యిటు చూచాడు.

"ఏమిట్రా చూస్తున్నావ్!"

"....ఇంకో ఆమ్లెట్టు ఏది!"

"నాకు గుడ్డు పడదురా. అందుకే వెయ్యలేదు. ఇదేం బంగారమా?"

"నిజమా! అయితే నీ అలవాటే నాకొచ్చిందమ్మా, నాకూ పడదం లేదు" ఆమ్లెట్టు తీసి ప్రక్కనే వున్న సాసర్‌లో వేసి, చారు పోసుకున్నాడు.

"నీకెప్పటి నుండి ఆమ్లెట్టు పడదురా! అది వుంటే స్వర్గంలో వున్నట్టు అనేవాడివి కదా."



"నీకు పడనప్పటి నుండే నాకూ పడడం లేదమ్మా" అన్నాడు గంభీరంగా. కాని దాచినా దాగనంటూ నవ్వు వచ్చేసింది.

"వెధవ వేషాలు నేర్చాడు." కసురుకుని సగం తను తీసుకుని సగం కొడుక్కి వేసింది.

"నర్సిమ్మ మామ గురించి అడుగుదామని మరిచేపోయాను..." వాలుక కరుచుకున్నాడు.

"ఎవర్ని అడగాలని..."

"అదేనమ్మా, ఆ రెడ్డి గారి వెంట వచ్చిన అతడిని..." అన్నాడు అన్నం పిసుకుతూ.

"ఆయన పేరేమిటిరా!" కుతూహలంగా అడిగింది.

"సీతారామిరెడ్డి. ఎందుకు?" అన్నాడు.

"ఏం లేదు...." అన్నది. ఆమెకు అన్నం చేదుగా అనిపించింది. చేయి కడిగేసుకుంది.

"అమ్మా! ఈ సెలవుల్లో ఊరుకెళ్ళి వచ్చేలా లేదు. మామ, తాత ఎదురు చూస్తారు" అన్నాడు తమ్ముడి పక్కన పడుకుంటూ.

"నువ్వెళ్ళిరా" అన్నది ఎటో చూస్తూ.

"బావుంది! రెడ్డిగారి దగ్గర వుంటే రెట్టింపు డబ్బు ముడుతుందని విల్సన్ అంకుల్ అన్నాడు. ఆయన అన్నారని కాదమ్మా, అతను మూల్గుతూ ఒంటరిగా పడుకుని వుంటే యెందుకో చాలా బాధగా వుంది. మనకు దగ్గర వాడేమో అన్నంత భ్రమ కలిగింది" అన్నాడు. ఉలిక్కిపడింది బాలామణి. విల్సన్ యేదయినా చెప్పాడా! అని అనుమానించింది.

"కొందరిని చూస్తే ఆత్మీయులయినట్టు, మరికొందరిని చూస్తే అపరిచిత వ్యక్తుల్లా కనిపిస్తారు కదమ్మా...ఆ....ఆ ఆ త్వరగా లేపు. అతని పరిస్థితి యెలా వుంటుందో?"

"అలాగే....." అన్నది. కృష్ణ నిద్రలోకి జారిపోయాడు.

ఆమె మనసు ఆరాటపడుతున్నది. ఇప్పుడామెకు యెవరిపైనా కోపం లేదు. ఒక మూలకు నెట్టాలనుకున్న గతం మళ్ళీ ప్రత్యక్షమయింది.

ఏదేమయినా, అతను తన జీవితాన్ని పండించిన వ్యక్తి! ఒక్కసారి వెళ్ళితే! అవసరమయినప్పుడు శత్రువులు కూడా వైరం మరచిపోతారు. మెల్లిగా లేచి, తలుపులు రెండూ లాగి, తాళం వేసింది. చలిగా అనిపించింది. తల పైకి ముసుగు లాక్కుంది. ఒక్క అడుగేసి ఠక్కున ఆగిపోయింది. విల్సన్ కారొచ్చి ఆగింది.

"ఎలా వున్నారు!" ఆదుర్దాగా అడిగింది.

"కృష్ణ చెప్పాడా?"

"ఆఁ... ఎవరో మన వూరి రెడ్డిగారని...."

"ఊఁ... అతడిని లేపు, ఒళ్ళు నొప్పులనుకుంటాను! ఒకటే అరుస్తున్నాడు. ఎవరయినా దగ్గరుండాలి. ఏదో అవసరమట. నర్స్ వెళ్ళి పోయింది.

"నేను అక్కడికనే బయలుదేరాను."

"తాళం వేశావు. పిల్లలు లేవరా?"

"పిల్లలు లేవరుగాని ఆయన సినిమాకు వెళ్ళాడు" అన్నది.

"ఆ సమయానికి వచ్చి తాళం చెవులు యిస్తాను. పద...." ఆమె వచ్చి కారెక్కింది.

ఒంటి మీద స్పృహ లేని సీతయ్యను, ఒకనాటి సీతయ్య దొరను చూస్తే కన్నీరు ఆగలేదు.

"అమ్మా! .... ఆఁ ... అబ్బా!..." పొర్లుతున్నాడు. విల్సన్ ఇంజెక్షన్ యిచ్చాడు. కళ్ళు తెరిచినా మనుష్యులను పిచ్చిగా చూడటం తప్పితే గుర్తించలేడు. రాత్రంతా టవల్ తడిపి ఒళ్ళు తుడుస్తూనే వుంది. తెల్లవారుఝామున ఒకటి, రెండు డిగ్రీల జ్వరం తగ్గిందేమో, లేచి మాట్లాడాడు.

"ఎవరూ!...బాలా....యిది ....కలా" రెప్పలు తాటించాడు. అవునన్నట్టు తలూపింది. అతని చేత మందు మింగించింది. అతను మరోసారి చుట్టూ చూచాడు.

"నేను ఎక్కడున్నాను?"



"ఆస్పత్రిలో..." అన్నది.

ఆమె చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. ఆమె విదిలించుకోలేదు. అతని నుదుట పట్టిన చెమట రెండో చేత్తో తుడిచింది.

"బాలా...కృష్ణుడు...."అడగలేకపోయాడు.

"బావున్నాడు. రాత్రి మీ దగ్గరున్నాడు" అన్నది. అతడు అలసటగా నిద్రపోయాడు. నర్స్ వచ్చి లేపితే మేలుకుంది. బయట యెక్కడో నిద్రబోయిన కొత్త జీతగాడు ఏసుదాసు వచ్చాడు. కునుకు పట్టిందే తెలియలేదు అనుకుంది.

"జ్వరం దిగినట్టుంది" అన్నాడు. మిషన్ కాంపౌండులో చదివానని గీర అతనికి.

"నువ్వు దగ్గరుండక బయట ఏం చేస్తున్నావ్?" కాస్త తీక్షణంగా అడిగింది.

"ఏం జెయ్యాలి! మూడు రాత్రులయింది, నిద్రలేదు. కొడుకు, కోడలు పట్టించుకోరు. ఆ పిచ్చి ఆమె తన గురించే తాను పట్టించు కోదాయె....."

"ఎవరా పిచ్చామె?" బాలామణి అడిగింది.

"ఇంకెవరు దొరగారి భార్య" అన్నాడు. అంతా అయోమయంగా వుంది. నౌకర్లు అనే తేలిక మాటలు వినే శక్తి లేదామెకు. ఇంటికి వెళ్ళింది.

అప్పటికే పిల్లలు, సాయిలు లేచారు.

"నన్ను లేపొద్దా అమ్మా, నువ్వెందుకు వెళ్ళావు" కృష్ణ ఎదురు వచ్చాడు.

"నువ్వు నిద్ర బోతున్నావు" అన్నది మాటలు పొడిగించకనే. కృష్ణ తన కొడుకని తెలిసిన తరువాత అతను రహస్యం దాస్తాడా? తను పిల్లలకు ముఖం యెలా చూపగలదు.

"ప్రక్క కొట్టులో పావలాకు పావు లీటరు పాలు పోస్తే యిక్కడి కెందుకు వచ్చినట్టో! కబుర్లు చెప్పకమ్మా."

"ఓ పంతులుగారా! కొసరు పాలు యెన్ని వస్తాయని? ఏమండీ మేం పాలున్న పెద్దమనుషుల దగ్గర కొంటాం. మాకు గేదెలు లేవు. ఆ పాలే పోస్తాం."

కృష్ణ అందరికీ జవాబు చెబుతూ వ్యాపారంలో తన చాతుర్యం చూపుతున్నాడు. అరగంట గడిచినా పళ్ళు తోముకుంటున్న బాలామణి లేవనే లేదు.

"చాయ్ తీసుకోవే చల్లారిపోతుంది." సాయిలు అరిచాడు. గబ గబ ముఖం కడుక్కుంది. సాయిలు పోసి వుంచిన టీ త్రాగేసింది.

'కృష్ణా, రాముడూ విల్సన్ మామయ్య దగ్గరకు వెళ్దాం పదండి. మీ నాన్న కొట్టు చూచుకుంటాడు."

"మేమెందుకు?" ఇద్దరూ ఒకేసారి అడిగారు.

"క్రిస్టమస్ పండుగ దగ్గరకు వస్తున్నది. ఆస్పత్రిలో రంగు కాగితాలు కట్టాలి" అన్నది. ఇద్దరూ కొట్టు సాయిలుకు అప్పగించి, తల్లి వెంట బయలుదేరారు.

నర్సింగ్‌హోమ్‌లో అడుగుపెట్టి, డాక్టర్‌గారి కారు లేకపోవడం చూసి తేలికగా నిట్టూర్చింది.

"ఒకసారి మన ఊరి రెడ్డిగారిని చూచి పోదామా?" అన్నది. ఇద్దరూ తల్లిని అనుసరించారు.

ఉదయం జ్వర తీవ్రత అంతగా వుండదు. ఆయన లేచి దిండ్లానుకుని కూర్చున్నాడు. నర్స్ మాత్ర యిస్తున్నది. అతను తల్లి వెనకాల వచ్చే ఇద్దరి పిల్లలను కళ్ళింత చేసుకుని చూచాడు! అవి ఆనందంతో సజలమయ్యాయి.

"కృష్ణా! అయ్యగారికి వేడి పాలు త్రాగించు..." అన్నది. కృష్ణుడు పాలు త్రాగించబోయాడు, ఆయన కృష్ణ భుజాల చుట్టూ చేతులు వేసి దగ్గరగా తీసుకున్నాడు. రెండో చేయి చాపి రాముడిని పిలిచాడు. రాము సందేహించాడు.

"వెళ్ళు రామూ! అయ్యగార్కి పిల్లలు లేరు. అందుకని..." అన్నది



కళ్ళతో యేదో సైగ చేసింది అతనికి. రాము దగ్గరగా వెళ్ళాడు. అతడిని కౌగిలించుకున్నాడు.

"బాబూ..." అతని కళ్ళు చెమర్చాయి.

"మీరు పాలు త్రాగండి." కృష్ణ పాలు త్రాగించాడు.

"ఇవి...ఇవి....పాలు కావు అమృతం బాబూ....అమృతం... నేను బ్రతుకుతాను. తప్పక బ్రతుకుతాను" అన్నాడు.

"మీరేం దిగులు పడవద్దు. మా విల్సన్ మామ పట్టిన కేసు ఫేలవడం అంటూ వుండదు" గర్వంగా చెప్పాడు కృష్ణ.

"నిజమండీ...." విల్సన్ బాగుచేసిన కేసుల వివరాలు చెప్పాడు రాము. వారినే మైమరిచి చూడసాగేడు సీతయ్య.

బయట విల్సన్ కారు ఆగిన శబ్దం అయింది. ఇద్దరూ లేచారు ఉత్సాహంగా.

"అమ్మా! అంకుల్ కారొచ్చింది. మేం వెడతాం." వాళ్ళు వెళ్ళిపోయారు.

"కూర్చో బాలా!" అతను చోటు చూపాడు జరిగి.

"ఫరవాలేదు" స్టూల్ లాక్కుని కూర్చుంది.

"వాళ్ళకు....వాళ్ళకు నా పరిచయం చెప్పావా?" అన్నాడు ఆశగా.

"మెల్లగా నేను చెబుతాను గాని, మీరు మాత్రం తొందర పడకూడదు" అన్నది.

"నువ్వే చెప్పు నువ్వు సమర్థురాలివని అంగీకరిస్తున్నాను బాలా...." అన్నాడు. ఆ తరువాత బాలామణి సపర్యల వల్లనయితేనేం, పిల్లలను చూచిన మనోధైర్యం వల్లనయితేనేం, విల్సన్ శ్రద్ధ వల్లనయితేనేం ఆయన పది, పన్నెండు రోజులలో మామూలు మనిషి అయ్యాడు. ఒక్కసారి మధ్యలో చంద్రశేఖర్, అతని భార్య వచ్చారు.

"డాక్టరుకు యేమన్నా యిచ్చి వెళ్ళండి బాబూ, ఇంటి మనిషిని చూచినట్టు చూస్తున్నాడు" అని ఏసుదాసు చెప్పాడు. చంద్రశేఖర్ నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు.

"నేను చూడనని సగభాగం పంచుకున్నాడుగా. అందులో నన్ను యిచ్చుకోనీ...."

"నడుమ నీ పెత్తనం చాలా అయిందేం? గవర్నమెంటు ఆస్పత్రి లేదా? ఈ నర్సింగ్‌హోమ్‌లో చేర్పించావేం?" లక్ష్మి కసురుకుంది. మళ్ళీ యెవరూ రాలేదు.

"రెడ్డిగారూ! రెండు, మూడు రోజులలో మీరు ఇంటికి వెళ్ళవచ్చు" విల్సన్ చెప్పాడు. ఆయన వెళ్ళిపోయాక ఏసుదానును పిలిచాడు సీతారామిరెడ్డి.

"ఉత్తరం యిస్తాను. గోవిందరావు దగ్గరకెళ్ళి డబ్బు పట్టుకురా. అట్లాగే మీ అమ్మగార్ని వెంటబెట్టుకురా. సైక్రియాటిస్టుకు చూపుదాం అంటున్నాడు డాక్టరు."

"మంచిదయ్యా." మధ్యాహ్నం ఏసుదాసు వెళ్ళిపోయాడు. చలిగా వుందని శాలువా కప్పుకుని, సాయంత్రం వరండాలో పచార్లు చేస్తున్నాడు ఆయన. అతనికిష్టమయిన వంటకాలు తీసుకుని వచ్చింది బాలామణి.

"అప్పుడే తిరుగుతున్నారేం? అలసటగా వుండదూ?" అన్నది. అతనొచ్చి కూర్చున్నాడు.

"అలసట, చికాకు అన్నీ మరచిపోయాను బాలా." ఆమె ఏదో చెప్పాలని తటపటాయించసాగింది.

"రేపు, ఎల్లుండి యెప్పుడయినా వీలు చూచుకొని ఇంటికి వెళ్ళమన్నాడు డాక్టరు. వెళ్ళే ముందు నా పిల్లలను తీసుకొని పట్నం అంతా తిరుగుతాను.... వాళ్ళకు కావలసిన వస్తువులు యిప్పించాలి. తనివితీరా కబుర్లు చెప్పాలి.." అతని మాటలు చూస్తుంటే బాలామణి మతిపోసాగింది. భారతీయుల వివాహబంధం బహు చిత్రమయింది. విద్యావంతులే దాని అర్థం వెదకడానికి వెనుకంజ వేస్తారు. బాలామణి లాంటి వారు ముందుకు వచ్చి అర్థం చెబుతారా?

"మాట్లాడవేం బాలా?"



"మీరు మాట్లాడుతుంటే వింటున్నాను. అడగడం మరిచేపోయాను. జయలక్ష్మిగారికి పిచ్చటగా?"

"ఊఁ......." దీర్ఘంగా నిట్టూర్చాడు. అదో రకమయిన పిచ్చి. డబ్బు, బంగారం, వెండి అంటే జయకు ప్రాణంతో సమానం. అవి ఇంట్లో వుంటే అమ్మ అడుగుతుందని, దొంగతనం జరిగిందని బొంకి వాటిని వదినకు ఇచ్చింది. ఆ అవకాశం వదులుకోలేదు వారు. అవి తీసుకొని మార్చి పిల్లలకు నగలు చేయించుకున్నారు. జయ అడిగితే నగలు, డబ్బు సంగతి తెలియదని బుకాయించారు. మాట మాట పెరిగింది. నిస్సంతువు అని నిందించడమే కాక, కొడుకుతో వేరు కాపురం పెట్టించారు. ఆ షాక్‌కు తట్టుకోలేకపోయింది. ఎవరితోను మాట్లాడదు. అంతగా అరిచే మనిషి, పిచ్చిచూపులు చూస్తుంది. జ్ఞాపకం వస్తే వంట చేస్తుంది. లేకపోతే పెరట్లో దొరికే అందమయిన రాళ్ళు ఏరి డబ్బాలో నింపి సంతోషిస్తుంది...."

"పాపం?"

"నా వారు నాకు దూరమయినా, తన వారన్నా తనకుంటారను కున్నాను బాలా. డబ్బు కోసం యింత నాటకం ఆడుతున్నారని అనుకోలేదు" నిట్టూర్చాడు.

"ఆమెను డాక్టరుకు చూపించకూడదూ?"

"దాసును వెంట తీసుకురమ్మన్నాను. డాక్టరుకు చూపించాలి. అమ్మను చూద్దామని వెడితే నా పరిస్థితి అర్థం చేసుకోకుండా నానా మాటలన్నది సరస్వతి" అతను గడిచిన గాథలు చెబుతుండగానే చీకటి చిక్కబడింది. బాలామణి లేచింది.

"బాలా! రేపు అన్నీ చెప్పి బాబులను తీసుకురా."

"ఊఁ....." బయటికి వచ్చింది. ఆమె హృదయం ద్వైదీభావంతో సతమతమవుతున్నది. ఒక వైపు సంఘంలో తన స్థానం, రెండో వైపు మానవతా దృక్పథం.

రెండూ సమంగా నిలుచున్నాయి. ఎన్ని నిందలయినా భరించింది. ఎన్ని కష్టాలకో ఓర్చుకుంది. పుట్టింటివారిని మరచిపోయింది. ఎందుకు?-

తన పిల్లల హృదయంలో తన స్థానం ఉన్నతంగా వుండాలని. ఈనాడు అతను కష్టాలలో వున్నాడని కరిగిపోతుందా? పరువు కోసం ప్రాకులాడే మనుషులు, మమతల విలువెంత? తను త్యాగం చేసి గొప్ప అనిపించు కోవాలని లేదు.

"అమ్మా! ఇంకా ముందుకు యెక్కడికే!" రాము అరిచాడు. ఉలిక్కిపడి చూచింది. కొట్టుదాటి నాలుగు అడుగులు వెళ్ళింది. నవ్వుకుని ఇంట్లోకి వచ్చింది. కృష్ణ తలకు అమృతాంజనం రాస్తున్నాడు సాయిలు.

"ఏందే! నువ్వు పనిచేస్తావు సరే, పోరలను యెందుకు పొలిబడతావు. చలిలో తిప్పినావు. ఆడికి నెత్తి నొప్పి వచ్చింది."

"నేను వెళ్ళేటప్పుడు బాగానే వున్నాడు కదా!" తనూ వెళ్ళి ప్రక్కన కూర్చుంది.

"నాన్న కంగారుపడతారమ్మా, కాస్త తలనొప్పి" అన్నాడు. అందరూ కూర్చుని భోజనాలు చేశారు. అన్యమనస్కంగా పడుకుంది. పిల్లలు సీతారామిరెడ్డి విషయం విని సంతోషించేది యెంతోగాని, సాయిలు వాళ్ళను వదిలి వుండగలడా? బాధ్యత ఒకవైపు, బంగారు భవిష్యత్తు మరొకవైపు ఆమెను ఆహ్వానించాయి. ఎటూ తేల్చుకోలేకపోయింది.

రెండు రోజులు గడిచాయి. జయలక్ష్మికి కావలసిన పరీక్షలన్నీ పూర్తి అయ్యాయి. నర్సింగ్‌హోమ్‌లో ఒక మూల యెటో చూస్తూ కూర్చుంది. సీతారామిరెడ్డి ఆమెను చూచి ఓ నిట్టూర్పు వదిలాడు. ఆత్రంగా బాలామణి రాక కోసం చూస్తున్నాడు. ఏసుదాసు సినిమా నుంచి వచ్చే కంటే ముందే తన పిల్లలు తన దగ్గరకు రావాలి. గంభీరంగా, మెల్లగా వచ్చింది బాలామణి.

"పిల్లలేరి బాలా? అలా వున్నావేం?"

"వస్తారు...." చటుక్కున వంగి అతని పాదాలకు నమస్కరించింది.

"బాలా! ఏమిటిది?"

"ఏమండీ నేను యెవరికి ప్రియురాలిగా, భార్యగా మిగల్లేదు.... కనీసం....... కనీసం నా పిల్లలకు తల్లిగా మిగలనివ్వండి....." వెక్కి వెక్కి ఏడ్చింది.



"బాలా!" అతను లేవనెత్తాడు.

"అవునండీ! వాళ్ళకిప్పుడీ విషయం తెలిస్తే, నన్ను ఏవగించుకుంటే, నా బ్రతుక్కు అర్థం లేదు. నేను జీవించి లాభం లేదు."

"బాలా!" ఆమె నోటికి చెయ్యి అడ్డం పెట్టాడు.

"నిజమండీ! ఒకనాడు మీకు కోపం తెప్పించాలని, రోషం కల్గించాలని యేమేమో అన్నాను. ఈనాడు నాకు కోపం లేదు. నా జీవితానికి ఈ మాత్రం విలువయినా మీరిచ్చిందే. కాని నా స్థితి అర్థం చేసుకోండి." అతనేం మాట్లాడలేదు. చెప్పవలసిందేం లేనట్టు బాల కూడా మౌనంగా వుండిపోయింది. అరగంట గడిచింది.

"సరే బాలా? నీ ఇష్ట ప్రకారమే జరగనీ...."

"మీ రామాటంటారని తెలుసు. అలా అని మిమ్మల్ని దూరం చెయ్యం. మా ఊరి సీతయ్యదొరగా, ఆయన భార్యగా మీ ఇద్దరికీ ఏ అవసరం వచ్చినా పిల్లలు ఆదుకుంటారు" అన్నది గబగబా.

"మంచిది" శుష్కహాసం చేశాడు రెడ్డి.

"నామీద కోపం వచ్చిందా?"

"లేదు. నీ వ్యక్తిత్వానికి నాలాంటివారు సిగ్గుపడాలి. పరువుకోసం గాలిలో వదిలి, ఈనాడు నాది అనడం హాస్యాస్పదమే" అన్నాడు.

బయట పిల్లలు మాట్లాడిన శబ్దం అయింది. కిటికీలో వున్న జగ్గులోని నీళ్ళు తీసుకుని ముఖం తుడుచుకుంది బాలామణి. వాళ్ళు వచ్చేశారు.

"అయ్యగార్కి నమస్కరించండి" నవ్వుతూ అంది.

"నమస్తే...." ఇద్దరూ చేతులు జోడించారు.

"ఊ......" అతని కళ్ళు చెమర్చాయి. ఇద్దరినీ దగ్గరగా తీసుకున్నాడు.

"మా ఊరు యెప్పుడయినా రండి బాబూ."

"మీరు హైద్రాబాద్ రండి, మేం వేసవి సెలవులలో వస్తాం."

"అలాగే" జేబులో చెయ్యిపెట్టి, డబ్బు తీసి చెరి రెండు వందలిచ్చాడు.

"ఇంత డబ్బా! వద్దండీ...."

"తీసుకోండి. వారు డబ్బుగలవారు. ఇవ్వగల సమర్థులు" అన్నది. తమ తల్లేనా అని ఆశ్చర్యంగా చూసి, డబ్బు తీసుకున్నారు.

"థ్యాంక్స్!" అన్నారు ఒకేసారి.

ఏసుదాసు కూనిరాగం తీస్తూ వచ్చాడు.

"వెళ్ళి టాక్సీ తీసుకు రా" అన్నాడు సీతయ్య.

"రేపు వెడదాం అన్నారు కదా?"

"పని అయిపోయింది" అన్నాడు. అయిదు నిమిషాలలో టాక్సీ వచ్చింది. జయలక్ష్మిని పిలుచుకు వచ్చాడు. ఇద్దరూ కూర్చున్నారు. దాసు ముందు కూర్చున్నాడు. కండ్లలో నీరు తిరుగుతుంటే, వీడ్కోలు చెబుతూ చెయ్యి ఊపాడు సీతారామిరెడ్డి. బాలామణి, పిల్లలు ముగ్గురూ చేతులూపారు. టాక్సీ కనుమరుగయింది.

"ఎందుకమ్మా! ఆయన ఏడుస్తున్నాడు?"

"ఛ! అంత పెద్దాయన ఏడ్వడం ఏం బావుంది. ఆఁ..... భార్య కోసం కదూ!"

"కాదు బాబూ, పిల్లలు లేరని ఏడుస్తున్నాడు."

"ఓస్! అంతేనా నన్ను పెంచుకోమను...." రాము నవ్వాడు.

"మనల్ని వదిలి మన అమ్మా, నాన్న వుంటారా! వాళ్ళున్నా నేనుండలేను" కృష్ణ తల్లి వంక చూశాడు.

"అమ్మా! నువ్వు ఏడుస్తున్నావా?"

"లేదురా...సంతోషంతో మతిపోతోంది....పదండి...." ఇద్దరూ చెరో ప్రక్కన నడుస్తుండగా బయటికి వచ్చింది బాలామణి.

